# మా మంచి మాస్టారు

## పాఠకుల జ్ఞాపకాలు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 41

ష్టారు

# ఇందులో..


1. దూర్వాసుల రామ్ 3
2. కొండవీటి సత్యవతి 6
3. వేములపల్లి వైధర్ 9
4. వి.ప్రతిమ 11
5. రమామణి 15
6. మాగంటి వంశీ మోహన్ 18
7. ఎమ్.వి.ఎల్. ప్రసాద్ 22
8. హరి మూర్తి 25
9. కట్టా గోపాలకృష్ణ మూర్తి 27
10. జి. నారాయణ రావు 33
11. జయ రవిచంద్ర 36
12. దూర్వాసుల వెంకట సుబ్బారావు 39
13. పూడి పెద్ది శేషు శర్మ 42
14. నన్నపునేని మోహన్ 45
15. ప్రొ.గంటి ప్రసాద రావు 48
16. శ్రీనివాస ఫణికుమార్ డొక్కా 53
17. అయ్యావారు శెవలెంక 56
18. తోటకూర ప్రసాద్ 59
19. వేదుల సుభద్ర 62
20. కలశపూడి శ్రీనివాస రావు 65
21. కట్టాగోపాల కృష్ణ మూర్తి 67
22. బలభద్రపాత్రుని రమణి 72
23. కృష్ణా అక్కులు 76
24. ఎ.విజయకుమార్ 79
25. నాగళ్ళ సుధ 82
26. నందరావు పట్నాయక్ 85
27. రి సీతారామయ్య 87
28. భమిడి పాటి ఫణిబాబు 90
29. చిట్టే సిద్ధలలిత 92
30. డా.కనుపర్తి విజయలక్ష్మి 97
31. స్వర్ణబాల గంటి 99
32. డా.ఉమా ఎయ్యుణ్ణి 102
33. శారద 105
34. దీప్తి కనుపర్తి 108


net




# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

## దూర్వాసుల రేపు



నేనెప్పటికీ మరచిపోలేని మాస్టారు శ్రీ దూర్వాసుల సూర్యనారాయణ గారు (DSN మాష్టారు అని పిలిచేవాళ్ళం). మా ఇంటి పేర్లు ఒక్కటే అయినప్పటికి ఆయనకు మాకు ఎటువంటి చుట్టరికం లేదు, నాకు 9, 10 వ తరగతిలో  ప్రైవేట్ చెప్పేవారు.

మా మాష్టారి గురించి చెప్పేముందు మా కుటుంబ సభ్యుల గురించి కొంచం చెప్పవలసి వుంది. ఎందుకంటే మాష్టారు నా వొక్కడికే కాకుండా మా కుటుంబ సభ్యుల్లో చాలా మందికి 1965-2005 మధ్యలో సుమారు ఇరవై మందికి ట్యూషన్ చెప్పారు. అందుకని మా



కుటుంబం అంటే మాష్టారికి ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ద వుండేది, మా ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి మాష్టారు వారి కుటుంబంతో సహా హాజరయి ఆశీస్సులందజేసేవారు. ప్రస్తుతపు రాజమండ్రి MP అయిన శ్రీ. వుండవల్లి అరుణ్‌కుమార్ గారు కూడా ఒకప్పటి మా మాష్టారి శిష్యులే.

మా నాన్నగారు వాళ్ళు ఎనిమిది మంది అన్నదమ్ములు (మా నాన్నగారు రెండవ వారు), మా నాన్నగారి నాలుగవ తమ్ముడు మొదలు మా కజిన్స్ అందరికి మాష్టారే ట్యూషన్ పాఠాలు చెప్పారు. మా నాన్నగారు గవర్నమెంట్ జాబ్ (ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సివిల్ ఇంజనీర్) కారణంగా మా చిన్నప్పుడు బదిలీలు ఎక్కువగా వుండటంతో, నన్ను, తమ్ముడిని మూడు సంవత్సరాలు రాజమండ్రిలోనేవున్న సత్యసాయి గురుకులంలో (హాస్టల్లో) చేర్పించారు. 6,7,8 తరగతులంతా నా విద్యాభ్యాసం ఆ స్కూల్లోనే జరిగింది, చాలా క్రమశిక్షణతో పాఠాలు నేర్పించేవారు.  తరువాత మళ్ళీ నాన్నగారికి రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ కావడంతో, ఇంటికి తీసుకువచ్చి నన్ను గవర్నమెంట్ మోడల్ హైస్కూల్లో చేర్పించారు. అప్పటి వరకు మంచి క్రమశిక్షణ వున్న బడిలో చదువుకొని వచ్చిన మాకు, ఆ లోటు ఏమాత్రం తెలీకుండా సాయంత్రం వేళ మాష్టారు DSN గారి వద్దకు ప్రవేట్ పాఠాలు నేర్చుకోటానికి పంపేవారు. నిజం చెప్పాలంటే నేను స్కూల్లో నేర్చుకున్న దానికంటే మాష్టారి వద్ద నేర్చుకున్న విషయాలే ఎక్కువ.

క్రమశిక్షణకి మారుపేరు మా మాష్టారు, ఎర్రని శరీర ఛాయతో తెల్లని ప్యాంట్ షర్ట్ వేసుకొని, నుదుటిన గంధసింధూరం పెట్టుకుని , చూసిన వెంటనే నమస్కరించే విధంగా గొప్ప వర్చస్సుతో వుండేవారు. ఉదయాన్నే 5 గంటలకి లేచి కాలకృత్యాలు తీర్చుకుని...యధావిధిగా ఆసనాలు, యోగా చేసేవారు. తరువాత సంధ్యావందనం, ఇతర పూజాకార్యక్రమాలు ముగించుకుని 7 గంటలకి మొదటి బ్యాచ్ టూషను మొదలు పెట్టేవారు. 10 నుంచి 5 గంటల వరకు బడిలో పాఠాలు చెప్పి వచ్చిన తరువాత , సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇంట్లో ట్యూషన్ చెప్పేవారు. కూలి పనులు చేసుకునే వారి పిల్లల నుండి, గొప్పింటి పిల్లల వరకు అన్ని వర్గాల వాళ్ళు వచ్చేవారు. ఇచ్చిన ఫీజ్ తీసుకోవటమే తప్ప ఏనాడు డబ్బులకి డిమాండ్ చేసేవారు కాదు, నాకు తెలిసి కొంతమంది స్తితిగతులని బట్టి అస్సలు డబ్బులు తీసుకునేవారు కాదు. కేవలం మాకు సంబంధించిన తరగతి పాఠాలే కాక, ఎన్నో ఇతర విషయాలు, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన విషయాలు చర్చించేవారు. ఫండమెంటల్లీ strongగా వుండాలని చెప్పేవారు. పురాణ గాధలుమొదలుకొని, ఆనాటి ప్రస్తుత రాజకీయాల వరకు అన్ని చర్చించేవారు. సాధారణంగా ఎప్పుడూ శాంతంగానే వుండేవారు, ఎప్పుడైనా ఏ విషయంలోనైనా పిల్లలపై కోపం వస్తే మాటల్లోనే కరుకుదనం చూపించేవారు తప్ప, ఏనాడూ కూడా చెయ్యి చేసుకునేవారు కాదు. బాగా అల్లరి చేసే పిల్లలని క్లాస్‌లీడరుగా నియమించేవారు, అందువల్ల క్లాస్‌లో అల్లరి బాగా తగ్గేది. బట్టి కొట్టించడం కాని, గుడ్డిగా పుస్తకంలో వున్నది ముక్కున పట్టేయడం అనేది మా మాష్టారు ఒప్పుకునేవారు కాదు, విషయాలను బాగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలని చెప్పేవారు.

మాష్టారు మాకు ఇంగ్లీషు గ్రామర్ నేర్పిన పద్దతి చాలా బాగుంటుంది. రోజూ మనం ఎక్కువగా వాడే పదాల్ని పుస్తకంలో వ్రాయించి (DO-DID-DONE, GO-WENT-GONE...etc), మాష్టారు క్లాస్‌కి వచ్చే వరకు క్లాస్ లీడర్ చేత ఒక పారాయణంలా చేయించేవారు. అందుకేనేమో 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదువుకున్న నేను, పొరబాటున కూడ గ్రమెటికల్ మిస్టేక్స్ లేకుండ ఈరోజుకి ఇంగ్లీష్ మాట్లాడగలుగుతున్నాను. ఇదే విధంగా తెలుగు వ్యాకరణం, ఛందస్సు, పుస్తకంలో వుండే చక్కని పద్యాలను అందరిచేతా చెప్పించేవారు, ముఖ్యంగా శ్రీనాధుడి పద్యాలు, పోతన భాగవతంలోని పద్యాలు మరింత శ్రద్దతో నేర్పించేవారు.



అప్పుడప్పుడు యోగాసనాలు నేర్పించేవారు, రోజూ వ్యాయామం నిష్టగా చేస్తే శరీరానికి చాలా మంచిదని... రోజంతా చాలా హుషారుగా వుంటుందనేవారు. అదే విధంగా లలిత కళల పట్ల ఆసక్తి కలవారికి అందులో ప్రొత్సహించేవారు, పాటలు పాడటంలో ఆసక్తి వున్న నన్ను బాగా ప్రొత్సహించేవారు, ఎప్పుడైనా కాంపిటేషన్‌కి వెళ్ళే ముందు ఆ పాటని క్లాస్‌లో విద్యార్థులందరి ముందు పాడించి నాకు మరింత మనోధైర్యం కలిగేలా చేసేవారు.

నేను 10వ తరగతిలో వుండగా మాష్టారు రిటైరవ్వడంతో మాకు మరింత సమయం కేటాయించగలిగేవారు. నాకు, నా స్నేహితుడు రవికుమార్‌కి మా ఇంట్లోనే ప్రైవేట్ చెప్పడానికి వచ్చేవారు. 6వ తరగతి చదువుతున్న మా తమ్ముడు నగేష్ కూడా మాతో పాటు కూర్చుని హోమ్‌వర్క్ చేసుకునేవాడు. పూర్తిగా ఇంగ్లీషు

మీడియం (ICSE)లో చదువుకున్న వాడికి, మాష్టారు తెలుగు పద్యాలు చెప్పే విధానం బాగా ఆకట్టుకునేది. మాతో పాటు చాలా పద్యాలు పెద్దగా సాధన చేయకుండానే నేర్చుకోగలిగాడు.

మాష్టారు ముఖ్యంగా లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు చెప్పేవారు. ఆదివారాల్లోను, శలవుదినాల్లోను మిగతా సబ్జక్ట్‌లు సైన్స్, సోషల్, హింది చెప్పేవారు. ఆఖరి పరీక్షల ముందు మరింత సమయం వెచ్చించి, ఒకటికి రెండు సార్లు ప్రతీది వ్రాయించి క్షుణ్ణంగా వచ్చేట్టు చేసేవారు. ఒక్కోసారి పరీక్షకి బయలుదేరే కొద్ది గంటల ముందు కూడా ఇంటికి వచ్చి, కొన్ని ముఖ్యమైన టాపిక్స్ రివిజన్ చేయించేవారు.

10వ తరగతి మార్కులు ప్రకటించిన తరువాత, మాష్టారికి చూపించటానికి వెళ్ళినప్పుడు, స్వీట్స్ తినిపించి, లెఖల్లో 99 మార్కులే వచ్చాయే ? ఇంకొక మార్కు ఎక్కడ తప్పి వుంటుందని ప్రశ్నించారు. తరువాత భవిష్యత్తులో ఏంచేస్తే బాగుంటుందో సుదీర్ఘంగా చర్చించారు. మా కుటుంబంలో జరిగే ఏ ఫంక్షన్‌లో మాష్టారు కనిపించినా, ఆయన వద్ద చదువుకున్న శిష్యులందరం వెళ్ళి ప్రత్యేకంగా పలకరించే వాళ్ళం. ఇంజనీరింగ్‌లో చేరే ముందు, మొదటి ఉద్యోగంలో చేరే ముందు మాష్టారి వద్ద ఆశీస్సులు తీసుకునేందుకు వెళ్ళినప్పుడు, ఆయన కళ్ళల్లో కనిపించిన ఆనందం అనిర్వచనీయం. అమెరికా అవకాశం వచ్చిందని కొద్దిరోజుల్లో బయలుదేరుతున్నానని
చెప్పినప్పుడు, మన సంస్కృతిని ఎప్పటికీ మరవద్దని, పదిమందికి సాయపడే మంచి పనులు చేయాలని చెప్పారు. ఆ - తరువాత ఎప్పుడు ఇండియా వెళ్ళినా మాష్టారిని కలిసేవాడ్ని, అమెరికా విషయాలన్నీ మాష్టారి భార్యతో కలిసి చాలా -



ఆసక్తిగా అడిగి తెలుసుకునేవారు. 1999 అక్టోబరు 21 వ తేదీన జరిగిన నా వివాహానికి మాష్టారి దంపతులిద్దరూ హాజరయి ఆశీస్సులందజేసారు. నాన్నగారు ఎప్పుడు, ఎక్కడ కనిపించినా మా బాగోగులు అడిగి తెలుసుకుని సంతోషించేవారు. మేము ఎంత అభివృద్ధిలోకి వచ్చినా మాష్టారు మా నుంచి ఏనాడూ ధనసహాయం ఆశించలేదు, పెద్దగా స్థిరపడలేక చిన్న ఇన్సూరెన్స్ ఏజంట్‌గా పనిచేస్తున్న వారి ఆఖరి అబ్బాయికి వీలైతే ఏదైన పాలసి చేయమని అడిగారంతే.

2005 వ సంవత్సరంలో ఓల్డ్ స్టూడెంట్స్ అందరూ కలిసి రాజమండ్రిలో మాష్టారుని సన్మానించడం జరిగిందని తెలిసి చాలా సంతోషించాను, మా తరపున నాన్నగారు వెళ్ళి మాష్టారిని కలిసి అభినందించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ మధ్యనే కొద్ది నెలల క్రితం నాన్నగారు ఫోన్ చేసి, మాష్టారు ఇంక లేరు స్వర్గస్తులయ్యారని చెప్పినప్పుడు, చాలా దుఃఖం ముంచుకువచ్చి కళ్ళవెంట నీళ్ళు రాలాయి. నిరాడంబరంగా జీవించి, నిస్వార్థంగా సేవ జేసి ...ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి, ప్రేమాభిమానాలు చూరగొన్న మా మాష్టారు ఏలోకానవున్నా వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడ్ని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

నా ఎదుగుదలకి, సాధించిన విజయాల వెనుక మా మాష్టారి కృషి , పట్టుదల ఎంతోవుంది. నాలాగే దేశ, విదేశాల్లో మా మాష్టారి శిష్యులెంతో మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, రాజకీయ నాయకులుగా, ప్రముఖ వ్యాపారవేత్తలుగా ఆయా రంగాలలో ఎంతో అభివృద్ధిని గడించారు. "నూటికో కోటికో ఒక్కరు, ఎప్పుడో ఎక్కడో

పుడతారు...మా దేవుడు మీరే మాష్టారు" అన్నారు ఒక సినీ కవి, ఈ వాక్యాలు మా మాష్టారి విషయంలో అక్షరాల సత్యం. భౌతికంగా ఈలోకంలో లేకపోయినా, మా అందరి మనస్సులో మా మాష్టారు ఎల్లప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. ఈ వ్యాసం ద్వారా మా మాష్టారిని, వారితో వున్న అనుబంధాన్ని... జ్ఞాపకాలని స్మరించుకునేందుకు అవకాశమిచ్చిన 'కౌముది' నా ప్రత్యేక కృతజ్ఞతలు.

****




# కొండవీటి సత్యవతి

*సాహిత్యాన్ని ప్రేమిచడం నేర్పిన నా గురువులు*

'మామంచి టీచర్లు' శీర్షికకు రాయమని కిరణ్‌ప్రభగారు అడిగినపుడు నా మనసులో చాలామంది గురువులు మెదిలారు. జీవితానికి వెలుగులు ప్రసాదించిన గురువులు చాలామంది ఉన్నారు. బడికెళ్ళడం, చదువుకోవడం మొదలు పెట్టిన దగ్గరనుంచీ ఎంతోమంది ఉపాధ్యాయులు మన జీవితంలోకి వస్తారు. కొందరు బలమైన తమ ముద్రని మనమీద వెయ్యగలుగుతారు. కొందరు పేర్లు కూడా గుర్తుకు రానంతగా మరుగున పడిపోతారు.

నేను మా ఊరి బడిలో చదువుకుంటున్నపుడు అంటే షుమారు నలభై అయిదు ఏళ్ళ క్రితం నాకు పాఠాలు చెప్పిన ముగ్గురు మాష్టార్లు ఇప్పటికీ నాకు గుర్తే. వీరన్న మాష్టారు, బాపన మాష్టారు (ఆయన్ని అలాగే పిలిచేవారు) బాపిరాజు మాష్టారు. అందరిలోకి బాపిరాజు మాస్టారంటే పిల్లలకి చాలా ప్రేమ ఉండేది. బాపన మాష్టారు భూతద్దాన్ని సూర్యుడికి అడ్డంగా పెట్టి గడ్డిని మండించే పద్ధతిని మాకు నేర్పారు. కాఫీపొడి, పంచదార నోట్లో వేసుకుని గ్లాసుడు నీళ్ళు తాగి, పిల్లలూ కాఫీ ఇలా కూడా తాగొచ్చు అని అనేవారు. ఇలాంటివే ఎన్నో చమత్కారాలు చేసి చూపించేవారు. బాపిరాజు మాష్టార్ని బదిలీ చేస్తే మేమంతా ప్రెసిడెంటుగారింటి దాకా ఊరేగింపు జరిపి ఆయన్ని బదిలీ చెయ్యొద్దని గొడవ చేసాం.



ఎలిమెంటరీ స్కూల్ దాటి హైస్కూలులో చదవడం కోసం నేను చాలా కష్టపడ్డాను. మా పరిస్థితి అందుకు సహకరించకపోయినా మా నాన్న నన్ను "హిందూ స్త్రీ పునర్వివాహ సహాయక సంఘం ఓరియంటల్ స్కూలు"లో చేర్పించాడు. (హెచ్‌ఎస్ పి వి ఎస్ స్కూలు) ఈ స్కూలులో ఇద్దరు వ్యక్తులు నా జీవితం మీద తీవ్ర ప్రభావం చూపారు. ఒకరు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు కన్యాకుమారిగారు, రెండో వ్యక్తి మా సంస్కృతం మాష్టారు శ్రీ విష్ణుశాస్త్రిగారు. నేను చదువుకున్నది ఓరియంటల్ స్కూల్ కాబట్టి ఆరో తరగతి నుంచీ పదో తరగతి వరకు సంస్కృతం మాత్రమే చదువుకున్నాను. సంస్కృతాన్ని క్లాసులో కూర్చుని చదువుకోవడం తక్కువ. ముఖ్యంగా ఆరు, ఏడు క్లాసుల్లో. బయట కూర్చోబెట్టి అందరి చేత వల్లె వేయించేవారు. అమరకోశం, వ్యాకరణం, శ్లోకాలు గొంతెత్తి వల్లె వేసేవాళ్ళం.

రామః రామౌ రామాః అంటూ వల్లె వేయడమే. కాళిదాసు మేఘసందేశం లోని శ్లోకాలు మొత్తం వల్లె వేసేవాళ్ళం.

*"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా*

*హిమాలయో నామ నగధిరాజః"*

మేఘ సందేశంలోని మొదటి శ్లోకం నాకిప్పటికీ కంఠస్థమే.

అలాగే కాదంబరి నాటకంలో మహాశ్వేత గురించి అనుకుంటాను.

*"శిరీష పుష్పాధిక సౌకుమార్యే*

*బాహూ తదీయావితి మే వితర్కః"*

అలాగే చంపూ రామాయణంలోని శ్లోకాలు, మృచ్ఛకటికం నాటకంలోని అంకాలు. ఇవన్నీ నాకిప్పటికీ గుర్తున్నాయంటే వాటిని బోధించి, మాచేత వల్లె వేయించిన సంస్కృతం మాష్టారుదే ఆ ఘనతంతా. మేము గొంతెత్తి వల్లె వేసేటపుడు చిన్న తప్పు వినబడినా ఆయనకు చాలా కోపమొచ్చేసేది.... తప్పు చదివిన వాళ్ళ కంఠాన్ని ఇట్టే గుర్తుపట్టి బడితె పూజ చేసేవారు. పరుగులెత్తించి కొట్టేవారు. తప్పు చేసిన పిల్ల దొరక్కపోతే ఆయనే తల గోడకేసి కొట్టుకునేవారు. అంత కోపం ఆయనకు. ఆ కోపం చూసి మేం వణికిపోయేవాళ్ళం. తప్పు చదవకుండా జాగ్రత్తగా వల్లెవేసేవాళ్ళం. పదోతరగతి పూర్తయ్యేటప్పటికే నేను ఎన్నో ప్రముఖ కావ్యాలు చదువుకున్నాను. ఎం.ఏ స్టాండర్డ్ సిలబస్ ఉండేది 10వ తరగతిలో. అందుకనే స్కూల్ మొత్తానికి నేను, అన్నపూర్ణ అని ఇంకో అమ్మాయి మాత్రమే 10 వ తరగతిలో పాస్ అయ్యాము. అయితే మాకు సంస్కృతం నేర్పిన విష్ణుశాస్త్రిగారు మాత్రం చాలా గొప్ప వ్యక్తి. ఆయన దగ్గర చదువుకున్న సంస్కృతం నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉండటానికి కారణం ఆయన మా చేత చదివించిన పద్ధతి. గురుకులాల్లో లాగా చెట్ల కింద కూర్చోబెట్టి గంటల తరబడి వల్లె వేయించడం.

*"స్వదేశే పూజ్యతే రాజా*

*విద్వాన్ సర్వత్ర పూజ్యంతే"* అని

*"కేయూరా న విభూషయంతి పురుషం*

*యా సంస్కృతాధార్యతే*

*న స్నానం, న విలేపనం, న కుసుమం*

*నాలంకృతా మూర్ధజాః*

*వాణ్యేకా సమలంకురేతి పురుషం*

*యా సంస్కృతాధార్యతే*

*క్షీయంతే ఖలు భూషణాని సతతం*

*వాగ్భూషణం భూషణం"*

నగలు, అలంకారలు మానవుడికి సౌందర్యాన్నియ్యవని, ఆభరణాలు నాశనమైపోతాయని వాక్కు మాత్రమే మంచి భూషణమని మాకు ఆయనే చెప్పారు. ప్రతి శ్లోకం విడమర్చి వాటికి తాత్పర్యాలు చెప్పేవారు. మా సంస్కృతం మాష్టారు గురించి ఎంత రాసినా తక్కువే.

ఆయన కూతురు స్వరాజ్యం నా క్లాస్‌మేట్. అలా నేను మా మాస్టారు గారి ఇంటికి తరచు వెళ్ళేదాన్ని. నేను తిండి తిప్పలు లేకుండా స్కూల్‌కి వచ్చేసేదాన్ని. స్వరాజ్యం వాళ్ళమ్మగారు తనతో పాటు నాకూ అన్నం పెట్టేవారు. వాళ్ళింట్లో

కలిసిపోయి తిరగనిచ్చేవారు. కానీ భోజనం మాత్రం బయట అరుగు మీద ఆకులో పెట్టేవాళ్ళు. నేను తిన్న తర్వాత ఆకు నేనే తీసాక పసుపు నీళ్ళు చిలకరించేవాళ్ళు. ఈ కుల వివక్ష నాకు అప్పట్లో చాలా సహజంగా అనిపించేది. బ్రాహ్మల ఇళ్ళల్లో ఇలాగే అన్నం పెడతారు అనుకునేదాన్ని. ఈ విషయం పక్కన పెడితే, నాకు సంస్కృతం నేర్పి, సాహిత్యం మీద అమితమైన ప్రేమని కలిగించిన మా విష్ణుశాస్త్రి మాష్టారు అంటే చాలా గౌరవం ఉంది. ఆయనకిపుడు 85 సంవత్సరాలు దాటాయి. ఈ వ్యాసం రాస్తున్నపుడు మా తమ్ముడి ద్వారా ఆయన ఫోన్ నెంబరు సంపాదించగలిగాను. ఫోన్ చేసి ఆయనతో మాట్లాడాను. మాష్టారు నన్ను గుర్తుపట్టడం, నా పేరు ఊరితో సహా చెప్పడం నాకు సంతోషం కలిగించింది. ఆయన తన ఫోటోను కూడా పంపించారు. ఇలా మా విష్ణుశాస్త్రి మాస్టారు గురించి గుర్తు చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

అలాగే నాకు విద్యాదానం చేసిన వారిలో కన్యాకుమారిగారు ప్రథములు. మా స్కూల్ ప్రధానోపాధ్యాయిని అయినా నన్నెంతో ఆదరంతో చూసేవారు. వారింట్లో నన్ను పెట్టుకుని నా చదువు కొనసాగేలా చేసిన ఆమెకి నేను ఎంతో రుణపడి ఉన్నాను. పుస్తకాలు చదవడం నేర్చుకున్నది ఆమె శిష్యరికంలోనే. మా వాళ్ళు నన్ను స్కూల్ మాన్పించిన ప్రతీసారి మా ఇంటికి ఉత్తరాలు రాసి, స్వయంగా వచ్చి సర్ది చెప్పి నా చదువు కొనసాగేలా చేసింది ఆవిడగారే. నిజంగా ఆవిడ నాపట్ల అంత శ్రద్ధ తీసుకుని, మా వాళ్ళతో వాదించి, ఎంతో శ్రమకోర్చి నాకు అర్థంకాని పాఠాలు ఇంట్లో చెప్పి, నన్ను ప్రోత్సహించక పోయి ఉంటే నా జీవితం మరోలా ఉండేది. మా అక్కలిద్దరి లాగానే నాకంటూ ఒక జీవితం లేకుండా, చదువు లేకుండా, చిన్నప్పుడే పెళ్ళిచేసుకుని మామూలు గృహిణిగా స్థిరపడిపోయేదాన్ని.

మా సంస్కృతం మాష్టారు, కన్యాకుమారి నేతృత్వంలో నేను తొమ్మిదో తరగతిలో గెల్చుకున్న ఓ అద్భుతమైన బహుమతి గురించి చెప్పి తీరాలి. నర్సాపురానికి సమీపంలో ఆచంట అనే గ్రామంలోని దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు చాలా గొప్పగా

జరుగుతాయి. ఆ ఉత్సవాల సందర్భంగా భగవద్గీత మీద పోటీలు జరుగుతాయి. కన్యాకుమారిగారు నన్ను తనతో ఈ ఉత్సవాలకు తీసుకెళ్ళారు. పోటీలో పాల్గొనమని ప్రోత్సహించారు. నేను అప్పట్లో భగవద్గీతలోని చాలా అధ్యాయాలను కంఠస్థం చేసి, అర్థాలు, తాత్పర్యాలు చెప్పేదాన్ని. ఉత్సవాలకి వచ్చిన అశేష జన సమూహం ముందు నేను పోటీలో పాల్గొన్నాను. పది నిమిషాల సమయంలో శ్లోకాలు చదివి అర్థం చెప్పాలి. నేను శ్లోకాలు పాడటం మొదలవ్వగానే నిర్వాహకులు సమయం మర్చిపోయారు. అరగంట సేపు అలా చదువుతూనే ఉన్నాను.. ఆ పోటీలో నాకు ప్రథమ బహుమతి వచ్చింది. భాగవతం వాల్యూములు ఇచ్చారు. అక్కడున్న చాలామంది అప్పటిక ప్పుడు నాకెన్నో ప్రయిజులిచ్చారు. మర్నాడు పేపర్లో నా ఫోటో చూసాకగానీ మా ఇంట్లో వాళ్ళకు ఈ విషయం తెలియదు. అప్పుడు నేను తొమ్మిదో క్లాసు చదువుతున్నాను. అంత చిన్న వయసులో ఓ పెద్ద పోటీలో పాల్గొని ప్రథమ బహుమతితో పాటు, ఎన్నో ప్రశంసల్ని పొందడం వెనకు ఉన్నవారు మా సంస్కృతం మాస్టారు, కన్యాకుమారిగార్లు మాత్రమే. వీరిరువురికీ శిరస్సు వంచి పాదాభివందనం చెయ్యడం తప్ప ఇంకేం చెయ్యగలను. నా పట్ల ఎంతో ప్రేమని, వాత్సల్యాన్నీ పంచి ఇచ్చిన గురువులందరికీ నా హృదయ పూర్వక నమస్కారాలు తెలుపుకుంటూ, మరో అవకాశం ఎప్పుడైనా వస్తే నాకు తెలుగు సాహిత్యాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసిన మా తెలుగు లెక్చరర్ హనుమాయమ్మగారి గురించి, చరిత్రని మనోహరంగా బోధించిన లలిత, వసంత గార్ల గురించి తప్పక రాసాను. ఇప్పటికి శెలవు... ***



# వేములపల్లి శ్రీధర్

కృష్ణాజిల్లా జి.కొండూరులోని ఎస్.ఎస్.ఆర్.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1963 - 64 లో నేను ఎస్.ఎస్.ఎల్.సి చుదువుతున్నాను. పంచెకట్టు, ఫుల్‌హేండ్స్ షర్ట్, పైన కండువా, కళ్ళజోడు, పట్టీల చెప్పులు వేసుకుని ఉపాధ్యాయ వృతికి  భాష్యం చెప్పిన వ్యక్తి ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా శ్రీ చలసాని వెంకటరత్నంగారు వచ్చారు. నాది ఉయ్యూరు దగ్గర తాడంకి. 10వ తరగతివరకు అక్కడే చదివాను. జి.కొండూరులో మాఅన్నయ్య హైస్కూలులో లైబ్రరీ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తుండటం వలన చదవటానికి అక్కడకి వెళ్ళవలసి వచ్చింది. ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఎక్కువగా తూర్పు కృష్ణాకు చెందిన వారవడంవలన అందరు కలిసి మెలిసి ఉండేవారు. అప్పట్లో ఆ ప్రాంతంలో వరి పండేది కాదు. ఎక్కువగా జొన్నలు పండించి దంచి వండుకుని తినేవారు. బియ్యం కొన్ని షాపులలో మాత్రం దొరికేవి.

ఆ పాఠశాల వాగు ఒడ్డున ఉంది. ఆ వాగులో వరదకు పులి కొట్టుకు వచ్చిందట. అందువల్ల దానిని పులివాగు అని పిలిచేవారు. ఆ గ్రామంలో ఎక్కడ త్రవ్వినా ఉప్పు నీరే కాబట్టి ఆ వాగులో చలం (అంటే ఒక గుంటలాగా ఇసుక తీస్తే నీరు ఊరుతూ ఉంటుంది. పరిశుభ్రమైన నీరు  వచ్చే వరకు నీటిని తీసేవారు) త్రవ్వి కడవలో వడపోసుకునేవాళ్ళం.  మా క్లాసు మొత్తం 25మంది. వారిలో అబ్బాయిలు 22, అమ్మాయిలు ముగ్గురు. పాఠశాల అప్పట్లో మంచి క్రమశిక్షణతో నడిచేది. ఉపాధ్యాయులు అందరూ కలిసి అంకితభావంతో వృత్తిపై గౌరవం ఉంచి పనిచేసేవారు.  అప్పట్లో మాకు ఇంగ్లీషుకు శ్రీ వెంకటరత్నం గారు వచ్చేవారు. ఆయన పారశాలకు వచ్చేటప్పుడు పుస్తకం హస్త భూషణం అన్నట్లుగా ఎప్పుడూ చేతిలో పుస్తకం తప్పనిసరిగా ఉండేది. తరగతి గదిలో పాఠ్యబోధన చేసేటప్పుడు ఒక్కోరోజు ఆంగ్ల పాఠ్యాంశంలోని పద్యం ఒక్క పిరియడుకు ఒక్క లైను కూడా పూర్తి అయ్యేదికాదు. దానిలోని అర్థాలు విపులంగా వివరించి చెప్పేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు అమ్మాయిలు. ఒక కొడుకు అశోక్ కుమార్ 10వ తరగతి చదివేవాడు. అందువల్ల ఉదయం, రాత్రి ఆయన దగ్గరకు చదువుకోవడానికి వెళ్ళేవాళ్ళం. మాకు తెలుగు మాష్టారు సుబ్బయ్యగారు ఉండేవాళ్ళు. ఆయన కంఠము, భాషా స్వచ్ఛత ఎంతో మధురంగా ఉండేది. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోగాని, గ్రామంలోకానీ ఎక్కడ కనిపించినా విద్యార్థులు, గ్రామస్థులు చాలా గౌరవించేవారు. గ్రామస్థులు కూడా ఉపాధ్యాయుల మీద గౌరవభావంతో కూరగాయలు పంపేవారు. ఎస్.ఎస్.ఎల్.సిలో ఆ గ్రామస్థులు 15 మంది వరకు ఉండేవారు. మా అందరిది ఒకే మాట ఒకే బాటగా ఉండేది.

ఒక రోజు తరగతి గదిలో ఒక విచిత్రం జరిగింది. ఒక విద్యార్థి పుస్తకం అట్టతీసి ప్రక్క విద్యార్థికి ఇచ్చాడు. అలా అలా చేతులు మారి 7వవాడిగా నా దగ్గరకు వచ్చింది. దానిని నేను మిఠాయి పొట్లంగా చుట్టి రీసెస్‌లో బయటకు వెళుతూ దానిని ఆడపిల్లల బల్లపై పెట్టాను. 10 నిమిషాల తర్వాత లోపల బెల్లు కొట్టినపుడు అందరం తరగతి


గదిలోనికి వెళ్ళాము. దానిని విద్యార్థినులు తీసి ఉపాధ్యాయుల ప్రక్కన వేసారు. సోషల్ టీచర్ దాన్ని చూసి దానిపై ఉన్నపేరు చదివి ఆ విద్యార్థిని నిలబెట్టారు. ఎవ్వరూ నా పేరు మాత్రం చెప్పలేదు. ప్రధానోపాధ్యాయుడి వద్దకు రిపోర్టు వెళ్ళింది. మరుసటి రోజు అసెంబ్లీలో ప్రధానోపాధ్యాయుడు చాలా తీవ్రంగా హెచ్చరించారు. ఎస్.పి.ఎల్.ని పిలిచి ఎంక్వయిరీ చేయమని చెప్పారు. గ్రామంలోనూ చర్చనీయాంశమైంది. ఒకవారం రోజుల తర్వాత ప్రధానోపాధ్యాయుడి వద్దకు వెళ్ళి ఆ పని నేనే చేసాను సరదాకి చేసాను ఇక ముందు అటువంటి పనులు చేయనని కళ్ళనీళ్ళ పర్యంతమై చెప్పాను. ఆయన దాన్ని ఎవ్వరికీ చెప్పక స్టాఫ్ మీటింగ్ పెట్టి ఇంతటితో ఈ విషయం వదిలేస్తున్నాము. ఇది విద్యార్థులు కొంటెతనానికి చేసింది కానీ కావాలని చేసింది కాదని సర్ది చెప్పడం జరిగింది.

ఆనాడు గురువు అనే గౌరవభావం ప్రతి విద్యార్థిలోనూ ఉండేది. మాకు రాత్రిళ్ళు పాఠశాలలో తరగతులు నిర్వహించేవారు. ట్యూషన్ లేని వారందరం వెళ్ళేవాళ్ళం. ప్రధానోపాధ్యాయులు రాత్రిపూట 10 గంటల వరకు ఉండి చదివించేవారు. ఉదయం లెక్కల మాష్టారు వచ్చి గణితం చెప్పేవారు. గణితానికి చెన్నారావుగారు వచ్చేవారు. ఆకాలంలో కాంపోజిట్, జనరల్ అని భాగాలుండేవి. ఆయన పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకుని 16 మోడల్స్ చేయించేవారు. వాటిలో 12 లెక్కలు తప్పనిసరిగా వచ్చేవి.

మేము పాఠశాలకు వెళ్ళేదారిలో ఆ పాఠశాల కట్టించిన శాగం శివరామ రెడ్డిగారి ఇల్లు ఉండేది. పాఠశాలకు వెళ్ళు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తప్పనిసరిగా ఆయనకు నమస్కరించి వెళ్ళవలసి వచ్చేది. ఆయన ఎప్పుడైనా వరండాలో కూర్చున్నప్పుడు అలా నమస్కరించని ఉపాధ్యాయులను బదిలీ చేయించేవారు. ఆనాటి పలుకుబడి అలా ఉండేది. వర్షాకాలంలో బాగా వర్షం పడినప్పుడు పులివాగు చాలా ఉధృతంగా వచ్చేది. ఆ రోజు పాఠశాలకు సెలవు ప్రకటించేవారు.

ఆనాటి ఉపాధ్యాయులు వృత్తిపై గౌరవం అంకితభావంతో పనిచేసేవాళ్ళు. తక్కువ జీతం వచ్చినప్పటికీ దానితోనే పొదుపు చేసుకుని నాలుగురాళ్ళు వెనకేసుకునేవారు. ఈనాడు ఎంత జీతం వచ్చినా ఆనాటి విలువలు లేవు. విద్యార్థులను పైకి తీసుకురావాలి అనే భావన ఉండేది.

ఆ నాటి మా బ్యాచ్ విద్యార్థులం అందరం పబ్లిక్ పరీక్షలు రాయటానికి మైలవరం వెళ్ళి వ్రాయవలసి వచ్చేది. అప్పట్లో బస్సులు కూడా ఎక్కువ ఉండేవి కావు. అందువల్ల మైలవరంలోనే పరీక్షాకేంద్రానికి దగ్గరగా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని మా పదిమందిని హాస్టల్లోలాగా ఉంచి ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో శ్రద్ధగా దగ్గరుండి చదివించి పరీక్షాకేంద్రానికి తీసుకెళ్ళి ఆయన మరల పాఠశాల నిర్వహణకు వచ్చేవాళ్ళు. అప్పటి మా తోటి విధ్యార్థులు ఉద్యోగస్తులుగా స్థిరపడినవారు ఎక్కువమంది. వారిలో (1). తాడికొండ జనార్ధనరావు ఉపాధ్యాయుడు, (2) తాడికొండ కృష్ణారావు సొసైటీ అధ్యక్షులు. 3 వెంకటేశ్వరరెడ్డి ఆర్.టీ.సి కండక్టరు (4) శాగం భాస్కరరెడ్డి ఆర్.టీ.సి కండక్టరు. (5) ఎన్.వి నారాయణరెడ్డి ఉపాధ్యాయుడు (6) ఎస్.వి కృష్ణారెడ్డి విలేజ్ అసిస్టెంటు (7) గరిమెళ్ళ రంగారావు వ్యాయామోపాధ్యాయులు (8) గుత్తికొండ రామచంద్రయ్య. ఉపాధ్యాయులు (9) నేను ఉపాధ్యాయుడుగాను ఇంకా అనేకమంది సహ విద్యార్థులు ఉద్యోగస్థులుగా స్థిరపడ్డారు. దీనికి కారణం ఆనాటి



మా గురువుల ఆదర్శ బోధన మమ్ములను సన్మార్గంలో నడిపి మాకు ఒక చక్కని బాట వేసింది.

ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన శ్రీ చలసాని వెంకతరత్నంగారు మన ముందు లేకపోయినా ఆయన నేర్పిన బాట మాకు ఆదర్శమై మమ్మలని తీర్చి దిద్దిన గురువులకు ఋణపడి ఉంటాము. మేము సన్మార్గంలోకి వెళ్ళాలన్నా చెడు అలవాట్లకు లోనవ్వాలన్నా అదే వయసు కాబట్టి మమ్మలను సత్పౌరులుగా తీర్చిదిద్దిన మా గురువులు చిరస్మరణీయులు.

**నా ఈ వ్యాసం చంద్రునికో నూలు పోగులాగా కీ.శే. చలసాని వెంకటరత్నంగారికి అంకితం**

***



## వి.ప్రతిమ

*'చదివించిరి నను గురువులు '*
*చదివితి దర్మార్థ ముఖ్య శాస్త్రంబులు*
*నే చదివినవి గల్వవు పెక్కులు*
*చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ '*

అంటాడు ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడి ఎదురుగా నిల్చుని..

'మామంచి మాస్టారు' గురించి వ్రాయదల్చుకున్న క్షణం నుండీ ఈ పద్యం పదే పదే నా నోట్లో ఆడుతోంది... గురువుల గురించి గుర్తు చేసుకోవడమంటే ఈ సుదీర్ఘ జీవనయానపు ఒకానొక మైలు రాయి వద్ద నిలబడి ఒక్కొక్క అడుగూ వెనక్కి నడుచుకుంటూ వెళ్ళి బాల్యాన్ని తవ్వుకోవడమే...

నాకనిపిస్తుంది ఏ వ్యక్తికి కూడా జీవితంలో ఒకరు మాత్రమే గురువుగా ఉండరు... జీవిత పయనంలోని వివిధ స్థాయిల్లో, వివిధ సందర్భాల్లో అనేక మంది గురువులు వివిధ రకాలుగా మనల్ని ప్రభావితం చేస్తారు అని. జీవిత పాఠాల గురించి పక్కన పెట్టి కేవలం బడి చదువుల విషయమే ప్రస్తావించుకున్నప్పటికీ కూడా ప్రాథమిక, మధ్యమ, ఉన్నత స్థాయిల్లో ముగ్గురు, నలుగురు గురువులు నాకు కళ్ళెదుట నిలుస్తున్నారు.

నాది తమిళనాడులోని తిరువళ్ళూరు జిల్లాలోని ఒక కుగ్రామం (మా అమ్మమ్మ ఊరు)లో అక్షరాభ్యాసం జరిగింది. అక్కడ నాతోటి పిల్లలందరికీ పప్పులు, బెల్లాలు పంచి పెట్టి వాద్దేరి (అయ్యవారు) కి అయిదు రూపాయిలు, బస్తాడు వడ్లు ఇచ్చి మా తాతయ్య నాకు అక్షరాభ్యాసం చేయించారు...

ఆ వాద్దేరి పేరు నాకు సరిగ్గా గుర్తులేదు కానీ, అత్యంత ప్రసన్నంగా ఉండే ఆయన ముఖం మాత్రం నా మస్తిష్కంలో ముద్రించుకు పోయి ఉంది. ఆయనే నాకు తెలిసీ తెలీని తొలి గురువు కావొచ్చు. అయితే నాకు ఊహ వచ్చి నాయుడు పేటలో బడికెళ్ళడం మొదలు పెట్టాక నాకు గుండెల్లో జ్వరం తెప్పించిన మా మంచి మాష్టారు కుప్పుస్వామి అయ్యవారు. మా ప్రాంతంలో 'మాస్టారు' అన్న పదం కాకుండా అయ్యవారు, అయివారు అన్న పదమే ప్రాచుర్యంలో ఉంది. ఆ 'అయ్యవారు' కూడా 'అయివోరు'గా మోడిఫై అయిపోయింది...

కుప్పుస్వామి అయివారు మా బోర్డు స్కూలుకి హెడ్‌మాస్టరుగా పనిచేసేవాళ్ళు. సోడాబుడ్డి కళ్ళద్దాల్లోనుండీ అత్యంత పెద్దగా కనిపించే ఆ కళ్ళు ఎప్పుడూ ఉరుముతున్నట్లుగానే ఉండేవి. గోచీ పోసి కట్టిన ధోవతి ఒక్కసారి కూడా ఆయన కాళ్ళకి అడ్డం పడేది కాదు. అంత వేగంగా కలియ తిరిగేవాడాయన స్కూలంతా. ఆ రోజుల్లోనే ఒకసారి స్కూలు మొదలయ్యాక ఒక్క పిట్ట బయట నుండీ లోపలికి రావడానికి లేదు. ఒక్క విద్యార్థి లోపలి నుండీ బయటకెళ్ళడానికి లేదు. ఆయన చేతిలో ఎప్పుడూ చింత బరికె ఉండేది. బెత్తం లేకుండా కుప్పుస్వామి అయవార్ని అస్సలు ఊహించలేం. ఆయనకు 'సుధావళ్ళి' అనే కూతురుండేది. చిత్రంగా ఆ అమ్మాయి కూడా మాతోపాటు బయపడుతుండేది.

నిజానికిప్పుడిది వ్రాస్తుంటే కూడా కుప్పుస్వామి అయ్యవారు బెత్తం పట్టుకుని, కళ్ళజోడు సవరించుకుంటూ నా వెనకనుండీ నన్నే చూస్తున్నారేమో అని జంకుతున్నానంటే అప్పటి నా పరిస్థితి ఊహించుకోవచ్చు. అయితే ఆయన ఏ పైలోకాల్లో ఉన్నారో కదా అనుకుంటే కంటికి నీటి తెర అడ్డం పడి ఇబ్బంది పెడుతోంది.

మరి అంతలా భయపెట్టిన ఆ అయివార్ని ఇవ్వాళ ఇంతగా ఎందుకు తలుచుకుంటున్నానంటే. నాకు గుణింతాలు పొల్లుపోకుండా రావడానికి కారణం ఆయనే. ఎక్కడ ఏ చిన్న తప్పు వ్రాసినా పిడికిళ్ళు బిగించమని ముడుకుల మీద బెత్తంతో కొట్టేవాడాయన. ఆయన చేతి మొట్టికాయలు రుచి చూడని విద్యార్థి ఒక్కరు కూడా మా బోర్డుస్కూలులో లేరనే నా నమ్మకం.

అయితే గుణింతాలు, ఎక్కాలు, చరిత్రపాఠాలు, సామాన్య శాస్త్రం నా మెదడులో ఇంకిపోవడానికి కారణం ఖచ్చితంగా ఆయనే. ఆయన పేరుకి హెడ్ మాస్టారే కానీ టీచర్లా ప్రతీ క్లాసులోనూ వచ్చి కూర్చుని పాఠాలు చెప్పేవారు. అప్పట్లో డి.యి.వోలు మా స్కూలుకి రావడానికి ఇష్టపడేవాళ్ళు. ఏరోజు, ఏక్లాసులో, ఏ పిల్లాడ్ని లేపి ప్రశ్నించినా సమాధానం నాలుకల మీదే ఉండేది..

కుప్పుస్వామి అయివారి బళ్ళో చదివినవాళ్ళే తర్వాతి కాలంలో ఎస్.ఎల్.సి లో ర్యాంకులు తెచ్చుకున్నారు...

ఆయన ఫోటోగ్రాఫ్ ఒక్కటి కూడా నా వద్ద ఉంచుకోలేకపోవడం నా బాలనేరంగా నేను భావిస్తున్నాను.

ఆ తర్వాత స్థాయిలో అంటే ఎలిమెంటరీ స్కూలునుండీ మిడిల్ స్కూలుకి వచ్చాక (అంటే 6,7,8 తరగతులు ఉన్న స్కూలుని మిడిల్ స్కూలని, 9,10,11 క్లాసులు ఉన్న బడిని హైస్కూల్ అని పిలిచేవాళ్ళు).

మిడిల్ స్కూల్లో లెక్కల్ని నా బుర్రకి తేలిగ్గా అర్థం చేయించింది 'విక్టర్' అయివారు. ఆయన కూడా మా మిడిల్ స్కూలుకి సింహస్వప్నమే అయినప్పటికీ ఆయన తమ క్లాసుకి రావాలని పిల్లలంతా కోరుకునేవాళ్ళు. అందుక్కారణం కేవలం చదువులు మాత్రమే కాకుండా ఇతరేతర విషయాలు అనేకం ఆయన మాకు చెపుతుండేవారు.. అందులో అనేక సామాజిక విషయాలూ, కథలూ, కాకరకాయలూ కూడా ఉండేవి. అంతేకాకుండా మాకు పరమత సహనం ఆయన మూలంగానే అలవడింది. మతాలూ, కులాలూ వంటివన్నీ మనిషి ఏర్పరచుకున్నవే తప్ప ఏ దేవుడూ వాటిని సృష్టించలేదని ఆయనే మాకు తెలియచెప్పారు..

ఇంగ్లీషు వ్యాకరణం అద్భుతంగా అరటి పండు వొలిచి నోట్లో పెట్టినట్లుగా చెప్పేవాడాయన. లెక్కలు... ఒక లెక్క చేయడానికి ముందు ఆ లెక్కని పదే పదే చదివి అర్థం చేసుకుని స్టెప్స్, స్టెప్స్‌గా వ్రాసుకుంటూ వెళ్ళినట్టయితే సునాయసనంగా జవాబు ఎన్ని చిక్కులు ఎదురయినా వాటిని పొరలు పొరలుగా విడదీసుకుంటూ వెళ్ళి సమాధానం దొరికించుకోవడం అలవాటయిపోయింది. రియల్లీ ఐ మస్ట్ బీ థాయాంక్‌ఫుల్ టు హిమ్ ఫరెవర్.

అయితే నేను హైస్కూల్ చేరుకునేటప్పటికి నన్ను జీవితపు విలువల్లోకి, సాహితీ అభిలాషలోకి అప్రమేయంగా తీసుకెళ్ళిన మాష్టారు ఉప్పల నటరాజశర్మగారు. హైస్కూలుకొచ్చాక ఆయన వద్దకి ప్రయివేటుకి వెళ్ళేదాన్ని. ప్రయివేటంటే ట్యూషనన్నమాట..


**ఉప్పల నటరాజశర్మ**

నేను ప్రయివేటులో చేరిన మొదటిరోజే అయివారికి కొడుకు పుట్టినట్టుగా వారి అత్తగారి ఊరి నుండీ టెలిగ్రాం వచ్చింది. అంతే కాకుండా నేను చేరిన మర్నాటి నుండే ఒకరుకొకరుగా చాలామంది విధ్యార్థులు నటరాజశర్మగారి ట్యూషన్లో చేరడం మొదలయింది...

వాళ్ళింట్లో ఒక కుటుంబ వాతావరణం, హోమ్లీఫీలింగ్ ఉండేది. ఆ కుటుంబంలో నేనూ ఒకదాన్నిగా కలిసిపోయాను. వీటన్నింటి మూలంగానో ఏమో వాళ్ళంతా నన్ను వాళ్ళింట్లో సభ్యురాలిగా భావించి ఆదరించేవారు. ఇప్పటికీ అభిమానిస్తున్నారు.

ఒక్కసారి నటరాజయివారు పాఠం చెపితే ఇక మళ్ళీ ఆ పాఠం చెపితే ఇక మళ్ళీ ఆ పాఠం చదవాల్సిన అవసరముండేది కాదు మాకు... తరగతి గదిలో మాస్టార్లు పాఠాలు చెప్పేటప్పుడు అత్యంత ఏకాగ్రతతో వినాల్సిన అవసరాన్ని పదే పదే హెచ్చరించేవారాయన. ఏ సబ్జెక్టునయినా అర్థం చేసుకుని చదివినట్టయితే అత్యంత తేలిగ్గా జ్ఞాపకముండి పోతుంది. అర్థం కాకుండా బట్టీయం వేయడం మంచి పద్ధతి కాదని ఆయనే నేర్పించారు.

నటరాజశర్మగారి తండ్రి ఉప్పల నరసింహశర్మ గొప్ప సాహితీవేత్త, సంస్కృత పండితుడు. ఆయన వాకిట్లో కూర్చుని అలవోగ్గా అప్పటికప్పుడు ఆశు పద్యాలు చెపుతుంటే చాలా ఆశ్చర్యం కలిగేది. అప్పుడప్పుడూ నన్ను పిలిచి ఎక్స్‌టెంపోర్‌గా ఒక పద్యం చెప్పి 'ఇందులో గణాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకో' అనేవాళ్ళు. అప్పుడప్పుడే లఘువులు, గురువులూ అంటూ తెలుగు పద్య వ్యాకరణా బట్టీయం వేస్తున్నామేమో నాకూ, విశాలాక్షికీ ఆ ఆటవెలుదులూ, తేటగీతులూ, సీస పద్యాలకి గణాలు కుదిరాయో లేదో చెక్ చేయడం మహా ఉత్సాహంగా ఉండేది. ఇప్పటికీ పద్యాల పట్ల లోలోపల అత్యంత అభిమానం మిగిలిపోవటానికి కారణం ఆ మహా పండితుడేనని నా ఉద్దేశం.

నేనూ, విశాలాక్షి, యశోద పరీక్షలొస్తే చాలు నటరాజయ్యవారి ఇంట్లోనే పడుకునేవాళ్ళం. నటరాజ శర్మగారి భార్య నిర్మలమ్మ తెల్లవారు ఝామునే మమ్మల్ని నిద్రలేపేది. ఇక్కడ నిర్మలమ్మ గారి గురించి కూడా చెప్పుకోవాలి. ఆవిడ అప్పటికి వస్తోన్న వారపత్రికలయిన ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంద్రజ్యోతి, యువ వంటి వాటిల్లో సీరియల్స్, కథలూ ఇంకా నవలలూ వంటివెన్నో చదవడమే కాకుండా ఆ కథల గురించీ, అందులోని జీవన విలువల గురించీ మాతో చర్చిస్తూ ఉండేవారు. అదీ ప్రయివేటు మొదలవడానికి ముందున్న కాస్త సమయంలో మాత్రమే. ఆవిడ మాట్లాడటం కోసం నేనూ, విశాలాక్షి చాలా ఆతృతగా ఎదురుచూస్తుండేవాళ్ళం.

మా మాటల్లో ఎక్కువగా యద్దనపూడి, కోడూరి, ఇంకా అప్పటికి ముప్పాళ్ళగా ఉన్న రంగనాయకమ్మ తరచూ వచ్చేవాళ్ళు.. సనాతన సాంప్రదాయ వైదిక కుటుంబంలోని కోడలయిన రంగనాయకమ్మ చైతన్యవంతమైన రచనల

గురించి ఒక పాజిటివ్ భావనతో మాట్లాడ్డం అప్పటికి నాకు తెలీలేదు గానీ ఇప్పుడు తలుచుకుంటూంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

అదలా ఉంటే నటరాజశర్మగారి తమ్ముడు విద్యాశంకరమూర్తి అప్పటికి కొన్నాళ్ళు నిరుద్యోగిగా ఉండడంతో తన అన్నతో పాటుగా మా అందరికీ పాఠాలు చెప్పేవాడు.. సమయం దొరికినప్పుడు ఈ సమాజంలో జరుగుతోన్న అనేకానేక విశేషాల గురించీ, సినిమాల గురించీ రాజకీయాల గురించీ మాకు చెపుతుండేవాడు.. అంతే కాకుండా డ్రాయింగు, పెయింటింగ్‌లోని మెలుకువలు తెలిపేవాడు. బొమ్మలు గీయడం నేర్పేవాడు.

ఇప్పుడిదంతా ఎందుకు చెప్పుకోవల్సి వచ్చిందంటే మా చిన్న ఊరు నాయుడు పేటలో ఉండి విస్తృతమైన ప్రపంచాన్ని నేను చూడగలగడానికి కారణం నా గురువులు.. నటరాజయ్యవారి కుటుంబ సభ్యులంతా కూడా గురువులయి అనేక రంగాల గురించి నాకు అవగతమయ్యేలా చేశారని చెప్పక తప్పదు.

ఇటీవల నెల్లూరు జిల్లా ఉత్తర ప్రాంతం నుండీ ఒకానొక వృద్ధ పాఠకుడు నన్ను వెతుక్కుంటూ వచ్చి 'అమ్మా నీ కథలు అక్కడక్కడా చదువుతున్నాను. వివిధ రకాల సామాజికాంశాలతో నువ్వు వ్రాస్తున్న కథల గురించి, పొందుతోన్న పురస్కారాల గురించీ పలువురి ద్వారా వింటున్నాను.. గతంలో నాయుడుపేటలో ఉప్పల నరశింహశర్మగారు గొప్ప సాహిత్య పండితుడు.. ఆయన తర్వాత మన ఊరి నుండీ సాహిత్యాన్ని పండిస్తున్నది నువ్వే' అని అన్నారు. ప్రశంస కోసమే ఆయన ఆ మాట అని ఉండొచ్చు..

నరసింహశర్మగారి సాహిత్యంతో పోలికని కాదు గానీ ఆ మాట వినగానే చెప్పలేనంత ఆనందమూ, తృప్తి కలిగింది...

అలా నటరాజయ్య వారి వద్ద నా ప్రయివేటు చదువుల్లోనే కాకుండా జీవితంలోనూ, సాహిత్యంలోనూ కూడా నన్ను ముందుకు నడిపించిందని నేను భావిస్తున్నాను.

ఇలా చెప్పుకుంటూ పోతే నా కాలేజీ స్థాయి గురువులూ, ఆ తర్వాత సాహితీ లోకంలోని గురువులూ... ఇలా ఎందరో మహానుభావులు నన్ను ప్రభావితం చేసారని చెప్పక తప్పదు.

నాకీ అవకాశాన్నిచ్చి బాల్యంలోకి నెట్టిన కౌముది వారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ వారవకాశం ఇస్తే మరోసారి సాహితీ గురువుల గురించీ ప్రస్తావించుకుందాం.

ప్రతిమ గారి సొంతవూరు నాయుడు పేట. భూమిక సంపాదక సభ్యులు. 1990నుండీ కథలు వ్రాస్తున్నారు.. వీరి మొదటి కథ 'యముడికి హాలీడే'. 2004 లో 'పక్షి' అన్న కథా సంపుటి వెలువడింది. 'కండిత' అన్న కథాసంపుటి, 'ముఖచిత్రం' అన్న కవిత్వ సంపుటి తొందరలో రాబోతున్నాయి. 'పక్షి' కథా సంపుటికి 2005లో 'చాసో స్ఫూర్తి' పురస్కారం, 'కంకాళం' అన్న కథకి 'రంగవల్లి' స్మారక పురస్కారం లభించింది.



# రమామణి

*జీవించిరి అంకిత భావం సేవా నిరతులు ఊపిరులయి*
*నిల్చిరి భావి భారత బంగరు భవితకు రథ సారథులయి*
*నిర్మించిరి శాంతీ సహనం ఆత్మ విశ్వాసాల పెట్టని కోటలు*
*వెలిగించిరి అక్షర చిరు దివ్వెలు ప్రకాశించెను అవి అఖండ జ్యోతులయి*
*గర్వించిరి తూరుపు చంద్రోదయాన్ని గాంచిన పడమటి రవి బింబమయి*
*సాధించిరి వృత్తిని నూరు మార్కులు నూటికి మా మంచి మాష్టరులయి*

మా స్కూలు మాష్టార్ల సంగతులు గుర్తు తెచ్చుకుంటుంటే, ఇదొక ధారావాహిక నవల అయిపోతుందేమో అనిపించింది. మా మాష్టార్ల కబుర్లు అన్నింటినీ సంక్షిప్తంగా మీముందుంచటానికి ప్రయత్నిస్తే ఇలా వచ్చింది...

మా స్వస్థలం శ్రీకాకుళం దాదాపు నా చదువంతా శ్రీకాకుళంలోనే సాగింది, (ఒక్క అయిదవ తరగతి మాత్రం వీరఘట్టంలో చదువుకున్నాను). మా టీచర్లు క్లాసులో పాఠం చెప్పేసి నోట్సు ఇచ్చేస్తే మా పని అయిపోయింది అనుకునే వారు కాదు. ఒక విద్యార్థి నేర్చుకోవాల్సిన ఎన్నో మంచి విషయాలని చెప్పేవారు.. సంగీతం, సారసత్వం, సాంస్కృతిక అంశాలు కొంతమంది మాష్టార్ల దగ్గర నేర్చుకుంటే, విద్యా వైజ్ఞానిక సమాజిక విషయాలు మేము ఇంకొంత మంది మాష్టార్ల దగ్గర్నుంచీ నేర్చుకున్నాము. ముందుగా నేను ఎలిమెంటరీ స్కూలు దగ్గర్నుంచీ చెప్పాలి.

మా అమ్మ గారే నాకు మొదటి గురువు. నేను ప్రాథమిక విద్య మొదలు పెట్టినప్పుడే నా ఆరోగ్యం బాగోలేక కొన్నాళ్ళు స్కూలుకు వెళ్ళలేక పోయాను. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలు ఇంటి దగ్గరే ఉండి చదువుకున్నాను. మా అమ్మగారి దగ్గరే అక్షరాలు గుణింతాలు నేర్చుకున్నాను. తర్వాత మా ఇంటి  కెదురుగా ఉన్న రిటైర్డు మాష్టారుగారి వద్ద చదువుకున్నాను, పేరు మండపాక అచ్యుతరావు అనుకుంటాను ఎందుకంటే అతని అసలు పేరు ఎవరికీ తెలియదు కానీ అతన్ని పుల్లయ్య మాష్టారుగా తెలియని వాళ్ళు ఉండరు. ఆ మాష్టారు ఊళ్ళో చాలా మంది పిల్లలకి ప్రైవేట్లు చెపుతూ ఉండేవారు.

మా అమ్మగారు నన్ను కూడా అతని దగ్గర ప్రైవేటులో పెట్టారు. అతను లెక్కల్లోనూ, ఇంగ్లీషులోనూ మహామేధావి. చాలా శాంత మూర్తి చాలా ఓపిగ్గా పాఠం చెప్పేవారు.

అలా ప్రభుత్వం వారి పాఠ్య పుస్తకాలతో నాలుగు సంవత్సరాలు ఆ మాష్టారు దగ్గరే చదువుకున్నాను. అక్కడే లెక్కలలోనూ, ఇంగ్లీషులోనూ మంచి పునాది ఏర్పడింది. తర్వాత క్లాసుల్లో నాకు తెలిసింది ఆ మాష్టారి దగ్గర చదువుకోవడం వలననే పై క్లాసుల్లో అన్నీ సులభంగా అర్థమవుతున్నాయని.

నేను అయిదవ తరగతికి వచ్చాను మా నాన్నగారికి వీరఘట్టాం ట్రాన్సఫర్ అయింది. ఇంక ఆ సంవత్సరం స్కూలు తెరిచిన వెంటనే ఎలిమెంటరీ స్కూలులో జాయిన్ చేసారు. అక్కడ అయిదవ తరగతి చదువుతుండగానే మా ఇంగ్లీషు మాష్టారు (కర్రి క్రిష్ణమ్మ) దేవుడు ఒక్కడే అనే ఒక నాటకం వ్రాసి మా చేత వేయించారు. నేనూ ఒక పాత్ర వేసాను. అయిదవ తరగతిలో మొదటి సారిగా నాటకం వేయడం తలచుకుంటే చాలా సంతోషంగా ఉంటుంది.

ఆ తర్వాత 6, 7 తరగతులు శ్రీకాకుళంలో అప్పర్ ప్రైమరీ స్కూల్లో చదివాను. అక్కడ టీచర్లందరూ చాలా చక్కగా పాఠాలు చెప్పేవారు. స్కూలు చిన్నదవటం వలనేమో మాకు మా టీచర్లతోనూ, తోటి పిల్లలతోనూ ఎంతో సాన్నిహిత్యం ఉండేది, అక్కడ నాతో చదివిన అమ్మాయిలు నాకు ఇప్పటికీ అక్కడక్కడ కలుస్తూ ఉంటారు.

ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు శ్రీకాకుళం గవర్నమెంటు గర్ల్స్ హైస్కూల్లో చదివాను. ఆ స్కూలు క్రమశిక్షణకి మారుపేరు. అకడమిక్స్‌లో కూడా చాలా పేరున్న స్కూలు. అక్కడ హోం వర్కులు, యూనిట్ టెస్టులు మొదలుకుని అన్నింటిలోనూ మంచి మార్కులు రావాలి. స్టూడెంట్స్ మంచి మార్కులు తెచ్చుకోవాలని టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. మా క్లాసుకి వచ్చిన మాథ్స్ టీచర్లు, సుశీల గారు, సీతగారు, పంకజ నయనగారు, వైజయింతిమాల గారు. వీరి క్లాసులు నాకు ఇప్పటికీ బాగా గుర్తు. చాలా బాగా చెప్పేవారు. ఇంకా డి. సుబ్బలక్ష్మి, ఆకెళ్ళ సుబ్బలక్ష్మి (మా అక్క) నవనీతమణి టీచర్లు కూడా స్కూల్లో నన్ను బాగా ప్రోత్సహించేవారు. మా హిందీ టీచరుగారు, మంచి పుస్తకాలు చదవాలని చెప్పేవారు. కొన్ని పుస్తకాల్లోంచీ ఆవిడకి నచ్చిన మంచి వాక్యాలని తీసుకుని క్లాసుకి రాగానే బోర్డు మీద వ్రాస్తూ ఉండేవారు. ఉదాహరణకి "పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గదితో సమానం" ఇలాంటివి, వీటితో ఎక్స్ట్రా కరికులర్ ఏక్టివిటీస్ చాలా ఉండేవి. వారానికొకసారి ఒక ప్రత్యేక సమావేశం ఉండేది. దానిలో ఏదో ఒక అంశం మీద చర్చ లేదా వ్యాసరచన వకృత్వపు పోటీలు ఉండేవి. ఏ అమ్మాయికి ఎందులో ఆసక్తి, నైపుణ్యం ఉందో గుర్తించి ఆయా రంగాల్లో బాగా ప్రోత్సహించేవారు మా టీచర్లు.

ఒకసారి క్లాసులో పాఠం అయిపోయిన తర్వాత మా టీచరు, సరదాగా పాటలు పాడించేవారు. అప్పుడు నేను "నెమలికి నేర్పిన నడకలివీ" అనే పాట పాడాను. నాపాట టీచరుకి చాలా నచ్చి తర్వాత రాబోయే ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ పోటీలలో మా స్కూలు నుంచీ లలిత సంగీతం పోటీలలో పాల్గొనాలని నా పేరు ఇచ్చేసారు. నా మీద నాకే నమ్మకం లేదు నేను వెళ్ళనన్నాను, వీల్లేదన్నారు రాజ్యలక్ష్మి టిచరు గారు. "నాకు మంచి పాటలు రావన్నాను" అయితే ఇప్పుడే పంపిస్తా అని ఆ మాష్టారి దగ్గరకు వెళితే నీ గొంతుకు సరిపోయే పాట నేర్పిస్తారు అంటూ నన్ను ఆమెకి తెలిసిన సంగీతం మాష్టారు శ్రీ వరదరాజు మాష్టారు వద్దకు పంపించారు. అలా నేను మొదట గురువుగారి దగ్గర ఒక పాట నేర్చుకున్నాను. ఆ మాష్టారు నాకు "కోయిలా చేయవే పాటకచేరీ" అనే మంచి పాట నేర్పించారు. బాలల అకాడమీ పోటీలలో కూడా పాల్గొన్నాను. ఈ సంఘటన హైస్కూలులో మధురమైన అనుభూతి. అలా శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాను..

ఈ సందర్భంగా నేను మరికొంత మంది మాష్టార్లని చెప్పుకోవాలి. ఇంచుమించు ఆరు నుంచీ పదవ తరగతి వరకు ప్రతీ సంవత్సరమూ పరీక్షల ముందు భమిడిపాటి సూర్యనారాయణ మాష్టారి దగ్గరకి వెళ్ళి ఇంగ్లీషులో ఏమైనా

తెలియకపోతే అడిగి తెలుసుకునే వాళ్ళం. కొన్ని సార్లు పరీక్షల్లో ఏమేమి వస్తాయో ముందుగా ఊహించి చెప్ప కలిగే వారు ఆ మాష్టారు. అబ్బూరి లక్ష్మణ శర్మ

మాష్టారు ( మా బాబాయి గారు) సైన్ మేథ్స్ ఇంగ్లీషు ఈ మూడు సబ్జెక్టుల పేపర్లు ముందుగా ఊహించి మా చేత చదివించేవారు, మా పిన్నిగారు అబ్బూరి సత్యవతమ్మ, చరిత్ర  సాంఘిక శాస్త్రాలు చెప్పేవారు. మరువాడ శంకరరావు మాష్టారు కూడా ఇంగ్లీషు చెప్పేవారు.

తర్వాత చదువుకున్నది శ్రీకాకుళం మహిళా కళాశాల. మా ప్రిన్సిపాల్‌గారు వేదుల సూర్యాకాంతంగారు. మహిళా కళాశాల అంటే పద్ధతిగా ఉండాలని అన్ని క్లాసులు సక్రమంగా జరుగుతున్నాయో లేదోననీ రోజంతా విజిట్స్ చేస్తూనే ఉండేవారు. ఒక్కొక్క సారి సమావేశాల్లో మాట్లాడుతూ "స్పర్ధయా వర్ధతే విద్యయా (పోటీ తత్వం ఉంటేనే ప్రగతిని సాధించగల)రని"" అమ్మాయిలని పోటీ పడి చదవమని ప్రోత్సహించేవారు. విజ్ఞానం మహా సముద్రంలాంటిది. మనం చెంచా పట్టుకుని వెళితే చెంచాడే వస్తుంది. మనం బకెట్ పట్టుకుని వెళితే బకెట్‌తో వస్తుంది" అని చెప్పేవారు. మొదటి సంవత్సరంలో మేము మా ఫిజిక్స్ (గొల్లపూడి సూర్యప్రకాశరావు) మాష్టారు అంటే ఇష్టపడేవాళ్ళం. అతని సబ్జెక్టులో ఎక్కడైనా నిర్లక్ష్యం చేసినా మార్కులు తక్కువ వచ్చినా బాగా అరిచేవారు. ఆయన పెట్టే టెస్ట్‌లు చాలా కష్టంగా ఉండేవి, అయినా ఆ మాష్టారి క్లాసు చాలా ఎంజాయ్ చేసేవాళ్ళం, ఎప్పుడూ మిస్ అయేవాళ్ళం కాదు.


డిగ్రీ చదివేటప్పుడు అనంత లక్ష్మీ నరసమాంబగారని ఒక తెలుగు మేడం ఉండేవారు. ఆమెని చూస్తే ఆ సరస్వతీదేవిని చూస్తున్నట్లు భక్తి గౌరవమూ కలుగుతాయి. మేము మొదటి సంవత్సరంలో చేరిన కొద్దిరోజులకే ఆమెకు వైజాగ్ ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోయారు. ఇంకొక మాష్టారు శోభిరాల సత్యన్నారాయణ (రాగమయి రచయిత) మాష్టారు రిటైరు అయిపోయారు. మా క్లాసులకి సులోచనా మేడం, పద్మావతీ మేడం వచ్చేవారు. విమల కుమారి మేడం క్లాసు చాలా ఎంజాయ్ చేసేవాళ్ళం. ఎప్పుడూ మిస్ అయేవాళ్ళం కాదు. ఆదిభట్ల నాగభూషం మాష్టారు, రాణీ హయగ్రీవశర్మ మాష్టారు, సీతారామమూర్తి నాయుడూ, ఆర్.భాస్కరరావు మాష్టార్ల క్లాసులు చాలా ఎంజాయ్ చేసేవాళ్ళం. హైమావతీ మేడం, శారదా మేడం, రామారావు నాయుడు మాష్టారు ఇంగ్లీష్ చెప్పేవారు ఎన్నో మంచి విషయాలని కూడా చెబుతూ ఉండేవారు. కాలేజీలో వ్యాసరచనలు, వకృత్వపు పోటీలు క్విజ్‌లాంటివి ఎన్.అప్పారావు మాష్టారు నిర్వహిస్తూ ఉండేవారు. ఆయన సంపాదకత్వంలోనే కాలేజీ మాగ్‌జైన్ ఒకటి ఉండేది. ఆ కమిటీలో రెండు సంవత్సరాలు నేను కూడా మెంబరుగా పనిచేసాను. అప్పారావు మాష్టారు మాట్లాడుతూ టాపిక్‌ని వేదాంతంలోకి తీసుకుపోతూ ఉండేవారు. ఉపనిషత్తులు గురించి చెపుతూ ఉండేవారు. కాలేజీ నుంచీ వెళ్ళిపోయేముందు అందరి మాష్టార్ల ఆటోగ్రాఫ్ తీసుకునేవాళ్ళం ఆయన్ని నేను ఆటోగ్రాఫ్ అడిగినప్పుడు "తత్వమసి" అని ఒక మాట వ్రాసారు. అంటే ఏమిటి అడగాలనుకున్నాను కానీ ఇన్నాళ్ళూ నా శిష్యురాలుగా ఉండి ఈ అమ్మాయికీమాత్రం తెలియలేదా అని విచారిస్తారేమోనని అడగలేదు... ఉపనిషత్తుల సారాంశాన్ని ఒక్క మాటలో చెప్పగలిగే బ్రహ్మజ్ఞాని ఆ మాష్టారు, కాబట్టి ఏదో మంచి మాటే వ్రాసి ఉంటారులే అని సరిపెట్టుకున్నాను.

"నేను చదువుకున్న విద్యాలయాలకు నాకు చదువు నేర్పిన గురువులందరికీ నా హృదయపూర్వక నమస్సుమాంజలులు"

"ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు"



భర్త, కుమారులతో శాక్రిమెంటో లో నివసించే ఆకెళ్ళ రమామణి గారు http://www.greetway.com ,http://www.andhrakitchen.com అనే వెబ్ సైట్స్ నిర్వహిస్తుంటారు. సంగీతం, సాహిత్యం అభిరుచులు..



# మాగంటి వంశీ మోహన్

**మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని పెద్దలు ఊరకే అన్నారా.** యే శిశువుకయినా మొదటి గురువు తండ్రి అయితే, ఆ శిశువులోని ప్రతిభకు సాన పెట్టి సమాజానికి వజ్రాల్లాంటి ప్రతిభావంతులను అందించే బాధ్యత ఆచార్యవర్యుల వారిది. నాకు విద్యాదానం చేసి, ఈ సమాజంలో ఒక బాధ్యత గల పౌరుడిగా జీవించటానికి పునాదిరాళ్ళు పేర్చిన తలిదండ్రులకి, ఆచార్యవర్యులందరికీ సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తూ.

నేను పుట్టింది కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అయినా, పెరిగింది చదువుకున్నది అంతా హైదరాబాదులో. నాన్న మాగంటి శివరామశర్మగారు నాకు మొట్టమొదటి గురువు అయితే, హైదరాబాదు అశోక్ నగరులోని "లక్ష్మీ చిల్డ్రెన్స్ హౌస్" ప్రధానోపాధ్యాయురాలు ముకుంద గారు రెండవ గురువు. చిన్నప్పుడు ఆవిడని చూస్తే హడల్. నాకే కాదు,ఆ పాఠశాలలో చదివిన ఎవరిని అయినా అడగండి. కానీ పెద్దయ్యాక ఆలోచిస్తే, ఆవిడ భయానికి చదివిన చదువు, ఆవిడ నేర్పిన క్రమశిక్షణ నా జీవితం ఒక గాడిలో ఉండటానికి పునాది అని తెలుస్తోంది..

ఆవిడ ఇప్పుడు ఈ ప్రపంచంలో లేకపోయినా ఆవిడని నేను తల్చుకోని రోజు అంటూ ఉండదు. ఆ స్కూల్లో నేను ఐదవ తరగతిదాకా చదివాను. ఎల్.కే.జీ నుండి, నాలుగవ తరగతిదాకా నేనే క్లాసు ఫస్టు. ప్రతిసంవత్సరం స్కూల్ వార్షికోత్సవాల్లో ఆవిడ చేతుల మీదుగా ఇచ్చిన జ్ఞాపికలు, ఆవిడ సంతకంతో ఉన్న అన్ని ప్రోగ్రెస్ కార్డ్‌లు ఎంతో పదిలంగా దాచుకున్నాను. వాటిని చూసినప్పుడల్లా ఇప్పటికీ పాతిక ముప్పై ఏళ్ళ క్రితం నాటి చిన్నప్పటి ఆ మధుర జ్ఞాపకాలు గుర్తుకు వస్తూ ఉంటాయి. ఐదవ తరగతి మొదట్లో మటుకు చదువు అడుగంటింది. ఎందుకో నాకూ తెలియదు. ఎంత అడుగంటినా కూడా మొదటి పదిమందిలోనే ఉండేవాడిని అనుకోండి.

ఒక రోజు ముకుందా గారు, మా అమ్మ ప్రసూన గారిని పిలిచి "ఏవండీ మీ అబ్బాయి ఎందుకో చదువులో వెనకబడుతున్నాడు. స్కూల్ అయ్యాక ఒక గంట నా వద్ద వదిలి పెట్టండి నేను చూస్తాను" అని నన్ను స్కూల్ అయ్యాక అట్టిపెట్టుకుని చదువు చెప్పేవారు. నాతో పాటు నా లాంటివాళ్ళు ఇంకా ఉండేవాళ్ళు అనుకోండి. నాకు బాగా గుర్తు ఆ సమయంలో ఆవిడ చేతిలో ఒక కర్ర ఉండేది. ఏ రోజూ ఒక్క దెబ్బ వెయ్యకపోయినా ఆ కర్ర చూస్తే వణుకు

పుట్టేది నాకు. అప్పటినుండి మళ్ళీ గాడిలో పడ్డాను అనుకోండి. ఆవిడ తన పాఠశాలలో పిల్లల గురించి ఎంత ప్రత్యేక శ్రద్ధ  తీసుకునేవారో చెప్పటానికి ఉదాహరణ అన్న మాట.

ఆరో తరగతి నుంచి పదోతరగతి దాకా చదువు హిమాయత్ నగర్లోని "సైంట్ ఆంథోనీస్ హైస్కూల్" లో జరిగింది. అక్కడి మాష్టార్లు - స్వరూప రాణి గారు (బయాలజీ), సత్యలక్ష్మి గారు (ఫిజిక్స్), మహదేవిగారు, ఎలిజబెత్ గారు, అనురాధ గారు, ఈశ్వరిగారు, జి.లలిత గారు (ఇంగ్లీషు, బయాలజీ), కరుణమ్మగారు (తెలుగు), ఉషా రావు గారు, అమృత గారు, శకుంతల గారు, భాను గారు, విశాల గారు, మార్తా గారు (లెఖ్ఖలు), నింబాల్కర్ గారు (లెఖ్ఖలు), మేరీ గారు, శశికళగారు, సబీనా గారు, జూలీ గారు, వాసంతి గారు (కెమిస్ట్రీ), ఫాతిమాగారు , రూపాగారు(లెఖ్ఖలు), త్రిపుర సుందరి గారు, ఇలా ఎంతో మంది దగ్గర చదువుకున్నాను.

వీరందరిలో నాకు కరుణమ్మగారంటే చాలా అభిమానం. ఆవిడ పాఠాలకు మటుకు ఎప్పుడూ  నా గైర్హాజరీ ఉండేది కాదు. కరుణమ్మగారు అవటానికి క్రిష్టియన్ అయినా , భారతం భాగవతంలోని పద్యాలు ఎంతో హృద్యంగా వివరించేవారు. ఆవిడ పెట్టిన తెలుగు విద్యాభిక్షే ఈవేళకు కూడా నా నోట్లో తెలుగు ఆడటానికి కారణం.

అందరూ తెలివికలవాళ్ళూ కాదు, అందరూ మందబుధ్ధులూ కాదు, కానీ అన్ని రకాల విద్యార్ధులూ ఉండేవారు మా తరగతిలో. అది సహజమే కదా మరి. అందులో విశేషం ఏమిటీ అంటారా ? అలా ఉన్న రకాల విద్యార్ధులందరికీ అర్ధం అయ్యేటట్టు చెప్పే మాష్టార్లు చాలా అరుదు. ఆవిడ అందరు విద్యార్ధులనీ ఒకే గాటన కట్టేసి పాఠాలు చెప్పుకుంటూ పోయేరకం కాదు. పాఠాలు చెప్పేటప్పుడు చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఏ విద్యార్ధికి ఎలా చెపితే అర్ధం అవుతుందో ఆవిడకి తెలిసినంతగా ఎవరికీ తెలియదు అని నా నమ్మకం. పిల్లలకి అర్ధం కావటానికి ఆవిడ అవలంబించే పద్ధతులు కొత్తగా ఉండేవి అప్పట్లో. ఉదాహరణకి తరగతిలో పిల్లలతో వారంలో రెండు రోజులు పద్యాలు, పాఠాలు ఒక్కొక్కడితో చదివించి వాడి చేతే ఇతర పిల్లలకి అర్ధం చెప్పించేవారు. ఒక వేళ ఎక్కడయినా తప్పు చదివితే ఆవిడ సరిచేసి, మిగిలిన పిల్లలతో ఒక అభిప్రాయసేకరణ / విశ్లేషణ జరిపించేవారు. ఆ పాఠం అందరికీ అర్ధం అయ్యింది అని ఓటు వచ్చిన రోజు - ఆ పాఠం చదివినవాడికి ఒక చిన్న బహుమతి ఉండేది. అలా పిల్లల్లో పోటీతత్వం పెంచి వాళ్ళకి పాఠం అర్ధం అయ్యేటట్టు చేసేవారు అన్న మాట. అందరికీ ఉత్సాహంగా ఉండేది ఆ వారం ఎవడికి ఏం బహుమతి వస్తుందో అని. అలాగే వ్యాసాల పోటీ పెట్టేవారు ప్రతి నెలా రెణ్ణెళ్ళకి. భలే గొప్పగా ఉండేది ఆవిడ తరగతి మటుకు.

ఆవిడ పుస్తకంలో చూసి చెప్పటం చాలా తక్కువ. ఆవిడ అవలంబించే బోధనా పద్ధతులలో ఇంకో చిన్న ఉదాహరణ. "ఇంతింతై వటుడింతై" అన్న పద్యం తెలియని తెలుగువాడు ఉండడు కదా - అది అందరికీ అర్ధం కావటానికి ఆవిడ తరగతిలో ఉన్న అత్యంత పొడగరిని, రెండవ పొడగరిని, మధ్యస్థంగా ఉన్నవాడిని, పొట్టిగా  ఉన్న వాడిని పిల్చి, అందరినీ తరగతి మధ్యలో నుంచోబెట్టి పొట్టివాడిని బలిచక్రవర్తిగా చేసి, మిగిలిన ముగ్గురిని వామనావతార పురుషులుగా చేసి  పద్యం చదువుతూ, అర్ధం వివరిస్తూ వాళ్ళ చేత ఆ అభినయం చేయించారు. అలా అరటి పండు వలిచి పెట్టినట్టు నాటకం రూపంలో ప్రదర్శిస్తే ఎంత మందమతికి అయినా ఆ పద్యం అర్ధం కాకుండా ఉంటుందా? మీరే చెప్పండి. అలా ఎంతో ఆసక్తికరంగా ఉండేది ఆవిడ బోధన.

అలాగే విద్యార్ధులని ఉత్సాహపరచడంలో కూడా ఆవిడదే ప్రధమ తాంబూలం. అది పాఠశాలలో కానివ్వండి, బయట కానివ్వండి. నాకే జరిగిన ఒక సంఘటన చెపుతాను. కరుణమ్మగారు మా ఇంటికి దగ్గరలోని బాంక్ కాలనీలో ఉండేవారు. మేము అశోకనగర్లో ఉండేవాళ్ళం. మా ఇంటి చుట్టుపక్కల ఉన్న పిల్లలు, కొంత మంది సహ విద్యార్ధులు

కలిసి సాయంత్రం పూట క్రికెట్ బ్యాట్లు బంతులు వగైరా సరంజామా అంతా పుచ్చుకుని ఆట ఆడుకునేవాళ్ళం. అలా నెమ్మదిగా జట్టు కొంచెం నైపుణ్యం సంపాదించాక పక్క కాలనీ పిల్లలతో ఒక పోటీ మ్యాచ్ పెట్టుకున్నాం. అందులో తుక్కు తుక్కుగా ఓడిపోయాం అనుకోండి. అలా ఓడిపోయి ఈసురోమంటూ భారంగా ఆ మైదానం నుంచి ఇంటికి పోతూ ఉంటే ఆవిడ అప్పుడే 20 నంబర్ బస్సులో ఎక్కడినుంచో వస్తూ మమ్మల్ని చూసి బస్సులోనుంచి దిగి మమ్మల్ని పిల్చి - "ఏరా అబ్బాయిలూ ? ఏమిటి అలా ఉన్నారు?" అని వివరాలు అడిగి తెలుసుకుని పక్కనే ఉన్న తన ఇంటికి తీసుకుని పోయి కూర్చోబెట్టి, బిస్కట్లు - చాయ్ తీసుకుని వచ్చి "ఒరే పిల్లలూ ఒక్కటే గుర్తు పెట్టుకోండి - పడి లేచిన వాడే విజేత. కాబట్టి ఓటమికి ఎప్పుడూ కుంగిపోకూడదు" అని మమ్మల్ని ఊరడించి , ఉత్సాహ పరిచి ఇంటికి పంపారు. ఆ అమూల్యమయిన మాట "పడి లేచిన వాడే విజేత" నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఇప్పటికి ఈ అమెరికా దేశానికి వచ్చాక, రాకముందూ జీవితంలో దెబ్బలు తిన్నప్పుడల్లా (కందిపోయే దెబ్బలు చాలానే తగిలాయి అనుకోండి- అది అంతా వేరే సంగతి) ఆవిడ మాటలు గుర్తుకు తెచ్చుకుని ఉత్సాహం పొందుతూ సమస్యలని పరిష్కరించుంటూ ఉన్నాను. అలా విద్యార్థులకి ప్రేరణగా నిలిచిపోయే వ్యక్తిత్వం ఆవిడ సొంతం. ఆలాంటి మాష్టారు దగ్గర చదువుకున్నందుకు నా జీవితం ధన్యం.

నేను మార్చిపోలేని మరో మాస్టారు కామేశ్వరి గారు.. సుమారు ఏడెనిమిది యేళ్ళ క్రితం అనుకుంటాను, నేను సెలవలకి హైదరాబాదు వెళ్ళినప్పుడు గోల్కొండ కోట "లైట్ అండ్ సౌండ్ షో" కి వెళ్ళాను. అక్కడికి ఆవిడ కూడా వచ్చారు. ఆవిడ భర్త ఆంధ్రప్రదేశ్ చీఫ్ జస్టిస్ అనుకుంటాను, సాయుధులతో పాటు ఉన్నారు. ఆవిడని చూసి నేను వెళ్ళి నమస్కారం పెడితే ఆవిడ వెంటనే నన్ను గుర్తు పట్టి, "ఇదిగో వీడు మా స్కూల్లో చదువుకున్నాడు ఇప్పుడు అమెరికాలో ఉన్నాడు" అని ఎంతో సంతోషంగా అక్కడివారికి చెపుతూంటే నాకు ఎందుకో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అలాంటి మంచి మంచి ఉపాధ్యాయుల దగ్గర చదువుకునే అవకాశం దొరికినందుకు నా జన్మ ధన్యం అని అనుకుంటున్నాను.


అందరికీ పేరు పేరునా శతసహస్ర కోటి వందనాలతో ..

సరే ఇక సెలవలు వస్తే పాలోమని అమ్మమ్మగారి ఊరు చల్లపల్లి పోయేవాళ్ళం.అక్కడ తాతగారు కాశీభట్ల వీరరాఘవయ్యగారు సాయంత్రంపూట కొంత మంది పిల్లలకి వేదపాఠాలు చెప్పేవారు. ఇంట్లో ఉన్న బావి చప్టా మీద ఆయన బావి ఒరుగులకి తల వాల్చి పడుకుని పాఠాలు చెపుతూ ఉంటే, ఆయన చుట్టూ కూచుని, కాళ్ళు వంతుల వారీగా (నేను కూడా!)వత్తుతూ పిల్లలు ఆ పాఠాలను వల్లిస్తూ ఉండేవాళ్ళు. ఆయన కాళ్ళు ఎందుకు నొక్కవలిసి వచ్చేది అంటే, మా తాతగారు రోజూ దగ్గర దగ్గర 15 మైళ్ళు సైకిలు మీద మోపిదేవి వెళ్ళి వచ్చేవారు. ఆయన అక్కడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు. అలా వయసు మీద పడుతున్నకొద్దీ అన్ని మైళ్ళు సైకిలు తొక్కినందుకు ఆయనకి కాళ్ళు నొప్పులు వచ్చేవి. అందుకని పిల్లలు ఆయన కాళ్ళు పట్టేవారు. ఆ పిల్లలని చూసి మాకు కూడ ఉత్సాహం వచ్చి మేము కూడ చేరేవాళ్ళం ఆ గుంపులో. అలా తాతగారి వద్ద చిన్నప్పుడు చాలానే నేర్చుకున్నాము. అభ్యాసం లేకపోవడం వల్ల ఆ పాఠాలు సగం పైనే మర్చిపోయాను. ఒక విషయం చెప్పాలి ఇక్కడ. ఆయన మనవళ్ళు, ఇతర పిల్లలు అని పక్షపాతం చూపించేవారు కాదు. ఎవరయినా సరే పదం తప్పు పలికాడో వాడికి ఫటేల్మని దెబ్బ పడిపోయేది. అలా తాతగారి వద్ద ఎంతో మంది పిల్లలు విద్యనేర్చుకుని ఇవ్వాళ్ళ మంచి మంచి దేవాలయాలకి

అర్చకులుగా ఉన్నారు. ఆయన ఆ భగవంతుడికి మనసారా చేసిన పూజల ఫలితమో, విద్యార్ధులకి వేదభిక్ష పెట్టిన ఫలితమో ఏమో కానీ, ఆ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు మా అందరినీ చల్లగా చూస్తున్నారు.

అలా నాకు దైవభక్తి నేర్పిన మొదటి గురువు తాతగారే.

ఏమన్నా అనుకోండి కానీ, నాకు సంబంధించినంతవరకు చందమామ, బాలమిత్ర, ఫాంటం కథలు, ఇంకా బోలెడన్ని చిన్నపిల్లల పుస్తకాలు ఇవి అన్నీ కూడా గురువుతో సమానం. కొంతమందికి అవి స్నేహితులుగా కనపడవచ్చు...కానీ నా అభిప్రాయం వేరు. నా మదిలో వాటికి గురుస్థానం ఎందుకంటే, చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే గొప్ప గొప్ప విశేషాలు ఉన్నాయి వాటిలో. అలా బాలల్లో విజ్ఞాన వికాసానికి తోడ్పడేది ఏది అయినా ఆచార్యవర్యులతో సమానం. అసలు ఆ పత్రికలను ప్రజల్లోకి తీసుకుని వచ్చిన వ్యక్తులు, పత్రికా నిర్వాహణకు సహకరించిన వ్యక్తులు, ఆ వందలాది పత్రికలను వెనకాల ఉండి నడిపే మనుషులు కూడా గురు సమానులే. ఇది ఖచ్చితమయిన నిజం.




ఎందరో ఆచార్యవర్యులు

అందరికీ శతసహస్రకోటి వందనాలు

***

*మాగంటి వంశీ మోహన్ గారు ఐ.బి.మ్ లో పనిచేస్తున్నారు. వారి శ్రీమతి శ్రీదేవి, పాప వైష్ణవితో శాక్రిమెంటోలో నివసిస్తున్నారు. వంశీ గారికి పాతతరం తెలుగు సాహిత్యం పై మక్కువ ఎక్కువ . తెలుగు భాషాభిమానంతో తెలుగుకు సంబంధించిన సైట్లు* www.maganti.org and http://janatenugu.blogspot.com *మెయిన్‌టైన్ చేస్తున్నారు.*

# యమ్వీ ఎల్ ప్రసాద్





మనం జీవితంలో ఎంతమంది టీచర్లని కలిసినా చిన్నప్పటి టీచర్లు గుర్తున్నంతగా మిగతా టీచర్లు గుర్తుండరేమో. గుర్తున్నాకానీ, పసి వయసులో మనపై ప్రభావం కలిగించిన టీచర్లే మనసుకి దగ్గరగా మిగిలిపోతారేమో.. నేను ISRO లో అబ్దుల్ కలామ్ గారి (మాజీ భారత రాష్ట్రపతి) వద్ద పనిచేసినా, తరువాత అమెరికా సిలికాన్ వేలీలో విజయవంతమైన ఎంటర్ ప్రెన్యూర్‌గా పేరు తెచ్చుకున్నా, వీటన్నింటికీ అసలైన బలీయమైన పునాది నా ఎలిమెంటరీ, హైస్కూలు రోజుల్లోనే సమకూరిందని భావిస్తాను. నా హైస్కూలు గురించి చెప్పాలంటే నాకిష్టమైన టీచర్ (ప్రిన్సిపాల్) శ్రీమతి వి.కోటేశ్వరమ్మ గారి గురించే చెప్పాలి. కేవలం కోటేశ్వరమ్మగారు అనేకంటే మాంటిస్సోరి కోటేశ్వరమ్మ గారంటే అందరికీ తేలికగా తెలుస్తుంది. విజయవాడలో గత 52 సంవత్సరాలుగా విద్యాదానం చేస్తున్న కోటేశ్వరమ్మ గారి గురించీ, వారితో నా అనుబంధం గురించీ, వారు నన్ను ప్రభావితం చేసిన తీరు గురించీ చెప్పేముందు ,ఆవిడ ప్రారంభించిన మాంటిస్సోరి స్కూలు గురించి ముందుగా కొంచెం చెప్పాలి.

శ్రీమతి వి.కోటేశ్వరమ్మగారు మొట్ట మొదటిసారిగా 1955లో మాంటిస్సోరి విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. అభ్యుదయభావాలతో మొదలైన ఈ స్కూలుకి అప్పట్లో విజయవాడలో పేరొందిన మెడికల్ డాక్టర్ కొమ్మరాజు అచ్చమాంబ గారి ప్రోత్సాహం ఎంతో ఉంది. ఈ అచ్చమాంబగారు ప్రఖ్యాత ఇంజినీరు స్వర్గీయ డాక్టర్ కె.ఎల్ రావు గారి బంధువులుకూడా. 1957 లో విజయవాడ, సూర్యారావు పేటలో విజయాటాకీస్ ఎదురుగుండా వీధి దగ్గరలో డాక్టర్ ముత్యాల గోవిందరాజులు నాయుడు గారి భవనంలో కోటేశ్వరమ్మ గారి మాంటిస్సోరి స్కూలు పురుడు పోసుకుంది. అప్పట్లో ఆ భవనానికి పెద్దగేటు, గేటుకి అటూ ఇటూ తొండాలు పైకెత్తి నిలుచున్న ఏనుగుల బొమ్మలూ ఉండేవి. అందుకనే మొదట్లో ఈ స్కూలుని ఏనుగుల బడి అనికూడా పిలిచే వారు. అతి త్వరలోనే పిల్లల సంఖ్య పెరగడంతో ఆ భవనం సరిపోక, రేడియో స్టేషన్‌కి ఎదురుగుండా ఉన్న వీధిలోని పున్నమ్మ తోటలోకి ఈ స్కూలుని

1963-64 ప్రాంతాల్లో మార్చారు.

1959లో అక్షరాభ్యాసం అవగానే 1960 నుంచే కె.జి.క్లాసులో కోటేశ్వరమ్మగారి మాంటిస్సోరి విద్యాలయంలో విద్యార్థిగా చేరాను.. అప్పట్లో (బహుశా ఇప్పుడు కూడా ఈ అలవాటు అలానే ఉందేమో, తెలియదు మరి) ఫేమిలీలో పెద్దబ్బాయి లేదా పెద్దమ్మాయి ఏ స్కూలుకి వెళితే మిగతా పిల్లలని కూడ అదే స్కూలుకి పంపించడం అలవాటుగా ఉండేది. ఆ సూత్రాన్ననుసరించే మా అక్క లలితా కామేశ్వరీ, నేనూ , మా చెల్లీ (దుర్గామహాలక్ష్మి), తమ్ముడూ (శ్రీనివాస్), నలుగురమూ కోటేశ్వరమ్మ గారి స్కూలులోనే చదువుకున్నాం.

కోటేశ్వరమ్మ గారు చిన్నతనంలోనే మాకు నేర్పిన క్రమశిక్షణ,పోటీ తత్వం, చదువుని సవ్యమైన విధానంలో నేర్చుకునే పద్ధతులూ అన్నీ ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. ప్రతిరోజూ స్కూలు పిల్లలందరికీ అసెంబ్లీ నిర్వహించేవాళ్ళు. అన్ని తరగతులవాళ్ళమూ కలిసి స్కూలు ప్రారంభం కావడానికి ముందు స్కూలు బయట క్లాసుల వారీగా నిలబడేవాళ్ళం. ముందుగా ఒకరిద్దరు వందేమాతరం పాడే వాళ్ళు. తరువాత స్ట్రెచింగ్ ఎక్సర్ సైజులు ఉండేవి. అప్పుడు బి.బి.సి లో తరచూ వచ్చే వాద్యసంగీతాన్ని వినిపించేవాళ్ళు. Click here to listen to that music..!

తరువాత కోటేశ్వరమ్మ గారు ఆ రోజు వార్తాపత్రికల్లోని ముఖ్యమైన విశేషాలన్నింటినీ చదివి వినిపించేవాళ్ళు. కేవలం చదవడమే కాకుండా వాటిని విశ్లేషించి వివరంగా చెప్పేవాళ్ళు. అప్పట్లో పాకిస్థాన్ యుద్ధం జరుగుతోంది. యుద్ధ విమానాల గురించీ, అవి పనిచేసే విధానం గురించీ కళ్ళకి కట్టినట్లు చెప్పేవాళ్ళు. ఆ రోజు కోటేశ్వరమ్మ గారు అలవాటు చేసిన వార్తాపత్రికా పఠనమూ, జనరల్ నాలెడ్జి పట్ల ఆసక్తే, తరువాత నేను ఇంజినీరింగ్‌లో ఉండగా ఐదేళ్ళూ క్విజ్ ఛాంపియన్‌ని కావడనికీ, చివరి రెండేళ్ళూ టీమ్ కెప్టెన్ గా వుండడానికీ సహాయం చేసింది.


టీచర్లందరూ సరిగ్గా, అందరికీ అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారా లేదా అని కోటేశ్వరమ్మ గారి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వాళ్ళు. అందుకే విజయవాడలోని కుటుంబాల్లో కొన్ని తరాలకి తరాలే మాంటిస్సోరిలో చదువుకున్న సంఘటనలు కోకొల్లలు.. ప్రతినెలా ప్రోగ్రెస్ రిపోర్టులు ఇచ్చేవాళ్ళు. ఆవిడే స్వయంగా ప్రతి స్టూడెంట్‌ని పిలిచి ఆ రిపోర్టు ఇచ్చేవాళ్ళు. మాకది ఒక గొప్ప అనుభవం. ఆవిడ ఎదుట నిలబడాలంటేనే గౌరవంతో కూడిన భయం మమ్మల్ని ఆవరించేది. క్రిందటి నెలకీ, ఈ నెలకీ పోల్చి, మార్కులు తక్కువ వస్తే మందలించేవాళ్ళు. మిగతా మా కుటుంబసభ్యుల్లో ఎవరు ఎలా చదువుతున్నారో తేడా వివరించే వాళ్ళు. అలానే మంచి మార్కులు వస్తే చాలా ఆ- త్మీయంగా భుజం తట్టి మెచ్చుకునేవాళ్ళు. అభినందించడం కూడా ఒక కళే అని కోటేశ్వరమ్మ గారి వద్దనే నేర్చుకున్నాను.

విజయవాడకి ఏ సాహితీవేత్త, రాజకీయ ప్రముఖులు వచ్చినా మా స్కూలుకి పిలిచి వాళ్ళతో ఉపన్యాసాలిప్పించేవాళ్ళు కోటేశ్వరమ్మ గారు. అలానే గవర్నర్, రాష్ట్రపతి వగైరా జాతీయ నాయకులు వచ్చినప్పుడు కూడా జరిగే బహిరంగ సభల్లో మాతో ప్రదర్శనలిప్పించేవాళ్ళు. ఈ విధంగా అప్పటి గవర్నర్ పట్టంథాను పిళ్ళై, ఉపరాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ లాంటి ప్రముఖుల్ని చూసే అవకాశం కలిగింది. ఆ వయసులో అటువంటి అనుభవాలు చాలా ఉత్తేజకరంగా ఉండేవి.

నేను 1968 లో తొమ్మిదో తరగతి పూర్తిచేశాక కుటుంబ పరిస్థితులరీత్యా హైదరాబాదు వెళ్ళిపోవాల్సి వచ్చి మాంటిస్సోరి స్కూలునీ, కోటేశ్వరమ్మ గారి అధ్యాపకత్వాన్నీ వదిలెయ్యాల్సి వచ్చింది..తరువాత పై చదువులకోసం వివిధ నగరాలూ వెళ్ళడం, చివరికి అమెరికాలో స్థిరపడడం జరిగినా మాంటిస్సోరి స్కూలు గురించీ, కోటేశ్వరమ్మ గారి

గురించీ ఎక్కడ ఏ వార్త వచ్చినా వదిలిపెట్టకుండా చదువుతుండేవాడిని. అలానే మాంటిస్సోరిలో చదువుకున్న స్టూడెంట్స్ ఎవరైనా తారసపడినప్పుడుకూడా కోటేశ్వరమ్మ గారి గురించి మాట్లాడుకోవడం తప్పని సరి.

మొన్న 2006 డిసెంబర్‌లో విజయవాడ వెళ్ళినప్పుడు కోటేశ్వరమ్మ గారిని చూడడానికి వెళ్ళాను. దాదాపు 40 సంవత్సరాల తరువాత నా చిన్నప్పటి స్కూలుకివెళ్ళడం. వాళ్ళింటికి వెళ్ళేసరికి మేడమీద మడత నలగని ఖద్దరుచీరెలో ఎనిమిది పదుల వయసులోకూడా ఏ మాత్రం తరగని ఉత్సాహంతో వున్న కోటేశ్వరమ్మ గారిని కలుసుకోవడం ఒక గొప్ప అనుభూతి. నేను వెళ్ళి నమస్కారం చేసి పేరు చెప్పగానే ఒక్క క్షణం - ఆనవాలు పట్టలేదు. "అమ్మా నేను లలితా కామేశ్వరి వాళ్ళ తమ్ముడిని "అనగానే వెంటనే గుర్తుపట్టి " అవును ప్రసాద్..నువ్వు అప్పుడెప్పుడో అబ్దుల్ కలామ్ గారి వద్ద రాకెట్ పరిశోధనలేవో చేస్తున్నావని విన్నాను " అన్నారు. ఆవిడ జ్ఞాపకశక్తి అమోఘం. నా ఆరోగ్యవిశేషాలు అడిగి తెలుసుకున్నారు. మా ఫేమిలీ లో అందరి కబుర్లూ పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు. నాకు పంచదార సరిపడదని గ్రహించి ఒక గ్లాసుతో చల్లని మజ్జిగ తెప్పించి తన స్వహస్తాలతో తాగించారు. ఆ సమయంలో అవిడని చూస్తుంటే మా అమ్మే గుర్తొచ్చింది. తరువాత ఆవిడ భర్త కృష్ణారావు గారు కూడా వచ్చారు. నన్ను స్కూలుకి తీసుకెళ్ళి '40 ఏళ్ళ క్రిందట మనస్కూలు స్టూడెంటు.. అమెరికాలో ఉంటున్నాడు" అని అందరికీ పరిచయం చేశారు. అక్కడి స్టూడెంట్స్‌కి నాతో చిన్న ఉపన్యాసం ఇప్పించారు కూడా.


కోటేశ్వరమ్మగారితో ప్రసాద్

2005 ఫిబ్రవరిలో 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్వర్ణోత్సవం జరుపుకున్న మాంటిస్సోరి విద్యాలయం ఒక స్కూలు మాత్రమే కాదు. ఇప్పుడు అదొక వ్యవస్థ. వివిధ కళాశాలా ప్రాంగణాలతో శాఖోపశాఖలుగా విస్తరించిన ఆ సంస్థని గమనించినప్పుడు నేనూ ఒకప్పుడు ఇక్కడి విద్యార్థినే నన్న భావం మనసులో కించిత్ గర్వాన్నీ. ఎంతో ఆనందాన్నీ కలిగించింది.

వచ్చేప్పుడు ఇద్దరి కాళ్ళకీ నమస్కారం చేసి శెలవుతీసుకున్నాను.

విజయవాడ చరిత్రలో మాంటిస్సోరి స్కూలు ఎలా నిలిచిపోతుందో, నా మనసులో కోటేశ్వరమ్మ గారు కూడా శాశ్వతంగా నిలిచిపోతారు.. ఆమెకి భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలనీ, ఆవిడ అందించిన స్ఫూర్తి ముందు తరాలను మరింత ప్రభావితం చేయాలనీ మనసారా ఆశిస్తున్నాను.

మాంటిస్సోరి స్కూలు విద్యార్థినీ, విద్యార్థులెవరైనా ఈ వ్యాసం చదివితే నన్ను సంప్రదిస్తే ఎంతో సంతోషిస్తాను. మనందరం మరోసారి మన చిన్నప్పటి స్కూలు అనుభూతుల్ని నెమరేసుకోవచ్చు. మనందరం కలిసి పూర్వ విద్యార్థినీ విద్యార్థుల వివరాలతో ఒక వెబ్ సైట్ తయారు చేసుకుంటే బావుంటుంది.

montessorischoolvijayawada@gmail.com

ప్రస్తుతం డల్లస్, టెక్సాస్ లో నివసిస్తున్న ప్రసాద్ గారు 18 సంవత్సరాలకు పైగా సిలికాన్ వేలీలో నివసించారు. అనేక కంపెనీలలో ఉన్నతమైన ఉద్యోగాలు చేసిన ప్రసాద్ గారు, సొంతంగా కూడా కంపెనీలని స్థాపించి విజయవంతమైన ఎంటర్ ప్రెన్యూర్ గా పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడూ అనేక start-up కంపెనీలకి వివిధ రంగాల్లో సలహాదారుగా వుంటున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ అత్యుత్సాహంగా పాల్గొనే ప్రసాద్ గారు చక్కటి తెలుగు సాహిత్యాభిలాషి కూడా.



# హరి మూర్తి



**నేను చదువుతున్నప్పుడు నాకు మంచి ప్రోత్సాహాన్నిచ్చి, చాలా ఆదర్శంగా నిలిచిన వారిలో అత్యున్నతమైనవారు మా రెడ్డి మాష్టారు.** వారి పూర్తి పేరు పూందల వెంకట రమణారెడ్డి గారు నాకు ఇంటర్మీడియట్‌లో మాథ్స్ సబ్జెక్ట్ చెప్పేవారు. అసలు మాథ్స్ సబ్జెక్ట్ అంటేనే ముచ్చెమటలు పోసే నాకు, ఇంటర్మీడియట్‌లో ఎం.పి.సి. గ్రూపు తీసుకోవడానికి సాహించాను అంటే దానికి కారణం మా రెడ్డి మాష్టారు మాత్రమే. నేను ఇంటర్మీడియట్ చదవడానికి గవర్నమెంటు జూనియర్ కాలేజీ పార్వతీపురంలో జాయిన్ అయ్యాను. ఆ కాలేజీలో సరిగా చెప్పేవాళ్ళే లేరని, ఒకవేళ చెప్పినా, వినే విధ్యార్ధులే కరువని అందరూ అంటూ ఉండేవారు. కానీ మాథ్స్ లెక్చెరర్ చాలా బాగా చెపుతారని మా అన్నయ్య నాకు మంచి ధైర్యం చెప్పాడు. మొత్తం మీద భయపడుతూనే ఎం.పి.సి గ్రూపులో జాయిన్ అయ్యాను. మొదటి రోజు కాలేజ్‌కి వెళ్ళే సరికి కొంచెం ఆలస్యం అయింది అప్పుడే మా మాథ్స్ క్లాస్ మొదలైపోయింది.. లేటుగా క్లాసులోకి అడుగుపెట్టే ధైర్యం లేక, వరండాలో నిల్చుండిపోయాను. ఈ లోగా ఒక గంభీరమైన గొంతు "ఎవరోయ్ ఆ వరండాలో," అని. చేసేది లేక వెంటనే మా క్లాసు ఎంట్రెన్సు ముందు నిల్చుని, 'సార్! లేటు అయిపోయింద'ని మెల్లగా నసిగాను. 'ఆc లేట్ అయినా పరవాలేదు, వచ్చి ఈ ముందు బెంచీలో కూర్చో' అన్నారు. సాధారణంగా లేటుగా వెళితే హైస్కూలులో వెనక బెంచీ మీద నిల్చోమనేవారు కానీ కాలేజీలో మాత్రం ముందు కూర్చోమన్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. తరువాత తెలిసింది. "ముందు బెంచీలో వాళ్ళనే ఎక్కువగా ప్రశ్నలు వేస్తారని".

రెడ్డి మాష్టారు అంటే చాలా పెద్దవారు జుత్తు పండి ఉంటుందని ఊహించిన నాకు ఖంగు తిన్నట్లైంది. మా రెడ్డి మాష్టారు అందుకు భిన్నంగా ఉన్నారు చాలా అందంగా, మంచి ఠీవిగా ఉన్నారు. అతని మాట చాలా గంభీరంగా ఉంది. ఒక గంట సేపు జరిగిన క్లాసులో, అందరూ ఎంతో శ్రద్ధగా విన్నారు. నాకు చాలా ఆసక్తి కలిగింది. అంతవరకు కాలేజ్ అంటేనే భయం, మాథ్స్ సబ్జెక్ట్ అంటేనే వణుకున్న నాకు మా రెడ్డి మాష్టరు క్లాసంటే చాలా ఇష్టం అయింది. మాష్టారు బోధించిన తీరు మా క్లాసు అందరికీ చాలా బాగా నచ్చింది. రెడ్డి మాష్టారు క్లాస్ మిస్ అయితే, ఆరోజు ఎంతో వెలితిగా ఉండేది. మాథ్స్ సబ్జెక్టుని రెడ్డి మాష్టారు చాలా సునాయాసంగా, ఎంతో ఓర్పుగా మాకు భోదించేవారు. వారి ప్రోత్సాహంతో ఇంటర్మీడియట్ మొదటి పేపరులోమా క్లాస్‌మేట్స్ చాలా మందితో పాటు, నాకు కూడా మాథ్స్ సబ్జెక్టులో వంద శాతం మార్కులు రావటం జరిగింది. ఇంక ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు రావటంతో మా అందరికీ క్లాసు అంటే మంచి ఉత్సాహం పెరిగింది. మా మాష్టారు కూడా అంతకు రెట్టింపు ఉత్సాహంతో రెండో సంవత్సరం మాథ్స్ సబ్జెక్టు బోధించారు. మునుపెన్నడూ ఊహించని విధంగా, రెండో సంవత్సరంలో కూడా అత్యధిక స్థాయితో మార్కులు మాక్లాసులో వచ్చాయి. మేము చేసిన ప్రతీ పనిలోనూ, మా మాష్టారు స్ఫూర్తి ఉండేది. మా మాష్టారు గురించి ఒక్క మాటలో చెప్పాలి అంటే - మా మాస్టారు ప్రోత్సాహం వల్ల మా బాచ్‌లో పదిహేను మంది విద్యార్థులకు ఇంజినీరింగులో సీట్లు వచ్చాయి. అది పార్వతీ పురం కాలేజీలో ఇప్పటికీ ఒక రికార్డుగానే నిలిచింది. ఆ ఘనత మా రెడ్డి మాస్టారుకే దక్కింది. అది మొదలుకుని రెడ్డి మాష్టారు ఎందరో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఇంజినీరింగులో జాయిన్ అయ్యేలా ప్రోత్సహించేవారు.

తరువాత పలు కళాశాలలో మంచి ఉన్నతమైన పదవులను పోషించి ఎందరో ఇంజినీర్ను తయారు చేశారంటే అతిశయోక్తి కాదు. నిస్వార్ధంగా, అంకిత భావంతో ఫలితాన్ని ఆశించకుండా, వృత్తి ధర్మాన్ని నూటికి నూరుపాళ్ళు పాటిస్తూ మంచి విద్యను బోధించిన మా రెడ్డి మాష్టారు నాకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయులే.




మాస్టారు రమణారెడ్డి గారు,
శ్రీమతి పద్మావతి గారు

నేను కాలేజీ వదిలేసాక కూడా మాస్టారి గురించి విశేషాలు తెలుసుకుంటూనే ఉన్నాను. కేవలం కాలేజీ బోధనకే పరిమితం కాకుండా మాస్టారు గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్‌కి రాష్ట్ర స్థాయి లో ప్రెసిడెంట్ గా పనిచేశారు. ఆ సంస్థద్వారా టీచర్లకి వారందించిన సేవల వల్ల వారి పేరు రాష్ట్రమంతా చిరపరిచితమైంది. అలానే రోటరీ క్లబ్బులో ప్రవేశించి పాడేరు, అరకు, చింతపల్లి మొదలైన ఏజన్సీ ప్రాంతాల్లో పల్స్ పోలీయో లాంటి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహించారు. 2005, జూన్ 30న గవర్నమెంట్ సర్వీసెస్ నుంచీ రిటైరైనా కానీ ఇంకా అనేక సామాజిక సేవాకార్యక్రమాలతో చురుకుగా వున్నారు మా మాస్టారు.

ఇక మాష్టారుగారి కుటుంబం గురించి.. మా మాష్టారుగారి భార్య పేరు శ్రీమతి పద్మావతి. రెడ్డి మాష్టారుతో బాటు, అమ్మగారు కూడా మమ్మల్ని ఎంతగానో ఆదరించేవారు. మా క్లాస్మేట్స్ అందరి పేర్లతో సహా అమ్మగారికి పరిచయమే. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు. అమ్మాయికి పెళ్ళి అయింది. వారి అల్లుడుగారు విశాఖ పట్టణంలో

ఒక ముఖ్య దినపత్రికకు సబ్ఎడిటరుగా పనిచేస్తున్నారు. వారి అబ్బాయి ఒరాకిల్ కార్పోరేషన్, రెడ్ ఉడ్ సిటీ (USA)లో సాఫ్ట్వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. చాలా సంవత్సరాల తరువాత మా మాష్టారుతో ఫోనులో మాట్లాడాను. చాలా సంతోషం వేసింది. ఈ విధంగా "మా మంచి టీచర్లు" లో మా రెడ్డి మాష్టారు గురించి రాసే అవకాశం లభించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

సిలికాన్ వేలీలో టెక్నాలజీ రంగంలో ఉన్నతోద్యోగం చేస్తున్న హరి మూర్తిగారు చక్కటి గాయకుడు, నటుడు. ఈలపాట ఈయన ప్రత్యేకత. భార్య, పిల్లలతో ఎవర్ గ్రీన్ వేలీలో నివాసం.



# కట్టా గోపాలకృష్ణ మూర్తి

*1. పసితనంలో...*

1936లో అప్పటి గుంటూరు జిల్లాలో ఉన్న పందిళ్ళపల్లి అనే గ్రామంలో మా అమ్మగారి ఇంట్లో నేను జన్మించాను. నా చిన్నతనమంతా పందిళ్ళపల్లి గ్రామం, బందరు, కైకలూరు నగరాల్లో గడిచింది. హైస్కూలు, ఇంటర్మీడియట్ చదువులు పూర్తిచేసి బి.ఎస్సి చదువుకుని 17వ సంవత్సరంలో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీకి వెళ్ళేంతవరకూ ఈ పందిళ్ళపల్లి, బందరు, కైకలూర్లు దాటి నేనెక్కడికీ వెళ్ళలేదు.

నేను స్కూలుకు వెళ్ళడం మొదలు పెట్టింది పందిళ్ళపల్లిలోనే. చిన్నగ్రామం అవడం మూలాన అప్పట్లో అక్కడ ఒకే ఒక పూరిపాక ఎలిమెంటరీ స్కూలు ఉండేది. దాంట్లో 1,2 తరగతులు మాత్రమే ఉండేవి. పందిపళ్ళపల్లి తెల్లటి ఇసక తిన్నెలప్రాంతం. స్కూలు వెనక విశాలమైన దొడ్డి ఉండేది. ఆ దొడ్డిలో ఇసక మీద చేతివేలితో తెలుగు అక్షరాలు వ్రాసి, విద్యార్థుల చేత దిద్దించేవారు పంతులు.

ఇంట్లో చదువుకోడానికి మాత్రం మా అమ్మ నాకు పలకా, బలపం కొని ప్రతిరోజూ అక్షరాలు దిద్దించేది. అమ్మ చదువుకున్నది 5 వతరగతి వరకే, దాని తర్వాత తన చదువు మాన్పించేశారు తాతయ్యలు. కానీ, ఇంటిపనులు ఒకవైపు

చూసుకుంటూనే, నాకు తెలుగు అక్షరాలు, వ్యాకరణం, అంకెలు, గణితం, ఎక్కాలూ నేర్పించింది అమ్మ. ఇవేకాకుండా, కొత్త విషయాలు నేర్చుకోవాలీ, కనిపెట్టాలీ అనే కుతూహలాన్ని నాలో కలిగించింది అమ్మ నా పసితనంలోనే. తను ఎప్పుడూ ఏ ఉద్యోగమూ చెయ్యకపోయినా, నా పసితనం కాలంలో నచ్చిన పంతులు మా అమ్మే.

*2. కౌమారంలో....*

ఈ కాలంలో మా నాన్నగారు బందరులో రాష్ట్రప్రభుత్వంలో ఉద్యోగం చేస్తుండేవారు. నా హైస్కూలు, ఇంటర్మీడియట్ చదువులు బందరు హిందూ కాలేజీల్లో జరిగాయి.

సంస్కృతం నేర్చుకోవాలనే గొప్ప అభిలాషవల్ల నేను ఈ కాలంలో తెలుగు బదులు సంస్కృతం క్లాసులు తీసుకున్నాను. కనక ఎలిమెంటరీ స్కూలు తర్వాత స్కూళ్ళలో తెలుగు క్లాసులు తీసుకోలేదు.

అప్పుడు మా ఇంటి పక్క ఒక తమిళ కుటుంబం నివసించేది వాళ్ళకు ఒకే ఒక అబ్బాయి, నా వయస్సువాడు, పేరు పైనూరి హరిప్రసాద్. అతను నాకు ప్రాణస్నేహితుడయ్యాడు. మేము రోజూ స్కూలుకీ, సాయంత్రాలు చిలకలపూడిలో పాండురంగడి గుడికీ కలిసి నడిచి వెళుతుండేవాళ్ళం.

అతనికి తెలుగు చాలా ఇష్టం. హైస్కూలు, ఇంటర్మీడియట్లలో తెలుగు క్లాసులు తీసుకునేవాడు. ప్రతిరోజూ మేము స్కూలుకీ, గుడికీ నడిచి వెళ్ళేటప్పుడు, తన తెలుగు పంతులు నేర్పించిన పద్యాలు, తెలుగుసాహిత్య వివరాలూ నాకు చెపుతుండేవాడు. నేను తెలుగు సాహిత్యం గురించి తెలుసుకున్నదంతా అతనితో సంభాషణలగుండానే. కనుక ఆ వయస్సులో ఇతనే నా తెలుగు పంతులు అని చెప్పవచ్చు.

ప్రతిరోజూ అతనితో జరిగిన సంభాషణలు, చర్చలవల్ల నాకు చదువుమీదా, కొత్త విషయాలు నేచుకోవడం మీదా, ఆసక్తి బాగా పెరిగింది ఆ కౌమారదశలో. ఆ కాలంలో నా హైస్కూలు, కాలేజీ టీచర్లు ఎవ్వరూ అంతగా గుర్తులేరు నాకిప్పుడు. ఆ వయస్సులో నాకు నచ్చిన పంతులు, పంతులు కాని ఈ స్నేహితుడు పైనూరి హరిప్రసాదే!

*3. ఎం.ఎస్ చదువుకాలంలో...*

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్ పూర్తిచేశాక నేను కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్సిట్యూట్ (ISI)లో ఎం.ఎస్ చేశాను ISIని కలకత్తాలో స్థాపించింది ఇంగ్లండులో చదువుకుని వచ్చిన మహలనోబిస్ అనే బెంగాలీ ఆయన. మహలనోబిస్ ఇంగ్లండులో చదువుకున్న కాలంలోనే మేథమాటిక్స్‌లో గొప్ప పేరు గడించిన రామానుజం అక్కడే రిసెర్చి చేసేవాడు. అక్కడున్నంతకాలం, మహలనోబిస్, రామానుజం ఇద్దరూ ఒకే ఎపార్ట్‌మెంటులో నివసించారు.

అప్పుడు ISI లో ముఖ్య ప్రొఫెసర్ సి.ఆర్.రావు అనే తెలుగాయన. ఈయనకూడా ఇంగ్లండులోనే పి.హెచ్.డి చేశారు. ISI లో అందరూ ఈయన్ని గురించి చాలా గొప్పగా చెప్పుకునేవారు. ఈయన క్లాసులుంటే విద్యార్థులకు హడలుగా ఉండేది. నేను తీసుకున్న మొదటి క్లాసులో ఈయన ఒక ప్రశ్న అడిగి, ఒక్కొక్క విద్యార్థినీ వేలెత్తి చూపించి, జవాబు బోర్డుమీద విశదీకరించనున్నాడు. ఒకరిద్దరు చెయ్యలేమన్న తర్వాత నన్ను అడిగారు. నేను అది తేలిగ్గా చెయ్యగలిగాను. ఇలా 2,3 సార్లు జరిగాక, ఆయన తరచూ నన్నే అడిగేవారు. ప్రశ్నలు అంత కష్టమైనవి కావు గనుక,

నేను వాటి జవాబులు బోర్డుమీద తేలిగ్గా చూపించగలిగేవాడిని. బోర్డుమీద ఆయన ప్రశ్నలకు జవాబులు విశదీకరించడం నాకు చాలా గర్వాన్ని కలిగించేది. అందువల్ల ఆయన క్లాసులు నాకు చాలా నచ్చేవి.

అప్పుడే సి.ఆర్.రావుగారు నా జీవితానికి రోల్‌మోడలు అయ్యారు. నేనే గనక పంతుల్నయితే, పాఠాలు చెప్పడానికి ఈయన పద్ధతే వాడాలి అని మనస్సులో అనుకునే వాణ్ణి. ISI లో ఎం.ఎస్ చేస్తున్న కాలంలో రావుగారు నాకు నచ్చిన పంతులు అని వేరే చెప్పాలా?

కానీ రావుగారి క్లాసులో మిగతా విద్యార్థులందరూ ప్రైవేటుగా నన్ను "రావుగారి పెంపుడు కుక్క" అంటూ తిట్టేవారు.

రావుగారికి స్టాటిస్టిక్స్ అంటే ప్రాణం. స్టాటిస్టిక్స్‌లో రిసెర్చి చేసి పి.హెచ్.డి చెయ్యమని అందరు విద్యార్థులనూ ప్రోత్సహిస్తూ ఉండేవారు. అప్పుడు స్టాటిస్టిక్స్‌లో పిహెచ్‌డి చెయ్యాలనే కోరిక నాకు కలిగింది.

మహలనోబిస్, రావుగార్లిద్దరూ పేరుపొందిన రిసెర్చర్లు అవడం మూలాన ప్రపంచం నలుమూలలనుంచీ స్టాటిస్టిక్సు రిసెర్చిలో హేమాహేమీలందరూ ISI ను విజిట్ చేసేవారు ఆ రోజుల్లో. ఆ విజిటర్లందరూ సెమినార్‌లు ఇచ్చేవారు. ISIలో ప్రతివారం ఇలా ఇతర దేశాల నుంచీ వచ్చిన విజిటర్ల సెమినార్లు ఒకటి, రెండు ఉండేవి. చాలా వాటికి రావుగారు, మిగతా ప్రొఫెసర్లు వచ్చి కూర్చునేవారు. అందువల్ల విద్యార్థులు కూడా చాలామంది వాటికి వచ్చి కూర్చునేవారు, అర్థమయినా కాకపోయినా.

ఆ కాలంలో స్టాటిస్టిక్సు రిసెర్చిలో అగ్రశ్రేణివారుగా పరిగణింపబడేవారిలో ఇద్దరు ప్రముఖులు: ఒకరు సర్ రోనాల్డ్ ఫిషర్ అనే జుత్తంతా నెరసిన ఇంగ్లీషు ముసలాయినా, రెండోవారు జెర్జీనీమాన్ అనే కాలిఫోర్నియావాడు. నీమాన్ ఫిషర్ కన్నా వయస్సులో చాలా చిన్న; కానీ నీమాన్ పొడుగ్గా, బొద్దుగా ఉంటే; ఫిషర్ బలహీనంగా కనపడే పొట్టివాడు. వాళ్ళిద్దరికీ బద్ధవైరం, వాళ్ళ మధ్య లేతపచ్చటిగడ్డి వేసినా భగ్గున కాలిపోతుందని వినికిడి. ఒక సంవత్సరం వీళ్ళిద్దరూ ఒకే కాలంలో ISI వచ్చి నెలరోజులు ఉండడం సంభవించింది. ఈ నెలలో ప్రతివారం వీళ్ళిద్దరి సెమినార్లు వేరు వేరు రోజుల్లో జరుగుతాయని నోటీసు బోర్డులో ప్రకటించారు.

కుతూహలం వల్ల ఆ సెమినార్లకు విద్యార్థులం చాలామంది వెళ్ళి కూర్చునేవాళ్ళం. ఫిషర్, నీమాన్‌లలో ఒకరు స్పీకరు అయితే రెండో వారు మొదటి వరసలో కూర్చుని హాజరయ్యేవారు వీరి వైరం గురించి తెలుసు గనుక, విద్యార్థులమంతా తరచూ వీళ్ళిద్దరినే గమనిస్తూ ఉండేవాళ్ళం.

మొదటి సెమినార్ నుంచే ఒకరినొకరు విమర్శించుకోవడం మొదలయ్యింది. కొన్ని వారాలు గడిచాక, ఒకరు చెప్పేది ఇంకొకరు నాన్‌సెన్సు అనడం మొదలయ్యింది. ఒకసారి ఫిషర్ సెమినార్ ఇస్తుండగా సీమాన్ లేచి నుంచొని కోపంతో మాట్లాడడం మొదలు పెట్టాడు. మహలనోబిస్, రావు, వీళ్ళు కొట్టుకుంటారేమోనని భయపడినట్లున్నారు అప్పుడు; లేచి సీమాన్ని శాంతపరచి బయటకు తీసుకువెళ్ళారు.

స్టాటిస్టిక్సులో అగ్రశేణి రిసెర్చర్లు అనుకోబడే ఇద్దరు గొప్పవాళ్ళ మధ్యా కథా విషయం మీద ఒప్పందం లేకపోవడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. దీని స్టాటిస్టిక్సులో రిసెర్చి చేద్దామనుకున్న నాకోరిక సన్నగిల్లింది. రిసెర్చికి ఇంకొక సబ్జెక్టు వెదకడం ప్రారంభించాను.

ఆ సమయంలో వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు ISI కి అమెరికానుంచి ఒక పడుచు మేథమాటిక్సు ప్రొఫెసర్ వచ్చాడు. ఆయన ఆపరేషన్స్ రిసెర్చి (ఇంగ్లిష్) అనే కొత్త సబ్జెక్టు మీద చిన్న కోర్సు ఇస్తారని నోటీసు బోర్డులో ప్రకటించాడు.

ఈయన తన పడుచు భార్యతో బాటు వచ్చారు. ఆవిడ ఊహించలేనంత అందాలరాశి. ఒకసారి చూశాక, నాకు ఆవిడ ముఖాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేది. తెలుగు ప్రబంధ కవులు వర్ణించిన స్వర్గలోక నివాసిని అయిన రంభ అవతారం అయి ఉండాలి ఈవిడ అని నేననుకున్నాను. అందగత్తె కావడమే కాకుండా, అందర్నీ వారిపేరుతో పిలుస్తూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడేది. ఇంకో విశేషమేమిటంటే, ఆయన క్లాసులకు ఈవిడకూడా తన అల్లిక పనిముట్లతో హాజరు అయ్యేది. లెక్చర్ జరుగుతున్నంతసేపూ వెనకాల బెంచీలో కూర్చుని తన అల్లిక చేసుకుంటూ ఉండేది. ఈవిడను అప్పుడప్పుడూ చూడవచ్చనే ఆశతో విద్యార్థులంతా ఆయన ప్రతి లెక్చరుకీ హాజరు అయ్యేవారు.

### *4 పిహెచ్‌డి చదువు కాలంలో...*

ISI లో ఎం.ఎస్ (స్టాటిస్టిక్సు) పూర్తిచేశాక కొన్ని సంవత్సరాలు ISI లోనే ఉద్యోగం చేశాను. ఈ సమయంలో ఉద్యోగపు ఒత్తిళ్ళచేత పిహెచ్‌డి చెయ్యాలనే నా ఆశయం మరుగున పడింది. (OR) లో రిసెర్చి జరుగుతున్న యూనివర్శిటీలు ఆకాలంలో ఇండియాలో లేవనే చెప్పవచ్చు. OR లో రిసెర్చి చెయ్యాలంటే అమెరికాలో చదువుకి వెళ్ళాలని నేను గ్రహించాను. అది ఎలా కుదురుతుందీ అనే ఆలోచనలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

OR తెలిసినవారు ఎవరు మాట్లాడినా జార్జి డాంట్జిగ్ పేరు పలకడం విన్నాను. 1950 పడిలో ఈయన కృషివల్ల "లీనియర్ ప్రోగ్రామింగు" అనే OR సబ్జెక్టు ఉద్భవించి బాగా వర్ధిల్లింది. లీనియర్ ప్రోగ్రామింగ్ (Lp)ని చాలామంది నేర్చుకుని, డెషిషన్ ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చెయ్యడంలో దానికి చాలా ముఖ్యమైన ఉపయోగాలు కనుక్కున్నారు. చాలా కంపెనీలు ఎల్‌పి వాడి, తమ కంపెనీ నడపడానికి అయ్యే ఖర్చులు తగ్గించుకోగలిగారు. దాన్నుంచి డాంట్జిగ్‌కీ, ఆయన మొదలు పెట్టిన Lpకీ చాలా మంచి ఘనత చేకూరింది. ఈ Lp మీద కూడా రిసెర్చి చెయ్యాలనే గట్టి కోరిక నాకు ఉంది. కానీ ఇండియాలో అప్పుడు Lp మీద రిసెర్చి చేస్తున్న ప్రొఫెసర్‌లు ఎవ్వరూ కనపడలేదు. నా కోరిక నెరవేరాలంటే డాంట్జిగ్‌గారితో సంప్రదించాలని తెలిసి, అది ఎలా చెయ్యడమా అనే తర్జనభర్జనతో చాలాకాలం గడిపాక, 1962లో ధైర్యం చేసి ఆయనకు ఒక ఉత్తరం రాశాను, అంతకుముందు నేను TSP మీద చేసిన రీసెర్చి గురించి చెప్పి, వాళ్ళ యూనివర్శిటీలో పిహెచ్‌డి చదువుకు స్కాలర్‌షిప్పు లభిస్తుందా? అని ఆ ఉత్తరంలో అడిగాను.

వారం రోజుల్లోనే డాంట్జిగ్ గారి నుంచీ ఎయిర్ మెయిల్‌లో వచ్చిన కవరు చూసి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. దాంట్లో నా చదువుకి స్కాలర్‌షిప్పు ఆఫర్ వచ్చింది. దీనితో 1965 సెప్టెంబర్ UCB (యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీ)లో OR పిహెచ్‌డి ప్రోగ్రాంలో చేరాను.

మొదటి టరమ్‌లోనే డాంట్జిగ్‌గారి Lp కోర్సు తీసుకున్నాను ఈ కోర్సు, ఆయన రచించిన Lp పుస్తకం, నాకు ఆ సబ్జెక్టులో మొదటి పరిచయాలు. ఆ పుస్తకం, అప్పుడు పదకొండు డాలర్లకు కొన్నాను. ఈ పదకొండు డాలర్ల పెట్టుబడివల్ల తర్వాత నాకు చాలా ప్రతిఫలం లభించింది.

రెండవ టరమ్‌లో డాంట్జిగ్‌గారికి నేను TSPకని చేసిన రిసెర్చి వివరించడానికి ప్రయత్నించాను. మొదటి ప్రయత్నం విఫలం అయ్యింది. ఆయనకు నేను చెప్పినది ఏమీ అర్థంకాలేదు. మళ్ళీ జాగ్రత్తగా తయారయ్యి రెండో

ప్రయత్నం చేశాను. ఈసారి ఆయనకు బాగా అర్థం అయ్యేలా చెప్పగలిగాను అంతా అయ్యాక ఆయన ఇలా అన్నారు: "ఈ పొజిషన్‌లో నాకు కలిగే ఆనందాల్లో ఒకటి నీలాంటి పడుచువాళ్ళు చేస్తున్న కొత్త రెసెర్చిని గురించి వినడం సుమా!" అన్నారు. ఆ పలుకులు నాకు ఎంత మనోధైర్యాన్ని కలిగించాయో చెప్పలేను. ఇలాంటి మాటలతో ఆయన ఎంతోమంది పడుచు విద్యార్థులకు మనోధైర్యాన్ని కలిగించి ఉంటారని నాకు ఇప్పుడు అనిపిస్తుంది. నా పిహెచ్‌డి చదువుకాలంలో ఈ జార్జి డాంట్జిగ్ నాకు నచ్చిన పంతులు.

UCB లో నా మొదటి సంవత్సరం అయ్యాక, అంటే 1966లో డాంట్జిగ్‌గారు UCB ని వదిలిపెట్టి స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీకి వెళ్ళిపోయారు. అప్పుడు UCB లో ఇంకొక ప్రొఫెసర్, డేవిడ్‌గేల్, ఒకరోజు నాకొక ప్రాబ్లం ఇచ్చి, దీన్ని నువ్వు పరిష్కరించగవేమో చూడు అన్నారు. ఒక వారంరోజుల్లో దాని సొల్యూషన్ కనిపెట్టి ఆయనకు చూపించాను ఆ ప్రాబ్లమే నా థీసిస్ రెసెర్చి ప్రాబ్లం అయి, డేవిడ్ గేల్ గారు నాథీసిస్ ఎడ్వైజరు అయ్యారు.

UCB లో మూడు సంవత్సరాల్లో పిహెచ్‌డి పూర్తిచేశాక OR లో పంతులు ఉద్యోగాలకు వెదకడం ప్రారంభించాను. నాకు త్వరలోనే ఆ యూనివర్శిటీల నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి ఆఫర్లు వచ్చాయి. వీటన్నిటిలో ఏది తీసుకోవాలీ అనే తికమకలో నేనుండగా, గేల్ గారు UM (యూనివర్శిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ ఆర్బర్)కి వెళితే నీ భవిష్యత్తుకి మంచిది అని సలహా ఇచ్చారు. ఆయన మాటను బట్టి యుఎం కి వచ్చి చేరాను 1968 సెప్టెంబరులో. UM లో డేవిడ్ గేల్‌గారు నాకు నచ్చిన ఇంకొక పంతులు.

### *5. నచ్చిన పంతుళ్ళ ముఖ్య లక్షణాలు*

నాకు నచ్చిన టీచర్లందరివల్లా నా భవిష్యత్తు ఒక మలుపు తిరిగిందనే విషయం మీరు గమనించే ఉంటారు. ఇలా తమ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధివైపు మలుపు తిరిగేట్లు చెయ్యడం మంచి పంతుళ్ళ లక్షణాలలో ఒకటి అని నేననుకుంటాను.

ఈ పంతుళ్ళు స్వయంగా వాళ్ళ పాఠాల్లో నాకు నేర్పించింది విలువైనదే, కానీ దానికన్నా నాలో వాళ్ళు రగిలించిన "కొత్త విషయాలు నేర్చుకోవాలి" అనే మంట ఇంకా ఎన్నో రెట్లు విలువైనది. ఈ మంటవల్ల నా స్వయంకృషితో ఇంకా ఎంతో జ్ఞానం పొందగలిగాను. ఇలానే, "కొత్త విషయాలు నేర్చుకోవాలి, తెలుసుకోవాలి" అనే మంటను తమ విద్యార్థులలో రగిలించడం మంచిపంతుళ్ళ లక్షణాలలో ముఖ్యమైన రెండవది అని నా అభిప్రాయం.

### *6. పంతులుగా నా స్వానుభవాలు*

నేను కూడా ఒక పంతుల్ని అయ్యాను. కదా. నా స్వానుభావాలను గురించి ఇప్పుడు చెప్తాను.

ఒక విద్యార్థి "ఈయన/ ఈమె నాకు నచ్చిన పంతులు" అనే నిశ్చయానికి రావడంలో రెండు "వైపులు" ఉన్నాయని గమనించండి. ఒక వైపేమో విద్యార్థుల వైపు. ప్రతి విద్యార్థీ ఈ నిశ్చయం చెయ్యడానికి తన పంతుళ్ళ మధ్య తారతమ్యాలు చూసుకుని సరిపోల్చుకోవాలి రెండో వైపేమో పంతుళ్ళ వైపు. ఒక పంతులు విద్యార్థులతో తను ప్రవర్తించే విధానాన్ని బట్టి ఈ నిశ్చయంతో తను గెలిపొందేట్లు చేసుకోవచ్చు.

పంతులు ఉద్యోగం మొదలు పెట్టినప్పటినుంచీ నా విద్యార్థులందరూ నేను బోధించే సబ్జెక్టుని, తమ కెరియర్‌లో దాన్ని ఎలా వాడవచ్చో తెలుసుకునే లెవలు వరకూ నేర్చుకోవాలాని నాతహ తహ. ఇంకో గాఢ వాంఛ ఏమిటంటే నా విద్యార్థులకు నేను "నచ్చిన పంతులు" కావాలని.

పైన చెప్పిన "రావుగారి పద్ధతి" క్లాసులు చెప్పడంలో అమలు పరిస్తే విద్యార్థులకు సబ్జెక్టు బాగా నేర్చుకోవాలనే ప్రేరణ కలుగుతుందని నేను నమ్మాను. అందుకనే అమెరికాలో పంతులు ఉద్యోగం మొదలుపెట్టినప్పుడు, నా క్లాసులో రావుగారి పద్ధతిని అవలంభించాను. క్లాసులో ఒక్కొక్క విద్యార్థినీ వేలెత్తి చూపించి ప్రశ్నలు అడిగాను. కొన్ని క్లాసుల తర్వాత ఒక విద్యార్థి నన్ను ప్రైవేటుగా కలుసుకుని ఇలా చెప్పాడు. "మీరు నన్ను వేలెత్తి చూపించి ప్రశ్న అడగడం, దానికి నేను జవాబు చెప్పలేకపోవడం వల్ల క్లాసుముందు నాకు నామోషీ కలుగుతోంది. దయచేసి ఇక నన్ను అడగమాకండి" అని. నేను అప్పుడు గ్రహించాను, ఇలా వేలెత్తి చూపించి అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పలేకపోవడం వల్ల ఆ విద్యార్థి వ్యక్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బ తింటున్నాయని అందుకని అలా అడగడం వెంటనే మానేశాను.


ఇంకొకసారి ఒక గ్రాడ్యుయేట్ కోర్సులో ఒక విద్యార్థి ఇలా చెప్పాడు "మీరు బోధించే సబ్జెక్టు మీకు చాలా ఇష్టమని తెలుస్తూనే ఉంది. మీ విద్యార్థులందరూ రిసెర్చి చెయ్యగలిగే లెవలు వరకూ నేర్చుకోవాలని మీరు అనుకుంటున్నారు. నాకు ఈ సబ్జెక్టులో రిసెర్చి చెయ్యాలని లేదు. నా గమ్యం దీన్ని ప్రాక్టికల్ అప్లికేషన్స్‌కి ఎలా వాడాలో తెలుసుకోవడం వరకే" అని. అది నాకు సమంజసం అనిపించింది అప్పుడు. అందువల్ల విద్యార్థులు ఏ లెవెల్ వరకూ సబ్జెక్టుని నేర్చుకోవాలి అనే విషయం మీద నా ఆశయాలు మార్చుకోవలసి వచ్చింది.

పంతులుగా నా విద్యార్థుల మెప్పుదల పొందడం నాకెంతో ముఖ్యం. విద్యార్థులకు పంతులుగా ఉండాలంటే క్లాసులు ఎలా చెప్పాలీ, విద్యార్థులతో ఎలా ప్రవర్తించాలీ అనే విషయం మీద కూడా అన్వేషణ చేస్తూనే ఉన్నాను. ఈ అన్వేషణలే పంతులు ఉద్యోగంలో తృప్తి నిచ్చేవి అని నేననుకుంటాను.



*కట్టా మూర్తి ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ ఆర్బర్ లో ఆపరేషన్స్ రిసెర్చి బోధించి, పరిశోధించే అధ్యాపకులు. ఆన్ ఆర్బర్ లో సతీమణితో నివసిస్తారు. ఇద్దరు పిల్లలు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడం చాలా ఇష్టపడతారు. ఆరోగ్యానికి దినదిన వ్యాయామం అత్యవసరం అంటారు. ఈయన మాటల్లో " కదలిక ఆనందం, జోరు కదలిక బ్రహ్మానందం".*

# జి.నారాయణరావు



అది 1981 సంవత్సరం అప్పుడు గాంధీ హాస్పటల్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉండేది. ఇది జంట నగరాల్లో బోధనా ఆసుపత్రులలో ఒకటి. చుట్టుపక్కల వున్న అన్ని జిల్లాలనుండీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాలనుండి మాత్రమే కాక సరిహద్దున ఉన్న మహారాష్ట్ర ప్రాంతం నుండి కూడా ప్రజలు వస్తూ ఉంటారు. ఎప్పుడూ హాస్పటల్ జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇది ఒకకోణం. మరోకోణం ఏమిటంటే.. మిగిలిన గవర్నమెంటు ఆస్పత్రుల అవలక్షణాలన్నింటినీ ఇదికూడా పుణికిపుచ్చుకుని ఉండేది

పిడియాట్రిక్ వార్డ్, గైనకాలజీ డిపార్ట్‌మెంట్ పైన ఫ్లోర్‌లో ఉండేవి. పేషెంట్లు, వాళ్ళ బంధువులతో హడావిడిగా ఉంటుంది. అప్పట్లో ఒకరోజు విపరీతమైన బిజీగా ఉండే ఔట్ పేషెంటును చూసి వార్డ్ రౌండ్స్ కొరకు నేను, నా సహోద్యోగులు వచ్చాము. నేను అప్పుడు పిడియాట్రిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యేషన్ చేస్తున్నాను. ఆరోజుల్లో కారిడార్‌లోనే ఎమర్జన్సీ పేషెంటును చూడవలసి వస్తూ ఉండేది. ఆ రోజు కారిడార్‌లోని స్ట్రెచర్ మీద పది, పదకొండు సంవత్సరాల వయసున్న ఒక అబ్బాయి అపస్మారక స్థితిలోఉన్నాడు. వాళ్ళు సికింద్రాబాద్‌లోని మహంకాళి ఆలయం సమీపంలో ఉంటారు. పెద్దగా ఏమీ వివరాలు ఇవ్వలేకపోతున్నారు తల్లితండ్రులు. అప్పటికే అన్ని పరీక్షలు చేయబడి ఉన్నాయి. కానీ అన్నీ నార్మల్‌గా వున్నాయి. అపస్మారక స్థితికి కారణం తెలియడం లేదు. అప్పుడు మా ప్రొఫెసర్ డాక్టర్ మూర్తిగారు వచ్చారు. క్షుణ్ణంగా పరీక్ష చేసారు. అంతా చేసినా కారణం తెలుసుకోవడం కష్టంగా ఉంది. వెంట్రుకులలో కొంత ఫంగల్ ఇన్ఫెక్షన్ ఉండటం ఆయన గమనించారు. అప్పుడు ఆయనకు కారణం స్ఫురించింది. కొంత మంది ఆర్.ఎం.పి వైద్యులు ఆ కాలంలో దీనిని ఆర్సెనికాతో ట్రీట్ చేస్తారు. Arsenic poisoning అయి ఉండచ్చు అని ఊహించారు. వెంటనే అది నిజమని పరిక్షలో తేలింది. బొంబాయి నుండీ bal అనే మందును తెప్పించి ట్రీట్ చేసారు. ఆ అబ్బాయి పూర్తిగా కోలుకున్నాడు. ఇటువంటి ఎన్నో క్లిష్టమైనకేసులను సునాయాసంగా పరిష్కరించగలిగారు, నాకు నచ్చిన మాష్టారు డాక్టర్. పి.ఎస్. మూర్తిగారు.

ఆదర్శమైన గురువుకు ఉండవలసిన అన్ని లక్షణాలు పుష్కలంగా ఆయనలో ఉండేవి. బోధనాశక్తి, బోధనా పటిమ, బోధనా చాతుర్యం, శ్రోతలను ఆకట్టుకునే భాష లాంటి అరుదైన గుణాలు ఉండడమే గాక, పరిశోధన చేద్దామనుకునేవారికి అత్యంత ప్రోత్సాహము చూపించేవారు. రోగుల పట్ల శ్రద్దకు మాత్రం ఎప్పుడూ పెద్ద పీట వేసేవారు. దీనిని క్రింది ఉదాహరణను పేర్కొనవచ్చు.

ఒకరోజు నాకు అనుకోకుండా మీటింగ్‌లో మాట్లాడటానికి ఒక టాపిక్ ఇచ్చారు. దానికి సమయాభావం వలన ఆరోజు పూర్తిగా ఈ విషయమై నేను బిజీగా ఉండిపోవలసి వచ్చింది. అంతా తయారయి మేము మీటింగ్‌లో కూర్చున్నాము. అప్పుడు తెలిసింది ER నుండి ట్రాన్సఫర్ అయి వచ్చిన ఒక పేషెంటును ఎవరూ ఇంకా చూడలేదని – దానికి ఆయన చాలా కోపం తెచ్చుకున్నారు. మీటింగును మాత్రమే కాకుండా ఆ వారం మొత్తం టీచింగ్ రౌండ్స్‌ను

కాన్సిల్ చేసారు. మేమందరం నిరుత్సాహానికి గురి అయినా జీవితంలో విలువైన పాఠాలను ఆ విధంగా నేర్చుకున్నాము. రోగి మాత్రమే అతి ముఖ్యమైన వ్యక్తి, ట్రీట్‌మెంట్ అతిముఖ్యమైనది. మా పోస్ట్‌గ్రాడ్యేట్ స్టూడెంట్స్ అందరు 22 - 24 ఏండ్ల మధ్య ఉన్నారు. ఆ వయస్సులో పడ్డ జీవిత పాఠాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఆ తరువాత ఏ పేషెంట్ కూడా ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకపోయేది. మేము ఎంత బిజీగా ఉండేవాళ్ళమో చెప్పనవసరం లేదు అనుకుంటాను.

ప్రభుత్వ బోధనాసుపత్రులలో రోగులపట్ల నిర్లక్ష్యం, అవినీతి ఎటువంటి వారికయినా చెప్పకపోయినా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూ ఉంటుంది. అవినీతి వార్డుబాయ్ దగ్గర నుండీ మొదలవుతుంది అంటే చాలామంది ఆశ్చర్యపోతారు. చాలా మంది ప్రధాన వైద్యులు ట్రాన్స్‌ఫర్‌లను అడ్డుకుంటూ అదే హాస్పటల్లో ఉంటారు. వాళ్ళకు ప్రభుత్వం ఇచ్చే జీతం కంటే పైన వచ్చే ఆదాయం పదుల రెట్లలో ఉంటుంది. ప్రైవేట్ ప్రాక్టీసును అత్యంత ఉత్సాహంగా చేసుకుంటారు. టీచింగ్‌కు నామమాత్రం న్యాయం చేయరు. వాళ్ళ కిష్టమైన లేదా ప్రావీణ్యం ఉన్న ఏదో ఒక టాపిక్‌ను మాత్రమే పదేపదే వర్ణిస్తుంటారు. అందుకే మా మిత్రులకు ఏ టీచర్ ఏ టాపిక్ చెప్పినప్పుడు ఎక్కడెక్కడ జోక్‌లు వేస్తుంటారో బాగా తెలుసు. వాళ్ళు మా స్టూడెంట్స్ చదివే పుస్తకాలు మాత్రమే చదువుతారు. లేటెస్ట్ ఏమవుతుందో వాళ్ళు పట్టించుకోరు.

ఇటువంటి పరిస్థితుల్లో కూడా తను నమ్మిన విలువలకు గట్టిగా కట్టుబడి మనగలగడం సామాన్యం కాదు. అతడే మన డా.పి.ఎస్.మూర్తిగారు. అతను 5 అడుగుల ఎత్తుగల, కనిపించని ఆజానుబాహుడు. ఎప్పుడూ మంచి డ్రెస్స్, టై కట్టుకుని హుందాగా ఉండేవాడు. గవర్నమెంటు హాస్పటల్‌లో లంచాలు తినని, తిననివ్వని డాక్టర్లకు క్లాసు IV ఉద్యోగులు సరిగ్గా గౌరవం ఇవ్వరు. కానీ అతనిని అందరూ చాలా గౌరవించేవారు. వారి స్వగ్రామం భీమవరం అనుకుంటాను. హైదరాబాద్‌లో అరుదుగా లభించే స్వచ్ఛమైన తెలుగు భాష, తెలుగుతనం ఆయననుండీ వచ్చేది. వారి పర్సనల్ విషయాలు నాకు ఎక్కువగా తెలియవు. ఆయన వాడే కలర్స్ కొంచెం వింతగా అనిపించేవి. నాకు తెలిసిన చాలా మంది కంటే వారికి ఇంగ్లీషు మీద మంచి సాధికారం ఉంది. గవర్నమెంటు టీచింగ్ హాస్పటల్‌కు చాలా పేదవాళ్ళు, పల్లెటూరి నుండీ వచ్చినవాళ్ళు తెచ్చే పేషెంట్స్ చాలా సీరియస్‌గా ఉంటారు. ఈ పేషెంట్స్ వేరే వైద్యులు దగ్గర సరిగ్గా వైద్యం దొరకక కాంప్లికేట్ అయి ఉంటారు. పేషెంట్లకు కాని, వాళ్ళ బంధువులకు గానీ అనునయంగా సానుభూతిగా కన్పించదు. చేతులు చాపేవాళ్ళు కానివ్వండి, చీదరించుకునే వాళ్ళు కానివ్వండి అడుగడుగునా కనిపిస్తారు. అటువంటి పరిస్థితులలో ఎటువంటి మనుష్యులయినా, చినిగిన బట్టలతో ఉన్నా సరే వారిని మూర్తిగారు 'మీరు' అని గౌరవంగా సంబోధించేవారు. దీనివలన వాళ్ళు ఇబ్బంది ఫీలయ్యేవారు. అయినా మర్యాద ఇవ్వడం తగ్గించేవారు కాదు.. అటు వంటి వ్యక్తులు అతి అరుదుగా కనిపిస్తారు.

ఒకసారి వార్డ్‌లో ఉన్న ఇన్ పేషెంటుకు అందవలసిన మందులు అందలేదు. నర్స్‌ను ఈ విషయమై ఆయన అడిగారు. స్థూలకాయం ఉన్న తమిళ తెలుగు నర్స్ ఇంకా ఫార్మసీ నుండీ డిస్పాచ్ కాలేదు అని తాపీగా జవాబు ఇచ్చింది. మిగిలిన వాళ్ళు అయితే పట్టించుకునేవారు కాదేమో. ఆయన కొంత సమయం వెచ్చించి ఫార్మసీ ఎన్నింటికి సప్లై చేస్తుందని విచారించారు అప్పుడు తేలిందేమిటంటే ఆ మందులు అంతకు ముందే డిస్పాచ్ అయ్యాయని. అయితే ఏవి అని అడిగారు. అప్పుడు తెలిసింది ఆ మందులు నర్స్ కాజేసి తన ఫ్రెండుకు ఇచ్చిందని. ముచ్చెమటలు పట్టిన ఆ నర్స్ దాదాపు స్పృహ కోల్పోయినట్లయింది. తర్వాత అటువంటి సంఘటన ఆ ఫ్లోర్‌లో వినపడలేదు.

రోగిని దాదాపు 45 నిమిషాలు నుండీ ఒక గంట తీసుకుని క్షుణ్ణంగా పరీక్షించేవారు. ఆయన పేషెంట్లు, పేషెంట్ల బంధువుల నుండి వివరమైన సమాచారం రాబట్టేవారు. ముఖ్యంగా ఆయన పరీక్షించే విధానమే నేను ఆదర్శంగా స్వీకరించాను.

నాతో పాటు పి.జి చేసేవారిలో డా. విజయ్ భరద్వాజ్ ఉండేవాడు. (ఇప్పుడు అతను Michigan Henry ford Hospital పనిచేస్తున్నాడని విన్నాను.) మూర్తిగారి కారు గురించి ఒక జోక్ చెప్పాడు.

మూర్తిగారు ఆరెంజ్ రంగు గల ఫియట్ కారు వాడుతూ ఉండేవారు. మా పిడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉన్న ఫ్యామిలీ ప్లానింగ్ వింగ్ గోడకు ఆనుకుని పార్క్ చేసేవారు. దానిమీద రోజూ పక్షులు విపరీతంగా రెట్ట వేసేవి.

విజయ్ ఒకరోజు "సార్! మీ కారు రంగంటే ఈ పక్షులందరికీ బాగా ఇష్టమనుకుంటాను" అన్నాడు.

"ఇష్టమే లేక అయిష్టం కూడా అనుకోవచ్చు" కదా అని దానిని స్పోర్టివ్‌గా తీసుకుని హుందాగా నవ్వారు. వారిలో సమయానుకూలంగా హ్యూమరస్‌గా మాట్లాడే శక్తి ఉంది. ఆయన విజయ నగర్ కాలనీలో ఇల్లు కట్టుకున్నప్పుడు మమ్మల్ని అందరినీ పిలిచి మంచి ఆతిధ్యము ఇచ్చారు.

నేను వేరే కారణాల వలన ఒక సంవత్సరం అయిన తర్వాత ఆ డిపార్ట్‌మెంట్ నుండీ మారాను. కానీ వారు నాకు చిరకాలం గుర్తుంటారు.



*నారాయణ రావుగారు గాంధీ మెడికల్ కాలేజీ నుండి ఉత్తీర్ణులయ్యారు. ఇప్పుడు మౌంట్ షష్టాలో ఇంటర్నల్ మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నారు.*

# జయ రవిచంద్ర

## ఆస్ట్రేలియా



మా మంచి టీచర్లు అనే టాపిక్ వినగానే నాకు చిన్ననాటి రోజులు వెంటనే గుర్తు వచ్చాయి. ప్రతి వ్యక్తి తరిచి చూసుకుంటే తమ జీవితపు ప్రాథమిక దశలో ఎవరో ఒక ప్రత్యేక వ్యక్తి ప్రభావానికి లోను కావడం ఎంతో సహజం. అయితే ఈ వ్యక్తి ఒక బంధువో, మిత్రువో మాత్రం కారు. మనం ఎన్నో గంటలు వారితో గడిపిన ఈ ప్రత్యేక వ్యక్తి తప్పక మనకు చదువు నేర్పే గురువే! ఈ గురువు ఒకరు కావచ్చు ఒకరి కంటే ఎక్కువ మంది కావచ్చు. ఒక్కొక్కరి ప్రభావం ఒక్కో రీతిలో మనని తీర్చిదిద్దుతుంది.

ఇక నా సంగతికి వస్తే అవి 6వతరగతి నుండి 10 వరకు చదువుకున్న ఒక ప్రైవేటు స్కూల్ విద్యార్థిని జ్ఞాపకాలు.

క్రిష్ణమూర్తి మాస్టారు టీచరుగా నాకు హైదరాబాదులోని మొహదీపట్నం దగ్గర్లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్కూల్‌లో పరిచయం అయ్యారు. మా స్కూల్లో హింది నేర్పేవారు మాష్టారు. నాకు చదువు నేర్పింది నాలుగు సంవత్సరాలే అయినా ఆయనతో నా పరిచయం సుమారు ఓ 20 సంవత్సరాలు అని చెప్పగలను. నా మనసులో గురువు అంటే ఇలా ఉండాలి అనేలా ఒక ప్రత్యేక ముద్ర వేసిన వ్యక్తి ఆయన. ఆయన ఎంతో సాధారణంగా తెల్ల పంచె, ఖద్దరు కండువా, చేతిలో ఓ బాగ్ పుచ్చుకు కనబడేవారు. మొహంలో ఎప్పుడూ చెరగని నవ్వు! ఆ మర్చిపోయాను కళ్ళకి ఓ జోడు కూడానూ! మా మాస్టారు అంటే క్రమశిక్షణకు మారు పేరు. పేరుకు హిందీ టీచరు అయినా ఆయన మాకు చాలా విషయాలలో సహాయం చేసేవారు. ఇక తుంటరి పిల్లలకు ఆయన అంటే హడల్! ఏ మాటకు ఆ మాటే ఆయనకు కోపం వస్తే చేతి కర్రకు పని చెప్పేవారు. అంతదాకా రానిచ్చేవారు కాదు కానీ వస్తే ఆయన్ని ఆపటం ఎవరితరం కాదు. కోపం వస్తే ఇలా ఉండే మాస్టారికి ప్రేమ, వాత్సల్యం కూడా ఆభరణాలే! తోటి టీచర్లు కూడా ఆయనకు ఎంతో గౌరవం ఇచ్చి, ప్రతి ఒక్క విషయంలో వారిని సంప్రదించేవారు. ఆఖరుకు ప్రిన్సిపల్ గారు కూడా ముఖ్యవిషయాలు మాస్టారితో చర్చించేవారు. స్కూల్ పోటీలలో ఆయన్ని న్యాయ నిర్ణేతగా నియమించేవారు కూడాను.

అబద్ధం చెప్పడం ఆయన సహించేవారు కారు, దెబ్బలు పడతాయి అని తెలిసినా కూడా నిజమే చెప్పమని పిల్లలకు చెప్పేవారు, మా క్లాసులో బహు తుంటరి పిల్లలు కూడా స్కూలు వదిలి వెళ్ళే సమయానికి సరి కొత్త విద్యారుల్థుగా మారారు అంటే మీరు నమ్ముతారా? ఆయన క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేవారు కారు. అతి నెమ్మదిగా మాట్లాడే ఆ మనిషి క్లాసులో అంత మంది పిల్లలను ఎలా కట్టుదిట్టంగా ఉంచగలరు అని కొందరికి అనుమానం కూడానూ! మా క్లాసులో కండలు తిరిగిన ఓ మొద్దబ్బాయి ఉండేవాడు, తల్లీ తండ్రీ స్కూల్ దాకా పంపగలిగారే గానీ వాడికి చదువు అబ్బే భారం స్కూల్ టీచర్లకే వదిలిపెట్టారు. ప్రతీ టీచర్‌ను ఏడిపించటమే సత్తిరాజు

ధ్యేయం. బలహీనులు అయిన తత్తిమ్మా స్టూడెంట్లు ఈ ఆగడాలు చూస్తూ నోరు నొక్కుకునే వారే కానీ వాడిని ఎదిరిస్తే స్కూల్ వదిలాక జరిగే గలాటా తలుచుకుని భయపడేవారు. అమ్మాయిలంతా మాకు ఎందుకులే అని కిమ్మనకుండా ఉండేవారు. దానితో రెచ్చిపోయేవాడు ఈ తుంటరి. ఓ రోజు మాస్టారు క్లాస్‌కి రాక మునుపే ఈ గద్దరి పిల్లాడు బోర్డ్ మీద కళ్ళ జోడుతో సహా - మాష్టారి బొమ్మను వ్యంగ్యంగా చిత్రించి వచ్చి క్లాసులో కూర్చున్నాడు. ఆ తరువాత ఆయన క్లాస్‌కి వస్తూనే బోర్డ్ చూసి సన్నగా నవ్వుతూ 'అరే సత్తిరాజూ! నా బొమ్మకు మీసాలు మర్చిపోయావు సరిగా వెయ్యి' అని అంటూ కుర్చీలో కూర్చున్నారు. అంతే సత్తిరాజు నోట మాట రాలేదు. నిశబ్ధంగా క్లాసు గడిచింది. క్లాసు తరువాత పెద్దిరాజు పరుగున మాస్టారి దగ్గరకు వెళ్ళటం చూసిన నాకు దూరంగా వినపడసాగాయి వారి మాటలు. సత్తిరాజు క్షమాణ చెప్పిన తీరు దానికి ఆయన ఎంతో సౌమ్యంగా సమాధానం ఇస్తున్న తీరు చూస్తే ఆయన నిజంగా గాంధీ గారి ప్రతి రూపమా అనిపించింది. ఆ తరువాత అటువంటి చిన్న చిన్న సంఘటనలు ఆ కుర్రాడు చెయ్యటం మాష్టారి శిక్షణతో అతను స్కూల్ వదిలే సరికి పూర్తిగా ఒక కొత్త వ్యక్తిగా మారిన తీరు మా క్లాస్ పిల్లలను ఎంతో ఆశ్చర్యపరచింది. ఎవరైనా టీచరు రాకపోతే మా మాస్టారు కథలు చెప్పేవారు. అంటే చందమామ కథలు కాదు, స్వరాజ్యం కోసం జరిగిన పోరాటాలు వాటి వెనుక ఉన్న నాయకులు, వారి గొప్పతనం చాటి చెప్పేవారు.

నాకు మాస్టారు అంటే వల్లమాలిన గౌరవం, నేను ఆయన్ను ఎప్పుడూ అలాగే పిలిచేదాన్ని. మాష్టారి ప్రభావం నా స్కూలు జీవితంపై కావచ్చు, సంగీతం నేర్చుకునే విషయంలో కావచ్చు ఎంతైనా ఉన్నదని నేను గట్టిగా నమ్ముతాను. అప్పట్లో 7వ క్లాసుకు కూడా స్కూల్ ఫైనల్‌లాగా ఎక్జామినేషన్ ఉండేది, దానికి ఎంతో కష్టపడి చదివిన నాకు గొప్ప ఫలితం దక్కిన రోజు ఎప్పటికీ మరువలేనిది. చదువు అనేది మన కోసం చదువుకోవాలని, మనను ఒక మంచి వ్యక్తిగా తీర్చిదిద్దేది మన జ్ఞానమేనని, అది దొంగలు కూడా దోచుకొనలేరని కథలా చెప్పేవారు. ఏ పని అయినా పట్టుదలతో సాధించవచ్చని తరచూ చెబుతుండేవారు ఆయన, ఇది నాపై ఎంతో ప్రభావాన్ని చూపించింది. ఆ ప్రభావమే నేను ఈ రోజు కేవలం చదువు ఉద్యోగము అని పట్టుకు కూర్చోకుండా సమయాన్ని, వివిధ రకాలుగా వినియోగించుకోవాలనే ఒక కొత్త ఆలోచనను పెంపొందింప చేసింది. ఆస్ట్రేలియా వచ్చినప్పుడు మా అబ్బాయిలు చంటి పిల్లలు. వెంటనే ఉద్యోగంలో చేరలేకపోయాను. కాలం వృధా అవుతున్న విషయం గ్రహించి మూడు డిగ్రీలు సంపాదించుకోగలిగాను... దానికి పట్టుదలని స్ఫూర్తిని ఎలా సాధించానో మా మాష్టారికే తెలుసు.

ఇక ఫైనల్స్ అయ్యి స్కూలు వదిలి వెళ్ళే రోజులు రానే వచ్చాయి. నాకు, నా లాంటి మరెందరో మిత్రులకు ఇదే ఒక తీరని బాధ. అందరం కలిసి మాస్టారుతో గుర్తుగా ఫొటో తీయించుకున్నాము, ఆయనకు మంచి బహుమతిని గుర్తుగా తెచ్చి ఒక ఎర్రగులాబీతో సహా - ఇచ్చాము. దానికి ఆయన కళ్ళు చెమర్చాయి. అప్పటికే దాదాపు రిటైర్మెంట్‌కి దగ్గరగా ఉన్నారని అందరికి తెలుసు. అందరము తలో దారికి రకరకాల కాలేజీలల్లో చేరిపోయాము. మేము కూడా ఇల్లు కట్టుకుని వేరే కాలనీకి వెళ్ళటంతో మా స్కూల్‌తో ఇక సంబంధం తగ్గిపోయింది. ఓ రోజు అనుకోకుండా మాష్టారు మళ్ళీ మా కాలనీలో కనపడ్డప్పుడు నా ఆనందానికి హద్దులు లేవు. తరువాత తెలిసింది ఆయన ఉండేది మా కాలనీలోనే అని. ఇంకా గొప్ప వింత ఏమంటే నేను వీణ నేర్చుకునే సంగీతం టీచరు గారి ప్రక్క ఇల్లే మా మాష్టారు గారి ఇల్లు అవ్వటం. ఇంక నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు... ఏరోజు అమ్మా నాన్నా చెప్పక ముందే సంగీతం క్లాసుకు పరిగెత్తేదాన్ని. పాఠం పూర్తయ్యాక మాష్టారి ఇంటి ముందు అరుగు మీద, మాష్టారు వాళ్ళ ఆవిడ కూర్చుని మాలాంటివారిని పలకరిస్తుండేవాళ్ళు. నేను వెళ్ళి కాసిని కబుర్లు చెప్పేదాన్ని. అప్పటికి ఆయన రిటైరు

అయ్యారు మాష్టారుకు పిల్లలు లేకపోవటంతో ఆయనకు మేమంటే మరీ ఇష్టం. నా కాలేజీ కబుర్లు ఎంతో ఇష్టంగా వినేవారు, రాజకీయాలు గట్రా మాట్లాడేవారు. ఆయన ఒక మంచి మిత్రుడు అని కూడ అనిపించేది. నా పెళ్ళి కబురు మానాన్నగారి ద్వారా విని ఎంతో సంతోషించారు ఆయన, నా పెళ్ళికి మాష్టారు వచ్చి అక్షింతలు వేసారు. ఆ తరువాత దేశం వదిలి రావటంతో ఆయనను మునుపటిలా చూడలేకపోయాను. నేను ఇక్కడకు వచ్చిన పది సంవత్సరాలకు కాబోలు మా మాస్టారు ఇకలేరని తెలిసింది. నాకళ్ళల్లో కన్నీళ్ళు ఆగలేదు. 75 సంవత్సరాలు వచ్చినా అయ్యో మాస్టారు ఇంత త్వరగా వెళ్ళిపోయారే అని బాధపడ్డాను. వారి సతీమణి ఒక కుర్రవాడిని దత్తత తీసుకున్నారని తెలిసి చూడటానికి వెళ్ళాను. ఆయన ఇల్లు బోసిగా కనపడింది. మాష్టారుగారి నవ్వుతున్న మొహం పూలదండల మధ్య కనపడి నాకళ్ళు మసకబారాయి!



*జయగారు ఇండియాలో బాచిలర్ ఆఫ్ సైన్సు అండ్ మాస్టర్స్ ఇన్ సైకాలజీ పూర్తి చేసి, తరువాత ఆస్ట్రేలియా లో **Information Technology in Sydney** లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసారు. జయగారికి వీణ వాయించడం, కమ్యూనిటీ రేడియో బ్రాడ్కాస్టింగ్, కమ్యూనిటీ సర్వీస్ హాబీలు. భర్త,పిల్లలతో ఆస్ట్రేలియా నివసిస్తున్నారు.*





# దుర్వాసుల వేంకట సుబ్బారావు

అది కువైట్ లోని భారత రాయబారి కార్యాలయం. సమయం 15-11-1996 శుక్రవారం, సాయంత్రం. కువైట్ తెలుగు సంఘంవారు "ప్రవాసాంధ్రులు: కెనడా" పై మాట్లాడమని ముఖ్య అతిధిగా నన్ను ముందు వరుసలో కూర్చోబెట్టారు. సర్వసాధారణంగా ఉండే సాంకేతిక ఇబ్బందులవలన, వేరే ముఖ్య అతిధులు రానందున కార్యక్రమం మొదలు పెట్టటం ఆలశ్యమైంది. ఇంతలో తెల్లని పంచ, లాల్చీ, కండువా వేసుకున్న నలభై ఏళ్ళాయన "ఈడ ఎవరు కూర్చుండేది?" అని ప్రశ్నించారు. "ఈ కుర్చీ రిజర్వుడు" అన్నా ముక్తసరిగా. వెంటనే "ఏరికి?" అని ప్రశ్నించారు. "తమకే" అన్నా ఠక్కున. "సుబ్బారావంటే నువ్వేనా?" అవును, మరి తమరు అన్నా. నేను రామక్రిష్టయ్యను, నీకు సంగీతం గురువుని" అంటూ నన్ను చాలా ఆశ్చర్యపరచారు. నేను కువైట్ వచ్చి ఏడు వారాలైంది. పూర్వం కెనడాలో వయొలిన్ పాశ్చాత్య పద్ధతిలో నేర్చుకున్నా. కువైట్‌లో మన దక్షిణాదులు చాలామంది ఉన్నారని అందులో ఎవరో ఒక్కరైనా వైయొలిన్ నేర్పగలరన్న గంపెడు ఆశతో నేను వయొలిన్‌తో కువైట్ చేరా. అంతవరకు వయొలిన్ గురువు గురించి ఎన్నో ప్రయత్నాలు చేసి నిస్పృహతో లాభం లేదన్న నిర్ణయానికొచ్చా. మరి ఈయన ఇలా అన్నారు కదా అని, నా ఎడ్రసు, ఫోను నెంబరు ఇచ్చా. వచ్చే మంగళవారం 19.11.1996 సాయంత్రం 7 గంటలకు వస్తానన్నారు ఈయన. సరే, వస్తే చుసుకోవచ్చు అనుకున్నా. అన్నట్లే మంగళవారం 7గంటలకు సెక్యూరిటీ మనిషి రామకృష్ణయ్యగారిని ప్రవేశపెట్టాడు విల్లాలోకి. అదే నా జీవితంలో ఒక గొప్ప మలుపు. ఊహించని పరిస్థితుల్లో గురువుగారిని కలిసా. ఇద్దరం కూర్చున్నాం తివాసీపై. "నీకు ఎంతమాత్రం సంగీతం వచ్చో చెప్పు" అన్నారు. వచ్చినవి, గుర్తున్నవి వయొలిన్ వాయించి, "ఈ పరిజ్ఞానాన్ని మన కర్ణాటక సంగీతంలోకి మలుచుకోవలెనన్నది నా అభిమతం, ఆశ, ధ్యేయం  అయితే మన శాస్త్రీయ సంగీతంలో ఏ మాత్రం శిక్షణ, ప్రవేశం లేవు. కానీ ఒక్క త్యాగరాజ కృతి రాగ, తాళ, భావాలతో వాయించగలిగితే నా జన్మ తరించి నట్టే" అన్నా.

"చూడు, పెద్దయ్యా, యాడికో పోయి ఏదేదో చేద్దాం అనుకోమాకు. ఇంటికాడనే సంగీతం నేర్చుకో. మామూలు చదువులు గుప్పెడు పొట్టపోసుకోడానికే, సంగీత సాహిత్యాలు శాంతికే. ముక్తిసాధనకు, సాహిత్యాభిలాషకి సంగీతం ముఖ్యమే. కర్ణాటక సంగీతాన్ని వయొలిన్‌పై చెప్పలేను. వయొలిన్ అట్టే రాదు. వచ్చినంత వరకు నేర్పుతా. కానీ నీకు ముందుగా కావలసినది స్వరావళి, అలంకారాలు, సపతాళాలు - ఇవన్నీ గాత్రంతోటే ప్రారంభించాలి. ఈ రోజు కార్తీక, శుక్లదశిమి, అనురాధా నక్షత్రం, మంగళవారం, చాలా మంచిరోజు, ప్రతీ శనివారం, మంగళవారం ఇదే సమయానికి నీకు పాఠాలు చెపుతా"నని వీలయినంత మేరలో పూజ చేయించి శుక్లాంబరధరం, గురుబ్రహ్మ, శ్రీసరస్వతీ ప్రసన్న, శ్రారామరామేతి, ఓం నమో వేంకటేశాయ, శాంతాకారం, లక్ష్మీక్షీర సముద్రరాజతనయాం శ్లోకాలు ఆయనతోనే వల్లెవేయించారు. ఓం నమోనారాయణాయ అన్నది రాగయుక్తంగా పాడి, నాచేత చెప్పించి ఇది మాయా మాళవగౌళరాగం అన్నారు. సరే నన్నా వివరాలు తెలియక పోయినా. మరల శనివారం చెపుతానని వెళ్ళిపోయారు. నాటి

నుంచీ నేను కువైట్ వదిలి కెనడాకి వచ్చేవరకూ ఒక్క పాఠం మానేయకుండా, ఎండనక, గాలి, దుమ్ము దూసరాలున్నా, బస్సు, టాక్సీలపైనో ఖచ్చితంగా టైముకి వచ్చి సంగీతం, ప్రతిఫలాపేక్షన లేకుండా నేర్పే మాన్యులు మా గురువుగారు.

పూర్తిపేరు ఎల్లకట్ట రామాంజయ్య. తాళ్ళపాక అన్నమాచార్యుల వారికి తల్లిద్వారా 13వ తరం సంగీత వారసులు మా గురువుగారు. అందరూ రామకృష్ణ అనిపిలిచేవారు. తాళ్ళపాక చెన్నకేశవ స్వామి. అన్నమాచార్యుల దేవాలయంలో వంశపారంపరంగా అర్చకులుగా సేవిస్తున్న కుటుంబం. చదువులు, ఉద్యోగరీత్యా తాళ్ళపాక దరిలో నున్న నందలూరులో వీరి నివాసం. శ్రీ వెంకటేశ్వర సంగీత కళాశాల, తిరుపతిలో సంగీత విశారద, హరికథా విశారద చదివి 1985లో ఉత్తీర్ణులయారు. వీరి గురువులు సుప్రసిద్ధ గాయకులు శ్రీ పశుపతిగారు, శ్రీపట్టాభిగారు, శ్రీ బాలసుబ్రహ్మణ్యంగారు, శ్రీమతి మైథిలి గారు. శ్రీవత్సస గోత్ర, వైష్ణవులు అందుచే పూజాపునస్కారాలు బాగా తెలుసు.

వృత్తిరీత్యా కువైట్ పోలీసు శాఖలో భాష తర్జుమా చేయటం. వీరికి తెనుగు, కన్నడ, అరవం, మళయాళం, హిందీ, ఉర్దూ, అరబిక్ క్షుణ్ణంగానూ, కొద్దిగా ఇంగ్లీషు వచ్చు. ఈయన నిగర్వి, నిష్కల్మషంగా, నిరహంకారంతో, నిర్మల భక్తితో ఇహపరాలు సాధించుకోవాలనే జీవనయాత్ర సాగిస్తున్నారు. కువైట్‌లో ఈయనకి సంగీతమే ప్రాణమైంది, పల్లవించింది, పరిమళించింది. కువైట్‌లో బాధ్యతాయుతమైన ఉద్యోగం చేసుకుంటూ తీరిక సమయంలో, కనుమరుగవుతున్న కర్ణాటక సంగీతాన్ని తాను పాడి, నలుగురిచే పాడించాలని కంకణం కట్టుకున్నారు. మాన్యతగల, మానవీయ విలువలు తెలిసిన సుమధుర గాయకులు రామకృష్ణయ్యగారు పెద్దల నుంచీ ప్రణతులందుకున్నారు. హిందోళం, కళ్యాణి, నాట, మోహనరాగాలు ఆయన గొంతులోంచి పెల్లుబికిన మకరందాలు. ఈయనకు రాముని సన్నిధిని మించిన నిధి ఏదీలేదు. నందలూరులో వీరి ఇల్లు రామాలయం ప్రక్కనే. తన పొలంలో పంచముఖి ఆంజనేయస్వామి గుడి కూడా ప్రస్తుతం కట్టిస్తున్నారు.

రామకృష్ణగారికి ప్రథమ శిష్యుడను, వయస్సురీత్యా పెద్ద శిష్యుడిని నేనే. నాటికీ నేటికీ నన్ను పెద్దయ్యా, పెద్దాయనా అని పిలుస్తారు. గత మూడు - నాలుగు దశాబ్దాలుగా విదేశాల్లో స్థిరపడ్డ నాకు, మొదట్లో వీరి కడప మాండలికాలు అర్థమయ్యేవి కావు. నాకు విశాఖ, తూర్పు గోదావరి జిల్లా తెనుగుతోనే పరిచయం. దాని తోడు కీర్తన అర్థం చేసుకునే పాడాలన్న అభిప్రాయంతో గురువుగారు నేర్పుతున్న శ్రీ అన్నమాచార్యుల కీర్తనల్లో కొన్ని పదాలు ఉదాహరణకు నగి, నగికాలము, అదివో, తట్టుపుణుగు, వట్టిలపటము అర్థమయేవికావు. ఆయన జ్ఞాపకం నుంచీ చెపుతూంటే మాండలికాలు దొర్లుతున్నాయా, నేను వ్రాసుకునేది తప్పా అన్న అనుమానం కూడా కలిగేది. మా గురు శిష్యుల మధ్య ఏకా సుబ్బారావుగారి "నూతన సంగీత గాన సుధ" అన్న పుస్తమే నేను కెనడా నుంచీ తీసుకెళ్ళినదే ఉంది. కాలక్రమేణా ఇండియా వెళ్ళి తెచ్చుకున్న పుస్తకాలు తిరగేస్తే మా గురువుగారి జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపోయా. ఆయన మామూలుగా మాట్లాడ్డంలో కడప మాండలీకాలు ఎక్కువగా ఉన్నా, కీర్తనల విషయంలో ఆ వాగ్గేయకారుల తెనుగే వాడేవారు. పోగా స్వర, సాహితీ ఉచ్చారణ విషయంలో జంకూ, కొంకూ లేకుండా, అరమరికలు లేకుండా స్వచ్ఛంగా చెప్పించేవారు. ఆ స్వచ్ఛత వచ్చేవరకు వదిలేవారు కారు. ఆయన శృతిమాత, లయ పిత - వీరిద్దరూ తల్లిదండ్రులు - అది గుర్తుంచుకునే సంగీత సాధన చేయాలని పట్టుబట్టేవారు.

కెనడా వాసి పెద్దాయన సంగీతం నేర్చగా మేం ఎందుకు నేర్చుకోకూడదు అంటూ కాలక్రమేణా రమారమి 30 మంది శిష్యులు చేరారు మాగురువుగారి వద్ద. పిల్ల, పెద్దలను చేర్చి సంగీతం నేర్పే పద్ధతిని "సుజూకి" పద్ధతంటారు. అదే మాదిరి గాత్రం కూడా మా గురువుగారు ఈ 30 మందికి నేర్పేవారు. వీరందరూ ఎంతవరకూ పాడగలరో అన్నది

తెలియజేయడానికిగాను నెలవారీగా ఒక్కొక్కరి ఇంట్లోనూ శ్రీ అన్నమయ్య ఆరాధన, సంగీత ఆరాధనలు ఏడాదికోసారి జరిపించేవారు. ఈ మధ్య అఖండ ఆరాధన యజ్ఞం అని 108 కీర్తనలు రామకృష్ణయ్యగారు, శిష్యులు ప్రతి ఏడాదీ జరుపుతున్నారు. వేసవి వేడి భరించలేక కువైట్ నుంచీ మనవారు 6-8 వారాలు తమతమ గ్రామాలకు తిరిగి వెళ్ళటం పరిపాటే. అలాగే మాగురువుగారు నందలూరు వెళతారు. నేను ఇండియా వెళ్ళి, నందలూరులో మాగురువుగారింట్లోనే ఉండి రోజూ సంగీత సాధన చేసేవాడిని. ఆయన పాఠం ఆ రోజుకి ముగించిన తర్వాత ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు, స్థలపురాణ గాధలు చెప్పటం పరిపాటి. నందలూరు వెళ్ళిన ప్రతీసారి, ఒంటిమెట్టకోదండరాముని గుడికో, సౌమ్యనాధ దేవాలయంలో, తాళ్ళపాక చెన్నకేశవ, అన్నమాచార్యులు గుడికో, అహోబిలం నరసింహస్వామిదేవాలయానికో, గండి ఆంజనేయస్వామి గుడికో తీసుకెళ్ళే వారు. వారి గళంలో, ఆ నిరంతర ప్రవాహంలో కలిసి 60-90 నిముషాలు కీర్తనలు పాడే అదృష్టం నాదే అలాగే వారితో తిరుపతి, పుట్టపర్తి, బెంగుళూరులలో పాడిన ఆ అనుభూతే వేరు.



పుట్టపర్తిలో స్వామి దర్శనానికి ఎందరో బారులు తీర్చికూర్చున్నారు. స్వామి నెమ్మదిగా నడుచుకుంటూ మా గురువుగారి వద్ద ఆగి, "బాగా వ్రాశావు, బాగా పాడుతున్నావు, నీవు సాయి సంకీర్తనాచార్యుడివి, అన్నీ వింటూనే ఉన్నాన"ని దీవించారు. సత్యసాయి మీద ఎన్నో కీర్తనలు మా గురువుగారు వ్రాశారు, ఎందరికో వినిపించారు.

ప్రముఖ గాయకులు డా.బాలమురళీకృష్ణ గారు, శ్రీమతి శోభారాజు గారు కువైట్‌లో మా ఇంటికి వస్తే, మాగురువుగారిని పరిచయం చేసా. మాగురువుగారు గురువులు పశుపతిగారు, పట్టాభిగారు శ్రీమంగళం పల్లి బాలమురళీకృష్ణ గారికి సుపరిచితులే. పెద్దాయనా అని నన్ను పిలిచి తనతో కలిసి పాడించారు.

మా గురువుగారు ప్రస్తుతం కువైట్‌లో ఉంటున్నారు. 35 మంది శిష్యులతో. ఇండియా వెళ్ళేటప్పుడు విధిగా కువైట్‌లోగానీ, నందలూరులోగానీ గురువుగారి సన్నిధిలో సంగీత సాధన చేస్తున్నాను. వారానికోసారి ఫోనులో మాట్లాడి లేక రికార్డు చేసిన టేపులు పంపించో నాకున్న సందేహాలు తీర్చుకుంటాను. వారి శిష్యులు కాల్‌గరీలో, కాలిఫోర్నియాలో ఉన్నారు. అందరమూ కలిసి వారిని కెనడా - అమెరికాలకు ఒక సంవత్సరం ఆహ్వానించాలని సంబరపడుతున్నాము. అది జరిగే వరకు ఈ ఏకలవ్య శిష్యరికం తప్పదు. నాకేమైనా సంగీత జ్ఞానం కలిగింది అంటే అది మాగురువుగారు శ్రీ ఎల్లకట్ల రామాంజయ్యగారు వెదుక్కుంటూ వచ్చి, సహృదయతతో పెట్టిన భిక్షే. వారి ఋణం తీర్చుకోలేను.



# మా ఎ.ఎల్.పి మాష్టారు

- డా.పూడిపెద్ది శేషుశర్మ.



"గురుసాక్షాత్ పర్రబహ్మ. తస్మై శ్రీ గురవేన్నమః" - అనేది ప్రతీతి. నా విషయంలో గురువు పర్రబహ్మ అనేది అక్షరాలా నిజం. నా వ్యక్తిత్వానికి ఒక రూపకల్పన చేసి, ఈనాటి నన్ను, నన్నుగా తీర్చిదిద్దిన అపర బ్రహ్మ మా ఎ.ఎల్.పి మాష్టారు.

అమెరికాలో పూడిపెద్ది శేషుశర్మగా చలామణి అయ్యే నేను ఒకప్పటి విశాఖ పట్నం జిల్లాలోని విజయనగరంలో వడ్లమాని రామశేషంగా పుట్టి పెరిగాను. అది 1966-67. విజయనగరంలోని మహారాజా మల్టీ పర్పస్ హైస్కూల్ (ఎం.ఆర్.ఎం.పి. స్కూల్లో) తొమ్మిదవ తరగతిలో అడుగు పెట్టాను. మొట్టమొదటిసారిగా, ఆ రోజు స్కూలు వార్షికోత్సవాల సందర్భంగా, వివిధ పోటీల్లో గెలుచుకున్న విద్యార్థి, విధ్యార్థినులకు బహుమతి ప్రదానం జరుగుతోంది. పదమూడు పోటీలలో వరుసగా బహుమతి అందుకుని, స్టేజి దిగుతూ ఉంటే, "ఏమ్మా! నీ బహుమతులన్నీ పెట్టుకోడానికి ఒక బేగ్ పట్టుకు రానా!" నవ్వుతూ అన్నారు ఒకాయన, ఆయనను నేనెప్పుడూ చూడలేదు. నాకేం చెప్పాలో తెలీలేదు.

"రామశేషూ! ఇంతకీ నువ్వెవరి పిల్లవి?" మళ్ళీ అడిగారు. "ఓహో! వడ్లమాని అన్నపూర్ణేశ్వరరావు కూతురివా!"... అది నాకు మా గురువుగారు, మా ఇంగ్లీషు టీచరు అంగర లక్ష్మీ ప్రసాదరావు (ఎ.ఎల్.పి) గారితో మొట్టమొదటి పరిచయం. ఆ తరువాత, పదవ క్లాసునుండీ, పన్నెండవ తరగతి పూర్తయ్యేవరకు, ఆయన శిక్షణలో భయంలేకుండా ముందుకు పోగలిగే శక్తిని సంపాదించుకున్నా!

ఎ.ఎల్.పి. మాష్టారు అంగర సోమశేఖర్, రాధాకృష్ణమ్మ దంపతుల నలుగురు కొడుకులలో రెండోవారు. అంగర సోమశేఖర్ గారు విజయ నగరం ఎం.ఆర్.కాలేజీలో, బి.యి.డి కాలేజీలో ఇంగ్లీషు, సైకాలజీ లెక్చరర్‌గా పనిచేసి, మంచి పేరు తెచ్చుకున్నారు. ఎ.ఎల్.పి. మాష్టారి సతీమణి సుగుణగారు. అన్ని విషయాల్లో భర్తతో సమంగా తులతూగే తరుణి ఆమె. వారిద్దరికీ సంగీతం అన్నా, సాహిత్యం అన్నా, సాంస్కృతిక కార్యక్రమాలన్నా మహా ప్రీతి. మాష్టారు విజయ నగరంలోని "విజయ భావన" సంస్థకు అధ్యక్షుడిగా ఉండి, చాలా సాంస్కృతిక కార్యాలు నిర్వహించి, ఎంతమందో కళాకారులను సత్కరించారు.


మాస్టారు వారి శ్రీమతి సుగుణ

ఎ.ఎల్.పి మాష్టారుగారికి, ఏ సబ్జెక్టునయినా క్షుణ్ణంగా చర్చించి, పిల్లలకి అర్థం అయ్యేలా చెప్పగలిగే చాతుర్యం ఉంది. ఆయన ఇంగ్లీషు పాఠం చెపుతూ ఉంటే, మాంచి... పదునైన దర్శకత్వంలో, ఓ కేరెక్టర్ యాక్టర్ నొక్కి వక్కాణించి పలికే డైలాగ్‌లా ఉండేది. తాను ప్రతిపాదించిన విషయాన్ని ధైర్యంగా నిలబడి, ఖండించ గలిగే విద్యార్థినీ భయం వదిలి ఛాలెంజ్ చేయమని అడిగేవారు. ఆ తీరు నాకు చాలా నచ్చేది. నా ధైర్యం, చొరవ, ఆయన మెచ్చుకునేవారు. ఒక రోజు క్లాసులో ఉన్నట్టుండి హఠాత్తుగా నా వేపు చూసి,

"రామశేషూ, కార్ల్‌మార్క్స్ రాసిన దాస్ కేపిటల్ గురించి నీ అభిప్రాయం చెప్పవోయ్" అన్నారాయన. అప్పుడు దాస్ కేపిటల్ గురించి నాకంత తెలీదు. మా నాన్నగారు కమ్యూనిస్టు అని అడిగేరనుకుని, "మా నాన్నగారినడిగి చెపుతా మాష్టారూ" అన్నా ధైర్యంగా.

"మీ నాన్నగారు కమ్యూనిష్టని - నిన్నడగలేదోయ్. - నీకు రాజకీయాలంటే ఇష్టంకదా... అందుకు." అని నవ్వేశారు. పిల్లలలో ఆలోచనా శక్తిని ప్రేరేపించటం ఆయనకు అలవాటు.

ఆ రోజుల్లో మంచి ఇంగ్లీష్ టీచరుగా ఆయనకు గొప్ప పేరుండేది. చాలా మంది పిల్లలు ఆయన దగ్గర ట్యూషన్లకు వెళ్ళేవారు. నేను ఆయన దగ్గరకి ట్యూషన్‌కి వెళ్ళలేదెప్పుడూ. ఒకరోజు ఆయన నన్ను పిలిచి, "రామశేషూ, రేపు ఉదయం ఇంటికి రావోయ్... మేము జేన్ ఆస్టిన్ వ్రాసిన ప్రైడ్ అండ్ ప్రెజు డిస్"లో మిస్టర్ కాలిన్స్ కేరెక్టర్ డిస్కస్ చేస్తున్నాం" అన్నారు. సరే, పిలిచారు కదా. అని వెళ్ళాను. ఆ రోజు నేను గ్రహించినది ఏమిటంటే, ఆయన ట్యూషన్లు మామూలు పాఠాలు కావు. అవి చర్చలు. మా ఆలోచన్లను మా చేత వ్రాయించేవారు. పైకి చదవమనేవారు. అందులో తప్పులు మా చేతే చెప్పించేవారు. దాంతో నాకు ప్రూఫ్ రీడింగ్, ఎడిటింగ్ బాగా అలవాటయింది.

ఎ.ఎల్.పి మాష్టారికి ధైర్యంగా మాట్లాడే అమ్మాయిలంటే అభిమానం. అందుకే నేనంటే ప్రత్యేకాభిమానం. మాస్కూల్లో కో- ఎడ్యుకేషన్, అయినా అమ్మాయిల సెక్షన్ వేరేగా ఉండేది. నాలుగు అబ్బాయిల సెక్షన్స్ ఉంటే - ఒక అమ్మాయిల సెక్షను. ప్రతి ఏడాది స్టూడెంటు అసోసియేషన్ ఎన్నికలు జరుగుతుండేవి. ఎప్పుడూ అబ్బాయిలే నిలబడుతూ ఉండేవారు. అమ్మాయిలు ఏ పదవికీ పోటీ చేసేవారు కాదు. నేను పన్నెండవ తరగతిలోకి రాగానే ప్రెసిడెంట్‌గా నిలబడమని ఎ.ఎల్.పి మాష్టారు పట్టుబట్టారు. ఆయన ప్రోత్సాహంతో ఎన్నికలలో పోటీచేసా. తుక్కుగా ఓడిపోయా. మాస్కూల్లో ఉన్న నూటఏభై అమ్మాయిల్లో కనీసం సగం మందయినా నాకు ఓటు వేయలేదు. ఎనిమిది వందల ఓట్లలో, నాకు ఏభై ఓట్లు కూడా రాలేదు. నా కంటే, మా ఎ.ఎల్.పి.గారు చాలా బాధపడ్డారు. ఏ పదవికైనా, అమ్మాయిల ప్రాతినిధ్యం లేకపోవడం ఆయనకు నచ్చలేదు. వెంటనే మా హెడ్‌మాస్టారుతో మాట్లాడి, గర్ల్స్

అసోసియేషన్ ఒకటి స్థాపించి, దానికి నన్ను ప్రెసిడెంటుగా చేశారు. ప్రతినెలా, మంచి సాంస్కృతిక కార్యక్రమాలను నా ద్వారా నిర్వహించేవారు. ఆయనకు ఏదైనా తలంపు వస్తే "రామశేషూ ఇది చేస్తే బాగుంటుంది కదూ" అని, వెంటనే అది నా ద్వారా అమలులో పెట్టేవారు. మా స్కూల్లో మంచి డిబేటింగ్ టీమ్ ఉండేది. టీమ్‌లో నలుగురు ఉండేవారు. ముగ్గురబ్బాయిలు, నేనూ! ఎ.ఎల్.పి మాస్టారి తర్ఫీదులో చాలా డిబేటింగ్ పోటీల్లో పాల్గొని, బహుమతులు పొందేదాన్ని.

మాస్టారి ద్వారా నేను నేర్చుకున్నది ఇంగ్లీషు భాషేకాదు. కార్య నిర్వహణ, క్రమశిక్షణ, సూటిగా మాట్లాడడం, చెప్పేది స్పష్టంగా, అవతలి వాడికి అర్థమయ్యేలా చెప్పడం, చక్కటి కవితని గానీ, కథనిగానీ, నాటికనిగానీ, విని, చదివి, చూసి మనసారా ఆనందించడం. ఈనాడు నేను డాక్టరునయ్యానంటే మాష్టారి ప్రేరణ, వక్తగా పదిమంది ముందు మాట్లాడగలుగుతున్నానంటే ఆయన ప్రోద్భలం. కథలు రాస్తున్నానంటే ఆయన శిక్షణ, కార్యక్రమాలు నిర్వహిస్తున్నానంటే ఆయన ప్రోత్సాహం. అందుకే ఆయన నాకు పరబ్రహ్మ నిజానికి. ఆయన పేరు "లక్ష్మీ ప్రసాదు" అయినా, ఆయన సరస్వతీ దేవి, ప్రసాదంగా నా కిచ్చిన వరం.

డా.శేషుశర్మ గారు అట్లాంటాలో వైద్యవృత్తిలో ఉన్నారు. అమెరికా ప్రవాసాంధ్ర రచయిత / త్రుల్లో తనకంటూ ఒక మంచి పేరు తెచ్చుకున్న రచయిత్రి. వీరి కథల సంపుటి 'ప్రవాసాంధ్రుల ఆశాకిరణం' క్రిందటేడాదే వంగూరి ఫౌండేషన్ ద్వారా ప్రచురించబడింది.



# స్ఫూర్తిప్రదాత మా కవితాప్రసాద్ మాస్టారు
## - నన్నపనేని మోహన్



పచ్చని పంట పొలాలపై వర్షించాలని ఉవ్వెత్తున ఎగిసిపడే ఓ సముద్ర తరంగం బాష్పంగా మారుతుంది. బాష్పంగా మారిన తరంగం నింగికి ఎగసి, కదలే ఓ మేఘమై సుదూరతీరాలకు పయనించి, నేలకు జారే ఓ వానచినుకై , వాగై, వరదై మళ్ళీ సముద్రంలో కలిసిపోతుంది. ఆ తరంగ జీవనయానంలో తను స్పృశించే ప్రతిదానికీ ఏదో ఒక ప్రయోజకతను ఆపాదిస్తుంది. తన వాన చినుకు ఓ ఆలిచిప్పలో జారి ఆణిముత్యంగా మారవచ్చును. ఏ ఎడారిలోని చిన్ని మొక్కకో జీవంపొయ్యొచ్చు.

మనజీవితంలో ఆణిముత్యాన్నే అపురూపంగా చూస్తాం. కానీ దానికి జీవంపోసిన వాన చినుకు గురించి ఆలోచించం. ఒక మంచి మాస్టారు నాదృష్టిలో సముద్ర తరంగంతో సమానం.

అది 1980వ సంవత్సరం. భద్రాచలంలోని కొర్రాజులగుట్ట హైస్కూలు .. మా స్కూలుకు పార్ట్‌టైమ్ తెలుగు, లెక్కలు చెప్పడానికి ఒక యువకుడైన మాష్టారు వచ్చారు. తను వస్తూనే మొదటిరోజు ఎవరో ఒక ఇంగ్లీషు కవి వ్రాసిన "A wave vapored for the crops" అనే పదానికి అనువాదంగా పై విషయాన్ని విశ్లేషించినప్పటి క్షణంనుంచీ ఆ మాష్టారు నా జీవితాన్ని అత్యంతంగా ప్రభావితంచేసిన ఓ మంచి మాష్టారుగా నా మనస్సులో మిగిలిపోయారు. ఆయనే **శ్రీ రాళ్ళబండి ప్రసాద రాజు గారు.** ప్రపంచానికి మాత్రం యన '**కవితాప్రసాద్**' గానే సుపరిచితం.

ఎన్నో భావోద్రేకాలకు లోనయ్యే కౌమార దశలో ప్రతిమనిషికీ ఒక స్పష్టమైన దిశానిర్దేశాన్ని సూచించే ఒక మార్గదర్శక స్ఫూర్తి ఎంతో అవసరం. దిశానిర్దేశంతో పాటు జీవితగమనానికి అవసరమైన ఒక ఆలోచనాధోరణిని స్పష్టపరచడానికి కూడా మంచి గైడ్ కావాలి. ఆ ఆలోచనా ధోరణి సహృదయతతో కూడుకున్నదైతే గైడ్ కీ , సహాయం పొందిన శిష్యుడికీ ఇద్దరికీ జీవితాంతం అదొక తీయటి బంధంలా గుర్తుండిపోతుంది.

కవితా ప్రసాద్ గారితో పరిచయభాగ్యం, సరిగ్గా నా కౌమార దశలో జరగడం నిజంగా నా జీవితంలో జరిగిన ఓ అద్భుతమైన సంఘటనగానే చెప్పాలి. అది ఒక విధంగా చెప్పాలంటే రాడికల్ స్టూడెంట్ ఉద్యమం ఉధృతంగా ఉన్నరోజులు. రాడికల్ విప్లవభావాలకు ప్రభావితం అయ్యే సమయంలో , అందులో ఉన్న లోపాల్ని విడమర్చి చెప్పడమే కాకుండా, భావోద్రేకాలకు లోనై విప్లవమార్గం పట్టకుండా నన్ను సాహిత్యంవైపు మళ్ళించి నా జీవితగమనాన్నే పూర్తిగా మార్చేశారాయన.. ఈ రోజు నేను ఓ సాహితీవేత్తను కాకపోయినా తెలుగుసాహిత్యాన్ని ఆస్వాదించగలిగే స్థితిలో ఉండటానికి ఒక విధంగా కవితా ప్రసాద్ గారే స్ఫూర్తి ప్రదాత.

సిగ్మండ్ ఫ్రాయిడ్ సైకాలజీదగ్గరనుండి, దేవరకొండ బాలగంగాధర తిలక్ కవితల దాకా ఎన్నో విషయాలని విడమర్చి నేర్పేవారు. సామాజిక స్పృహను పూర్తిగా అవగాహన చేసుకోగలిగింది కవితా ప్రసాద్‌గారి ద్వారానే.

ఒక మాష్టారుగానే కాక ఒక ఆత్మీయుడిలా, ఓ రక్త సంబంధీకుడిలా నా జీవితాన్ని చక్కగా మలచిన ఓ మంచి మనిషి కవితాప్రసాద్ గారు. ఆ రోజుల్లో మా ఇద్దరి ఆర్థిక పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉండడం వలననేమో మాకున్న దాన్లో ఎంతో కొంత పంచుకోవడం ద్వారా మా అనుబంధం బలీయంగా ఉండేది.

నిండు వెన్నెల్లో గోదారి ఇసుక తిన్నెలపై కూర్చుని, సాయంత్రం నుంచీ తెల్లవారుఝాముదాకా ఎన్నో విషయాలు మాట్లాడుకుంటూ ఉండిపోయేవాళ్ళం. సాహిత్యం, ఆధునిక వచనకవితలు, సామాజిక సమస్యలు, రాజకీయాలు, ఉద్యమాలు ..ఇలా ఎన్నో విషయాలు. ఐతే దశాబ్దాల తరువాత వెనక్కి తిరిగి ఆలోచిస్తే తప్ప నాటి మా గురుశిష్య సంబధం ఎంత ప్రభావితం చేసిందో అర్థం కాదు.

నాస్తికత, ఆస్తికత, రేషనలిజం, కమ్యూనిజం, సోషలిజం, సైకాలజీ,సైన్స్, లెక్కలు, ఎకనామిక్స్,సాహిత్యం ..ఇలా – ఒకటి కాదు – ఎన్నో విషయాలు ఆయన ఓపిగ్గా నేర్పేవారు. 'మనిషిలో అంతర్గతంగా దాగి ఉన్న శక్తుల్ని వెలికి తీసేది విద్య' అన్నారు స్వామి వివేకానంద. ఐతే విద్య వ్యాపారంగా మారుతున్న కాలంలో ప్రతిఫలం ఆశించకుండా మాలో నిక్షిప్తంగా వున్న శక్తులకు ప్రాణస్పందన సృష్టించింది మాత్రం ఆయన విద్యాబోధనే అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

శ్రీశ్రీ కవితల్లో పదప్రయోగాల హోరు నుండి, తిలక్ కవితల్లోని కరుణ, దైన్యం..వగైరాలను విడమర్చి విశ్లేషించడం ద్వారా నాలో సామాజికస్పృహకి తొలిబీజం వేసింది కవితాప్రసాద్ మాష్టారే. మనస్సులో భావాలకు భాషనేర్పి, వాటిని వ్యక్తీకరించడం ద్వారా నాయకత్వ లక్షణాలను నేర్పింది ఆయనే. ఆ నాయకత్వలక్షణాలు ఆ రోజుల్లో ఓ విద్యార్థి నాయకుడిగా ఎదగడానికి ఉపయోగపడడమే కాకుండా ఈ రోజు వ్యాపార నాయకత్వానికి పునాదులుగా కూడా దోహదపడ్డాయి.

వృత్తిరీత్యా ఆయనా, బ్రతుకు తెరువును వెతుక్కుంటూ నేనూ ప్రపంచానికి రెండు వైపులకు పయనించాము. దాదాపు ఇరవై సంవత్సరాల తరువాత తానా మహా సభల్లో ఆయన నన్ను వెదుక్కుంటూ వచ్చి, అంతదూరంలో నేను కనపడగానే పరుగెత్తుకుంటూ వచ్చి చిన్నపిల్లాడిలా ఆలింగనం చేసుకుని, బొటబొటా కన్నీటి బిందువులు రాలుస్తుంటే నేను మాత్రం నిశ్చేష్టుడినై నిలిచిపోయాను. మనసు మూగపోయిన క్షణాలు.. అదొక అనిర్వచనీయమైన అనుభూతి.

ప్రతి మనిషి జీవితంలోనూ తన ఉన్నతస్థితిని చూసి అసూయపడే వాళ్ళుంటారు. తల్లిదండ్రులు, పిల్లలు తప్ప సొంత కుటుంబంలోని వ్యక్తులే అసూయ చెందడం కూడా అసహజం కాదు. కానీ ఏ రక్త సంబంధం లేకున్నా, తను నేర్పిన విద్య ద్వారా తన శిష్యుడు తనకన్నా ఉన్నత స్థితికి వెళ్ళాలని మనస్ఫూర్తిగా ఆశించేది ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే. గొంతు ఎండేలా, గుండె అవిసేలా అవిశ్రాంతంగా బోధిస్తూ తన జీవితకాలంలో వేలాది మందిని తీర్చిదిద్ది తను మాత్రం ఓ సామాన్య వ్యక్తిలా నిలిచిపోయే మహోన్నత మూర్తి ఉపాధ్యాయుడు.

విద్యతో పాటు మంచి జీవన విలువల్ని, ఆలోచనాధోరణుల్ని నాకు అందించిన ఒక మహోపాధ్యాయుడు కవితా ప్రసాద్ గారు. దుర్భరమైన పేదరికం ఒక వైపు, మేధస్సు ఉండి వృత్తిపరంగా ఎదగడానికి అవకాశంలేని సామాజిక పరిస్థితులు మరో వైపూ ఉన్నా, పట్టువదలని ఆత్మ స్థైర్యంతో తన చుట్టూ ఉన్న ప్రపంచానికి

ఉపయోగపడుతూ, తన జీవితంలో ఒక్కో మెట్టే ఎదుగుతూ, తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి చేసి, నిజాయితీ గల ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ కాగలిగిన ఆయన నిజంగా నాకు ఒక గొప్ప స్ఫూర్తి ప్రదాత.

జన్మభూమి ఋణాన్ని సేవచేసి తీర్చుకోవచ్చు. జన్మనిచ్చిన తలిదండ్రుల ఋణాన్ని వృద్ధాప్యంలో ఆదుకోవడం ద్వారా తీర్చుకోవచ్చు. కానీ మన జీవితానికి విద్యతో బాటు ఉన్నతమైన విలువల్ని అందించి ఒక ఉన్నతమైన స్థాయికి చేరుకోవడానికి సహకరించిన మంచి ఉపాధ్యాయుడి ఋణాన్ని మాత్రం ఏమి చేసినా తీర్చుకోలేము. ఉపాధ్యాయుడు కూడా మన నుంచీ ఏమీ ఆశించరు.

మా మంచి మాష్టారు కవితాప్రసాద్‌గారు నాకందించిన అమూల్యమైన విద్యకు ప్రతిఫలంగా, ఈ రోజు నా జీవనస్థాయికి సగర్వంగా పైకెత్తుకు తిరగగలిగిన నా శిరస్సు వంచి ప్రణమిల్లడం తప్ప మరేమీ అందించలేని ఒక విద్యార్థిగా మిగిలిపోతున్నాను నేను..!

*(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీ కవితా ప్రసాద్ గారి కవితా విశేషాలు* **www.kavithaprasad.com** *లో చూడొచ్చు - సంపాదకుడు )*



*ఉత్తర అమెరికాలోని బోస్టన్ నివాసి ఐన మోహన్‌గారు సాఫ్ట్‌వేర్ రంగంలో మునుముందుకు దూసుకు వెళుతున్న ఒక కంపెనీకి అధినేత. ప్రస్తుతం 'తానా ' సంస్థకి కోశాధికారి. అమెరికాలోనూ ఇండియాలోనూ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారు. ఆయన చేపట్టిన కార్యక్రమాల గురించి* **www.nmfriends.org** *వెబ్‌సైట్‌లో చూడొచ్చు. 'మోహన్ చైతన్య ' అనే కలం పేరుతో ఆయన అనేక కవితలు వ్రాసిన విషయం చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు.*





# ప్రొఫెసర్ గంటి ప్రసాదరావు

Dr.GP Rao
President and CEO,
Inventive Pathways-
Management Consultancy
BE(Hons), MTech, PhD, FIE,
FIETE, FNAE, FIEEE Member
UNESCO-EOLSS Joint
Committee PO Box 2623, Abu
Dhabi, UAE

ఇరువది రెండేళ్ళు నిరాటంకంగా సాగినది నా సుదీర్ఘ విద్యాభ్యాస యాత్ర. ఇందులో ప్రతియేటా ప్రతిచోటా వెలసిన భగవన్మూర్తులు నా గురువులెందరో మహానుభావులు. అందరికీ వందనాలు. 1947 నుండి భారత స్వాతంత్ర్యం లాగా నా విద్యాభ్యాసం లాంఛనంగా మొదలయింది. అక్షరాభ్యాసం కాగానే బొబ్బిలి సమీపాన ఉన్న మా స్వగ్రామం కలువరాయి గ్రామంలో మా పొరుగునే బడీ, మా ఇంట్లోనే అద్దెకుండే మా మాష్టారు కొల్లూరి లింగన్నగారు. వారూ వారి సతీమణీ నన్ను ఇంటా బయటా ఎంతో ముద్దుగా, ప్రేమగా చూసుకునేవారు. బడికీ ఇంటికీ ఏమీ తేడా తెలిసేది కాదు. పైగా బడిలో చాలా మంది తోటి పిల్లలు ఆడుకోవడానికి. సాధారణంగా కనిపించే మందలింపులు, బెత్తం దెబ్బలు, గోడకుర్చీలు ఇలాంటి చేదు అనుభవాలు లేకుండా నా చదువు తీపిగా ప్రారంభం కావడం నా అదృష్టసోపానం. అందుకే బడికి ఎంతో సరదాగా వెళ్ళడం మొదలయింది. కొద్దినెలలే కలువరాయిలో. తరువాత మా నాన్నగారి హయ్యర్ గ్రేడు టీచర్ ట్రైనింగ్ కోసం పార్వతిపురం వచ్చాం. అక్కడ బెలగాంలో నాయుడు వీధిలో ఒక ఇంట్లో అద్దెకుండే వాళ్ళం, మా అమ్మమ్మగారు, మా మేనమామగారి ఇద్దరు కొడుకులతో కూడా. అక్కడ కూడా పక్కనే మా బడి 'గురువు బడి', చెరుకు గడ్డితో నేసిన పూరిపాక. 1 నుండి 5 వరకు తరగతులు. ఇద్దరే ఉపాధ్యాయులు. మా మాష్టారు 'పట్నాయక్' గారు. పూర్తి పేరు నాకిప్పటికీ తెలియదు. నా 1,2 తరగతులలో ఆయనే మాష్టారు. ప్రేమతో చూసేవారు.



మా నాన్నగారికి ఒక ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలో మొదటి ఉద్యోగం రావడంతో బొబ్బిలి వచ్చాం. 1953 వరకు అక్కడే మొదటి రెండేళ్ళూ 'దొడ్డావారి' బడిలో 4,5 తరగతులు, 4వ తరగతిలో మా మాష్టారు క్రరి సీతారామమూర్తిగారు. సుమారు 20 ఏళ్ళ తర్వాత ఆయన్ని మళ్ళీ ఖరగ్‌పూరులో కలిశాను. ఆయన అక్కడ రైల్వే స్కూల్లో హిందీ టీచరుగా ఉండి రిటైరయ్యారు. 5 వతరగతిలో తాతా


సూర్యనారాయణ గారు. ఆయన నన్ను మా ముత్తాత గారి పేరుతో 'కొండయ్య తాతా' అని ప్రేమతో పిలిచేవారు. 6,7 తరగతులు సంస్థానం బ్రాంచి హైస్కూల్లో, ఇక్కడ మా మాస్టార్లు (అందరూ మంచివారే) పప్పు చాముండేశ్వరరావు, బులుసు శ్రీరామమూర్తి, కోడుగంటి సీతారామమూర్తి, ఆదిభట్ల అంగీరస శాస్త్రిగార్లు. 2001 లో నేను బొబ్బిలి వెళ్ళి మా స్కూలు వెతుక్కోవలసి వచ్చింది. చుట్టూ దుకాణాలు కప్పేసాయి. 1801లో బాలికల పాఠశాలగా స్థాపించబడిన ఈ స్కూలు భవంతి స్థితి చాలా శోచనీయంగా ఉంది. పైకప్పు పెంకులు పడిపోతూంటే గదులన్నీ విడిచి వరండా మీద అన్ని క్లాసులూ ఒక మూల నడుపుతున్నారు. మరోదేశంలో అలాంటి స్కూలుని కల్చరల్ హెరిటేజ్ సైట్ గా పవిత్రంగా నిలబెట్టుకునేవారు. 1953లో మా నాన్నగారికి సోంపేట దగ్గర ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగం రావడంతో సోంపేట వచ్చాం. సోంపేట బోర్డు హైస్కూలులో 8 నుండీ 11వ తరగతి (SSLC)వరకు నా చదువు.

మా పొరుగునే ఉండే మరువాడ వేంకటేశం గారు (మీసాల మాష్టారు గా ప్రసిద్ధులు) నన్ను స్కూలుకి తీసుకువెళ్ళి ప్రవేశపెట్టేరు. తిన్నగా 3వ ఫార్మ్ (8వ తరగతి) పారనంది సుబ్బారావు మాష్టారి క్లాసులో కూచోబెట్టారు. ఆ నాలుగేండ్లూ నాకు పాఠాలు చెప్పిన వారు: తెలుగు పండితులు మరువాడ శ్రీరామమూర్తి, కర్రి సుబ్బరాయ శాస్త్రి, గంటి మహాపాత్రుని గోపాలశాస్త్రి గార్లు. కుప్పిలి దాసుమహంతి గారు, దున్న సత్య అప్పారవు, వేదుల వేంకట జగన్నాథ రావు, చిత్రలేఖనం పి.లక్ష్మీనారాయణ, హిందీ కోడి బసవన్నగార్లు. హెడ్మాస్టారు ఉప్పాడ రామమూర్తిగారు స్కూలు ఫైనల్లో ఇంగ్లీష్ కాంపోజిట్ మాథమెటిక్స్. హాఫ్ ఇయర్లీ పరీక్షల్లో వచన సమాధానికి బదులు పద్యాలు వ్రాసినందుకు గోపాలశాస్త్రి గారు మాత్రం "ఒరే పబ్లిక్ పరీక్షల్లో మాత్రం ఇలాంటి పిచ్చి పనులు చెయ్యకుమీ" అని హెచ్చరించారు. కోడి బసన్నగారు వేసవి శలవుల్లో చేరదీసి నా పదమూడో ఏటకే మూడు హిందీ పరీక్షలు కట్టించారు.

SSLC పైన చదివించే ఆర్థిక బలం మా వాళ్ళకి లేదని typewriting and short hand నేర్చుకోడం మొదలుపెట్టేను సోం పేటలోనే మార్చి 1957లో పరీక్షలవగానే. ఆగస్టు వరకు యాంత్రికంగా నా ఈ అభ్యాసం సాగింది. అప్పుడు అనూహ్యమైన మలుపు. మా నాన్నగారు ఒక మిత్రుని ప్రోత్సాహపు మాటలు (సత్రంలో ఉచిత భోజనం దొరికితీరుతుందన్న) విని నన్ను తోడ్కొని వెంటనే విజయనగరం తీసుకువెళ్ళారు మహారాజావారి కాలేజీలో చేర్పించే ఆశతో. ప్రిన్సిపాల్‌గారు శ్రీ వసంతరావు వెంకటరావు గారిని కలిసాం. ఆయన్ని అంతకు రెండేళ్ళ ముందు సోంపేట స్కూలు వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా చూసాను. ఆయన నుండి ఎన్నో బహుమతులందుకున్నాను. ఆయనకి అవన్నీ జ్ఞాపకం ఉండి ఉండవు. ఆయనతో కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీ కవిరాయని వెంకట రమణ మూర్తిగారు కూడా ఉన్నారు. Pre university course (PUC) ఆ ఏడే మొదలు.

నన్ను పి.యు.సి.లో చేర్పించడానికి తెచ్చాననగానే కాస్త ఉలిక్కిపడి విసుగుతో "ఇంత లేటా? అన్నీ ఎడ్మిషన్లు ఎప్పుడో అయిపోయాయి. కోర్సులు కూడా చాలా సాగిపోయాయి లాభంలేదు వెళ్ళండి. వచ్చేయేడు వేళకి రండి" అని వసంతరావు వారు ముక్తసరిగా చెప్పి రమణమూర్తిగారితో ఏదో మాటల్లో పడ్డారు. మేమిద్దరం ఏమనడానికి ఏమీచేయడానికి తోచక అక్కడే చుట్టూ చూస్తూ కొన్ని నిమిషాల తరువాత వెనుతిరిగి అడుగులు భారంగా వెయ్యడం మెల్లగా మొదలుపెట్టాం. ద్వారానికి ఇంకా రెండగల్లో ఉన్నాం. వసంతరావు గారు పిలిచారు సర్టిఫికెట్లు చూపించమన్నారు. సంచిలో ఉన్న సరుకంతా తీసి వారి ముందుంచాం. వారు అన్ని సర్టిఫికెట్లు చూస్తూ రమణమూర్తిగారికి కూడా చూపించారు. ఇరువురూ పరస్పరం చూసుకున్న తరువాత వసంతరావు గారి నోటి నుండి ఒక చల్లని నిర్ణయ వాక్యం

వెలువడింది. "సోమవారం రండి జాయిను చేయండి." "అయిపోయిన కోర్సులు కవర్ చెయ్యడానికి నువ్వు కష్టపడి చదవాలోయ్" అని నాతో ప్రత్యేకంగా నొక్కి చెప్పారు.




మాలో ఆశ చిగురించింది.నా సర్టిఫికెట్లు సర్దుకుని సంచిలో పెట్టుకుంటుండగా నాన్నగారు సత్రం భోజనం గురించి మెల్లగా గొణిగారు వారికి విజ్ఞాపనగా. వసంతరావు వారు గట్టిగానే లాభం లేదన్నారు. ఆ విషయంలో తానేమీ చేయలేనని స్పష్టంగా చెప్పేశారు. మమ్మల్నే మరో మార్గం వెదుక్కోమన్నారు. మా ముఖాలలోని నిరాశని చూసి తానూ కొంత సందేహిస్తూనే వారాలు ప్రయత్నించి చూడండి మీకు అభ్యంతరం లేకపోతే, మా ఇంట్లో ఒకవారం లెక్కవేసుకోండి అన్నారు వసంతరావుగారు. రమణమూర్తిగారు వెంటనే మరో వారం మా ఇంట్లో అని తోడు పలకగానే మా నాన్నగారు మీమాంసలో కొంచెం పడినట్లు చూసి అంతవరకూ ఆ ఆలోచనలోలేని నేను సిద్ధం అన్నట్లు కళ్ళతో సూచించాను. మేము సరేనని తలలూపాం. అయితే ఈ శని ఆదివారాలు ప్రయత్నించి సోమవారం వచ్చి చెప్పండన్నారు వసంతరావు గారు. శలవు తీసుకుని బయట పడ్డాం. విజయనగరంలో ఆ రెండురోజులూ నిర్విరామంగా తిరిగి మిగతా 5 వారాలు సంపాదించి సోమవారం తిరిగివచ్చి ఫీజు కట్టి మాథమెటిక్స్, ఫిజికల్ సైన్సు, కమర్షియల్ నాలెడ్జి, అకౌంటెన్సీ (ఎం.పి.సి) గ్రూపులో నన్ను ప్రవేశపెట్టి నాన్నగారు బరువైన గుండెతో సోంపేట తిరిగి వెళ్ళారు. మా నాన్నగారికి ధైర్యం చెప్పిన ఆయన మనుమలున్న కోడుగంటివారి వీధిలోని గదిలోనే చేరి చదువులో పడ్డాను. మూడువారాలు కాబోలు సాఫీగా నడిచాయి. ప్రతిరోజూ వారం వున్న ఇంటికి ఉదయానే వెళ్ళి ఆ ఇంటివారికి గుర్తుచేస్తూ ఒక పొత్తిగావంచా పెట్టడం నా పరిపాటి. 1957 సెప్టెంబరు మధ్యలో ఒక బుధవారం ఉదయం గుర్తుచేయడానికి దాసన్న పేటలో చావలి శేషయ్యగారింటి వైపు వెళ్ళడం వారింటి ముందు జనాన్ని చూసి శేషయ్యగారు పోయిన విషయం గ్రహించి వెనుదిరిగి వెళ్ళిపోయాను. ఆ రోజెలాగో గడిపి మర్నాడు వసంతరావు గారింటికి వెళ్ళాను.

చావలి శేషయ్యగారింట్లో నాకోవారం అని వసంతరావుగారికి తెలుసు. వారంతట వారే గ్రహించారు. నాకొచ్చిన సమస్య వెంటనే తామే తీర్చేశారు. బుధవారం కూడా వాళ్ళింటిలో వారం అప్పటి నుండి. వారానికి రెండురోజులు వారి పంక్తినే భోజనం రెండూపూట్లా. సాయంకాలం భోజనానికి ముందూ తర్వాతా నాతో కబుర్లు. నేను వెంటనే సోంపేట వచ్చేశాను. మా వాళ్ళు నిబ్బరపడ్డారు. మళ్ళీ కాలేజీ తెరిచేలోపల వసంతరావు వెంకటరావు గారి ఏకైక కుమారుడు, 5-6 ఏండ్ల వాడు మశూచికానికి బలైపోయినట్లు తెలిసింది. వెంకటరావు గారికి మిగిలిన వారందరూ ఆడపిల్లలే. విజయనగరం చేరి వారింటికి వెళ్ళాను పరామర్శించటానికి. వసంతరావువారు నేను బయటికి వస్తూండగా "బాబూ నువ్వేమీ బాధపడకు. మా ఇంటి వారాలు మాననక్కరలేదు" అన్నారు. నేను మానలేదు. మరోదారి లేదు కూడా. మిగతా రోజులెలా వారితో వ్యవహరించేనో బాధతో. ఆ రోజుల్లో నా చేతినిండా గజ్జి. వ్రేళ్ళు స్వాధీనంలో ఉండేవికావు. కలుపుకుని తినడం కోసం నేను పడే పాట్లుచూసి వెంకటరావుగారి శ్రీమతి గారే కలిపి చేతిలో పెట్టి సాయం చేసిన మహాతల్లి. నా పంక్తిలోనే కూర్చొని భోంచేసే వారి పిల్లడు కూర్చునే చోటు ఖాళీగా ఉండడం నన్నెంతో కలవరపరచేదో చెప్పడానికి మాటలురావు.




గోపాలశాస్త్రి గారితో విశాఖలో(2001)



ప్రొ.సుదర్శనరావుగారితో (2007, హైదరాబాదు)

పియుసి కాగానే ఇంజనీరింగు చదవమని వసంతరావువారు ప్రోత్సహించారు. వారి ఆశీస్సులతో కాకినాడ గవర్నమెంట్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 5 సంవత్సరాల కోర్సులో ప్రవేశించాను. కాకినాడలో నన్ను ఆదరించి ప్రోత్సహించి కాచినవారు అనేకులు. వారిలో ముఖ్యులు ప్రొఫెసర్ గంటి సుబ్రహ్మణ్యంగారు, ప్రిన్సిపాలుగారైన పి.పి.ఎల్.రావు, పర్వతం దామోదరం గార్లు, లొల్లా గోపాలకృష్ణమూర్తి, సి.సుదర్శనరావు గార్లు. దామోదరం గారు నాకు మెరిట్ స్కాలర్‌షిప్పు తెచ్చిపెట్టారు. గోపాలకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, సుదర్శనరావు గార్లు వాళ్ళ ఇళ్ళల్లో గదులిచ్చి హాస్టలు బాడుగ భారం తగ్గించారు. వాళ్ళ కుటుంబాల్లో నన్ను కలుపుకుని కాపాడారు. పి.పి.ఎల్‌రావు గారు హాష్టల్లో కుదిర్చిన ఫ్రీ బోర్డింగ్ అక్టోబరు నుండీ మొదలు అంతవరకూ మళ్ళీ వారాలే. ఎస్.ఎల్ బలసుబ్రహ్మణ్యం, పి.పి.టి భూషణరావుగార్లు తోడ్పడ్డారు. ఒకసారి వేళకి ఫీజు కట్టడంలో వీరందరూ ఆర్ధిక సహాయం చేశారు. అందులో సి.తరుణయ్యగారు చేయికలిపారు. తరుణయ్యగారు కొన్నేళ్ళ తర్వాత (రిటైరయేముందు) పి.హెచ్.డి ఐఐటి ఖరగ్‌పూర్‌లో చేసి నాకు ఇంకా సన్నిహితులయ్యారు. ఆ వయస్సులో కాన్వొకేషనులో ఆయన డిగ్రీ తీసుకుంటున్నప్పుడు అక్కడ ఆయన శిష్యులమంతా లేచి నిలబడి హర్షధ్వానాలు చేశాం.

ఇంజనీరింగు చదవుకాగానే 1963లో నా వివాహం ఐనవెంటనే నూతన దంపతులమిద్దరమూ



1963లో ప్రొ.గంటి సుబ్రహ్మణ్యం గారి కుటుంబంతో కాకినాడలో



హైదరాబాదులో ప్రొ.గంటి సుబ్రహ్మణ్యం గారు, వారి సతీమణితో, 1989లో.

వసంతరావువారింటికి వెళ్ళి వారి ఆశీర్వాదాలందుకున్నాం.ఆ తరువాత 1969 వరకూ ఐ.ఐ.టి ఖరగ్‌పూరులో ఎం.టెక్. పి.హెచ్.డి. వరుసగా నిర్విరామంగా పూర్తిచేశాను. కోయంబత్తూరు పి.ఎస్.జి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం 1969 నుండి 1971 వరకు. 1979లో మద్రాసులో వి.వి.ఎల్.రావు గారిని సతీసమేతంగా కలిసి వారి ఆశీస్సులందుకున్నాను. 1974లో హైదరాబాదు ప్రత్యేకంగా వెళ్ళాను. కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకున్న గంటి సుబ్రహ్మణ్యం గారిని చూడడానికి. అప్పుడు వసంతరావు వారితో ఎన్నో కబుర్లు. ఆయన 'మానవా, మానవా?'' అన్న తన రచన నాతో చర్చించారు అణు అస్త్రాల మీద - నా తెలుగు రచనా వ్యాసంగం అప్పుడేమీ లేదన్నాను.

1979 లో వసంతరావువారిని ఆఖరుసారిగ కలిసాను. అప్పుడాయన విశాఖలోని గాజువాకలో ఒక కాలేజీ ప్రిన్సిపాలుగా ఉన్నారు. రైల్వేలో పనిచేస్తూ రైలుప్రమాదంలోనే అల్లుడు మరణించగా వారి అమ్మాయికి ఉద్యోగం ఇచ్చేరు. ఇది వారికి జీవితంలో మరో పెద్ద దెబ్బ. వాళ్ళింటికి సిటీ బస్సు మీద వెళ్ళి పిల్లలతో కూర్చున్నాను. కరెంటు లేదు. చీకటి పడగానే వసంతరావువారు వచ్చారు. నేను గేటు వరకు వెళ్ళి ఆయన్ని లోపలికి తీసుకుని వచ్చి దీపం వెలుతుర్లో ఆయన పాదాలకి వంగి మ్రొక్కాను. చాలాసేపు మాట్లాడుకున్నాం. అదే ఆ మహానుభావుణ్ణి ఆఖరుసారిగా చూడటం. చాలా ఏళ్ళ తర్వాత 1991లో కాబోలు వారి మనుమరాలు శ్రీకృప ఖరగ్‌పూర్‌లో మా ఇంటికి వచ్చి పరిచయం పరిచయం చేసుకుని తాతగారు పరమపదించినట్లు చెప్పింది. తాతగారూ అమ్మమ్మ నన్ను చాలా తలచుకునేవారని చెప్పింది.



హైస్కూల్లో మా తెలుగు మాస్టారైన గంటి మహాపాత్రుని గోపాలశాస్త్రిగారిని విశాఖలో 2001 లో ప్రత్యేకంగా వెళ్ళి సతీసమేతంగా కలిశాను. కాళ్ళకు నమస్కరిస్తున్నప్పుడు ఆయన పాదాల పొంగులు చూసిన నా మనసు కలవరపడింది. ఆయన వేసిన మొదటి ప్రశ్న పద్యాలు వ్రాస్తున్నావా? ఆరడుగుల ఆయన నడుం మాత్రం వంగలేదు. ఆయనలోని గాంభీర్యం అలాగే ఉంది. సి.సుదర్శనరావు దంపతులను తరవు హైదరాబాదులో కలుస్తూనే ఉన్నాను. వారితో వారి పిల్లలతో మనుమలతో గడిపిన క్షణాలు కమ్మనివి.

గంటి సుబ్రహ్మణ్యం గారు అమెరికాలో స్థిరపడినట్లు తెలిసి ఆయనతో ఫోనులో ఇ-మెయిలులో 4 సంవత్సరాలు అప్పుడప్పుడు కుశల సమాచారాలు పరస్పరం నడుస్తూ ఉన్నాయి.

నేను అక్షరాభ్యాసం అయి లాంఛనంగా మొదట స్కూల్లో చేరేనాటికే నాకెన్నో వచ్చేశాయి. ఆడుతూ పాడుతూ 20 ఎక్కాలు, 60 తెలుగు సంవత్సరాల పేర్లు, కొన్ని పద్యాలూలాంటివి. నన్ను ఎత్తుకుని ఎప్పుడూ తిరుగుతూ ఇవన్నీ నాకు సునాయాసంగా నేర్పిన నా ఫ్రీ స్కూలు టీచర్ మా నాన్నగారు గంటి వెంకటప్పడుగారు. అలా బడిలో చేర్చేముందు నన్ను బాగా సిద్ధంచేశారు. మళ్ళీ ఆఖరు దశలో జ్యోత్యైపనిషత్తులలో నాకు కావలసిన కొన్ని ముఖ్య

విషయాలూ, పుస్తకాలూ సమకూర్చి నేను గత పదిహేను సంవత్సరాల్లో భారతీయుల "సున్న"గణిత శాస్త్రానికి గొప్ప కానుక ఎలాగయింది? అన్న అంశంపై ఇస్తున్న ఉపన్యాసాలకి బలం చేకూర్చారు.

నా జీవితాన్ని రూపుదిద్దిన నా మాష్టారులందరి గురించీ వ్రాయాలంటే ఒక పెద్ద గ్రంథం అవుతుంది. అయినా ఈ శీర్షిక ద్వారా చాలామందిని తలచుకునే అవకాశం కలిగింది. ఇదీ ఒక అదృష్టమే. ఈ అవకాశాన్ని కల్పించిన కౌముది సంపాదకులకి కృతజ్ఞతలు.





## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

విరగ కాచిన చెట్టుని చూసి, విత్తు నాటిన రైతు ఎంత ఆనందిస్తాడో, అభివృద్ధిలోకొచ్చిన అంతేవాసుల్ని చూసి ఆచార్యుడు అంతగానూ పొంగిపోతాడు. అయ్యే చెట్టును ఆకులోనే గుర్తించే ప్రతిభావంతులు గురువులు. ఒక గొప్ప ఇంజినీర్ని చూసి "నాకు తెలుసునండీ, ఆ కుర్రాడు "ఏ" సెక్షనులో ఉండేవాడు చిన్నప్పుడు. ఒక్కనాడు కూడా హోంవర్కు మానేవాడు కాదు. ఆ క్రమశిక్షణే ఇంతవాణ్ణి చేసింది" అంటారో గురువుగారు. ఒక గొప్ప డాక్టర్ని చూసి " ఆ పిల్ల మా అమ్మాయేనండీ. ఆ వినయమూ, ఆ శ్రద్ధా. నూటరెండు జ్వరమున్నా ఎన్నడూ పరీక్ష మానడంగానీ, క్లాసుకి రాకపోవడం గానీ నేనెరగను. ముత్యాలకోవలాంటి దస్తూరి. ఏ విషయాన్నైనా చప్పున గ్రహించే తత్వం, నేనానాడే ఊహించాను, ఈ అమ్మాయి జీవితంలో పైకొస్తుందని" అంటారో మేష్టారు. అల్లాంటి గురువులకి తమ గుండెల్లో గుడి కట్టి, నిత్యం పూజించుకునే శిష్యులూ ఉన్నారు.

నేనింతవరకూ జీవితంలో పెద్దగా సాధించినదేమీ లేదు. కో అంటే కోటిమంది కంప్యూటరుగాళ్ళలో నేనూ ఒకణ్ణి, అంతే. ఒక మంచి మనిషిగా బతకాలని ప్రయత్నించడం, మనుషుల్ని ప్రేమించడం, సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి కలిగి ఉండడం, కోరుకున్న గమ్యాన్ని కష్టపడి, శ్రమించి చేరుకునే తత్వం అలవరచుకోవడం, సాటి మనిషికి కాస్త సాయపడాలనుకోవడం - ఇవి నా విజయాలనుకుంటే, వాటికి పునాదులు వేసిన గురువులు కొందరున్నారు. స్థలాభావం వల్లా, విస్తరణ భీతివల్లా, నా తొలిగురువు గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

"అమ్మా, నన్నింకా ఎప్పుడు పంపిస్తావే శిశువిహార్‌కి?" అనే నా పోరు పడలేక, నాలుగో ఏడు నిండగానే స్కూల్లో వేసేసింది అమ్మ. అప్పటికే అన్న రెండో క్లాసు. అన్న ఫ్రెండ్సు అందరూ నా ఫ్రెండ్సే. నన్ను తీసుకెళ్ళి నర్సరీ క్లాసులో కూర్చోబెట్టారు. "ఇదేమిటీ, ఇంచక్కా అన్నతోటీ, అన్న ఫ్రెండ్స్‌తోటీ కూచోబెడతారనుకుంటే, ఇక్కడ

కూచోబెట్టారేవిటీ, చిన్న పిల్లల మధ్య!" అని నాకు కోపం వచ్చి తెగ అల్లరి చేసేసాను. అప్పుడు వచ్చారు వరలక్ష్మీ టీచరు. వస్తూనే నన్నెత్తుకుని "మనం మం...చి పాటలు పాడుకుందాం, చాకలి బాన కూడా ఆడుకుందాం పద...." అంటూ నర్సరీ క్లాసుకి తీసుకెళ్ళారు. నన్ను వళ్ళో కూర్చోబెట్టుకుని "ఈ చిట్టెలుక పేరు శ్రీను, ఇవాళనుంచీ మనతో ఆడుకుంటాడు" అంటే, అందరూ గట్టిగా చప్పట్లు కొట్టేసారు.

ఆ రోజునుంచీ నాతో సమానంగా అల్లరి చేస్తూ, పాటలూ, పద్యాలూ, సంస్కృతమూ, మధ్య మధ్యలో ఎక్కాలూ, చిన్ని చిన్ని లెఖ్ఖలు నేర్పుతూ, నీడలా తోడుండేవారు వరలక్ష్మీ టీచరు. స్కూల్లో మా అమ్మ ఉన్నట్టే అనిపించేది నాకు ఆవిణ్ణి చూస్తే. ఆవిడ ఏ రోజన్నా రాకపోతే స్కూల్లో ఉండబుద్ధయ్యేది కాదు "ఐదెప్పుడౌతుందో, జనగనమణ పాడేసి ఇంటికి ఎప్పుడు వెళతానో" అంటూ ఎదురుచూసేవాణ్ణి ఆరోజు.

అలా వో మూడేళ్ళు గడిచాయి. నాకు కృష్ణశతకం, వేమన శతకం, బాల రామాయణం, దేశభక్తి గీతాలూ, చిన్ని పద్యాలూ, పాటలూ కంఠతా వచ్చేసాయి వరలక్ష్మీ టీచరు కృషివల్ల. వరలక్ష్మీ టీచరుకో అన్నయ్య ఉండేవారు మార్కండేయులుగారని. అప్పుడప్పుడూ స్కూలుకి ఆయన వస్తుండేవారు. ఒక పాటో, పద్యమో నేర్పుతూ ఉండేవారు.

ఉన్నట్టుండి ఓ సంక్రాంతి సెలవల తరువాత వరలక్ష్మీ టీచరు స్కూలుకి రావడం మానేసారు. ఓ వారం రోజులు బెంగగా చూసాను, రాలేదు. హెడ్మాష్టారు శ్రీవారణాసి వెంకట సుబ్రహ్మణ్యం గారిని అడిగే ధైర్యం లేదు, మిగతా మేష్టార్లని అడగాలనిపించలేదు. ఒకరోజు హెడ్మాస్టారి రూములో మార్కండేయులుగారు కనిపించారు. ఆయన బయటికొచ్చేదాకా ఆగి, దిగులుగా అడిగాను "మా వరలక్ష్మీ టీచరు ఏరీ??" అని. ఆయన నవ్వుతూ "వేరే ఊళ్ళో, వాళ్ళ అత్తారింట్లో హాయిగా ఉందిరా గడుగ్గాయీ" అన్నారు. నా కర్ధమైందల్లా ఒక్కటే, ఇంక వరలక్ష్మీ టీచరు కనపడరని. ఎంతో ఏడ్చాను. తలచుకుంటే ఇప్పటికీ కళ్ళమ్మట నీళ్ళొస్తాయి. అమ్మలాంటి టీచరు, అన్నీ నేర్పిన టీచరు అర్ధాంతరంగా వెళ్ళిపోయారని దిగులు, తలచుకున్నప్పుడల్లా.

ఇప్పుడు మా ఇంట్లో కమలం పువ్వులో కూర్చున్న లక్ష్మీ దేవి పటం ఉంది, పూజ గదిలో. ఆ లక్ష్మీ దేవి, అచ్చం మా వరలక్ష్మీ టీచరులాగే ఉంటుంది. "ఏరా, చిట్టెలుకా, శ్రీనూ, ఎలా ఉన్నావు?" అని అడుగుతున్నట్లుంటుంది.

"కలవారి కోడలూ కలికి కామాక్షీ
కడుగుతున్నది పప్పు కడవలో పోసీ
అంతలో వచ్చెనూ ఆమె పెద్దన్నా..."

అంటూ పద్యాలు చెబుతున్నట్టుగా ఉంటుంది. కొమ్ముబూరా పట్టుకున్న పల్లకీ వాడు చెరువు అవతల గట్టు నుంచీ "పం...పూ..." అని అంటే, ఇవతల గట్టు నుంచి రైతు "పంపనంటే పంపనూ, నే పంపనంటే పంపనూ..." అని కథ చెబుతూ, హాయిగా నవ్వుతూ, మమ్మల్ని నవ్విస్తున్నట్లుగా ఉంటుంది.

"ఓయి భారతీయ వీరుడా, న్యాయమార్గ సదా చారుడా..." అంటూ పాటలు నేర్పి, మాలో దేశభక్తి నూరిపోసి, "కాకః, అపు పః" అంటూ సంస్కృత కథలు చెప్పి, "చక్రి సర్వోపగతుండు..." అంటూ పద్యాలకి అర్ధం చెప్పి, "రేపటికల్లా ఈ పది పద్యాలూ, నాలుగెక్కాలూ నేర్చుకురా చూద్దాం, నీవల్ల అవుతుందో లేదో..." అని కవ్వించి నేర్పించి, నా భవిష్యత్తుకి పందిరి కట్టిన నా తొలి గురువు వరలక్ష్మీ టీచరు ఎక్కడున్నారో.

మీ కెవరికైనా తెలిస్తే ఓ మాటు చెప్పరూ?

***

అవునింతకీ మా వూరు పేరూ, స్కూలూ గ్రటా వివరాలు చెప్పలేదేమిటీ అంటారా?..మరైతే ముందుకి పదండి..

***

నేను పుట్టింది ధవళేశ్వరంలో తాతగారింట, 1972 జనవరి లో. పెరిగింది అమలాపురం లో. 1976 నుంచి 1980 వరకు, అంటే ఐదోక్లాసుదాకా చదువుకున్నది "శిశువిహార్"లో. నీలం లాగు, తెల్ల చొక్కా మా స్కూలు డ్రెస్సు. ఇప్పుడూ, చెరువుగట్టమ్మటే రోడ్డుమీద వెడితే, పార్కొస్తుందికదా, దాని ఎదురూగ్గా సందులో చివార్న వేపచెట్టు దాటివెడితే మా స్కూలొస్తుంది. స్కూలంటే వరహాభాట్ల గురుమూర్తి గారి ఇల్లన్నమాట. ముందో పెద్ద పెంకుటిల్లు, వెనకాతల చిన్న మైదానం, దానివెనక పేద్ద పాక. పాకలో మొదటి మూడుతరగతులు, ఒక్కోసారి పెద్ద ఉసిరి చెట్టు కింద కూడా.

నాలుగు, ఐదుల్లో పెంకుటింటి అరుగు మీదకి మారేవాళ్ళం. అక్కడే హెడ్‌మేష్టారి ఆఫీసుకూడా వుండేది.

గురుమూర్తిగారి అబ్బాయి పేరు డాక్టర్ వరహాభట్ల గోపాల కృష్ణ గారు. ఆయన తెల్లకోటేసుకుని, మెళ్ళో స్టెతస్కోపుతో, అచ్చం సినీమాల్లో శోభన్ బాబులా వుండేవారు, ఎప్పుడూ నవ్వుతూ. వాళ్ళ అబ్బాయి మాకన్నా కొంచెం చిన్నవాడు. వాడు బూరి బుగ్గలతో, తెల్లగా, ఎలాస్టిక్ లాగూ, టీషర్ట్ వేసుకుని, భలే ముద్దుగా వుండేవాడు. వాడికి తాతగారి పేరే పెట్టారని జ్ఞాపకం.

మా మేష్టార్ల పేర్లు :వరలక్ష్మి టీచరు, సుబ్బలక్ష్మి టీచరు, పేరి యజ్ఞ లక్ష్మి టీచరు, అమ్మాణీ టీచరు, పాలగుమ్మి శ్రీనివాస రావు మేష్టారు, బాలాంత్రపు భ్రమరాంబ గారు ఇంకా...మా హెడ్‌మేష్టారు శ్రీవారణాసి వెంకట సుబ్రహ్మణ్యం గారు. పాత హెడ్‌మేష్టారు సావిత్రిగారు మరి అప్పటికే శ్రీనివాసా గార్డెన్ స్కూలుకి వెళిపోయారు కదా.

మా చదువుని పరీక్షించడానికి అప్పుడప్పుడూ ఇనస్పెక్షను కొచ్చే పెద్దలు :

శ్రీ కొత్తపల్లి ఘనశ్యామల రావు గారు, శ్రీ వారణాసి సూర్యనారాయణ గారు, శ్రీపేరి దక్షిణా మూర్తి గారు, శ్రీ మాడభూషి కృష్ణమాచార్యులు గారు, శ్రీ వారణాసి రాంబ్రహ్మం గారు

స్కూలు వార్షికోత్సవానికి బహుమతులు ప్రదానం చేసినవారు : డాక్టర్ గొట్టుముక్కల వర్మ గారు, డాక్టర్ వరహాభట్ల గోపాలకృష్ణగారు.

"ప్రదీప్తి" అనే పేరిట మాకు ఎన్నో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు, "వడ పాయసం" వంటి ఆటల పోటీలూ, దేశభక్తి గీతాల పోటీలు

నిర్వహించిన మా పాత శిశువిహార్ అన్నయ్యలు :

1) మాడభూషి రాఘవ

2) వారణాసి రాంబాబు

3) కొత్తపల్లి అప్పారావు

ఇన్ని చెప్పాను కాబట్టి ఇంకోమాట. నాకు నా ఫ్రెండ్ల పేర్లన్నీ గుర్తే, కానీ ఇక్కడ రాయను. ఈ రచన వాళ్ళెవరేనా చదివి, వారికింకా నేను గుర్తుంటే, నాకు ఈమైలు రాయడం గానీ, ఫోను చేయడం గానీ చెయ్యాలోచ్

ప్రస్తుతం :

అప్పటినుంచీ, ఇప్పటివరకూ మొద్దబ్బాయిలానే బతుకుతున్నాను. గవర్నమెంటుద్యోగం చేసుకుంటున్నాను అట్లాంటాలో. పాపం, పెళ్ళికూడా అయిపోయింది (వైటూకే ప్రాబ్లం).

మూడేళ్ళ నా పిల్ల రాయనిచ్చినప్పుడు రాస్తూ, పాడమన్నప్పుడు పాడుతూ...ఒకటి కాదులెండి. నానా హంగామా చేస్తూంటాను. గత పద్దెనిమిదేళ్ళుగా అడపాదడపా చెయ్యి చేసుకుంటున్నాను. గత పాతికేళ్ళుగా నోరు కూడా. వీలుచూసుకుని ఈ సంవత్సరాంతానికి నా మొదటి కథల కబుర్ల పుస్తకం తెద్దామని ప్రయత్నం. అదీ నా ప్రోగెస్ కార్డు, ఇప్పటివరకూ. ఇహ సంతకం పెడతారో లేదో మీ ఇష్టం

***

phanidokka@yahoo.com 404-435-0309



## అయ్యవారు శివలెంక

కౌముదిలో "మా మంచి టీచర్లు" శీర్షిక నాకు అత్యంత ప్రియమైన టాపిక్ అనడం అతిశయోక్తి కాదు. ఎంతో మంది తమ తమ చిన్ననాటి మధుర స్మృతులు వివరిస్తున్న వైనం నన్ను ఈ చిన్ని వ్యాసం రాయడానికి ప్రోత్సహించింది. సహజంగానే అందరిలా, నాకు నా చిన్ననాటి టీచర్లందరు స్మృతి పథంలో మెలిగారు. ఒక్కసారిగా దాదాపు మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్ళి అలనాటి మధుర స్మృతులు గుర్తు తెచ్చుకోవడం ఎంత ఆనందకరమో అనుభవంలోకి వస్తే కానీ తెలియలేదు. ఈ జ్ఞాపకాల దొంతరలో కొన్ని పేర్లు మరిచిపోతే క్షంతవ్యుడను. ముందుగా తొలిగురువు అయిన నా మాతృమూర్తి శ్రీమతి శివలెంక వీరలక్ష్మి గారికి ప్రణామములు.

ఇప్పటివలె "మూడో ఏడు" నుంచీ స్కూలుకి పంపే ధోరణి ఆ రోజుల్లో లేనందువల్ల హాయిగా ఐదో ఏడువరకు ఆడుకోవడమే. ఏ విధమైన బాదర బందీ లేకుండా హాయిగా బెజవాడ సత్యనారాయణపురం సందుల్లో ఆడుకుంటున్న కుర్రవాడిని పొద్దున్నే నిద్రలేపి "ఇవాళ నీకు అక్షరాభ్యాసం" అని చెప్పి పీటల మీద కూచోబెట్టిన చిన్ని జ్ఞాపకం ఏదో నిన్నో మొన్నో అన్నట్టుగా ఉంది. నాకు అక్షరాభ్యాసం చేయించి "అ ఆ లు" దిద్దించిన శ్రీ చిట్టా సుబ్బయ్య శాస్త్రిగారికి

ఎల్లప్పుడూ కృతజ్ఞుడను. తదుపరి శారదా బాల విద్యాలయంలో నాలుగో క్లాసు వరకు నాకు విద్యా బుద్ధులు నేర్పిన లలిత టీచర్, పాత టీచర్లను గుర్తుచేసుకోవడం నా ధర్మం.

ఆ రోజుల్లో నాలుగు నుంచీ ఆరో క్లాసుకు వెళ్ళడానికి ఐదు చదవకుండా లెక్కలు, ఇంగ్లీషు, సోషల్ మరియు సైన్స్ సబ్జెక్ట్‌లో ఒక ప్రవేశ పరీక్ష ఉండేది. వయసు చాలకపోతే ఒక ఏడు ఎక్కువవేసి మరీ చేర్పించేద్దాం అని ఇంట్లో వాళ్ళు నిర్ణయించేశారు. ఆ సందర్భంలో నన్ను ఆ ఎంట్రన్స్ పరీక్షకు తయారు చేసిన శ్రీమతి కామాక్షి టీచరు గారి గురించి ఎంత చెప్పినా తక్కువే. రోజూ మధ్యాహ్నం రెండు గంటలకు టీచరు గారి ఇంటికి వెళితే మళ్ళీ రాత్రి తొమ్మిది వరకు అక్కడే ఇలా దాదాపు మూడు నెలలు టీచరు గారు నాకు విసుగు విరామం లేకుండా అన్ని సబ్జెక్ట్స్ లోను శుశ్రూష చేయించారు. ఒక్క ప్రవేశ పరీక్షకు సంబంధించిన విషయాలే కాకుండా సత్ప్రవర్తనకు సంబంధించిన విషయాలు, రామాయణ, భారత గాథలు, ఎన్నో నీతి కథలు చెప్పి ఒక మంచి భవిష్యత్తుకు పూలబాట వేసారు మా కామాక్షి టీచర్. కన్నబిడ్డవలె టీచరు గారు నన్ను చూసుకున్నారు అని చెపితే తక్కువ చేసి చెప్పినట్లే. అంత బాగా టీచరుగారు నన్ను చూసుకున్నారు.

ఆ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న నాకు 6నుంచీ 9 వ క్లాసు వరకు తదుపరి ప్రస్థానం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మునిసిపల్ హైస్కూల్, సత్యనారాయణపురం. AKPMH School లో చేయి తిరిగిన లెక్కలు మాష్టారు శ్రీ రామారావుగారు, ఇంగ్లీష్ మేష్టారు శ్రీ ప్రకాశ శర్మగారు, సైన్స్ మేష్టారు శ్రీ రాజుగారు, డ్రాయింగ్ మేష్టారు, సీత టీచరుగారు, డ్రిల్లు మేష్టారు శ్రీ సుబ్బారావు గారు, NCC శ్రీ జనార్ధనగారు ఇలా ఎంతో మంది టీచర్లు ప్రతి విద్యార్ధిని పేరుపేరునా పలకరిస్తూ బాగా చదవని ప్రోత్సహించిన వైనం ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టు నా ముందు అలా తిరగాడుతూనే ఉంది. ఇవి కాక పారుపల్లి రామకృష్ణయ్య వీధిలో (పార్కు ఎదురుగా) ఉన్న లైబ్రరీలో రోజు పొద్దున్నే స్కూల్ టైంకి గంట ముందుగా చేరుకుని చదివిన వార్తా పత్రికలు (అర్ధం అయినా అవకపోయినా హిందూ పేపరు చదవమని ప్రోత్సహించిన మా జనకులు స్వర్గీయ శివలెంక చంద్రమౌళి గారి వాక్కులు), ఆ లైబ్రరీ చెట్టు మీద ఆడిన కోతి కొమ్మచ్చులు, అవి చూసిన పెద్దలు ఇంటికెళ్ళాక వీపు మీద వేసిన అట్లు ఎంతో మధురం. పదో తరగతి (SKPVVHH) స్కూల్లో చదివినప్పుడు హార్ధిక సహాయమే కాకుండా ఆర్ధిక సహాయం కూడా చేసిన శ్రీ చాగంటి రామకృష్ణ మాష్టారు, శ్రీ పున్నారావుగారు (వీరు ఇప్పుడు సత్యనారాయణ పురం గడియారం వారి వీధిలో ఉన్నారు) ఇలా ఎందరెందరో తమ ఆశీస్సులు అందచేశారు.


ఈ చదువు ఇలా ఉండగా ఆ రోజుల్లో దక్షిణ భారత హిందీ ప్రచారోద్యమం ఉధృతంగా సాగుతూ పిల్లలందరూ ప్రాథమిక, మాధ్యమిక వంటి హిందీ పరీక్షలు కట్టడం ప్రతి ఇంట్లోను సర్వసాధారణ దృశ్యం. అలా శ్రీమతి ప్రాతూరి జయలక్ష్మి గారి దగ్గర నేను కూడా హిందీ పరీక్షలకు కట్టడం మొదలయింది. టీచరు గారి శిష్యుల్లో అతి చిన్న వయసులో (పదో క్లాసు పాస్ అయ్యే సమయానికి) మొత్తం ప్రవీణ వరకు అన్ని పరీక్షలు పాస్ అయ్యాను అంటే హిందీ టీచరు గారి చలవే. సత్యనారాయణ పురంలో హిందీ టీచరు గారు అంటే తెలియని వారు ఉండేవారు కాదు అప్పట్లో. క్రితం సారి ఇండియా వెళ్ళినప్పుడు ఎంతో ఆప్యాయంగా పలకరించిన టీచరు గారు ఈ మధ్య స్వర్గస్తులయినారు అన్న వార్త ఎంతో కలిచి వేసింది. తదుపరి నా ఇంజినీరింగు విద్య మహారాష్ట్రలో జరిగినప్పుడు ఈ నేర్చుకున్న హిందీ ఎంతగానో ఉపకరించింది.

రాష్ట్ర రాజకీయాలకే కాకుండా విద్యార్థి రాజకీయాలకు కూడా గుండెకాయ వంటి బెజవాడ నగరంలో ఇంటర్మీడియట్‌లో చేరిన కుర్రవాడు సహజంగా ఏదో ఒక విద్యార్థి సంస్థ వేపు ఆకర్షితుడవటం, చురుగ్గా పాల్గొనడం కద్దు. అటువంటి పరిస్థితిలో శాతవాహన కాలేజీలో చేరిన నాకు భవిష్యత్తు గురించి బోధించి, చదువు ఆవశ్యకతను వివరించిన శ్రీ ప్రజాపతిరావుగారు, హనుమంతరావుగారు, పుచ్చా రామకృష్ణ శాస్త్రిగార్ల అమూల్యమయిన సలహాలు నాటికే కాక నేటికీ ఆచరణీయమే. తదనంతరం ఇంజినీరింగుకై మహరాష్ట్ర వెళ్ళడం, ఉద్యోగ రీత్యా ఈ దేశానికి వలస రావడం జరిగినా ఆ నాటి మధుర స్మృతులు, ప్రతి దశలో గురువులు అందించిన ప్రోత్సాహం, ఆ దీవెనలు నిన్నో మొన్నో జరిగాయేమో అన్నంత తాజాగా ఉన్నాయి.

కేవలం ఉద్యోగ ధర్మం నిర్వర్తించడంలా కాకుండా ప్రతీ విద్యార్థిని తమ కన్నబిడ్డలవలె చూసి, విద్యా బుద్ధులు నేర్పి ప్రతిఫలం ఆశించకుండా తమ విద్యార్థులు జీవితంలో బాగుపడాలని తపించి, అలా వృద్ధిలోకి వచ్చిన విద్యార్థులు తిరిగి తమను పలకరించిన నాడు సంతసించే ఆ గురువుల మోములో కలిగే ఆనందం వర్ణనాతీతం. ఇదంతా మీరు పెట్టిన భిక్ష, మీ చలవే మేష్టారు అంటే, "మేము చేసింది ఏమీ లేదు మీరు చదువుకున్నారు వృద్ధిలోకి వచ్చారు" అనడం ఆ గురువుల నిస్వార్థమయిన ప్రేమకు చిహ్నం. ఆ మంచి టీచర్లందరికీ శతకోటి వందనాలు సమర్పిస్తూ అట్టి గురువులను స్మరించుకునే అవకాశం కలుగజేసిన కౌముది పత్రిక వారికి సర్వదా కృతజ్ఞుడను.



*శివలెంక విజయవాడు వాస్తవ్యులు. ప్రస్తుతం ఉత్తర అమెరికాలో కనెక్టికట్ రాష్ట్రంలో ఒక కంపెనీలో ప్రాజెక్ట్ లీడరుగా ఉన్నారు. తెలుగు భాషాభిమానంతో నెట్‌లో ఉన్న అన్ని సాహితీ చదవడం వీరి అలవాటు. కనెక్టికట్ తెలుగు సంఘంలో* ***(www.tactusa.net)*** *సెక్రటరీ పదవి నిర్వహిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటుంటారు..*



# తోటకూర ప్రసాద్



విద్యార్థులకి ఏమి నేర్పాలో , ఎలా నేర్పాలో తెలిసిన మాస్టారు -

విద్యార్థులని సొంత పిల్లల్లా చూసుకునే మాస్టారు -

విద్యార్థులకి తన పట్ల గౌరవంతో కూడిన భయమూ, భక్తీ కలిగేలా ప్రవర్తించే మాస్టారు -

వేష, భాషల్లోనే కాక ప్రవర్తనలోనూ ప్రతిక్షణం విద్యార్థులకి ఆ-దర్శవంతం అనిపించే మాస్టారు -

హాస్యచతురతతో కూడిన అభ్యాస విధానాలతో పాఠాల్ని ఆసక్తి కరంగా బోధించగల మాస్టారు -

..

ఇలాంటివన్నీ ఒక ఆదర్శవంతమైన్ టీచర్‌కి ఉండవలసిన లక్షణాలు అనుకుంటే - ఇవన్నీ మూర్తీభవించిన మా మంచి టీచర్ శ్రీ అప్పరాయ వర్మ గారు..

సాధారణంగా విద్యార్థులు ఎలిమెంటరీ స్కూల్లో ఉండగా భావాలు అంత పరిణితి చెందవు. ఇంకా పసితనం పోని వయసులో టీచర్లంటే అభిమానం, ప్రేమ ఉంటాయేమో కానీ, టీచర్ల బోధనలకి ప్రభావితమయ్యేంత పరిణితి ఆ వయసులో మనలో చాలా మందికి ఉండదు. అదే హైస్కూలు అనే సరికి 6 వ తరగతి నుంచీ 10 వ తరగతి వరకూ మనలో భావాలు క్రమ, క్రమంగా పరిణితి చెందుతూ, భవిష్యత్తులో మనం ఏమిటి అనే దానికి గట్టి పునాదులు ఏర్పడతాయని నా అభిప్రాయం. అందుకే హైస్కూలు టీచర్లు కలిగించినంత ప్రభావం ప్రాథమిక పాఠశాల టీచర్లు కానీ, తరువాత కాలేజీ లెక్చరర్లు కానీ కలిగించలేరేమోనని నా వ్యక్తిగత అభిప్రాయం..ఆ విధంగా నేను పుట్టి పెరిగిన గన్నవరం(కృష్ణాజిల్లా) ఊళ్ళోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నన్ను అత్యంత ప్రభావితం చేసిన మా మంచి మాస్టారి గురించి ఒక సారి మననం చేసుకుంటాను.

ఆయనే మా హిందీ మాస్టారు అప్పరాయ వర్మ గారు.. ఇంకొక విశేషమేమిటంటే మా నాన్నగారే మా టీచర్! ఐతే తండ్రిగా ఇంటివద్ద ఎంత ప్రేమగా ఉండేవారో, స్కూల్లో టీచర్ గా అంత క్రమశిక్షణ నిచ్చేవారు. హిందీ మాస్టారి అబ్బాయి అని ప్రత్యేకమైన ట్రీట్మెంట్ ఏమీ ఉండేది కాదు. నేనూ అందరు పిల్లల్లానే ఆయనతో స్కూల్లో మాట్లాడేవాడిని. మిగతా పిల్లలంతా కూడా నాలాగే నాన్నగారితో ఉండేవారు.

ఆయన క్లాసంటే పిల్లలందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వారు. పేరుకి హిందీ మాస్టారే కానీ స్కూల్లో



ఇతరత్రా బాధ్యతలు చాలా చూస్తుండేవారు. స్కూలు మొదలు పెట్టడానికి ముందు పిల్లలందరినీ గ్రౌండ్‌లో నిలుచోబెట్టి అసెంబ్లీ నిర్వహించేవారు. దానిలో నాన్నగారే చొరవతీసుకుని ఆ రోజు వార్తాపత్రికలోని ముఖ్యమైన వార్తలని వాటి ప్రాముఖ్యతతో సహా వివరంగా చెప్పేవారు. ఈ విధానం మా అందరికీ జనరల్ నాలెడ్జి అంటే ఇంట్రెస్టు కలగడానికి దోహదం చేసింది.

మొట్ట మొదటిసారిగా ఆరో తరగతిలో నాకు హిందీ అక్షరాలు నేర్పించారాయన. ఇప్పుడెలా ఉందో తెలీదుకానీ ఆ రోజుల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ అనే సంస్థ హిందీ భాషా వ్యాప్తికోసం చాలా పథకాలు అమలుపరచేది. అందులో ఒకటి హైస్కూళ్ళలో హిందీ మాస్టార్లు వేసవి శెలవల్లో ప్రత్యేక హిందీ క్లాసులు తీసుకుని పిల్లలని ఆ సంస్థ నిర్వహించే పరీక్షలకి కూర్చోబెట్టేవారు. ఆ విధంగా నేను కూడా మిగతా పిల్లలతో బాటుగా నాన్నగారి వద్ద 6వ తరగతి శెలవల్లో ప్రాథమిక, 7 వ తరగతి శెలవల్లో మాధ్యమిక, 8వ తరగతి శెలవల్లో రాష్ట్ర భాష పరీక్షలు పాసయ్యాను. ఆయన పాఠాలు చెప్పే విధానం వల్ల హిందీ అంటే అమితమైన ప్రేమ ఏర్పడింది. అందుకే ఇంటర్మీడియట్ లో కూడా ద్వితీయ భాషగా హిందీనే తీసుకున్నాను. ఇలా ఒక భాషమీద బాగా పట్టు వచ్చే సరికి ఇంకో భాషని లొంగ తీసుకోవడం కూడా చాలా సులువైంది. ఈ విధానంలో నాకు తెలుగు భాషమీద మమకారం కలగడానికీ, పట్టు దొరకడానికీ నాన్నగారి బోధనా విధానాలే కారణమని గట్టిగా నమ్ముతాను.

కేవలం తన తరగతిలో పిల్లలనేకాకుండా స్కూల్లో ఎవరు అల్లరి చేస్తున్నారని తెలిసినా నాన్నగారు వాళ్ళని దండించి క్రమశిక్షణలో పెట్టేవారు. బెత్తం, దెబ్బలవరకూ వెళ్ళకుండా మాటలతోనే పిల్లలని అదుపుచేయగల గుణం ఆ-యన సొంతం. ఊళ్ళో పెద్దలంతా ఆయనకి తెలిసిన వాళ్ళేకాబట్టి ఈయన కాస్త గదమాయించినా తల్లిదండ్రులుకూడా అది తమ పిల్లల మంచికేనని అర్థం చేసుకుని ఆయనకే మద్దతునిచ్చేవారు.

నాన్నగారే టీచర్ అవడం వల్ల రోజులో ఎక్కువభాగం నాన్నగారితో గడపడానికీ, ఆయన కున్న మంచి అలవాట్ల వల్ల ప్రభావితమవడానికీ అవకాశం లభించింది. అబద్ధాలు ఆడితే అస్సలు ఊరుకునే వాళ్ళు కాదు. కొన్ని రోజులు సాయంకాలం స్కూలు వదిలాక కూడా అక్కడే ఆడుకుంటూ బాగా చీకటి పడ్డాక ఇంటికి వెళ్ళేవాడిని. ఎందుకాలశ్యమైందని అడిగితే ఏదో కారణం చెప్పేవాడిని. కొన్ని రోజుల తర్వాత నేనిలా ఆటల్లో పడి ఇంటికి ఆలశ్యంగా వస్తున్నానని తెలిసి ‘ నువ్వు ఆలశ్యంగా రావడంకంటే దాన్ని కప్పి పుచ్చుకోవడానికి అబద్ధమాడి పెద్ద తప్పు చేస్తున్నావు‘ అని నాకు వివరంగా చెప్పి మళ్ళీ అబద్ధమనేది నానోటి నుంచీ రాకుండా చూసారు.

తెలుగు భాషాభిమానం నాలో కలగడానికి కారణం గ్రంథాలయ పుస్తకాల పఠనం కారణమైతే , గ్రంథాలయానికి రెగ్యులర్ గా తీసుకెళ్ళిన శ్రమ మాత్రం నాన్నగారిదే. మొదట్లో ఆటల మీద ఉన్నంత దృష్టి పుస్తకాలు చదవడం మీద ఉండేది కాదు. అందుకని తనతో బాటు లైబ్రరీకి వస్తే తిరిగొచ్చేపుడు చెరుకు రసం కొనిపెడతానని ఊరించేవారు. మొదట్లో చెరుకురసం కోసమని లైబ్రరీకి వెళ్ళినవాడిని తరువాత నా అంతటనేనే పుస్తకాల పురుగునై పోయాను.

కేవలం చదువే కాకుండా సామాజికబాధ్యత, పౌర విధులు లాంటి విషయాలని చెప్పడమే కాక ఆచరించి

చూపేవారు నాన్న గారు. ఆయన కృష్ణాజిల్లా టీచర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా చాలా కాలం పనిచేసారు. ఆ సమయంలో నాన్నగారిని కలవడానికి జిల్లాల్లో మారు మూల ప్రాంతాలనుంచీ కూడా ఎంతో మంది టీచర్లు ఆయన వద్దకి వస్తుండే వారు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క సమస్య. అందరి సమస్యలూ చాలా ఓపికగా వినేవారు. ఎవర్నీ మళ్ళీ మళ్ళీ తిప్పించుకోవడం కానీ, వాళ్ళని నిర్లక్ష్యం చెయ్యడం కానీ చేసే వారు కాదు. 'మనం లీడర్ పదవిలో ఉన్నప్పుడు..అందరికీ అందుబాటులో ఉండాలి. వాళ్ళ సమస్యల పరిష్కారానికి శాయశక్తులా , శక్తి వంచనలేకుండా ప్రయత్నించాలి..' అని వివరిస్తూ ప్రాక్టికల్ గా తానేమి చేస్తుందీ చూపించే వాళ్ళు. ఈ రోజు నాకు అంతో ఇంతో సామాజిక సేవా దృక్పథం అలవడింది అంటే మామంచి మాస్టారైన నాన్నగారి చలవే..

ఆడంబరాలకి పోకుండా, ఉన్నదానిలో తృప్తిగా బ్రతకడం, ఉన్నదానిలోనే పదిమందికీ సహాయపడగలగడం..అనే మంచి గుణాలు ప్రాక్టికల్‌గా నాన్నగారి వద్దనుంచే నేర్చుకున్నాను. ఇవే కాదు.. చాలా విషయాలు కేవలం బోధన ద్వారానే కాక ఆచరణలో చూపించే వారు. అందుకే ఆయన వద్ద నేర్చుకున్న పాఠాల ప్రభావం చాలా గాఢంగా ఉండేది.

నేను కాలేజీకి వెళ్ళాక స్టూడెంట్ లీడర్ గా ఎన్నికైన విషయం తెలిసి, ముందుగా అభినందించిన వ్యక్తి నాన్నగారే. చదువు దెబ్బ తింటుంది , ఇలాంటి వ్యవహారాలెందుకు అని అస్సలు అనలేదు. ఈ విషయంలో కూడా తన గురు హృదయాన్ని ప్రదర్శిస్తూ" లీడర్ వయ్యావు బానే ఉంది కానీ ఇప్పుడు నీ బాధ్యత ఇంకా పెరిగింది. అందరూ నీ నాయకత్వాన్ని ఒప్పుకోవాలంటే ముందు నువ్వు ఆదర్శవంతమైన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలి. చదువులో కూడా అందరికంటే ముందుండడానికే ప్రయత్నిస్తుండాలి. అప్పుడే మిగతా వాళ్ళకి నీ మీద గౌరవం పెరుగుతుంది.." అని బాధ్యతాయుతమైన ప్రోత్సాహాన్ని అందించారు.

అందరికీ దొరకని అవకాశం నాన్నగారే టీచరవడం అనేది నాకు దొరికిన అదృష్టం.. అందుకు తండ్రిగానే గాక నన్ను , నా వ్యక్తిత్వాన్నీ తీర్చి దిద్దిన గురువుగా కూడా నాన్న గారు నాకు దైవ సమానులే..!



ప్రస్తుతం తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) కార్యదర్శిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న తోటకూర ప్రసాద్ గారు సామాజిక సేవా కార్యక్రమాలలోనూ. సాహిత్య కార్యక్రమాలలోనూ ముందుంటారు. అనేక సామాజిక సేవా సంస్థలతోనూ, సాహిత్య సంస్థలతోనూ క్రియాశీలక సంబంధాలు ఉన్నాయి. భార్య, కుమారుడు, కుమార్తెలతో టెక్సస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో నివాసం.

# వేదుల సుభద్ర

**వేలిని పట్టి, అక్షరాలు దిద్దించి, వేలల్లో ఒకరుగా నిలవాలని దీవించి, పెంచే గురువులకి ఎన్ని వేల నమస్సులు అర్పిస్తే మాత్రం సరిపోతుంది?** అమ్మ వొడిని వీడి, బతుకు బాటలో సాఫీగా సాగడానికి తొలి మజిలీ అయిన గుడి లాంటి బడికి సరి ఏముంది? ఒక్కరా? ఇద్దరా? అమ్మని గుర్తుకు తెచ్చే టీచర్లు, నాన్ననో, అన్ననో తలపించే మాస్టర్లు, ఎంతమంది చేతిన పడితే ఈనాడిలా ఈ మాత్రం ఉన్నామో కదా? అనుకుంటే, నా ప్రశ్నకి సమాధానంగా నా జ్ఞాపకాల మనో వీధిలో అనునిత్యమూ మెలిగే గురువులు ఎందరో!

చిన్నస్కూల్లో చదువు అయిపోయిందిగా! నా ఫ్రెండ్స్ అందరూ లూథరన్ హైస్కూల్ లోనే చేరుతున్నారు, నన్నూ అక్కడే చేర్చమంటే, అమ్మ వినలేదు, సరికదా! ఇంటికి దగ్గర, మన పక్కవాళ్ళ పిల్లలందరూ అక్కడే ఉన్నారు, వాళ్ళతో కలిసి నువ్వు కూడా. వెళ్ళి రావచ్చు. పైగా అది అమ్మాయిల స్కూల్ కూడానూ , అని నన్ను అక్కడే చేర్చింది. నాన్నగారి బదిలీల మూలంగా ఎన్నో ఊర్లు తిరిగిన మాకు అన్నీ మా ఊర్లే. అయితే అప్పటి మా ఊరి పేరు తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ దగ్గర ఉన్న పెద్దాపురం అన్నమాట. ఇక మా స్కూల్ పేరే, గవర్నమెంట్ గరల్సు హై స్కూల్, పెద్దాపురం. అప్పట్లో నాకు ఈ స్కూల్ లో చేరడంకన్నా లూథరన్ హైస్కూల్ లో చేరడమంటేనే ఇష్టంగా ఉండేది. అమ్మా, నాన్నలు చెప్పాకా తప్పదు కదా! కానీ చేరాకానే తెలిసింది ఆ స్కూల్ గొప్పతనం. అక్కడ ఉన్న ఒక్క సంవత్సరంలో ఎన్నో తీపి గుర్తులు, దారానికి అంటుకుపోయిన మల్లెపూల వాసనలా!

నేను చదివిన ఆరవ తరగతి కి వచ్చే టీచర్లు అందరూ మంచి టీచర్లే. లెక్కలతో పాటు ఎన్.సీ.సీ కూడా నేర్పించే మనోరమా టీచర్, సైన్స్ చెప్పే వాళ్ళ అక్క సావిత్రి టీచర్, సోషల్ పాఠాలతో పాటు చక్కని కథలని కూడా ఎంతో నేర్పుగా, ఓర్పుగా చెప్పే మణి కుమారి టీచర్, స్కూల్ ప్రధానోపాధ్యాయిని గారైన అన్నపూర్ణ టీచర్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతమందో ! అయినా అందరిలోకీ మా విశాలాక్షి టీచర్ అంటే మా అందరికీ చాలా స్పెషల్. నాకైతే మరీనూ. అప్పటికీ, ఇప్పటికీ, ఆవిడే నా క్లాస్ టీచర్ అనిపిస్తుంది. అంత అభిమానం ఆవిడంటే.

ఎప్పుడూ చల్లగా, వెన్నెలలా నవ్వుతూ ఉండడమే ఆవిడకి ఒక పెద్ద ఆభరణం. ఆవిడ ఎవ్వరినీ గట్టిగా కోప్పడ్డం గానీ, విసుక్కోవడం గానీ మేమెవ్వరం ఎప్పుడూ చూడలేదు. మా క్లాస్ లోనే కాదు, మొత్తం స్కూల్ లోనే మా టీచర్ అంటే ఇష్టం లేని పిల్లలు దాదాపుగా లేరనే చెప్పాలి. అరటిపండు ఒలిచి అరచేతిలో పెట్టినంత సులువుగా, సరళంగా, పాఠం చెప్పడం ఎలాగో ఎవ్వరైనా ఆవిడ దగ్గరనుంచే నేర్చుకోవాలి అనడంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదు. సంధులంటే సందులనీ, సమాసాలంటే సమోసాలనీ అనుక్కునే నేటి పిల్లలకి మా టీచర్ వచ్చి ఒక్కసారి పాఠం చెప్పితే తెలుగు తప్పకుండా వచ్చి తీరుతుంది. తెలుగు క్లాస్‌లో నేను ఎప్పుడూ నా స్థానంలో కూర్చునే దాన్ని కాదు. అక్కడనించి లేచి ముందుకు వచ్చి మరీ వినేదాన్ని. అలా టీచర్ దగ్గరగా వచ్చి వింటే, ఆవిడ నాకు ఒక్కర్తికే పాఠం చెప్పుతున్నట్టు అనిపించేదేమో మరి. వత్తుగా ఉన్న నల్లటి జుట్టుని మరీ పెద్దది కాని జడగా అల్లుకునేవారావిడ. మా ఇంటి అమ్మమ్మగారింట్లో (ఇంటికి కాదులెండి, మాకే అమ్మమ్మగారు, అంటే మా ఇంటి ఓనర్ అన్నమాట.) పూచే

ముద్ద మందారం పువ్వో, అది లేకపోతే మొగ్గో, అదేదో అద్భుతమైన గులాబి పువ్వు అయినట్టు తీసుకు వెళ్ళి ఇస్తే, - ఆవిడ కూడా అంతే ఇష్టంగా జడలో పెట్టుకుంటే చూడటం నాకు చాలా సంతోషంగా ఉండేది. ఆ ఆనందంకోసమే ఏ రోజైనా పూయకపోతే పాపం మా మందారచెట్టు మీద విసుక్కునేదాన్ని కూడ.



స్కూల్ వార్షికోత్సవాలకి మా క్లాస్ పిల్లలు 'పులి-కుందేలు' నాటకం వెయ్యాలని మా టీచర్ నిర్ణయించారు. మరి అందులో కుందేలు వేషం నాదేనని ఆవిడ చెప్పగానే నేను వేసిన గెంతులకి నిజం కుందేలు కూడా కుదేలై పోవలసిందే. లంకా సత్యవతిదేమో పులి వేషం. మరిడమ్మ సంబరాలకి అదీ, పులి వేషాలు బాగా వేస్తారు కదా, పెద్దాపురం లో. కనక పులి ముఖం అదీ దొరకడం తేలిక కదా! అందుకనే సింహం పాత్రని ఇలా పులిగా మార్చారన్నమాట మా టీచర్. పచ్చటి చార్ట్ పేపర్ మీద నల్లటి స్కెచ్ పెన్‌తో పులిచారలు గీసి, పసుపు రంగు పరికిణీ, జాకట్టు వేసుకున్న సత్యవతికి ముందూ, వెనకా అతికించి, పెద్ద వీధిలో పులి వేషం వేసేవాళ్ళ దగ్గరనించి మేము అడిగి తెచ్చిన పులి ముఖాన్ని తగిలిస్తే, నాకు కాకపోయినా, నిజమైన చిట్టి కుందేలుకు భయం వేసేలా మా పులి తయారయిపోయింది. మరి నాకో?? ఎన్.సి.సీ లో ఇచిన తెల్ల డ్రెస్ వేసుకుంటే బాగానే సరి పోతుంది అనుకున్నాం. మరి ముఖం మాటేవిటి?? నాకు తెలిసి కుందేలు వేషం ఎవరూ వెయ్యలేదు అప్పటివరకు, మరిడమ్మ సంబరాలలో. అందుకని ముఖం దొరికే ఛాన్స్ లేనే లేదు. దానికీ టీచరే సలహా చెప్పారు. పరికిణీ మీద వేసుకునే తెల్లజాకెట్టు చేతులలో త్రిభుజాకారంగా అట్టముక్కలు పెట్టి కుట్టి, తల మీద కాప్ లాగ పెట్టుకుని, ముఖానికి కొంచం మేక్‌అప్ చేస్తే సరిపోతుందనీ. చేతులకీ, కాళ్ళకీ తెల్ల సాక్స్‌లు వేసుకుంటే బావుంటుదని చెపుతూనే, 'అన్నింటికీ నేనొక్కదాన్నే ఎక్కడ చావన్రా?? మీ బుర్రలకి ఏమీ తోచవా??' అని ముద్దుగా విసుకున్నది కూడా నిజం కాదని నాకు అప్పుడు తెలియకపోయినా ఇప్పుడు ఖచ్చితంగా తెలుసు. మా నాటకం సూపర్ హిట్ అయ్యి కుందేలు భలే ముద్దుగానూ, పులి నిజంగానే భయం వేసేటట్టూ ఉన్నాయి అని అందరూ మెచ్చుకుంటే, అది మా టీచర్ గొప్పే కాని మాదా మరి??

అప్పట్లో స్కూళ్ళకి ఇన్స్‌పెక్టర్ గారు రావడమంటే మగ పెళ్ళి వారు వచ్చినట్టే. స్కూల్ తుడిచి అద్దంలా ఉంచడం దగ్గరనించీ, అప్పటి వరకుచెప్పినవన్నీ మళ్ళీ నేర్చుకోవటం వరకూ (ఇన్స్‌పెక్టర్ గారు వస్తే ప్రశ్నలు అడుగుతారు కదా మరి!) ఎంత పనో ! ఆయన వచ్చిన రోజున అందరూ ఇస్త్రీ చేసిన (చెంబు ఇస్త్రీ అయినా పరవాలేదు) బట్టలు వేసుకోవాలనీ, శుభ్రంగా నూనె రాసుకుని జడలు వేసుకోవాలనీ, ఇలాంటి చాలా విషయాలు తప్పకుండా నోటీసు రాసి మరీ పంపించేవారు. సాధారణంగా క్లాస్ టీచర్ క్లాస్ లోనే మొదట ప్రశ్నలు అడుగుతారు కనక, మాకు తెలుగు క్లాస్

జరిగే వేళకి మా టీచర్ తో పాటు ఇన్స్పెక్టర్ గారు కూడా వచ్చేసారు. టీచర్ కాసేపు పాఠం చెప్పగానే ఆయన ప్రశ్నలు అడగడం మొదలు పెట్టారు. ముందు వరసలో కూర్చున్న ఒక అమ్మాయిని లేపి ఆవుకు పర్యాయపదాలు చెప్పమన్నారు. ఆ అమ్మాయి పాపం భయం గా లేచి నిల్చుని, 'గోవు' అని చెప్పింది. "గుడ్" అని 'ఇంకోటి చెప్పు' అన్నారు ఆయన. అప్పటికే భయంగా ఉన్న ఆ అమ్మాయి ఆలోచనలో పడింది. మెల్లగా "గోమాత" అంది. ఆయన నవ్వుతూ కాదన్నట్టు గా తల ఊపారు. అప్పుడు టీచర్ ' పొరపాటున ఆవు ఇంట్లోకి వస్తే ఏమని తోలుతాం? కుక్కని కొట్టినట్టు ఛీ! ఛీ! అనం కదా? మరి ఏమంటాం?? ఛో! ధే! ధే! అంటామా లేదా??' అన్నారో, లేదో ! మేమందరం లేచి 'ధేనువు' అని చెప్పేసి విజయగర్వంతో నవ్వేసాం. మా తోపాటే టీచర్, ఇన్స్పెక్టర్ గారు కూడ నవ్వేసారు. అంత పెద్ద క్లూ ఇచ్చినా తెలుసుకోకపోవటానికి మేమేమీ తెలివి తక్కువవాళ్ళం కాదు కదా!

వార్షిక ఆటల పండుగ (అదే! స్పోర్ట్స్ డే ) నాడు పిరమిడ్లు వేయించారు మాచేత. కింద నలుగురితో మొదలు పెట్టి, తరవాత ముగ్గురూ, పైన ఇద్దరూ, అందరికంటే పైన ఒక్కరు ఇలా విన్యాసంగా నిలబడాలి. వరసలో ఎక్కి చక్కగా కొంతసేపు నిలబడి నెమ్మదిగా, వరసగా ఒక్కొక్క లెవెల్ మీదనించీ దిగాలన్నమాట. ఒక పిరమిడ్ మీద తెల్లగా, సన్నగా ఉండి 'నీకేలా? ఇంత నిరాశా?' అనే పాటని చక్కగా పాడే నూకరత్నాన్ని నిలబెట్టి, పక్కదానిమీద కొద్దిగా బొద్దుగా ఉండే నన్ను నిలబెట్టేసరికి, చాలా సేపు నిలబడితే కింద ఉన్న వాళ్ళు నా బరువుకి తట్టుకోగలరో లేదో నన్న భయంతో అనుకున్నదానికంటే కొద్దిగా ముందుగానే ఇంచుమించు గెంతినట్టే దిగిపోయాను ఆఖరి స్టెప్ లో. అప్పుడు మొదలయింది, టీచర్ తిట్టేస్తారన్న భయం. అప్పుడు కూడా టీచర్ నన్ను చూసి నవ్వుతూ ఇంకొంచం సేపు - ఆగవచ్చు కదా? 'భయపడ్డావా, ?' అని అడిగారే కానీ ఒక్క మాట కూడా అనలేదు. ఇలాంటివి ఎన్నో తీపి గురుతులు, టీచర్ కి సంబంధించినవి. అయితే క్లాస్ఫోటో లో టీచర్ పక్కన కూర్చోవాలని ఎంత ప్రయత్నించినా ఎందుకనో మరి? కుదరనే లేదు. ఆవిడ పక్కన కూర్చునే ఛాన్స్ వేముల లక్ష్మీ కుమారికి వచ్చింది తను అప్పుడు నాకు బెస్ట్ ఫ్రెండ్ కదా. అందుకని పరవాలేదు.

ఆరవతరగతి చివరకి వచ్చేసరికి టీచర్కి ట్రాన్స్ఫర్ అయిపోతుందనీ, ఇంకో స్కూల్ కి వెళ్ళిపోతారనీ తెలిసి, మాకందరికి చెప్పలేనంత దిగులు వేసింది. నేనూ, నాలాంటి కొంతమంది అభిమానులూ చాలా ఏడిచాము. అందరం కలిసి వెళ్ళి ప్రధానోపాధ్యాయిని గారిని అడిగి మా టీచర్ ఇక్కడే మా దగ్గరే ఉండేలా చూడమని చెప్పాలని అనుకున్నాము కూడా. ఇంతలో మా నాన్నగారికే ఆ ఊరినించి కాకినాడ బదిలీ అయిపోయింది. అలా ఆ స్కూల్ నించీ, ఆ ఊరినించీ దూరమయిపోయినా, ఆ జ్ఞాపకాలనించీ ఇప్పటివరకూ దూరమయినదీ లేదు, అయ్యేదీ లెదు. - ఆరవ తరగతి తరవాత టీచర్ని ఎప్పుడూ కలవకపోయినా ఆవిడని ఏనాటికీ మర్చిపోలేను. ముందే చెప్పాను కదా, నాకెప్పటికీ ఆవిడే క్లాస్ టీచర్. ఎప్పటికైనా టీచర్ని మళ్ళీ చూడగలనేమో నన్న ఆశ నా మనస్సులో సజీవంగానే ఉంది. కౌముది పత్రిక చలవ వల్ల ఇప్పటికి పెద్దాపురం నాటి మిత్రులు ఇద్దరు, ముగ్గురు కలిసారు. ఇంకా కలుస్తారనే - నమ్మకం తో గూగుల్ లోనూ, లింకిడ్ ఇన్, ఆర్కుట్ లాంటి చోట్లలోనూ వెతుకుతూనే ఉన్నాను. అలానే టీచర్ గురించి కూడా, ఎప్పటికైనా ఎదో ఒక ఆచూకీ తెలుస్తుందనే ఆశ. మా విశాలాక్షి టీచర్ గురించి మీలో ఎవ్వరికైనా తెలిస్తే మాత్రం నాకు తప్పకుండా చెప్తారు కదూ! ప్లీజ్.



సుభద్రగారు బెంగుళూరులో బయోటెక్నాలజీ కంపెనీలో పనిచేస్తున్నారు. తెలుగు కథలు చదవడంతో బాటు అప్పుడప్పుడూ వ్రాసుకోవడం ఇష్టం.

# కలశపూడి శ్రీనివాసరావు

**"చక్కగా చదువుకోండ్రా! మా కంటే బాగా చదువుకోవాలి లేకపోతే మాలాగే గోడలు విరిగిపోయి, పెంకులు జారిపోతున్న బళ్ళల్లో పాఠాలు చెప్పుకుంటూ బతుకీడ్చేయాలి" అన్న శ్రీ బండారు సూర్యనారాయణ రావు మాష్టారి మాటలు నా నాలుగో తరగతి నుండీ నేటి వరకూ గుర్తున్నాయి. ఆయన్ని ఏశక్తి ప్రేరేపించి ఆ మాటలనిపించిందో కానీ అది నాకు బతుకు బడిలోని తొలి పాఠం.**

అప్పటి నుండీ ఇప్పటి దాకా ఎందరో గురువులు, గురుతుల్యులు చిన్నా పెద్ద పాఠాలు జీవితాంతం గుర్తుంచుకోదగ్గవి ఎన్నో చెప్పారు. బ్రతకడానికి కావలసిన ఒక దిశ, ధైర్యం ఆత్మ విశ్వాసం అందించిన మరో ఇద్దరిని పరిచయం చేస్తాను.

ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు 1975 లో హైదరాబాదులో జరిగాయి వాటిలో పాల్గొనడానికి ప్రతి జిల్లానుండి ఇంటర్‌మీడియట్ నుండి ఒకరిని, డిగ్రీ నుండీ ఒకరిని వక్తృత్వపు పోటీల ద్వారా ఎంపిక చేసి ఆహ్వానించాలని నిశ్చయించింది. దానికి ఎవరిని సంప్రదించాలన్నది కానీ, వెళ్ళాలని కానీ, ప్రయత్నించాలని కానీ ఊహ లేని నన్ను, క్లాసులో నిలబెట్టి 'నువ్వెళ్ళరా!' అన్నారు మా బొబ్బిలి కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ గుడిమెట్ల సుబ్బిరెడ్డిగారు.




పదవ తరగతి పరిక్షా ఫలితాలు పేపర్లో వచ్చిననాడు ఫస్ట్‌క్లాసులో చూడకుండా మిగిలిన అన్నిచోట్ల చూసి నా నెంబరు లేకపోతే పరిక్షలో తప్పానని అనుకున్న నాకు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనడానికి అందులో గెలవడానికి బలం ఇచ్చింది ఆ ఒక్క మాటే!

నాకు ఇంగ్లీషులో మార్కులు బాగానే వచ్చినా నా స్నేహితులు కొందరు శ్రీ బళ్ళమూడి నారాయణరావు మాష్టారి దగ్గర తెల్లవారు ఝామున ప్రైవేటు వెళ్ళడం వల్ల నాకూ ఆయన దగ్గర ప్రైవేటు చేరాలనిపించి చేరాను. అప్పుడప్పుడు కరెంట్ లేకపోయినా కిరోసిన్ లాంతరు వెలుతురులో ఆయన ఇంగ్లీష్ పాఠాలు

చెప్పేవారు. లాంతరు వెలుగుతో పోటీగా ఆయన మొహం వెలిగిపోతూండేది. ఆయన హైస్కూల్లో టీచరే కానీ కాలేజి (ఇంటర్ మీడియట్)కి కావలసిన క్లాసు పాఠాలు కూడా చెప్పేవారు. పాఠం పేరుతో ఆయన ఇంగ్లీషు కవిత్వాన్ని, రచయితలని మాకు పరిచయం చేసారు. చిన్న చిన్న చినుకులతో వేసవి వర్షంలా సాగి చివరికి శరత్కాలపు వెన్నెలలా నవ్వుతూ తన వాక్ప్రవాహంలో ఊహని పడవగా చేసి,మాకు తెలియని ఆనంద తీరాలకు తీసుకువెళ్ళేవారు. నామీద ఆయనకు ప్రేమ ఉండేది. అది ఆయన మాటలలో చేతలలో ఎన్నోసార్లు తెలియజేసేవారు.




నారాయణరావు మాస్టారి దంపతులు

ఆయన ప్రేమ నా అస్థిత్వానికి ఆలంబన. ఆ దశలో అస్థిత్వం కన్నా తర్వాతే కదా మిగిలినవి అన్నీ. నా అస్థిత్వం ఆయన నేర్పిన పాఠాలకు ఫలితం. నేను ఫారిన్ పి.హెచ్.డికి వెళతాను అని చెప్పినప్పుడు ఆనందంతో మొదలైన ఆయన మాటలు 'నువు అమెరికా వెళ్ళిపోతావోయ్' అన్నారు విషాదంగా. అమెరికా వెళితే నేను ఆయనకు దూరమైపోతాననో లేక నాకు నేనే దూరమైపోతాననో ఆయన బాధపడ్డారు.

క్లాసు, పరిక్షలకి సంబంధించిన విషయాలు నేర్పే మాష్టర్ల కన్నా జీవించడానికి ఉపయోగపడే పాఠాలు నేర్పిన గురువులు జీవితాంతం గుర్తుంటారు. విద్యార్థిపై ప్రేమ ఉండి, ప్రోత్సాహాన్ని ఇవ్వగలిగి, ప్రతిభ ఉన్న గురువులు నిజమైన గురువులు. ఈ మూడు సమపాళ్ళలో ఉన్న ఈ ముగ్గురు గురువులు నాకే కాదు మరెంత మందికో 'మా మంచి మాష్టార్లు'!



బయోటెక్, ఫార్మసీ రంగాల్లో నిష్ణాతులైన శ్రీనివాస రావుగారు 'Catalyst for Humon development' అనే పత్రికని కూడా నిర్వహిస్తున్నారు. తెలుగు సాహిత్యం పట్ల అమితమైన మక్కువ కలిగిన వీరు కథలూ, కవితలూ కూడా వ్రాస్తుంటారు.



# కట్టా గోపాలకృష్ణ మూర్తి

*1. పసితనంలో...*

1936లో అప్పటి గుంటూరు జిల్లాలో ఉన్న పందిళ్ళపల్లి అనే గ్రామంలో మా అమ్మగారి ఇంట్లో నేను జన్మించాను. నా చిన్నతనమంతా పందిళ్ళపల్లి గ్రామం, బందరు, కైకలూరు నగరాల్లో గడిచింది. హైస్కూలు, ఇంటర్మీడియట్ చదువులు పూర్తిచేసి బి.ఎస్సి చదువుకుని 17వ సంవత్సరంలో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీకి వెళ్ళేంతవరకూ ఈ పందిళ్ళపల్లి, బందరు, కైకలూర్లు దాటి నేనెక్కడికీ వెళ్ళలేదు.

నేను స్కూలుకు వెళ్ళడం మొదలు పెట్టింది పందిళ్ళపల్లిలోనే. చిన్నగ్రామం అవడం మూలాన అప్పట్లో అక్కడ ఒకే ఒక పూరిపాక ఎలిమెంటరీ స్కూలు ఉండేది. దాంట్లో 1,2 తరగతులు మాత్రమే ఉండేవి. పందిపళ్ళపల్లి తెల్లటి ఇసక తిన్నెలప్రాంతం. స్కూలు వెనక విశాలమైన దొడ్డి ఉండేది. ఆ దొడ్డిలో ఇసక మీద చేతివేలితో తెలుగు అక్షరాలు వ్రాసి, విద్యార్థుల చేత దిద్దించేవారు పంతులు.

ఇంట్లో చదువుకోడానికి మాత్రం మా అమ్మ నాకు పలకా, బలపం కొని ప్రతిరోజూ అక్షరాలు దిద్దించేది. అమ్మ చదువుకున్నది 5 వతరగతి వరకే, దాని తర్వాత తన చదువు మాన్పించేశారు తాతయ్యలు. కానీ, ఇంటిపనులు ఒకవైపు చూసుకుంటూనే, నాకు తెలుగు అక్షరాలు, వ్యాకరణం, అంకెలు, గణితం, ఎక్కాలూ నేర్పించింది అమ్మ. ఇవేకాకుండా, కొత్త విషయాలు నేర్చుకోవాలీ, కనిపెట్టాలీ అనే కుతూహలాన్ని నాలో కలిగించింది అమ్మ నా పసితనంలోనే. తను ఎప్పుడూ ఏ ఉద్యోగమూ చెయ్యకపోయినా, నా పసితనం కాలంలో నచ్చిన పంతులు మా అమ్మే.

*2. కౌమారంలో....*

ఈ కాలంలో మా నాన్నగారు బందరులో రాష్ట్రప్రభుత్వంలో ఉద్యోగం చేస్తుండేవారు. నా హైస్కూలు, ఇంటర్మీడియట్ చదువులు బందరు హిందూ కాలేజీల్లో జరిగాయి.

సంస్కృతం నేర్చుకోవాలనే గొప్ప అభిలాషవల్ల నేను ఈ కాలంలో తెలుగు బదులు సంస్కృతం క్లాసులు తీసుకున్నాను. కనక ఎలిమెంటరీ స్కూలు తర్వాత స్కూళ్ళలో తెలుగు క్లాసులు తీసుకోలేదు.

అప్పుడు మా ఇంటి పక్క ఒక తమిళ కుటుంబం నివసించేది వాళ్ళకు ఒకే ఒక అబ్బాయి, నా వయస్సువాడు, పేరు పైనూరి హరిప్రసాద్. అతను నాకు ప్రాణస్నేహితుడయ్యాడు. మేము రోజూ స్కూలుకీ, సాయంత్రాలు చిలకలపూడిలో పాండురంగడి గుడికీ కలిసి నడిచి వెళుతుండేవాళ్ళం.

అతనికి తెలుగు చాలా ఇష్టం. హైస్కూలు, ఇంటర్మీడియట్లలో తెలుగు క్లాసులు తీసుకునేవాడు. ప్రతిరోజూ మేము స్కూలుకీ, గుడికీ నడిచి వెళ్ళేటప్పుడు, తన తెలుగు పంతులు నేర్పించిన పద్యాలు, తెలుగుసాహిత్య వివరాలూ నాకు చెపుతుండేవాడు. నేను తెలుగు సాహిత్యం గురించి తెలుసుకున్నదంతా అతనితో సంభాషణలగుండానే. కనుక ఆ వయస్సులో ఇతనే నా తెలుగు పంతులు అని చెప్పవచ్చు.

ప్రతిరోజూ అతనితో జరిగిన సంభాషణలు, చర్చలవల్ల నాకు చదువుమీదా, కొత్త విషయాలు నేచుకోవడం మీదా, ఆసక్తి బాగా పెరిగింది ఆ కౌమారదశలో. ఆ కాలంలో నా హైస్కూలు, కాలేజీ టీచర్లు ఎవ్వరూ అంతగా గుర్తులేరు నాకిప్పుడు. ఆ వయస్సులో నాకు నచ్చిన పంతులు, పంతులు కాని ఈ స్నేహితుడు పైనూరి హరిప్రసాదే!

*3. ఎం.ఎస్ చదువుకాలంలో...*

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్ పూర్తిచేశాక నేను కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ (ISI)లో ఎం.ఎస్ చేశాను ISIని కలకత్తాలో స్థాపించింది ఇంగ్లండులో చదువుకుని వచ్చిన యహలనోబిస్ అనే బెంగాలీ ఆయన. యహలనోబిస్ ఇంగ్లండులో చదువుకున్న కాలంలోనే మేధమాటిక్స్‌లో గొప్ప పేరు గడించిన రామానుజం అక్కడే రిసెర్చి చేసేవాడు. అక్కడున్నంతకాలం, యహలనోబిస్, రామానుజం ఇద్దరూ ఒకే ఎపార్ట్‌మెంటులో నివసించారు.

అప్పుడు ISI లో ముఖ్య ప్రొఫెసర్ సి.ఆర్.రావు అనే తెలుగాయన. ఈయనకూడా ఇంగ్లండులోనే పి.హెచ్.డి చేశారు. ISI లో అందరూ ఈయన్ని గురించి చాలా గొప్పగా చెప్పుకునేవారు. ఈయన క్లాసులుంటే విద్యార్థులకు హడలుగా ఉండేది. నేను తీసుకున్న మొదటి క్లాసులో ఈయన ఒక ప్రశ్న అడిగి, ఒక్కొక్క విద్యార్థినీ వేలెత్తి చూపించి, జవాబు బోర్డుమీద విశదీకరించనున్నాడు. ఒకరిద్దరు చెయ్యలేమన్న తర్వాత నన్ను అడిగారు. నేను అది తేలిగ్గా చెయ్యగలిగాను. ఇలా 2,3 సార్లు జరిగాక, ఆయన తరచూ నన్నే అడిగేవారు. ప్రశ్నలు అంత కష్టమైనవి కావు గనుక, నేను వాటి జవాబులు బోర్డుమీద తేలిగ్గా చూపించగలిగేవాడిని. బోర్డుమీద ఆయన ప్రశ్నలకు జవాబులు విశదీకరించడం నాకు చాలా గర్వాన్ని కలిగించేది. అందువల్ల ఆయన క్లాసులు నాకు చాలా నచ్చేవి.

అప్పుడే సి.ఆర్.రావుగారు నా జీవితానికి రోల్‌మోడలు అయ్యారు. నేనే గనక పంతుల్నయితే, పాఠాలు చెప్పడానికి ఈయన పద్ధతే వాడాలి అని మనస్సులో అనుకునే వాణ్ణి. ISI లో ఎం.ఎస్ చేస్తున్న కాలంలో రావుగారు నాకు నచ్చిన పంతులు అని వేరే చెప్పాలా?

కానీ రావుగారి క్లాసులో మిగతా విద్యార్థులందరూ ప్రైవేటుగా నన్ను "రావుగారి పెంపుడు కుక్క" అంటూ తిట్టేవారు.

రావుగారికి స్టాటిస్టిక్స్ అంటే ప్రాణం. స్టాటిస్టిక్స్‌లో రిసెర్చి చేసి పి.హెచ్.డి చెయ్యమని అందరు విద్యార్థులనూ ప్రోత్సహిస్తూ ఉండేవారు. అప్పుడు స్టాటిస్టిక్స్‌లో పిహెచ్‌డి చెయ్యాలనే కోరిక నాకు కలిగింది.

యహలనోబిస్, రావుగార్లిద్దరూ పేరుపొందిన రిసెర్చర్లు అవడం మూలాన ప్రపంచం నలుమూలలనుంచీ స్టాటిస్టిక్సు రిసెర్చిలో హేమాహేమీలందరూ ISI ను విజిట్ చేశేవారు ఆ రోజుల్లో. ఆ విజిటర్లందరూ సెమినార్‌లు ఇచ్చేవారు. ISIలో ప్రతివారం ఇలా ఇతర దేశాల నుంచీ వచ్చిన విజిటర్ల సెమినార్లు ఒకటి, రెండు ఉండేవి. చాలా వాటికి

రావుగారు, మిగతా ప్రొఫెసర్లు వచ్చి కూర్చునేవారు. అందువల్ల విద్యార్థులు కూడా చాలామంది వాటికి వచ్చి కూర్చునేవారు, అర్థమయినా కాకపోయినా.

ఆ కాలంలో స్టాటిస్టిక్సు రిసెర్చిలో అగ్రశ్రేణివారుగా పరిగణింపబడేవారిలో ఇద్దరు ప్రముఖులు: ఒకరు సర్ రోనాల్డ్ ఫిషర్ అనే జుత్తంతా నెరసిన ఇంగ్లీషు ముసలాయినా, రెండోవారు జెర్జీనీమాన్ అనే కాలిఫోర్నియావాడు. నీమాన్ ఫిషర్ కన్నా వయస్సులో చాలా చిన్న; కానీ నీమాన్ పొడుగ్గా, బొద్దుగా ఉంటే; ఫిషర్ బలహీనంగా కనపడే పొట్టివాడు. వాళ్ళిద్దరికీ బద్ధవైరం, వాళ్ళ మధ్య లేతపచ్చటిగడ్డి వేసినా భగ్గున కాలిపోతుందని వినికిడి. ఒక సంవత్సరం వీళ్ళిద్దరూ ఒకే కాలంలో ISI వచ్చి నెలరోజులు ఉండడం సంభవించింది. ఈ నెలలో ప్రతివారం వీళ్ళిద్దరి సెమినార్లు వేరు వేరు రోజుల్లో జరుగుతాయని నోటీసు బోర్డులో ప్రకటించారు.

కుతూహలం వల్ల ఆ సెమినార్లకు విద్యార్థులం చాలామంది వెళ్ళి కూర్చునేవాళ్ళం. ఫిషర్, నీమాన్‌లలో ఒకరు స్పీకరు అయితే రెండో వారు మొదటి వరసలో కూర్చుని హాజరయ్యేవారు వీరి వైరం గురించి తెలుసు గనుక, విద్యార్థులమంతా తరచూ వీళ్ళిద్దరినే గమనిస్తూ ఉండేవాళ్ళం.

మొదటి సెమినార్ నుంచే ఒకరినొకరు విమర్శించుకోవడం మొదలయ్యింది. కొన్ని వారాలు గడిచాక, ఒకరు చెప్పేది ఇంకొకరు నాన్‌సెన్సు అనడం మొదలయ్యింది. ఒకసారి ఫిషర్ సెమినార్ ఇస్తుండగా సీమాన్ లేచి నుంచొని కోపంతో మాట్లాడడం మొదలు పెట్టాడు. మహలనోబిస్, రావు, వీళ్ళు కొట్టుకుంటారేమోనని భయపడినట్లున్నారు అప్పుడు; లేచి సీమాన్ని శాంతపరచి బయటకు తీసుకువెళ్ళారు.

స్టాటిస్టిక్సులో అగ్రశేణి రిసెర్చర్లు అనుకోబడే ఇద్దరు గొప్పవాళ్ళ మధ్యా కథా విషయం మీద ఒప్పందం లేకపోవడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. దీని స్టాటిస్టిక్సులో రిసెర్చి చేద్దామనుకున్న నాకోరిక సన్నగిల్లింది. రిసెర్చికి ఇంకొక సబ్జెక్టు వెదకడం ప్రారంభించాను.

ఆ సమయంలో వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు ISI కి అమెరికానుంచి ఒక పడుచు మేథమాటిక్సు ప్రొఫెసర్ వచ్చాడు. ఆయన ఆపరేషన్స్ రిసెర్చి (ఇంగ్లిష్) అనే కొత్త సబ్జెక్టు మీద చిన్న కోర్సు ఇస్తారని నోటీసు బోర్డులో ప్రకటించాడు.

ఈయన తన పడుచు భార్యతో బాటు వచ్చారు. ఆవిడ ఊహించలేనంత అందాలరాశి. ఒకసారి చూశాక, నాకు ఆవిడ ముఖాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేది. తెలుగు ప్రబంధ కవులు వర్ణించిన స్వర్గలోక నివాసిని అయిన రంభ అవతారం అయి ఉండాలి ఈవిడ అని నేననుకున్నాను. అందగత్తె కావడమే కాకుండా, అందర్ని వారిపేరుతో పిలుస్తూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడేది. ఇంకో విశేషమేమిటంటే, ఆయన క్లాసులకు ఈవిడకూడా తన అల్లిక పనిముట్లతో హాజరు అయ్యేది. లెక్చర్ జరుగుతున్నంతసేపూ వెనకాల బెంచీలో కూర్చుని తన అల్లిక చేసుకుంటూ ఉండేది. ఈవిడను అప్పుడప్పుడూ చూడవచ్చనే ఆశతో విద్యార్థులంతా ఆయన ప్రతి లెక్చరుకీ హాజరు అయ్యేవారు.

*4. పిహెచ్‌డి చదువు కాలంలో...*

ISI లో ఎం.ఎస్ (స్టాటిస్టిక్సు) పూర్తిచేశాక కొన్ని సంవత్సరాలు ISI లోనే ఉద్యోగం చేశాను. ఈ సమయంలో ఉద్యోగపు ఒత్తిళ్ళచేత పిహెచ్‌డి చెయ్యాలనే నా ఆశయం మరుగున పడింది. (OR) లో రిసెర్చి జరుగుతున్న

యూనివర్శిటీలు ఆకాలంలో ఇండియాలో లేవనే చెప్పవచ్చు. OR లో రిసెర్చి చెయ్యాలంటే అమెరికాలో చదువుకి వెళ్ళాలని నేను గ్రహించాను. అది ఎలా కుదురుతుందీ అనే ఆలోచనలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

OR తెలిసినవారు ఎవరు మాట్లాడినా జార్జి డాంట్జిగ్ పేరు పలకడం విన్నాను. 1950 పడిలో ఈయన కృషివల్ల "లీనియర్ ప్రోగ్రామింగు" అనే OR సబ్జెక్టు ఉద్భవించి బాగా వర్ధిల్లింది. లీనియర్ ప్రోగ్రామింగ్ (Lp)ని చాలామంది నేర్చుకుని, డెషిషన్ ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చెయ్యడంలో దానికి చాలా ముఖ్యమైన ఉపయోగాలు కనుక్కున్నారు. చాలా కంపెనీలు ఎల్‌పి వాడి, తమ కంపెనీ నడపడానికి అయ్యే ఖర్చులు తగ్గించుకోగలిగారు. దాన్నుంచి డాంట్జిగ్‌కీ, ఆయన మొదలు పెట్టిన Lpకీ చాలా మంచి ఘనత చేకూరింది. ఈ Lp మీద కూడా రిసెర్చి చెయ్యాలనే గట్టి కోరిక నాకు ఉంది. కానీ ఇండియాలో అప్పుడు Lp మీద రిసెర్చి చేస్తున్న ప్రొఫెసర్‌లు ఎవ్వరూ కనపడలేదు. నా కోరిక నెరవేరాలంటే డాంట్జిగ్‌గారితో సంప్రదించాలని తెలిసి, అది ఎలా చెయ్యడమా అనే తర్జనభర్జనతో చాలాకాలం గడిపాక, 1962లో ధైర్యం చేసి ఆయనకు ఒక ఉత్తరం రాశాను, అంతకుముందు నేను TSP మీద చేసిన రీసెర్చి గురించి చెప్పి, వాళ్ళ యూనివర్శిటీలో పిహెచ్‌డి చదువుకు స్కాలర్‌షిప్పు లభిస్తుందా? అని ఆ ఉత్తరంలో అడిగాను.

వారం రోజుల్లోనే డాంట్జిగ్ గారి నుంచీ ఎయిర్ మెయిల్‌లో వచ్చిన కవరు చూసి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. దాంట్లో నా చదువుకి స్కాలర్‌షిప్పు ఆఫర్ వచ్చింది. దీనితో 1965 సెప్టెంబర్ UCB (యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీ)లో OR పిహెచ్‌డి ప్రోగ్రాంలో చేరాను.

మొదటి టరమ్‌లోనే డాంట్జిగ్‌గారి Lp కోర్సు తీసుకున్నాను ఈ కోర్సు, ఆయన రచించిన Lp పుస్తకం, నాకు ఆ సబ్జెక్టులో మొదటి పరిచయాలు. ఆ పుస్తకం, అప్పుడు పదకొండు డాలర్లకు కొన్నాను. ఈ పదకొండు డాలర్ల పెట్టుబడివల్ల తర్వాత నాకు చాలా ప్రతిఫలం లభించింది.

రెండవ టరమ్‌లో డాంట్జిగ్‌గారికి నేను TSPకని చేసిన రిసెర్చి వివరించడానికి ప్రయత్నించాను. మొదటి ప్రయత్నం విఫలం అయ్యింది. ఆయనకు నేను చెప్పినది ఏమీ అర్థంకాలేదు. మళ్ళీ జాగ్రత్తగా తయారయ్యి రెండో ప్రయత్నం చేశాను. ఈసారి ఆయనకు బాగా అర్థం అయ్యేలా చెప్పగలిగాను అంతా అయ్యాక ఆయన ఇలా అన్నారు: "ఈ పొజిషన్‌లో నాకు కలిగే ఆనందాల్లో ఒకటి నీలాంటి పడుచువాళ్ళు చేస్తున్న కొత్త రిసెర్చిని గురించి వినడం సుమా!" అన్నారు. ఆ పలుకులు నాకు ఎంత మనోధైర్యాన్ని కలిగించాయో చెప్పలేను. ఇలాంటి మాటలతో ఆయన ఎంతోమంది పడుచు విద్యార్థులకు మనోధైర్యాన్ని కలిగించి ఉంటారని నాకు ఇప్పుడు అనిపిస్తుంది. నా పిహెచ్‌డి చదువుకాలంలో ఈ జార్జి డాంట్జిగ్ నాకు నచ్చిన పంతులు.

UCB లో నా మొదటి సంవత్సరం అయ్యాక, అంటే 1966లో డాంట్జిగ్‌గారు UCB ని వదిలిపెట్టి స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీకి వెళ్ళిపోయారు. అప్పుడు UCB లో ఇంకొక ప్రొఫెసర్, డేవిడ్‌గేల్, ఒకరోజు నాకొక ప్రాబ్లం ఇచ్చి, దీన్ని నువ్వు పరిష్కరించగవేమో చూడు అన్నారు. ఒక వారంరోజుల్లో దాని సొల్యూషన్ కనిపెట్టి ఆయనకు చూపించాను ఆ ప్రాబ్లమే నా థీసిస్ రిసెర్చి ప్రాబ్లం అయి, డేవిడ్ గేల్ గారు నాథీసిస్ ఎడ్వైజరు అయ్యారు.

UCB లో మూడు సంవత్సరాల్లో పిహెచ్‌డి పూర్తిచేశాక OR లో పంతులు ఉద్యోగాలకు వెదకడం ప్రారంభించాను. నాకు త్వరలోనే ఆ యూనివర్శిటీల నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి ఆఫర్లు వచ్చాయి. వీటన్నిటిలో ఏది తీసుకోవాలీ అనే తికమకలో నేనుండగా, గేల్ గారు UM (యూనివర్శిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ ఆర్బర్)కి వెళితే నీ

భవిష్యత్తుకి మంచిది అని సలహా ఇచ్చారు. ఆయన మాటను బట్టి యుఎం కి వచ్చి చేరాను 1968 సెప్టెంబరులో. UM లో డేవిడ్ గేల్‌గారు నాకు నచ్చిన ఇంకొక పంతులు.

*5. నచ్చిన పంతుళ్ళ ముఖ్య లక్షణాలు*

నాకు నచ్చిన టీచర్లందరివల్లా నా భవిష్యత్తు ఒక మలుపు తిరిగిందనే విషయం మీరు గమనించే ఉంటారు. ఇలా తమ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధివైపు మలుపు తిరిగేట్లు చెయ్యడం  మంచి పంతుళ్ళ లక్షణాలలో ఒకటి అని నేననుకుంటాను.

ఈ పంతుళ్ళు స్వయంగా వాళ్ళ పాఠాల్లో నాకు నేర్పించింది విలువైనదే, కానీ దానికన్నా నాలో వాళ్ళు రగిలించిన "కొత్త విషయాలు నేర్చుకోవాలి" అనే మంట ఇంకా ఎన్నో రెట్లు విలువైనది. ఈ మంటవల్ల నా స్వయంకృషితో ఇంకా ఎంతో జ్ఞానం పొందగలిగాను. ఇలానే, "కొత్త విషయాలు నేర్చుకోవాలి, తెలుసుకోవాలి" అనే మంటను తమ విద్యార్థులలో రగిలించడం మంచిపంతుళ్ళ లక్షణాలలో ముఖ్యమైన రెండవది అని నా అభిప్రాయం.

*6. పంతులుగా నా స్వానుభవాలు*

నేను కూడా ఒక పంతుల్ని అయ్యాను. కదా. నా స్వానుభావాలను గురించి ఇప్పుడు చెప్తాను.

ఒక విద్యార్థి "ఈయన/ ఈమె నాకు నచ్చిన పంతులు" అనే నిశ్చయానికి రావడంలో రెండు "వైపులు" ఉన్నాయని గమనించండి. ఒక వైపేమో విద్యార్థుల వైపు. ప్రతి విద్యార్థీ ఈ నిశ్చయం చెయ్యడానికి తన పంతుళ్ళ మధ్య తారతమ్యాలు చూసుకుని సరిపోల్చుకోవాలి రెండో వైపేమో పంతుళ్ళ వైపు. ఒక పంతులు విద్యార్థులతో తను ప్రవర్తించే విధానాన్ని బట్టి ఈ నిశ్చయంతో తను గెలిపొందేట్లు చేసుకోవచ్చు.

పంతులు ఉద్యోగం మొదలు పెట్టినప్పటినుంచీ నా విద్యార్థులందరూ నేను బోధించే సబ్జెక్టుని, తమ కెరియర్‌లో దాన్ని ఎలా వాడవచ్చో తెలుసుకునే లెవలు వరకూ నేర్చుకోవాలాని నాతహ తహ. ఇంకో గాఢ వాంఛ ఏమిటంటే నా విద్యార్థులకు నేను "నచ్చిన   పంతులు" కావాలని.

పైన చెప్పిన "రావుగారి పద్ధతి" క్లాసులు చెప్పడంలో అమలు పరిస్తే విద్యార్థులకు సబ్జెక్టు బాగా నేర్చుకోవాలనే ప్రేరణ కలుగుతుందని నేను నమ్మాను. అందుకనే అమెరికాలో  పంతులు ఉద్యోగం మొదలుపెట్టినప్పుడు, నా క్లాసులో రావుగారి పద్ధతిని అవలంభించాను. క్లాసులో ఒక్కొక్క విద్యార్థినీ వేలెత్తి చూపించి ప్రశ్నలు అడిగాను. కొన్ని క్లాసుల తర్వాత ఒక విద్యార్థి నన్ను ప్రైవేటుగా కలుసుకుని ఇలా చెప్పాడు. "మీరు నన్ను వేలెత్తి చూపించి ప్రశ్న అడగడం, దానికి నేను జవాబు చెప్పలేకపోవడం వల్ల క్లాసుముందు నాకు నామోషీ కలుగుతోంది. దయచేసి ఇక నన్ను అడగమాకండి" అని. నేను అప్పుడు గ్రహించాను, ఇలా వేలెత్తి చూపించి అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పలేకపోవడం వల్ల ఆ విద్యార్థి వ్యక్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బ తింటున్నాయని అందుకని అలా అడగడం వెంటనే మానేశాను.

ఇంకొకసారి ఒక గ్రాడ్యుయేట్ కోర్సులో ఒక విద్యార్థి ఇలా చెప్పాడు "మీరు బోధించే సబ్జెక్టు మీకు చాలా ఇష్టమని తెలుస్తూనే ఉంది. మీ విద్యార్థులందరూ రిసెర్చి చెయ్యగలిగే లెవలు వరకూ నేర్చుకోవాలని మీరు అనుకుంటున్నారు. నాకు ఈ సబ్జెక్టులో రిసెర్చి చెయ్యాలని లేదు. నా గమ్యం దీన్ని ప్రాక్టికల్ అప్లికేషన్స్‌కి ఎలా వాడాలో


తెలుసుకోవడం వరకే" అని. అది నాకు సమంజసం అనిపించింది అప్పుడు. అందువల్ల విద్యార్థులు ఏ లెవెల్ వరకూ సబ్జెక్టుని నేర్చుకోవాలి అనే విషయం మీద నా ఆశయాలు మార్చుకోవలసి వచ్చింది.

పంతులుగా నా విద్యార్థుల మెప్పుదల పొందడం నాకెంతో ముఖ్యం. విద్యార్థులకు పంతులుగా ఉండాలంటే క్లాసులు ఎలా చెప్పాలీ, విద్యార్థులతో ఎలా ప్రవర్తించాలీ అనే విషయం మీద కూడా అన్వేషణ చేస్తూనే ఉన్నాను. ఈ అన్వేషణలే పంతులు ఉద్యోగంలో తృప్తి నిచ్చేవి అని నేననుకుంటాను.

******

*కట్టా మూర్తి ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ ఆర్బర్ లో ఆపరేషన్స్ రిసెర్చి బోధించి, పరిశోధించే అధ్యాపకులు. ఆన్ ఆర్బర్ లో సతీమణితో నివసిస్తారు. ఇద్దరు పిల్లలు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడం చాలా ఇష్టపడతారు. ఆరోగ్యానికి దినదిన వ్యాయామం అత్యవసరం అంటారు. ఈయన మాటల్లో " కదలిక ఆనందం, జోరు కదలిక బ్రహ్మానందం".*

## బలభద్రపాత్రుని రమణి



చిన్నప్పుడు స్కూలులో చదువు చెపుతున్న పంతులమ్మని 'మిస్' అనే వాళ్ళం. ఒక్కనాడూ బడికి వెళ్ళలేకపోయినా తెగ 'మిస్' అయ్యేవాళ్ళం. ఆ తరువాత 'టీచర్' అనేవాళ్ళం. కాలేజికి వెళ్ళాక 'మేడం', 'సార్' అంటూ తెగ అవినాభావ సంబంధం పెంచుకునే వాళ్ళం.

నాకు 'అ ఆలు' నేర్పిన తొలి గురువు అమ్మమ్మ.

సాహిత్యం అంటే ఆసక్తి కలిగించిన తొలి గురువూ అమ్మమ్మే! అటువంటి అమ్మమ్మ చెప్పే తాతయ్య కథ రాయాలని తొలిసారిగా కలం పట్టాను. భాష వచ్చు.. అవన్నీ కదంబంలా అల్లి కథ చెప్పడం రాదు! అల్లిక జిగిబిగి అల్లసానిది అంటారు. నేను 'గజబిజి'గా తాతయ్య కథని రాసి 'లీడర్' అని పేరు పెట్టాను. దాన్ని ఎవరికి చూపించాలో, ఎలా ప్రచురించాలో నాకేవీ తెలియదు.

సరిగ్గా ఆ సమయంలో నాకో గురువు కనిపించారు... ఆయనే యండమూరి వీరేంద్రనాథ్ 1993లో ఆయన్ని విచిత్రంగా కలిసాను.

ఒక నాలుగు లైన్ల చిన్న కవిత రాసి నేను పోటీకి పంపిస్తే దానికి జడ్జిగా ఉన్న ఆయన అది చదివి నాకోసం స్వరూప అనే అమ్మాయిని మా ఇంటికి పంపించారు. అప్పట్లో ఇలా ఇంటింటా టెలీఫోనూ, చెవికో సెల్‌ఫోనూ లేవు! ఆ అమ్మాయొచ్చి ఆయన పంపించారని చెప్పగానే థ్రిల్ అయిపోయాను.

ఋషి, పర్ణశాల, ఆనందోబ్రహ్మ, చెంగల్వ పూదండ, వెన్నెల్లో ఆడపిల్ల... అవన్నీ రాసిన అంత గొప్ప రచయిత నాకోసం కబురు చేసారా అని ఆశ్చర్యం! కానీ స్కూల్ టీచర్‌గా చేస్తున్న నాకు వెంటనే వెళ్ళడం కుదరలేదు. కొన్ని రోజులకి నేను వ్రాస్తున్న 'లీడర్' పూర్తి అయింది. అప్పుడు నేనూ, మా ఆయన వీరేంద్రనాథ్ గారి దగ్గరకి వెళ్ళి కలిశాం. "మీకు రచన చేసే సృజనాత్మక శక్తి ఉంది. ట్రై చెయండి......... స్కూల్ టీచర్లు చాలామందే వుంటారు.... అందరూ కథలు రాయలేరు" అన్నారు. 'నాకో ఉద్యోగం చాలా అవసరం' అన్నాను.

"ఎంతిస్తున్నారూ? " నవ్వుతూ అడిగారు.

"ఐదువందలు"

"నేనిస్తానులే ఓ సంవత్సరంపాటు.. మీకీ లైన్ క్లిక్ అయితే ఇందులో ఉండురుకాని, లేదా హైదరాబాదులో సందుకో బడి పెడుతున్నారు. ... మళ్ళీ టీచర్ అయిపోవచ్చు!" అన్నారు సీరియస్‌గా

"కష్టం" అన్నాను. రచయిత్రి అవడమా... జాబ్ వదలడమా.... వివరించలేకపోయాను. అప్పటి ఆర్థికస్థితి అలాంటిది!

"ఇది మా తాతగారి గురించి... చదవండి.... ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు" అని లీడర్ వ్రాత ప్రతిని ఆయన టేబుల్ మీద పెట్టి వచ్చేసాను.

ఒకరోజు ఆయన మావారికి ఫోన్ చేసారు. లీడర్ పుస్తకం ఎమెస్కోవారు పబ్లిష్ చేస్తున్నారనీ, ఫలానా రోజు 'ఆవిష్కరిస్తున్నాం' అనీ. ఆయన ఇంటికి వచ్చి చెపితే నాకు నోటమాట రాలేదు!

ఆవిష్కరణప్పుడు చెప్పారు. "శ్రీమతి రమణీ ప్రభాకర్ నా టేబుల్ మీద ఆ పుస్తకం వదిలి పెట్టి వెళ్ళాక చదవడం మొదలు పెట్టాను. నా కళ్ళమ్మట నీళ్ళు కారాపోయాయి. .... అప్పుడే ఈ పుస్తకం యువతకి స్ఫూర్తిదాయకం, ప్రచురించాలని నిర్ణయించుకున్నాను" అని

అమ్మమ్మ అంత ఆనందించడం నేనెప్పుడూ చూడలేదు! 'లీడర్' ఆయన వల్ల వెలుగు చూసింది. శ్రీరూపాటి విజయకుమార్ గారు ప్రచురించిన మంచి పుస్తకాల్లో ఒకటిగా దాన్ని ఇప్పటికీ ఉదహరిస్తుంటారు.

ఆ తర్వాత 'ముద్దు' అనే ఓ చిన్నపిల్లవాడి కథ రాసాను. దాన్ని వీరేంద్రనాథ్ గారికి చూపెట్టడానికి తీసుకెళ్ళాను. ఆయన చదివారు. నవ్వుకున్నారు. అప్పటికి నాకు పేరాగ్రాఫ్ డివిజన్ కూడా రాదు! 'దీన్ని ఫెయిర్ చెయాలి' అన్నారు. నేను వచ్చేసాను. మర్నాడు మళ్ళీ వెళ్ళాను ఫెయిర్ కాపీతో. అప్పటికే ముత్యాలవంటి దస్తూరితో దాన్ని అందంగా తిరగరాస్తూ కనిపించారు. నేను ఆశ్చర్యంతో చూస్తుంటే "మీ కథే.. మొత్తం తొమ్మిది పేజీలు ఫెయిర్ చేసాను. ఆంధ్రభూమిలో పోటీలు ఎనౌన్స్ చేసారు" అన్నారు.

ఆ కథ చేతిలోకి తీసుకున్నాను. ఇంకా కథలు రాయడం మొదలు పెట్టని నా చేతిలో యండమూరిగారు ఫెయిర్ చేసిన నా కథ! కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. అయినా 'థాంక్స్' అని కూడా అనలేదు. మాట రాలేదు. ఆ తరువాత ఆ కథకి ప్రైజు వచ్చింది.

పేరాగ్రాఫ్ డివిజన్, ఆశ్చర్యార్థకం, ఇన్వర్టెడ్ కామాస్, ప్రారంభం... ముగింపూ... మధ్యలో ఆపాలంటే ఎలాంటి చోట్ల ఆపాలో.... అన్నీ ఆయనే నేర్పించారు. క్లాసుల్లా కాదు! బెత్తం పట్టుకుని కొట్టినట్లు కాదు... చెంప మీద కొట్టినట్లు పేపర్లు పరపరున చింపి.... 'మళ్ళీ వ్రాయండి' అని నేర్పించారు.

నా మొదటి సీరియల్ 'మొగుడే రెండో ప్రియుడు' ఆరు వర్షన్లు వ్రాయించారు.

పెద్ద కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన నా 'వేపచెట్టు' కథని.... 28 పేజీలు వ్రాస్తే అడ్డంగా కొట్టేసి 18 పేజీలకి కుదించారు. ఉక్రోషంగా ఉండేది. ఒక్కోసారి కోపం వచ్చేది! పదనుగా తిట్టేవారు. "రాసాకా ఎడిట్ చేసుకోవాలి. ఫుల్‌స్టాప్ కూడా అనవసరంగా వాడకూడదు" అనేవారు. రెండు బస్సులు మారి ఎండలో వెళితే "ఐదు నిమిషాలు ఆలశ్యంగా వచ్చారు. టైం విలువ తెలీని వాళ్ళు రచయిత్రి కాలేరు" అనేవాళ్ళు. ఎప్పుడూ ఎక్కడా రికమెండ్ చేసేవాళ్ళూ కారు. చాలా హార్ష్‌గా మాట్లాడేవారు. నాతో ఏకవచన సంబోధన ఆనాటి నుండీ ఈనాటి వరకూ చెయ్యలేదాయన.

ఆయన రాసిన నవలలని ఆయన డైరెక్ట్ చేస్తున్నప్పుడు డైలాగ్స్ రాసే అదృష్టం నాకు దొరికింది.

తెల్లకాయితాల్ని నిలువుగా సగానికి మడిచి 'కుడి వైపు ఏక్షన్.... ఎడమ వైపు డైలాగు రాయాలి' అని నాకు నేర్పిన గురువు ఆయన.

ఆ తరువాత కాయితాన్ని అలా సగానికి మడిచి నేను ఎన్నో సీరియల్స్, కొన్ని సినిమాలు రాసాను.

కథలు వ్రాస్తున్న తొలిరోజుల్లో "'మీకు డబ్బూ, పాపులారిటీ కావాలా? లేక ఆత్మసంతృప్తి కావాలా?' నిర్ణయించుకునే టైం వచ్చింది. నా లాగా పేరు తెచ్చుకోవాలని ఉందా, కాళీపట్నం రామారావుగారిలా పేరు తెచ్చుకోవాలనుందా? చెప్పండి" అన్నారు.

"నాకు డబ్బూ, ఆత్మసంతృప్తీ. పాపులారిటీ కావాలి" అని క్లియర్‌గా చెప్పాను. కమర్షియల్ రైటర్‌గా నా భవితవ్యానికి బాట పడిన తొలి రోజు అది.

నేను నవలలు రాయడం మొదలు పెట్టిన మొదటి సంవత్సరంలోనే రెండు నవలలకి ఒక ప్రముఖ నిర్మాత రైట్స్ కొన్నారు.

నెలకి ఐదువందలు సంపాదించే ఒక స్కూల్ టీచర్ని మొదటి సంవత్సరంలోనే యాభైవేలు, మూడు నెలల టైంలో సంపాదించాను. నేను కమర్షియల్ రైటర్‌గా ఎదగడానికి అది తార్కాణం. విజయానికి ఐదు మెట్లు పుస్తకం మీరు తిరగేస్తే ఒక స్కూల్ టీచర్ భర్తతో తన దగ్గరకి వచ్చి 'నేను ఉద్యోగం మానలేను' అని చెప్పడం, మొదటి సంవత్సరంలోనే సినిమాలకి నవలలు అమ్మడం.... ఒక చాప్టర్‌లో ఉదహరించడం కనిపిస్తుంది. ఆ స్కూల్ టీచర్ని నేనే!

ఆయన నోటితో ఏనాడూ నన్ను మెచ్చుకోలేదు!.... తిట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి.

'ముద్దొస్తున్నావోయ్ గోపాలం' అనే సినిమా ఆయన డైరెక్ట్ చేద్దాం అనుకున్నారు. ఒక ముస్లిం ప్రొడ్యూసర్ నా దగ్గర కొచ్చి కథనం వ్రాయమన్నాడు. 'నా పేరు వేస్తారా?' అని నేను అడిగాను.

ఆ సాయంత్రం నేనూ, నా భర్తా , పిల్లలూ, ఆ ప్రొడ్యూసరూ, వీరేంద్రనాథ్ గారూ అంతా కలిసి ట్రెజర్ ఐలాండ్‌కి వెళ్ళాం. 'తెరమీద పేరు చూసుకోడానికి ఈ ఫీల్డులో ఎంత మంది ఎన్ని రోజులుగా పడిగాపులు పడుతుంటారో తెలుసా?' అని ఘాటుగా మందలించారు. నాకు కళ్ళనిండా నీళ్ళొచ్చాయి. నా భర్త ముందు.. ఇంకో ఇద్దరు పరాయివాళ్ళ ముందు తిట్టారు.

ఆ రోజే తెర మీద - వెండి తెర మీద పెద్ద పెద్ద అక్షరాలతో, సింగిల్ కార్డు నా పేరు పడేట్లు చేసుకోవాలని నిర్ణయించుకున్నాను! ఇది 1998లో జరిగింది అనుకుంట.

2000 లో నా కథ 'రేపల్లెలో రాధ' సినిమాగా వచ్చింది. సినిమా టైటిల్స్‌లో మొదటి పేరు నాదే!... ఫోన్ మ్రోగింది. తీస్తే "కంగ్రాట్యులేషన్స్" అన్నారు వీరేంద్రనాథ్, చిన్నగా నవ్వారు. నా పట్టుదల ఆయనకి తెలుసు!



తరువాత ఎనిమిది సంవత్సరాలు సీరియల్స్‌కి కథ, స్క్రీన్‌ప్లే, మాటలూ రాసాను. ఎక్కువగా ఈ.టీ.వీ.కే రాసాను. 'అనూహ్య, అగ్నిసాక్షి, చెలి, స్త్రీ నైజం, అంతర్ముఖం, పద్మవ్యూహం, కలకానిదీ..." ఇవన్నీ టీ.వీకి.

'అనగనగా ఓ అమ్మాయి, రేపల్లెలో రాధ, ఎవరే అతగాడు, బాస్, మధుమాసం, రెయిన్‌బో...' ఇవన్నీ సినిమాలు.

పదిహేనేళ్ళ ప్రస్థానం. మొదటి రోజుల్లో ప్రతి కథా ఆయనకి చూపించి, ఆయన సలహాలు తీసుకునేదాన్ని. తర్వాత తర్వాత ఫలానా ఫలానా పత్రికలో నా సీరియల్ వస్తోంది చదవండి అని ఫోన్ చేసేదాన్ని.

ఆ తరువాత అదీ మానేశాను. ఆయన నేనేం రాస్తున్నానో గమనిస్తున్నారని నేను అనుకోలేదు. గమనించాలనీ అనుకోలేదు. నవంబర్ 14 న ఫోన్ చేస్తుంటాను. ఆయన పుట్టిన రోజు అభినందనలు చెపితే చిరాగ్గా 'థాంక్స్' అంటారు. 'ఇప్పుడేం చేస్తున్నారూ?.... ' నేను మాట్లాడ్డానికి ఇంకేం పెద్దగా ఉండదు.

వాళ్ళ అబ్బాయి పెళ్ళికి వెళ్ళాను. తరువాత మళ్ళీ ఎప్పుడూ కలవలేదు. పదేళ్ళ తర్వాతనుకుంట... మొన్నీమధ్య కిరణ్ ప్రభగారు కౌముదిలో 'పాపులర్ రచనలు చెయ్యడం ఎలా' ప్రచురిస్తాను. పర్మిషన్ అడగండి' అంటే ఆయన ఇంటికి వెళ్ళాను.

మా గురువుగారిలో చాలా మార్పొచ్చింది!

ఆయన స్వభావానికి విరుద్ధంగా సెంటిమెంటల్‌గా మాట్లాడారు. "మిమ్మల్ని చాలా సందర్భాల్లో నేను తిట్టాను ఆ రోజుల్లో" అన్నారు. "అవన్నీ నా అంచికే అయ్యాయి" నా మనస్సులో అనుకున్నాను.

"ఇన్నేళ్ళలో మీ గురించి, 'కష్టపడి తన పని తనుచేసుకుంటుంది అన్నమాట తప్ప ... ఇంకోటి వినలేదు... ఐయామ్ ప్రౌడాఫ్‌యూ.... కార్లోంచి దిగుతుంటే.. అప్పట్లో బస్సులు మారి నడిచొచ్చే రమణి గుర్తొచ్చింది... కష్టపడి పెంచిన చెట్టు ఫలాలిస్తుంటే... చూసి కలిగే ఆనందం కలుగుతోంది" అన్నారు.

నా గురించి అన్ని మంచి మాటలు ఒకేసారి ఆయన నోటినుంచి వినడం నాకు ఆనందం కలిగించింది. నన్ను ఇన్నేళ్ళుగా ఆయన గమనిస్తున్నారని అప్పుడే తెలిసింది.

ఆయన శ్రీమతి చేసిన లతలు చెక్కిన అద్దం ఒకటి నాకు బహుమతిగా ఇచ్చారు. నేను వచ్చేస్తుంటే నా చేతిలో ఫైల్స్ చూసి "కారు దాకా ఈ ఫైల్స్ నేను పట్టుకోనా.. పడిపోతాయేమో" అన్నారు.

నేను మెట్లు దిగుతూ 'పడను" అన్నాను స్థిరంగా!

చాలా మంది రచనలు చేస్తారు. పాపులర్ రచనకీ మామూలు రచనకీ ఉన్న తేడా పట్టుకోలేరు. కొసమెరుపుల సొగసూ.... సశేషం అప్పుడు విశేషం... ఇవన్నీ చాలా మందికి తెలియవు!

ఇవన్నీ ఆయన వల్ల నాకు తెలిసాయి!

ఆయన మా ... మాష్టారు!



# నన్ను సైనికుడ్ని చేసిన మా ప్రొఫెసర్

- కృష్ణా అక్కులు



మా ప్రొఫెసర్ గారు

పళణినాథన్ గారు ఐ.ఐ.టి, చెన్నయ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయనే నా పి.హెచ్.డి గైడ్ పళణినాధన్ గారి దగర పి.హె.డి చేయడానికి స్టూడెంట్స్ కొంతవరకు భయపడేవారు.. ఎందుకంటే కనీసం రెండు ఇంటర్నేషనల్ జర్నల్ పబ్లికేషన్స్ లేకుండా థీసిస్ రానివ్వరనే భయం. పళణినాథన్ గారు, రీసెర్చి వలన మానవాళికి ప్రయోజనం ఉండాలని భావించే వ్యక్తి. అయితే ఆయన చెప్పిన ప్రకారం పి.హెచ్.డి చేస్తే కనీసం అయిదు సంవత్సరాలు పడుతుంది. ఇది చాలా మందికి నచ్చని విషయం.

పళణినాథన్ గారిలో ఇతరుల్ని నొప్పించే ఇంకొక విషయమేమిటంటే, ఆయన మాట చాలా కటువుగా ఉంటుంది. నచ్చని విషయాన్ని నిర్మొహమాటంగా చెబుతారు. ఆయనకి దేవుడంటే పరమకోపం. అసమర్థులు, భయస్తులు దేవుడు పేరు చెప్పుకుని కాలం వృథా చేస్తారంటారు.

కానీ ఆయనలోని మంచి గుణమేమిటంటే రీసెర్చి గురించి ఎంతసేపైనా డిస్కస్ చేస్తారు. శని, ఆదివారాలలో కూడా లాబ్‌కు వస్తారు. ఒక్కోసారి రీసెర్చి పరంగా చాలాసేపు వాదించుకునేవాళ్ళం. మా వాదన సమయంలో ఎప్పుడూ ఆయనకి కోపం వచ్చేదికాదు. నవ్వుతూ 'నా వాదన తప్పని ఋజువు చేయి సంతోషిస్తాన'నేవారు.. అంతేకాని 'నాకే ఎదురు చెబుతావా' అన్నభావం కనపరిచేవారు కాదు. 'వాదించడం అనేది పిహెచ్.డిలో ఒక భాగమే. అలా అయితేనే రేపు ఒక సైంటిస్ట్‌గా నీ అభిప్రాయాలని వ్యక్తపరచగలవ'నేవారు.

రీసెర్చి కాకుండా స్వంత విషయమేదైనా మాట్లాడిన మరుక్షణం 'సరే రేపు కలుద్దామ'నేవారు.

నేను రీసెర్చిలో చేరిన రోజునుంచీ పిహెచ్.డి మానెయ్యమని మా ఇంట్లో ఒకటే పోరు. నా పెళ్ళి కాకుండా మా తమ్ముడుకి, చెల్లికి పెళ్ళికాదని మావాళ్ళ భయం. సరే పెళ్ళి చేసుకునే పిహె.డి చేద్దామని నిర్ణయించుకుని సలహా కొరకై మా గైడునడిగాను. ఊహించిన విధంగానే 'పెళ్ళి చేసుకోవద్దు చేసుకుంటే నీ రీసెర్చి ఆలస్యమవుతుంది, తరువాత నన్ను నిందించకు' అన్నారు. అలా అయితే మా ఇంట్లో ప్రోబ్లం అవుతుందన్నాను. 'చూడు కృష్ణ, సలహా అడిగావు ఇచ్చాను అంతే. మీ ఇంటి సమస్య నా సమస్య కాద'ని చెప్పారు.

పెళ్ళయిపోయింది, రీసెర్చి సాగుతోంది, కొడుకు పుట్టాడు, ఆ సమయంలోనే స్టైఫండ్ కూడా ఆగిపోయింది. ఇవే సమస్యలుగా భావిస్తున్న సమయంలో బోనస్‌గా మా మామగారికి హార్ట్ ఎటాక్ వచ్చింది. అది తెలిసి నాలుగు రోజులు సెలవు పెట్టి ఊరెళ్ళాను. వచ్చిన తరువాత 'మీ మామగారికి ఎలా ఉంద'ని అడుగుతారనుకున్నాను. కానీ అలా అడగలేదు సరికదా 'చూడూ హార్ట్ ఎటాక్ వచ్చింది మీ మామగారికి, నువ్వేమీ డాక్టరు కాదు. అలాంటప్పుడు నువ్వు

ఊరెళ్ళి చేసేదేమీ ఉండదు. ముందే చెప్పాను పెళ్ళి చేసుకోవద్దు, ఇలాంటి సమస్యలొస్తాయని. వినలేదు. కాబట్టి అనుభవించు` అన్నారు. అసలు ఈ మనిషికి కొంచెం కూడా మానవత్వం లేదా అనిపించింది.

కష్టాలు రావడం మొదలు పెడితే చినుకులా మొదలై ఉప్పెనలా వస్తాయంటారు. ఒక ప్రక్క స్టైఫండ్ లేక, గైడ్ మాటలతో ఇంటి సమస్యలతో, ముగింపుకు రాని రీసెర్చ్‌తో సతమతమవుతున్న నాకు, మామగారు పోయారని వార్తందంది. జేబులో పైసా లేదు. నాలాగ సన్యాసుల్లా తిరుగుతున్న రీసెర్చ్ స్టూడెంట్స్ సిగరెట్లకు ఉంచుకున్న డబ్బులు రాల్చుకుని ఊరెళ్ళి మామగారి అంత్యక్రియలలో పాల్గొన్నాను.

అప్పుడు కథ ఇంకో విధంగా మారింది. మామగారు పోయిన బాధలో ఉండి నా కొడుకుకు జ్వరం వచ్చినా కొద్దిగా అశ్రద్ధ చేశాం. అయితే ఆ జ్వరం ముదిరి ఫిట్స్ (seizures) రావడం మొదలయింది. వెంటనే బెంగుళూరు వెళ్ళాం. అక్కడ డాక్టర్లు పరిశోధించి మీవాడికి ఏమీ లేదు, కేవలం బ్రెయిన్ ఫీవర్ వచ్చింది. పదిరోజులు ఐసియులో ఉంచి పరిశీలిద్దాం. ఇతను మొదటి బిడ్డయితే మీరు పూర్తిగా ఆశలు వదులుకోండి అని చల్లగా, చక్కగా ఉపదేశించారు. ఆహా! డబ్బులు లేనప్పుడు జబ్బులు, సంపదలు లేనప్పుడు ఆపదలు ఎంత చక్కగా ఆదుకుంటాయో మనిషిననిపించింది. ఈ విషయాలు వినడం మా ప్రొఫెసర్‌కి ఇష్టం ఉండదని తెలిసినా ఫోనులో పరిస్థితి వివరించాను.

పరిస్థితి మెరుగయిన తరువాత ప్రొఫెసర్ గారిని కలిశాను ఒక చిరునవ్వు విసిరారు. `వద్దురా పెళ్ళి అంటే విన్నావా` అనే వెటకారముంది ఆ నవ్వులో. ఆయన నుంచి ఎటువంటి ఊరడింపు ఉండదని తెలుసు కాబట్టి నా కోడుకు గురించి నేనేమి వివరించలేదు. కానీ ప్రొఫెసరే, `నీ స్టైఫండ్ ఆగిపోయింది కదా, కాబట్టి మూడు నెలలో పి.హెచ్.డి పూర్తి చేసి జాబ్ లో చేరాల`ని సెలవిచ్చారు.

ఆ రోజు నుంచీ దాదాపు రెండు మూడు నెలలు నాకోసమే రాత్రి పది లేదా పదకొండు గంటలవరకు లాబ్‌లో ఉండి నా థీసెస్ దిద్దేవారు. నేను ముందే చెప్పినట్లు రీసెర్చి పరంగా అయితే ఎన్ని గంటలయినా ఓపికగా గడుపుతారు. అదే స్వంత విషయాలు మాట్లాడితే మరుక్షణమే ముగింపు పలుకుతారు.

ఈ సమయంలోనే ఒక సంఘటన జరిగింది. ఒక రోజు ఉదయం పదకొండు గంటలప్పుడు నన్ను పిలిచి `ఈ రాత్రికి నేను ఉరెళ్ళాలి ఇప్పుడే కరెక్షన్స్ చెపుతాన`ని మొదలు పెట్టారు. దాదాపు మధ్యాహ్నం రెండుగంటలవుతుంది. నాకు బాగా ఆకలేస్తుంది. కానీ ప్రొఫెసర్ మాత్రం చాలా సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నారు. ఈ మధ్యలో ప్రొఫెసర్‌గారి భార్య రెండు సార్లు ఫోన్ చేస్తే ఫోన్ తీసి ప్రక్కన పెట్టారు. చివరికి ఆమె ఆఫీసు క్లర్క్‌కు ఫోన్ చేసి ఎన్ని గంటలకి వస్తారో కనుక్కోమన్నారు. `3 గంటలకు వస్తాను లంచ్ కూడా ప్యాక్ చేసుకుని తీసుకు రమ్మని చెప్పు ట్రైనులో తింటాన`న్నారు. నాకు కరెక్షన్స్ అన్నీ చెప్పి `రేపు 3 గంటలకి వస్తాను అన్నీ సిద్దంగా ఉంచు` అని వెళ్ళారు.

అప్పుడు ఆఫీసు క్లర్క్ నాతో, ఆ రోజు ఉదయం ప్రొఫెసర్ గారి నాన్నగారు చనిపోయారని, అందువల 4 గంటలకి ట్రైనుకి వెళ్ళవలసి ఉందని, అందుకే ప్రొఫెసర్ గారి భార్య కంగారుగా అన్నిసార్లు ఫోన్ చేశారని చెప్పాడు. అది విని `కరెక్షన్స్ ఇప్పుడు కూడా అంత ముఖ్యమా! ఏమిటి ఈ మనిషికి పిచ్చా` అనిపించి నాకు ఎక్కడ లేని ఏడుపు వచ్చింది.


అవే ఆలోచనలు నన్ను చుట్టుముట్టడంతో నేను కరెక్షన్స్ పూర్తి చెయ్యలేకపోయాను. కానీ ప్రొఫెసరుగారు తను చెప్పినట్లు ట్రైను దిగి 3గంటలకి ఆఫీసుకి వచ్చారు. `సారీ, సర్ మీ నాన్నగారు పోయారని తెలిసింద`న్నాను. `ఊс..` అని చిరాకుగా `ముందు కరెక్షన్స్ ఎంతవరకయ్యాయో చెప్పవయ్యా` అన్నారు. ఇంకా కొంచెం మిగిలిందని

చెప్పాను. ‘చూడు నీ దగ్గర సింపతీ మాటలు వినడానికి రాలేదు. నీ పని త్వరగా చేసి పంపించాలని నేనెంతో శ్రమిస్తున్నాను. కానీ నువ్వు చేయవలసిన పని నువ్వు చెయ్యక పోతే నేనేమీ చెయ్యలేన‘ని వెళ్ళిపోయారు.

ఈ సంఘటన ద్వారా మా ప్రొఫెసర్‌గారేమిటో అర్ధం అయింది. నాకు కష్టం వచ్చినపుడే కాకుండా ఆయనకి కష్టం వచ్చినప్పుడు కూడా తొణకకుండా ఎలా ఉండాలో తెలిపారు. మరియు ఏ బాధ వచ్చినా అది మనం చేసే పనిని దెబ్బతీయకూడదనే విషయం తెలియచేశారు. పిహె.డి అయిన తరువాత ఇలా అన్నారు. "కృష్ణా కొన్ని సందర్భాలలో నీతో కావాలనే చాలా నిర్దయగా ప్రవర్తించాను. అలాకాకుండా నేనూ సింపతీ చూపిస్తే జరిగినవే తలచుకుని పని మానేసి కాలం వృధా చేసేవాడివని" అన్నారు. ‘నాకు దేవుడంటే నమ్మకం లేదు. అయితే నేను చేసే పనినే దైవంగా భావిస్తాను‘ అని చెప్పారు.

పనిని గౌరవించడం ఆయనకి స్వతహాగా అబ్బిందో లేదా, అబ్దుల్ కలాంగారి స్నేహం వలన వచ్చిందో తెలియదు కానీ అనుకున్నది సాధించేంత వరకు ఓపికగా ప్రయత్నించే గుణం మాత్రం చాలా అద్భుతమైనది. నా రీసెర్చి పేపర్స్ చాలా మంది రిఫర్ చేస్తున్నారని, గత పది సంవత్సరాలలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన బెస్ట్ వంద పేపర్స్‌లో నా పేపరు ఉందని తెలిసి చాలా సంతోషించాను. ఈ సాధనలో నేను కేవలం అర్జునుడినే, మా ప్రొఫెసరే రధసారధి.

ఈ విధంగా నాకు పిహెచ్.డి మరియు పేపర్స్ సంపాదించి పెట్టడమే కాకుండా, నాలో మనోవికాసానికి తోడ్పడి, ఒక స్ట్రాంగ్ పర్సన్‌గా లేదా ఒక సైనికుడిగా జీవితంలో ఎలా పోరాడాలని నేర్పిన నా గురుచరణములకు నమస్కరిస్తున్నాను.



సిలికాన్ వేలీలో ఉద్యోగం చేస్తున్న కృష్ణ గారు సాహిత్యాభిమాని. పద్యాలు, వ్యాసాలు వ్రాస్తుంటారు.

# "తస్మై శ్రీ గురవే నమః"

- ఎ.విజయకుమార్, హైదరాబాదు

"శ్రీ గురుభ్యోనమః" అవును గురువు గురించి రాసే ఏ శీర్షిక అయినా గురువుకే ధారపోయాలి. ఇదేమిటి?



నేర్చిన ఏ విద్య అయినా గురువుకే ధారపోయాలి అనేది చదువుకి సంస్కారం నేర్పిన సంస్కారం. ఇలాంటి మరెన్నో సంస్కారాలను నిరంతరం ఆచరిస్తున్న ఈ ఆదర్శమూర్తి నియాన్ లైట్ల నీడలో మగ్గే నేటి తరానికి ఓ మార్గదర్శి.

ఎందుకంటే 'యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేత్తరో జనః" అన్న గీతా సారాంశాన్ని బలంగా నమ్మిన వ్యక్తి. 2005లో భాగ్యనగరానికి వచ్చిన నేను సంగీతాపేక్షతో గురువుకై రెండు సంవత్సరాలుగా అన్వేషణ సాగిస్తున్న తరుణంలో 2007లో కలిగిన పరిచయం మాది. నేడు ఎంతోమంది తమకున్న సరస్వతి కటాక్షాన్ని లక్ష్మి కటాక్షంగా రూపాన్తరించేస్తున్న క్రమంలో సంగీత ప్రచారమే తన జీవిత ఆశయంగా 'సప్త స్వరాల'నే తమ జీవిత పరమపద సోపానాలుగా మలుచుకున్న ఈయన సంగీతానికి నిలువెత్తు స్వరూపమే అంటాను నేను.

అది 2007 వ సంవత్సరం. అప్పటికే నేను భాగ్యనగరం చేరి రెండు సంవత్సరాలపై చిలుకు అయింది. కాని నా అంచనాల మేరకు ఓ గురువుకానీ, ఓ సంగీత సంస్థ గానీ నాకు తటస్థించలేదు. రోజూ ఉదయం 8.30కి ఆఫీసుకి వెళ్ళడం తిరిగి రాత్రి 11.30కి ఇంటికి చేరుకోవడం ఇదే నా దినచర్య. నా జీవితంలో ఎంతో ప్రధానంగా ఫీల్ అయ్యే సంగీతాన్ని మిస్ అవుతున్నానని బాధపడని క్షణం లేదు. కాని ఓ రోజు ఆదివారం 7.30 కి ఆఫీసు ముఖం చూడాల్సి వచ్చింది. ఆదివారం కూడా పనేమిటిరా బాబూ? అనుకుంటూ ఈసురోమని బయలుదేరాను.

విచిత్రం ఏమిటంటే ఆ పనిచేసిన ఆదివారమే నాకు మేలు చేస్తుందని, అదే నన్ను గురువు దగ్గరకి దారి చూపెడుతుందని అనుకోలేదు. రోజు వెళ్ళే దారే అయినా ఎప్పుడూ వినపడని సరళీలు, జంటలు, పిల్లార గీతాలు, అలా ఒక దాని తరువాత ఒకటి మురళీనాదంలా వినపడడానికి ఆ రోజు మాత్రమే జరిగే ప్రాక్టీస్ క్లాసే కారణం. అప్పటికే కొంత వరకు సంగీత ప్రవేశం ఉండడంతో నా మనస్సు కూడా అప్రయత్నంగా శ్రుతి కలుపుతోంది. ఆఫీసు పని ముగియగానే గురువుగారిని వెళ్ళి కలిసాను అతను నా అభిలాష అంతా విని "నేను త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కించెం రద్దీగా ఉన్నాను. ఇలా నువ్వు చేరగానే నేను ఆ పని ఈ పని అని నీకు పాఠం చెప్పకుండా ఉండేందుకు నా మనసు అంగీకరించదు. అందుకని దయచేసి నువ్వు వచ్చే నెల కనపడు" అని చెప్పారు.

నా ఉత్సాహం మీద నీళ్ళు జల్లినట్లయింది. మళ్ళీ నెల ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడడమే అయింది. సరిగ్గా మళ్ళీ నెల వచ్చింది, నాకు వేరే ఊరికి పోస్టింగ్ వచ్చింది. రెండూ ఒకేసారి జరిగాయి. అంతే మరింత దూరం అయ్యాను. అలా నాలుగు నెలలు గడిచాయి. కాని ప్రాప్తం ఎవరు తప్పించగలరు. అందుకే మళ్ళీ వెళ్ళి కలిసాను.

"నమస్కారం గురువుగారు"

"ఎవరు"

"నేనండి విజయకుమార్ని అని ఇంతకుముందు జనవరిలో ఒకసారి..." అంటూ గుర్తుచేసే ప్రయత్నం చేశాను.

"ఆ అవునయ్యా.. అపుడూ వచ్చేనెల రమ్మన్నాను కదా. ఇప్పుడు వచ్చావేంటి?"

జరిగినదంతా వివరించి నా అభిలాష తెలిపాను. "సరే" అని శ్రుతి కలిపించి మర్నాటి నుంచీ రమ్మనడం జరిగింది.

సాధారణంగా చాలా మంది గురువుల వద్ద చూసాను. అంతకు ముందు ఎంతవరకు నేర్చుకున్నా మళ్ళీ కొత్త గురువు దగ్గర సరళీల నుంచి పాఠం మొదలు పెట్టాల్సిందే. కానీ మా గురువుగారు మాత్రం "నేర్చుకున్నవే ఎన్నాళ్ళు నేర్చుకుంటావయ్యా..... కొత్తవి నేర్చుకో" అంటూ ప్రోత్సహించారు.

ఒకరోజు ఒక చోట కచేరి. ఎప్పుడూ కచేరి సమయానికి పావుగంట ముందరే ఉంటారు అంతే కానీ కచేరీ చేసే పాటగాణ్ణి నేనేకదా అని ఆలస్యంగా వెళ్ళడం ఎరుగరు. కానీ ఆ రోజు మృదంగం వయొలిన్ సహకార వాయిద్యాలు ఇంకా రాలేదు. సాధారణంగా పక్క వాయిద్యాలు వచ్చే దాక కచేరి ఎవరూ మొదలుపెట్టరు. కానీ ఇక్కడ విషయం ఏమిటంటే "శ్రుతి బాక్స్ ఉండనే ఉంది. లయకి మనచేతులు ఉన్నాయి. ఇక కచేరీ ఆగడమెందుకు?" అని సమయానికే మొదలెట్టేసారు. ఇలాంటి క్రమశిక్షణ పాఠాలకి ఎన్నిటికో మాకు రోల్‌మోడల్.

ప్రతి సంవత్సరం తమ విద్యార్థులనే కాక నేను వస్తాను, నాకూ రావాలని ఉంది అన్న ప్రతి ఒక్కరిని తిరవయ్యార్ త్యాగరాజ స్వామి ఆలయం సందర్శన బాధ్యత నెత్తిమీద వేసుకుంటారు.

గంటకి ఇంత! పాఠానికి ఎంత! అని లెక్కల్లో 'సరిగమలు' 'సరిసరి' అనిపించే ఈ వ్యాపార ధోరణి ప్రపంచంలో మా గురువు అలా కాదు అని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. తను నేర్పాలనుకున్న పాఠానికి రోజుకి 24 గంటలు కాదు ఆ పాఠం వచ్చేవరకు, ఆ సంగతి పలికే వరకు సూర్యుడు అస్తమించడు. చంద్రుడు ఉదయించడు. అలాగే తాళ క్రమం గతిలో పడేవరకు మా చేతులకి, ఆ సంగీత స్వర ఝరికి తాళమే ఉండదు.

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు కావడంతో చదువుతో పాటు సంస్కారంకి కూడా పెద్ద పీట వేస్తారు గురువుగారు. 1953లో ఆకాశవాణి విజయవాడలో మరియు 1958 నుంచి ఆకాశవాణి హైదరాబాద్‌లలో కర్ణాటక సంగీత కళాకారులుగా పేరొందిన **శ్రీకొండపల్లి సీతారామాంజనేయ బాలకృష్ణశాస్త్రి** (మా గురువుగారు). మచిలీపట్నం వాస్తవ్యులైన శ్రీ కొండపల్లి సీతారామ ఆంజనేయులు మరియు కొండపల్లి కామేశ్వరశర్మ దంపతుల కుమారుడు. గురుకుల పద్ధతిలో "బ్రహ్మశ్రీ వేదమూర్తులైన హరినాగభూషణం"గారి వద్ద ఒక దశాబ్ద కాలంపాటు సంగీతాభ్యాసం సాగించిన గ్తరువాత "శ్రీ మంగళంపల్లి బాలమురళి కృష్ణ"గారి బాణీకి ఆకర్షితులై ప్రధమ గురువుగారి అనుమతితో ఆయన వద్ద ఒక విశన్తి కాలంగా ఆయన అనుగ్రహం పొంది అతన్నే గురువుగా ఆరాధిస్తూ సంగీత క్షేతాన్ని సస్య శ్యామలం చేసే ప్రక్రియలో ప్రధమ విత్తుగా నిలిచిన ప్రశస్తుడు అని చెప్పవచ్చు.

అంతేకాదు ప్రతి సంవత్సరం "సప్తస్వర" వేదికగా చేసుకుని జరిపే త్యాగరాజ ఆరాధనోత్సవాలని, లేదా ఏదైనా సందర్భాన్ని పురస్కరించుకుని జరిపే కార్యక్రమాలలో తను ఎప్పుడూ పాడాలనుకోరు. మీరు పాడాలి ఎన్నాళ్ళు ఇలా తెర వెనకాలే ఉంటారు అంటూ ఔత్సాహికులకి, యువ కళాకారులకి అవకాశం ఇచ్చి పెద్ద పీట వేస్తారు. కానీ అదే తను తన గురువు దగ్గర విద్యాభ్యాసం సమయంలో మాత్రం మైక్ పెట్టుకు పాడవయ్యా అని వాళ్ళ గురువుగారు అంటే "వద్దు గురువుగారు మైక్ పెట్టుకుంటే ప్రదర్శన మీదకి మనసు పోతుంది మీ బాణీపై మనసు ఉండదు" అని

మనసంతా కూడా విద్య మీద లగ్నం చేసేవారు. అంతేకాదు తమ ఆదాయంలో ఇంచుమించు అంతా సంగీత సేవకి వినియోగిస్తూ తను అధ్యక్షుడై ఉన్న "సప్తస్వర" అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

అందుకే భాగ్యనగర వాసులంతా ఈ 'మహోన్నత శిఖరానికి, ఈ ఉత్తుంగ తరంగానికి' దేనితో కొలవాలో అన్న సందిగ్ధంతో
"స ప స"లే సరి అనిపించి "స - సంగీత, ప - ప్రచార, స - సేవకా రత్న" అనే బిరుదుతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. గురువుగారిని అదే "స ప స"లకి నిర్వచనం అడిగితే స - సర్వం, ప - ప్రతిక్షణం, స - సంగీతం అంటారు. కానీ మా శిష్య వర్గాన్ని అడిగితే స - సంగీత లోక, ప - ప్రాగ్దశ్చిమాల, స - సార్వభౌముడు అంటాం.

స్వయానా బాల మురళిగారే తన స్వదస్తూరితో 'ఆత్మీయ అంతేయవాసి' అని ప్రశంసిస్తే ఎన్నో కోట్ల విలువగల ఆస్తి దక్కించుకున్న పేదవాడిలా ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవడం ఆయనకి గురువుపట్ల ఉన్న అంకిత భావానికి సూచన. అదే సంస్కారం అదే నిబద్ధత తను తమ విద్యార్థులందరి విషయంలో పాటిస్తారు.

శ్రీ శ్రీ ఇంకా ఈ నేలపై ఉంటే సాహితి క్షేత్రం ఇంకెంతగా సస్యశ్యామలం అయ్యుండేదో అని చలంగారు అన్నమాటలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి అంటాన్నేను. అందుకే ఇటువంటి 'మా మంచి మాస్టారు' పంచభూతాలున్నంతవరకు ఆయురారోగ్యాలతో ఉండి సంగీత క్షేత్రాన్ని సస్యశ్యామలం చేయాలన్నది మా కోరిక ఎందుకంటే "యది దైవాత్ ఫలం నాస్తి ఛాయా కేన నివర్యతే" కదా!.



# ఆచార్య దేవోభవ!!!

- నాగళ్ళ సుధ

**ఆచార్య దేవోభవ!!!** గురువు, మాస్టారు, టీచర్...... పేర్లు ఎన్నైనా పరమార్ధం ఒక్కటే. ఎప్పుడైనా పాత జ్ఞాపకాల్లోకి వెళితే నేను తలుచుకునేది ఒక్క టీచర్ని కాదు. నాకు విద్యాబుద్దులు, సంస్కారం నేర్పిన ఎందరో మహానుభావుల్ని.

మొట్టమొదటిగా తప్పనిసరిగా నేను చెప్పవలసింది శ్రీరామమూర్తి మాస్టారు గారి గురించి. ఎందుకంటే నాకు అ, ఆలు A B C D లు చెయ్యి పట్టి దిద్దించింది ఆయనే. 1972లో నాకు నాలుగు సంవత్సరాల వయస్సులో మాస్టారుగారు రేపల్లెలో మా ప్రక్క ఇంట్లో అద్దెకి ఉండేవారు. అప్పటికి ఆయనకి ఒక కూతురు, నా కన్నా సంవత్సరం పెద్దది. నన్ను వీధి చివరన ఉన్న ప్రకాశం మున్సిపల్ జూనియర్ బేసిక్ స్కూలులో జాయిన్ చెయ్యాలంటే అయిదు సంవత్సరాలు ఉండాలి కాబట్టి మాస్టారు నా వయస్సు ఎక్కువ వేసి జాయిన్ చేశారు. ఎప్పుడూ తెల్లని చొక్కా, పంచె కట్టుకుని ఉంగరాల జుట్టుతో గంభీరంగా ఉండేవారు. ఇంటి ప్రక్కనే ఉంటున్నా, ఆయన భార్యతో ఎంత చనువున్నా కూడా ఆయనంటే ఎంతో భయం వేసేది. నన్ను ఎప్పుడూ కోప్పడేవారు కాదు. కానీ మా అన్నయ్యని కానీ వేరే మగపిల్లలని కానీ 'రేయ్' అని గట్టిగా కేకవేస్తే నేను భయపడి పోయేదాన్ని. అంత స్ట్రిక్ట్‌గా కనిపించేవారు ఆయన. అలా ఆ స్కూలులో మాస్టారి గారి ఆధ్వర్యంలో ఆడుతూ పాడుతూ అయిదవ తరగతి పూర్తి చేశాను.

ఈ కాలక్రమంలో మాస్టారుగారికి మరో ముగ్గురు కూతుళ్ళు పుట్టారు. మాస్టారికి మగపిల్లవాడు కావాలని ఉండేదని ఆయన భార్య ద్వారా అమ్మకి, అమ్మ ద్వారా మాకు తెలిసింది. అప్పుడు తెలిసింది ఆర్ధికభారం అయినా ఆయన నలుగురు ఆడపిల్లల్ని ఎందుకు కన్నారో. మాస్టారుగారు నేర్పింది అక్షరాలు, పదాలే కావచ్చు కానీ అవే నా భవిష్యత్తుకి పునాది రాళ్ళని ఘంటాపధంగా చెప్పగలను.

శ్రీరామ్మూర్తి మాస్టారు గారు మాతో సుమతీ శతకం, వేమన శతకం వల్లె వేయించేవారు, సాయంత్రం ప్రైవేట్ క్లాసులో. మమ్మల్ని ప్రైవేట్‌కి పంపటం అవసరం లేకపోయినా వాళ్ళకి కొంచెం ఆర్ధికంగా సాయం చేసినట్లు ఉంటుందని అమ్మ నన్ను, మా అన్నయ్యని మాస్టారుగారి దగ్గరకు పంపేది. మా ఇంటి పక్కనుంచి అదే వీధిలో వేరే ఇంటికి మారినా వాళ్ళ అమ్మాయితో ఆడుకోవటానికి వెళుతూ ఉండటం వల్ల మాస్టారుగారి కుటుంబంతో అనుబంధం నేను పదవ తరగతి పూర్తి చేసేవరకూ కొనసాగింది.

కాలక్రమేణా వాళ్ళు ఇల్లు మారుతూ ఉండటం, నేను వేరే ఊరు హాస్టల్‌కి వెళ్ళటంతో వాళ్ళ విషయాలు అమ్మ ద్వారా తెలుస్తూ ఉండేవి. ఖచ్చితంగా మాస్టారు గారు ఏ సంవత్సరంలో పోయారో గుర్తు లేదు కానీ సర్వీసులో ఉండగానే పోవటం వల్ల ఆయన ఉద్యోగం వాళ్ళ మూడో కూతురికి వచ్చినట్లు తెలిసింది. శ్రీరామ్మూర్తి మాస్టారుగారిని నేను ఎప్పటికీ మరిచిపోలేను.

ఆ తరువాత నేను చెప్పవలసింది ఉదయభాస్కర్ టీచర్‌గారి గురించి. ఆవిడ మాకు టీచ్ చేసింది పదవ తరగతి ఇంగ్లీష్ ఒక్కటే అయినా ఆవిడతో నా అనుబంధం అయిదు సంవత్సరాలు. ఎలాగంటే - నేను రేపల్లెలోని భగవాన్ శ్రీ సత్యసాయి హైస్కూలులో ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివాను. స్కూలులో పుట్టపర్తి సాయిబాబా మా దైవం. ఉదయం టీచర్లు అందరినీ 'సాయిరాం టీచర్' అని గ్రీట్ చేసేవాళ్ళం. ప్రతి గురువారం సాయంత్రం స్కూల్ వదలబోయే గంట ముందు మోరల్ క్లాస్ ఉండేది. మేమందరం మళ్ళీ గురువారం ఎప్పుడు వస్తుందా అని శుక్రవారం నుంచే ఎదురుచూడటం మొదలు పెట్టేవాళ్ళం, ఎందుకంటే ఉదయభాస్కర్ టీచర్ మాకు మోరల్ క్లాసులో నీతికథలు చెప్పేవారు. అవి ఎంతో వినసొంపుగా చెప్పేవారు. 300 వందల మందికి పైగా ఉన్న మేము ఓపెన్ గ్రౌండ్‌లో మైకు లేకుండా కూడా ఆవిడ కథ వినగలిగే వాళ్ళం అంటే ఆ కథలు మమ్మల్ని ఎంత ఆకట్టుకున్నాయో మీరు ఊహించగలరు. అంత స్వచ్ఛంగా, ఆకట్టుకునేలా చెప్పేవారు ఆవిడ.

ఆ నీతి కథల ప్రహసనం మెల్లగా రామాయణం చెప్పటంగా రూపాంతరం చెందింది. నేను పదవ తరగతి అయిపోయి బయటకి వచ్చేసరికి రామాయణ కథనం కొనసాగుతూనే ఉంది. నాకు హైస్కూలు గుర్తు వస్తే మొట్టమొదట గుర్తువచ్చేది మా ఉదయ భాస్కర్ టీచరే. ఆవిడ ఇంగ్లీష్ టీచర్ కన్నా కూడా నీతి కథలు చెప్పే టీచర్ గానే గుర్తుండిపోయారు. అలా అని ఆవిడ సబ్జెక్ట్ మీద ఏ మాత్రం అశ్రద్ధ చూపేవారు కాదు. ఎలాగంటే.....

ఉదయ భాస్కర్ టీచర్‌గారు మా స్కూల్ కరస్పాండెంట్ గోపాలరావుగారి భార్య. వాళ్ళ ఇంటి దగ్గరలోనే వాళ్ళకి హైస్కూల్ కాక ఒక కాన్వెంట్ ఉండేది. మేము పదవ తరగతిలో ఉండగా డిసెంబర్ మొదలుకుని మార్చిలో పరీక్షలు అయ్యేవరకు మాకు స్పెషల్ క్లాసులు ఉండేవి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి పదిగంటలవరకు ఈ కాన్వెంటులో పర్యవేక్షణ అంతా ఉదయభాస్కర్ టీచర్ గారిదే రాత్రి పదిగంటలకి ఇంటికి వెళ్ళలేని వారికి అక్కడే




పడుకునే వాళ్ళం. ఎందుకంటే ఇక్కడే ఉంటే ఉదయం 5 గంటలకే చదువుకోవడానికి టీచరుగారు లేపేవారు. 5 గంటలనుంచి 6 గంటలవరకు చదువుకుని అప్పుడు ఇళ్ళకు వెళ్ళేవాళ్ళం. నిజంగా ఆవిడ స్కూల్ కోసం, మాకోసం చేసిన నిస్వార్థ సేవ మరిచిపోలేనిది. వాళ్ళ అమ్మాయి సాయిలత మెడిసిన్, అబ్బాయి గిరిధర్ ఎం.బి.ఎ చేశారని తెలిసింది. స్కూలు వదిలేసిన తరువాత టీచర్‌గారిని ఒకటి రెండు సార్లు మాత్రం కలవగలిగే అవకాశం వచ్చింది నాకు.

నేను భీమ్లిలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్ బ్రాంచ్ లో జాయిన్ అయినప్పుడు ఆ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్యామ సుందరరాజుగారే మా హాస్టల్ వార్డెన్‌గా ఉండేవారు. ఆయన మా అమ్మాయిలందరికీ తండ్రిలాగే వ్యవహరించేవారు. కాలేజ్ అవర్స్ అయిపోయాక మమ్మల్ని షాపింగ్ కి తీసుకెళ్ళినా, సినిమాకి తీసుకెళ్ళినా, బీచ్‌కి తీసుకెళ్ళినా ఎల్లప్పుడూ మా వెంటే ఉండి మా సేఫ్టీ గురించే ఆలోచించేవారు. హోం సిక్‌తో ఏడుస్తున్న అమ్మాయిలకి జోక్స్ చెప్పి నవ్వించేవారు. తను అంతకు ముందు పనిచేసిన కాలేజ్‌లో విషయాలు చెప్పి మమ్మల్ని ఎంకరేజ్ చేసేవారు.




తరువాత ఆయన వ్యక్తిగత కారణాల వలన హాస్టల్ వార్డెన్‌గా విరమించుకున్నప్పుడు మేమందరం ఎంత బాధపడ్డామో నాకిప్పటికీ కళ్ళకి కట్టినట్లుగానే ఉంది. కాకపోతే వెంటనే రత్నకుమారి టీచర్ ఆయన బాధ్యతల్ని చేపట్టి అతి తక్కువ సమయంలోనే మమ్మల్నందరినీ మళ్ళీ నవ్వించగలిగారు. ఆవిడ వయస్సులో మాకంటే నాలుగైదు సంవత్సరాలు పెద్ద అంతే. అందుకే మాలో ఒకరిగా కలిసిపోగలిగారు. మాతోపాటే హాస్టల్‌లో ఉంటూ మాతో ఫ్రెండ్‌లా ఉండేవారు. హాస్టల్ దాటి క్లాసులోకి వెళ్ళగానే ఆవిడ లెక్చరర్, మేము స్టూడెంట్స్. మూడు సంవత్సరాలు హాస్టల్లో ఫ్యామిలీస్‌కి దూరంగా ఉన్నాకానీ ఈ ఇద్దరి టీచర్ల వల్ల మేము చదువు మీద దృష్టి పెట్టగలిగాము.

వైజాగ్ లోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో (1989 - 1993) నాకు గుర్తున్న ఒకే ఒక్క లెక్చరర్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ రాజుగారు. ఆయన చాలా సీరియస్‌గా ఉండేవారు కానీ చాలా బాగా టీచ్ చేసేవారు. సబ్జెక్ట్ మీద మంచి కమాండ్ ఉండేది. మా ప్రాజెక్ట్‌కి కూడా ఆయనే గైడ్‌గా ఉండి పూర్తి చేయించారు.



సుధగారు న్యూయర్క్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. భర్తా, కుమార్తెలతో న్యూజెర్సీలో నివాసం.

# మార్గదర్శి... మహాత్ముడు

## - ఆనంద రావ్ పట్నాయక్



ఆంధ్రదేశంలో ప్రతీ మూడోవారి పేరు సుబ్బారావు. కాని మా మాష్టారుగారి పేరులో ఒక విశిష్టత ఉంది. మాచ్చేటి సుబ్బారావు, ఎం.ఎ.బి.ఇడి. స్టేటు అవార్డు విన్నర్. నిగర్వి. నిష్టాగరిష్టుడు. సాయిబాబా భక్తుడు. ఇలా చెప్పుకుపోతుంటే పేజీలు చాలవు.

నేను జి.సి.డి హైస్కూలు, రాయగడలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రోజులు. రాయగడ ఒరిస్సాలో ఉన్నా మాది బైలింగ్యువల్ హైస్కూలు. మా తెలుగు విద్యార్థులకు తెలుగు మాష్టార్ల కొరత ఉండేది. అప్పుడు సుబ్బారావుగారు ఖాళీగా ఉంటే తాత్కాలికంగా, మాకు తెలుగు, లెక్కలు చెప్పేందుకు నియమితులయ్యారు. అప్పటికాయన బి.ఏ కూడా పాసు కాలేదు. అంతవరకు టీచర్లు మాకు శాడిస్టులుగా కనిపించేవారు. ఒక టీచరు డస్టరుతో మునివేళ్ళ మీద కొడితే, మరో మాష్టారు బొడ్డు పట్టుకుని పిండేసేవాడు. ఎర్రని మిడిగుడ్లతో మరో సారుని చూసి దడుచుకునేవాళ్ళం. అప్పుడు ప్రవేశించారు సుబ్బారావు మాస్టారుగారు. పెదాల మీద చెదరని చిరునవ్వు, తెల్లని దుస్తులతో దివి నుండి భువికి దిగివచ్చే దేవదూతలా ఉండేవారు.

మాట మధురం
మనసు మధురాతి మధురం
మంచిని పెంచిన మనీషి
చదువుని చదువులా కాకుండ
ఆటలా, పాటలా ఆలాపించిన తపస్వి
అతని పేరే సుబ్బారావు
విన్నంతనే కష్టాలు రావు.

తెలుగు పిల్లలకు తెలుగు పాఠ్యపుస్తకాలుండేవి కావు. ఎవరో, ఎక్కడో ఒరియా పుస్తకాలను అనువదించి చెప్పిన నోట్సు తప్ప మరో ఆధారం ఉండేది కాదు. మెట్రిక్కు పరీక్షలో ప్రశ్నాపత్రాలు ఇంగ్లీషులో ఉండడం చేత పిల్లలు వాటిని అర్థం చేసుకుని జవాబులు వ్రాయడం కష్టతరమై ఉండేది. బడిలో తగినంతమంది తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడం,

పాఠ్యపుస్తకాలు తెలుగులో లేకపోవడం, పిల్లలు ఒరియాలో పాఠాలు విని పరీక్షలో తెలుగులో జవాబులు రాయడం ఎంత బాధాకరమైన విషయమో ఆలోచించండి.

నాల్గవ తరగతి నుండి పదకొండవ తరగతి వరకు తెలుగులో రాసి మమ్మల్ని ఆదుకున్నారు మాష్టారుగారు. ఆయన ఉపాధ్యాయ జీవితంలో ఇంట్లో ప్రవేటు ట్యూషన్స్ ఎప్పుడూ చెప్పలేదు.

మరోభారతాన్ని ఆంధ్రీకరించడానికి పూనుకున్న నన్నయ్య కొన్ని పర్వాలు మాత్రమే రాసి విరమించుకున్నాడు. మిగిలిన పర్వాలను తిక్కన తెనిగిస్తూ నిష్క్రమించాడు. అసంపూర్ణంగా మిగిలిన పర్వాల్ని ఎఱ్ఱన అనువదించి తెలుగు ప్రజలకు మహోకారం చేసాడు. సుబ్బారావు మాష్టారిని ఆధునిక ఎఱ్ఱన ఎందుకన కూడదు?

ఉద్యోగంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురుకొన్న ధీశాలి మా మాష్టారుగారు. మొదటిగా లోకల్ హైస్కూలులో టీచరుగా ఉండి ప్రవేటు యాజమాన్యం నియంతృత్వాన్ని సహిస్తూ వచ్చారు. ఆ తర్వాత మున్సిపల్ హైస్కూలులో హెడ్మాస్టారుగా చేరి అస్తవ్యస్తంగా ఉన్న స్కూలుని ఒక కొలిక్కి తెచ్చారు. అదే టైంలో ఆయన కొడుక్కి భయంకరమైన రక్త స్రావ వ్యాధి (Nose Bleeding), వచ్చింది దానికోసం ఆయన తిరగని ఊరులేదు. ట్రీటుమెంటుకి డబ్బు ఖర్చు. ఇక ఇంట్లో పెద్దకొడుకుగా ఉమ్మడికుటుంబంలో ఎన్నో ఇబ్బందులు. ఇలా శారీరకంగా మానసికంగా, ఆర్థికంగా కుంగిపోయిన మాష్టారు మేరుపర్వతంలా ధైర్యంగా ఉండేవారు. ఆయన కొడుకు పోయాడు.

దేవుణ్ణి నమ్మారు. బాబాని ఆశ్రయించారు. చివరికి ఏమయింది మాష్టారు అంటే ఆయన చెప్పిన మాట ఇప్పటికీ నా మదిలో మెదులుతుంది. గురుతుల్యుడిగా శ్రేయోభిలాషిగా ప్రేమించే గురువుగారి భార్యను పాము కాటు వేస్తే విలవిల్లాడిపోయిన తన గురువుగారి బాధను చూసి 'ప్రభూ! నా కుమారుడుని తీసుకుపోయి మా గురుపత్నిని బ్రతికించుమా అని ప్రార్థించారు. గురుపత్ని బ్రతికి బట్టకట్టడం, మాష్టారిగారి బాబు బలయిపోవడం' జరిగిందట. ఆయన్ని ఆధునిక బాబరు అని ఎందుకనకూడదు!

ఈనాడు నాలాంటి ప్రవాసాంధ్రులు తెలుగు మాట్లాడుతున్నాం, తెలుగు రాయగలుగుతున్నాం అంటే అది ఆయన పెట్టిన బిక్ష. తెలుగు భాష మధురాతి మధురమైనదని, ఆ భాషలో అవధానాలు, సామెతలు, పొడుపు కథలులాంటివి ఉన్నాయని మొట్టమొదటిసారి భాషాసొబగులు కళ్ళకుకట్టినట్లు వివరించిన మా మంచి మాష్టారు సుబ్బారావు.

ఆయన మితాహారి. కనీసం ఉల్లి, వెల్లుల్లి కూడా తినని శుద్ధ శాకాహారి. పొగాకు, మద్యానికి బహుదూరం. అందుకే ఆయన మాకు మార్గదర్శి. ఆయనకు వచ్చిన జబ్బు లివర్‌నిరోసిస్ అంటే తాగుబోతులకు రావల్సినది రావడం విచిత్రంగా లేదూ! 19.08.08 నాడు ఆయన స్వర్గస్తులయ్యారు. ఆయన పార్థివ శరీరం చూడ్డానికి నాకు అదృష్టం లేక పోయింది. అప్పుడు నేను అమెరికాలో ఉన్నాను. విదేశాలకు వెళ్ళేముందు మాష్టారు, ఆయన ధర్మపత్నికి పాదాభివందనం చేసి దీవనలు తీసుకోవడం నాకు ఇప్పటికీ గుర్తు. మాష్టారు గారి భార్య లీలావతి భర్తకు తగ్గ భార్య. మాష్టారుగారి విజయానికి వెనకనున్న స్త్రీమూర్తి ఆమే అంటే అతిశయోక్తికాదు.

చివరిగా ఒక మాట. ప్రముఖ దినపత్రికలో స్ట్రింగరుగా పనిచేస్తున్న ఒక విలేఖరి అవినీతి కారణంగా తొలిగించబడ్డాడు. తినడానికి తిండిలేక భార్యాబిడ్డలతో మలమల మాడిపోతున్న అతను మాష్టారి దగ్గరకు వెళ్ళి బతుకు తెరువు చూపెట్టమన్నాడు. అంతటి లేమిలో కూడా మాష్టారుగారు అతనికి నెలనెలా డబ్బిచ్చి అతను నిర్వహించే చీటి

పాటకు ఆదుకున్నారు. గడువు ముగిసినా మాష్టారు డబ్బుని మాజీ విలేఖరి ఇవ్వలేదు సరికదా నేనేమీ అతనికి బాకీలేను అన్నాడు. అయినా మాష్టారు ఉదారహృదయంతో క్షమించారు. మా ఊరి జీసస్ క్రైస్ట్ అని ఎందుకు పిలవకూడదూ!

మేం నెలకొల్పిన సాహితీ సాంస్కృతిక సంస్థ స్పందనలో ఉపాధ్యాక్షుడిగా ఉండి తగిన సలహాలిచ్చి మమ్మల్ని ప్రోత్సహించే నాయకుడు ఆయన. కానీ సాహితీవనంలో వేరుపురుగులున్నాయి జాగ్రత్త నాయనా అని హెచ్చరించేవారు. జీవన సాగరంలో మనసా, వాచా, కర్మణా తను నమ్మిన మార్గంలో పయనించిన నావికుడాయన.

# ఆరి సీతారామయ్య

*"నువ్వు మాంసం తినకపోవటానికి కారణం మతసంబంధమైన నమ్మకాలా ?"*

*రెస్టారెంట్ కెళ్ళినప్పుడు అమెరికన్ మిత్రులు అడిగే ప్రశ్న ఇది.*

*నాకు ఓపిక ఉంటే అసలు సంగతి చెపుతాను. లేకపోతే, "అవును," అంటాను.*

*ఒక్కోసారి "అవును," మాటే సరిపోదు.*

"మరి మా ఆఫీసులో పనిచేసే పటేల్ బర్గర్లు తింటాడే, అతను హిందూ కాదా? లేక అతనూ నువ్వూ వేరే వేరే కాస్టా?"

ఈ ప్రశ్న మీదేశం గురించి నా క్కూడా కొద్దో గొప్పో తెలుసులే అని చెప్పటానికి వేసే ప్రశ్న. ఇక దీని ముగింపు గురించి రాయాలంటే అది ఇంకొక పెద్ద కథ అవుతుంది. ఓపిక ఉంటే అసలు సంగతి చెపుతానన్నాను కదా. దాని విషయం చెపుతాను.

మా స్వగ్రామం తిమ్మనపాలెం. ప్రకాశం జిల్లాలో ఒంగోలు నుంచి గుంటూరు పోయే రహదారి మీద ఒంగోలుకు పదమూడు మైళ్ళు ఉత్తరంగా ఉంటుంది. నేను చదువుకున్న రోజుల్లో అది చిన్న గ్రామం. బహుశా అంతా కలిసి వంద కుటుంబాలుండేవేమో. ఊళ్ళో ఎక్కువ భాగం రహదారికి తూర్పు వైపు ఉండేది. ఊళ్ళో ఉన్న ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాల రోడ్డుకు పడమటి వైపున ఉన్న ఇళ్ళ వెనక ఉండేది. తూర్పు వైపు ఇళ్ళలో పిల్లలు బడికెళ్ళాలంటే రోడ్డు దాటి వెళ్ళాలి. పెద్ద వాళ్ళకు అదొక భయం. రోడ్డు మీద ఎప్పుడూ లారీలు చాలా వేగంగా పోతుండేవి.

బడికి వెళ్ళడం, సాయంత్రం బడివెనక చింత తోపులో చెడుగుడూ, బిళ్ళంగోడూ, ఉప్పాటా ఆడుకోవటం - ఇవి తప్ప పిల్లలకు మరో వ్యాపకం ఉండేది కాదు. బడి రెండు నిట్టాళ్ళ పూరి గుడిసె. దాని

ముందు నీళ్ళబావి. చాలా ఖాళీస్థలం ఉండేది. అందులో రకరకాల పూల మొక్కలుండేవి. బడి పక్కనే తమ్మవరపు వెంకటరమణయ్య పంతులుగారి ఇల్లు. అసలు బడి ఆయన స్థలమేనని, దాన్ని స్కూలుగా మార్చి పిల్లలకు చదువుచెపుతున్నాడనీ చెప్పుకునేవారు.

ఉదయం ప్రార్థనతో మొదలయ్యేది బడి. అందరం బడి ముందు వరసగా నుంచునే వాళ్ళం. తల్లీ నిన్ను దలంచి, శుక్లాంబరధరం పాడేవాళ్ళం. ఇంకా ఏమైనా పాడేవాళ్ళమేమో గుర్తులేదు. తర్వాత లోపలికెళ్ళటం ఎవరి స్థలంలో వాళ్ళు కూర్చునేవాళ్ళం. బల్లలూ కుర్చీలు ఉండేవి కాదు. ఒక్కో తరగతి వాళ్ళం ఒక గుంపుగా కూర్చునేవాళ్ళం. ఇక ఏం చదువుకున్నామో గుర్తులేదు. పలకల మీద అ,ఆ,లు నేర్చుకోవటం గుర్తుంది. గుణింతాలు నేర్చుకోవటం గుర్తుంది. మిగతా చదువు గురించి అంతగా గుర్తులేదు. కాకపోతే పద్యాలు చదవటం, అప్పచెప్పటం మాత్రం బాగా గుర్తుంది. సుమతీ శతకం, వేమన శతకం పద్యాలు అప్పచెప్పేవాళ్ళం. రుక్మిణీ కళ్యాణం మొదటి నుంచి చివరిదాకా అప్పచెప్పాం. ఘనుడా భూసురుడేగెనో, నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో, విని కృష్ణుండది తప్పుగా దలచెనో - చదువుతుంటే రుక్మిణి కళ్ళముందే కనిపించేది. పాపం, అమ్మాయికి ఎంత కష్టం అనిపించేది. అలా అనిపించటానికి కారణం రమణయ్య పంతులుగారు ఈ పద్యాలగురించి వివరంగా చెప్పిన విధానం. ఆయన రుక్మిణీ కళ్యాణం గురించి పాఠం చెపుతుంటే, నోళ్ళు తెరుచుకుని వింటుండేవాళ్ళం పిల్లలం అందరం.

ఉన్న ఐదు తరగతులూ ఒకే గదిలో ఉండటం వల్ల పంతులుగారు ఈ వైపున ఉంటే ఆ వైపు పిల్లలు పెద్దగా మాట్లాడుకోవటం, "ఒరేయ్, అల్లరి చెయ్యకండ్రా," అంటూ పంతులుగారు ఆ వైపు వెళ్ళటం, ఇక ఈ వైపు పిల్లలు మాటల్లో పడటం - ఇలా పాపం అటూ ఇటూ తిరుగుతుండేవాడు పంతులుగారు. కానీ ఎప్పుడూ ఎవర్నీ తిట్టటం కొట్టటం నేను చూళ్ళేదు. మహా అయితే అల్లరి చెయ్యటం ఆపకపోతే అందరిచేతా గోడకుర్చీ వేయిస్తానని బెదిరించేవాడు.

సాయంత్రం బడి గంట కొట్టగానే, బడి ముందున్న మొక్కలకు నీళ్ళు పొయ్యటం మొదలయేది. బడి ముందే నీళ్ళ బావి ఉండేది. చేంతాడు - బక్కెట్‌తో నీళ్ళు తోడటం కొందరి బాధ్యత, నీళ్ళను కుండల్లో పొయ్యటం కొందరు, కుండలతో మొక్కలకు నీళ్ళు పొయ్యటం - మా బాధ్యతలను ఇలా పంచేవాడు పంతులుగారు. ఒక జట్టు అయింతర్వాత మరొక జట్టు పనిలోకి దిగేది. చేంతాడుతో నీళ్ళు తోడేటప్పుడు, బావి చుట్టూ నీళ్ళు పడి బురద బురదగా అయ్యేది. తాడు బురదలో పడితే జారిపోతూ నీళ్ళు తోడటం కష్టం అవుతుంది. అందువల్ల నీళ్ళు తోడేవాడికి పక్కగా నిలుచుని, తాడు బురదలో పడకుండా చుడుతూ పట్టుకోవటానికి ఒకడు కావాలి. మా జట్టులో ఆ పని నేను చేసేవాడిని. వీడు సోమరి అనేవాళ్ళు మా జట్టు వాళ్ళు.

నీళ్ళు పొయ్యటం అయింతర్వాత, ఎవరికి ఇష్టమైన ఆటలు వాళ్ళు ఆడుకునేవారు. నాకు ఆడపిల్లలతో గవ్వలాట ఆడటం బాగా ఇష్టంగా ఉండేది, చింత తోపులో చెడుగుడు, ఉప్పాట కూడా ఆడేవాళ్ళం.

బడి పక్కనే రమణయ్య పంతులుగారి ఇల్లుండేది. ఇంటి ముందు రెండు వైపులా అరుగులుండేవి. ఒక అరుగుమీద ఒక పక్కన పెద్ద చెక్కపెట్టె ఉండేది. దాన్లో చిందరవందరగా పడేసిన పుస్తకాలుండేవి.


ఇష్టమొచ్చిన పుస్తకం ఎవరైనా తీసుకోవచ్చు. ఏం పుస్తకాలుండేవో గుర్తులేదుగాని, చందమామ, బాలమిత్ర మాత్రం గుర్తే.

రాత్రి భోజనాలయింతర్వాత ఊరి జనం రమణయ్య పంతులు గారి ఇంటికి చేరేవారు. ఆయన ఇంటి ముందు అరుగు మీద కూర్చుని భాగవతమో, రామాయణమో చదివి వినిపించి, అర్థం చెప్పేవాడు. ఓపిక ఉన్నంతసేపు కూర్చుని, నిద్రవచ్చిన వాళ్ళు లేచిపోతుండేవారు.

ఆ రోజుల్లో దసరా పండగ అంటే పిల్లలందరికీ బాగా హుషారుగా ఉండేది. ఏదో ఒక తరగతి పిల్లలను తీసుకుని పంతులుగారు ఊళ్ళోకి వెళ్ళేవారు. ఎవరి ఇంటికి వెళ్ళినా పంతులుగారిని చూడగానే సాదరంగా ఆహ్వానించి, మంచం వేసి, కూర్చోమనేవారు. పంతులుగారు కూర్చోగానే మేమందరం దసరా పాట పాడేవాళ్ళం. పాట అంతా గుర్తులేదుకాని, "అయ్యవారికి చాలు ఐదు వరహాలూ, పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు, "మాత్రం గుర్తుంది. అడగటం ఐదు వరహాలే గాని, ఇవ్వటం మాత్రం ఒకటీ రెండు రూపాయలే. పిల్లలకు మాత్రం బెల్లమూ, కందిపప్పో శనగపప్పో పెట్టేవారు. అవి నములుతూ ఇంకొక ఇంటికి వెళ్ళేవాళ్ళం.

ఇప్పుడు ఎలా ఉందో తెలియదుగాని ఆ రోజుల్లో బడి అంటే అమెరికాలోలాగా ఉదయం వెళ్ళటం, మూడు గంటలకు ఇంటికి రావటం కాదు. ఉదయం వెళ్ళేవాళ్ళం, పదీ పదకొండు గంటలకో ఏమో ఇంటి కెళ్ళేవాళ్ళం. మళ్ళా రెండు మూడు గంటలప్పుడు బడికెళ్ళటం, సాయంత్రం ఇంటికి రావటం మధ్యాహ్నం అందరూ ఇంటికెళితే నేను మాత్రం చాలా సార్లు పంతులుగారింటి దగ్గరే ఉండేవాణ్ణి. పంతులుగారికి ఒక కొడుకుండేవాడు. అతనితో నాకు మంచి స్నేహం కుదిరింది. మధ్యాహ్నం పిల్లలందరూ ఇళ్ళకు వెళ్ళింతర్వాత పంతులుగారు ఇంట్లో చాలా సేపు పూజ చేసేవాడు. పూజ అయింతర్వాత ఆయనా, కొడుకూ భోజనం చేసేవారు. నేనుంటే నేను కూడా వాళ్ళతో తినేవాడిని.

నాలుగు సంవత్సరాలు నేను రమణయ్య పంతులుగారి బళ్ళో చదివాను. నన్ను మూడో తరగతి నుంచి అయిదో తరగతిలోకి మార్చాడాయన. అందువల్ల నాలుగు సంవత్సరాల్లో ఐదు తరగతులూ అయిపోయాయి. ఆ నాలుగేళ్ళలో చాలా సమయం నేను పంతులుగారి ఇంట్లోనే గడిపాను. ఆయన ఎప్పుడూ ఇలాంటి పదార్థాలు తినొచ్చు, అలాంటివి తినకూడదూ అని చెప్పలేదు. కాని వాళ్ళింట్లో వాళ్ళు వండుకుని తినే పదార్థాలే నాకూ అలవాటయ్యాయి. మా ఇంట్లో అమ్మ నాకు మాంసం అలవాటు చెయ్యాలని ప్రయత్నం చేసింది. కాని నేనే ఒప్పుకోలేదు. రమణయ్య పంతులుగారు అవి తినరు కాబట్టి అంతే. అంతకంటే పెద్ద కారణం ఏమీ లేదు.



అమెరికాలోని ప్రవాసాంధ్ర రచయితల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపుని పొందిన ఆరి సీతారామయ్య గారు, తక్కువగా వ్రాసినా ఉత్తమ ప్రమాణాలు గల కథలు వ్రాసారు. వీరి కథల్లోని సామాజిక స్పృహ, జీవన విలువల పట్ల స్పష్టమైన దృక్పథం.. కథకుడిగా వీరికి ప్రత్యేక గుర్తింపుని తెచ్చాయి.

# గురుదేవోభ్యోన్నమః

## - భమడిపాటి ఫణిబాబు

నేను 1958 నుండి 1962 దాకా అమలాపురం శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కాలేజ్‌లో చదువుకున్నాను. ఆ రోజుల్లో మాకు విద్య నేర్పిన కొందరు గురువులను ఈ వ్యాసం ద్వారా గుర్తు చేసుకోవడానికి ఈ ప్రయత్నం. వారు నేర్పిన పాఠాలు జీవితంలో ఎంతో ఉపయోగించాయి.

ముందుగా చెప్పవలసింది మా ప్రిన్సిపాల్ - శ్రీ పెద్దాడ రామచంద్రరావుగారు. ఆయన డిగ్రీ క్లాసులన్నింటికీ కలిపి ఇంగ్లీష్ డ్రామా (షేక్స్‌ఫియర్) చెప్పేవారు. మాకు ఆయన ద్వారా నేర్చుకునే అదృష్టం ఎంతో కాలం కలగలేదు - వారు సర్వీస్‌లో ఉండగానే దివంగతులైనారు.

ఇంగ్లీష్‌కి శ్రీ జి. కృష్ణమూర్తిగారు, శ్రీ ఆర్.రామకృష్ణారవుగారు - వారు చెప్పే విధానం చెప్పనలవికాదు. అరటిపండు వలచి చేతులో పెట్టేటట్లుగా ఉండేది. ఆరోజుల్లో వారు చెప్పిన పద్ధతి ఇప్పటికీ మర్చిపోలేదు.

తెలుగులో శ్రీవెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు - ఆయన తెలుగులో పద్యం చదివి తాత్పర్యం చెపితే ఇంక మరిచిపోవడం అనే మాట ఉండదు. క్లాస్‌లో ఎంత పెద్దవాడినైనా సరే "ఏరా" అనే సంభోదించేవారు. ఆయన చేతి చివాట్లు తినడం ఒక వరంగా ఉండేది. ఎవ్వరూ క్లాస్ మానేవారు కాదు.

మాథమేటిక్స్‌కి వస్తే శ్రీ జి.పి.రామేశంగారు - ఆయన దగ్గర నేర్చుకున్నవాళ్ళు ఎవరూ లెఖ్ఖలు అంటే భయపడేవాళ్ళుకాదు. అంత సులభం చేశారు. అలాగే శ్రీ చిదంబరంగారు, అలాగే మా అక్కయ్యగారు కందా భాస్కరంగారు.

ఫిజిక్స్‌కి వస్తే శ్రీ దాసు ఉపేంద్రరావుగారు, డి. రామకోటేశ్వరరావుగారు, కందుకూరి పుండరీకాక్షుడుగారు.

కెమిస్ట్రీకి శ్రీ జి.వి.ఎస్. రామారావుగారు, శ్రీ వెంకట రత్నంగారు. కెమిస్ట్రీ ఇంత సులభమా అనిపించేలాగ చెప్పేవారు.

ఇవి కాకుండా జనరల్ ఎడ్యుకేషన్ అని ఉండేది - హిస్టరీ, పోలిటిక్స్, ఎకనామిక్స్ - శ్రీ శ్రీరామశర్మగారు హిస్టరీ, శ్రీ వేణుగోపాల్ గారు సివిక్స్, శ్రీ పేరి శాస్త్రిగారు ఎకనామిక్స్ చెప్పేవారు. శ్రీ జి.వెంకటేశ్వర్లుగారు వరల్డ్ హిస్టరీ చెప్పేవారు.

వీరే కాఉండా, శ్రీ వక్కలంక లక్ష్మీపతి రావుగారు, శ్రీ జి.వి కృష్ణారావుగారు, శ్రీ పారుపూడి వెంకట్రావు గారు, ఆయన సిస్టర్ వెంకటరత్నం గారు, శ్రీ బాలాంత్రపు శ్యామలరావుగారు, శ్రీ పి.డి.విల్సన్‌గారు.

పైన పేర్కొన్న వారందరూ కూడా చదువు నేర్పడం ఒక యజ్ఞంలా నిర్వహించేవారు, అంటే ఏదో అందరినీ శ్రమ పెట్టడం కాదు. చదువు మీద ధ్యాస ఉండేటట్లుగా చెయ్యడం అన్నమాట. వాతావరణం కూడా చాలా ప్రశాంతంగా ఉండేది. ఈనాడు ఉన్నట్లుగా కాలుష్యం ఉండేది కాదు. పిల్లలలో ఒక క్రమశిక్షణ, నేర్చుకోవాలనే తపన ఉండేది.

ఆ రోజులు గుర్తుచేసుకోవడం మీతో పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారికి పోతన అంటే చాలా అభిమానం. భాగవతం నుంచి అన్ని పద్యాలకు టీకా, తాత్పర్యంతో సహా వీలు ఉన్నప్పుడు చెప్పేవారు. ఆయన క్లాసులోకి రాగానే అందరికీ విపరీతమైన నవ్వు వచ్చేసేది. ఇంకొక తెలుగు మాష్టారు శ్రీ వక్కలంక లక్ష్మీపతిగారికి శ్రీనాధుడు అంటే చాలా ఇష్టం, ఈయన క్లాస్‌లో శ్రీనాధుడి గురించి బ్రెయిన్ వాష్ అయితే, శ్రీవెంపరాల వారి క్లాస్‌లో పోతన గురించి అయ్యేది. వీళ్ళ దెబ్బలాట మూలంగా మాకు మంచి వినోదంగా ఉండేది. శ్రీ సూర్యనారాయణగారు మాకు చుట్టం కూడాను, అంటే మా అమ్మమ్మగారి ద్వారా, ఎప్పుడైనా కాలేజ్‌లో ఏమైనా అల్లరి చేస్తే ఆ సాయంత్రానికి ఇంటికి రిపోర్ట్ వెళ్ళిపోయేది!!

అలాగే లెక్కలకి కందా భాస్కరంగారు వచ్చేవారు అన్నాను కదా ఆవిడ మా అక్కయ్యగారు - అంటే మా పెద్దమ్మగారి కూతురు. అదేకాకుండా మా నాన్నగారు అమలాపురం హైస్కూల్‌కి హెడ్మాస్టర్‌గా ఉండేవారు. దీనివలన నాకు కాలేజ్‌లో ఏమీ పిచ్చి పిచ్చి వేషాలు వేయడానికి వీలుండేది కాదు. పైగా ఊరు చిన్నది అవడం మూలంగా విషయాలు అందరికీ తెలుస్తాయి.


నాకు కొంచెం కాలు నొప్పి అవడం వలన గేమ్స్ దేనిలోనూ పాల్గొనడానికి పర్మిషన్ ఉండేది కాదు. ఎలాగో ఇంట్లో వాళ్ళ కళ్ళు కప్పి క్రికెట్ ఆడేవాడిని.

శ్రీ జి.పి.రామేశంగారు పాఠం (ఆయన జామెంట్రీ, ఎస్ట్రానమీకి వచ్చేవారు) మొదలుపెడితే విరామం ఉండేది కాదు. నాన్ స్టాప్‌గా చెప్పేవారు. ప్రతి మాట తరువాత "మా" అనేవారు. అంటే "టెక్ ఫర్ ఎక్సాంపుల్" అనాలంటే "టేక్ మా ఫర్ మా ఎక్సాంపుల్ మా" అన్నమాట కానీ దీనివలన ఎవరికీ సమస్య ఉండేది కాదు వింటే భారతం వినాలి లేకపోతే రామేశంగారి దగ్గర మేథ్స్ నేర్చుకోవాలి అనేవారు. శ్రీ పెద్దాడ రామచంద్రరావుగారు దిగవంతులైన తరువాత శ్రీ రామేశంగారిని ప్రిన్సిపాల్‌గా చేశారు. అప్పటినుంచీ క్లాసులు తీసుకోవడం తగ్గింది.

ఇంక ఇంగ్లీష్ చెప్పిన శ్రీ ఆర్.ఆర్.కె గారి పద్ధతి చాలా బాగుండేది. దేనికైనా అర్ధం ఆయన డైరెక్ట్‌గా చెప్పేవారు కాదు, మనచేతే చెప్పించడానికి ప్రయత్నం చేసేవారు. దానివలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి - అప్పుడు నేర్చుకున్నవి మళ్ళీ మరచిపోలేదు.

శ్రీరామశర్మగారు నేర్పిన హిస్టరీ అయితే చెప్పఖ్ఖర్లేదు. అదొక కథలాగ చెప్పేవారు. ఆరోజుల్లో హైస్కూల్ చదువులు తెలుగులోనే అయ్యేవి. అయినా హిస్టరీ కాలేజ్‌లో ఇంగ్లీష్‌లో చెప్పినా ఏమీ కష్టం అయేదికాదు. దానికంతా ఆయన చెప్పే పద్ధతిలో ఉండేది. ఎక్కడెక్కడివో విషయాలు చెప్పి పాఠాన్ని చాలా ఆకర్షణీయంగా చెప్పేవారు.

అలాగే శ్రీ రామకోటేశ్వరరావు గారు ఫిజిక్స్, శ్రీవెంకటరత్నగారు చెప్పే కెమిస్ట్రీ వింటే చదువు మీద ఇష్టం ఏర్పడేది. వారు ఏదో చెప్పేసి కోర్స్ పూర్తిచేయడం ధ్యేయంగా కాకుండా, మనకి అర్ధం అయిందా లేదా అని చూసేవారు.అవసరమైతే కాలేజ్ అయిన తరువాత కూడా ఉండి సహాయం చేసేవారు. చదువులు కమర్షియల్ అయిన ఈ రోజులు చూస్తుంటే మేము ఎంత అదృష్టవంతులమో అనిపిస్తుంది. మేము నేర్చుకున్నది, ఈనాటితో చూస్తే చాలా తక్కువ అయి ఉండవచ్చు, కానీ నేర్చుకున్నది ఎప్పటికీ మర్చిపోలేము.



ఫణిబాబు గారు 1963లో పూనాలోని ఆర్డినెన్స్ ఫేక్టరీలో చేరి 2005 సంవత్సరంలో రిటైర్ అయ్యారు. గోదావరి తీరంలో కొంతకాలం ఉండాలనే సదుద్దేశంతో ప్రస్తుతం రాజమండ్రిలో గోదావరి గట్టున ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. తెలుగు అంటే వెర్రి అభిమానం. ఇటీవలే బ్లాగులోకంలో అడుగుపెట్టి అనేకమంది అభిమానులని సంపాదించుకున్నారు.

## చిట్టే సిద్ధ లలిత

**గురుబ్రహ్మ, గురు** విష్ణు, గురుదేవో మహేశ్వరహః అన్నారు మన పెద్దలు. సృష్టి, స్థితి, లయకారకులైన త్రిమూర్తుల దైవత్వాన్ని, గొప్పతనాన్ని... విద్యాబుద్ధులు నేర్పే గురువులో ఆపాదించి గౌరవించమన్నారు.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని గురువును తల్లితండ్రుల సరసన చేర్చి దైవంతో సమానంగా భావించి పూజించమన్నారు.

దేవుడు ఎక్కడో లేడు. ఎక్కడో ఉంటాడనీ వెదకాల్సిన పనీ లేదు. మన కంటికి కనిపించే విధంగా, భూమిపై జన్మించి మనల్ని ప్రేమించి లాలించి, విద్యాబుద్ధులు నేర్పించి పెంచి పెద్ద చేసి, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే తల్లీతండ్రి గురువుల రూపాల్లో ఆ దేవుడు కొలువున్నాడు. అజ్ఞానిగా జన్మించిన శిశువును మనిషిగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల గురువుల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనది. ఎన్నడూ మరువలేనిది ప్రాతఃకాలాన స్మరింపదగినది.



నా ఐదేళ్ళ వయసులో.. మా పెద్దమ్మ గంగమ్మ మంచిరోజు, తిథి, చూసి నాకు తలస్నానం చేయించి, క్రొత్తబట్టలు వేసి క్రొత్త పలక, బలపం నా చేతికి ఇచ్చింది. బొరుగులు, పప్పులు, బెల్లం, చాక్లెట్లు అన్ని తరగతుల పిల్లలకు సరిపడా బ్యాగులో సర్దుకుని, నా చేయి పట్టుకుని నడిపించి బడికి తీసుకుని వచ్చి ఒకటో తరగతిలో కూర్చోబెట్టింది. అక్కడ మొదటి తరగతి టీచరైన కమలమ్మ చేత సరస్వతీదేవి పటానికి పూజ చేయించి సరస్వతీ నమస్తుభ్యం అనే శ్లోకం పాడించి పలకపై అ ఆ లు దిద్దించి అక్షరాభ్యాసం చేయించింది.

పలకా బలపం పట్టుకోవడం రాని వయసులో ఆమె చేయి ఆసరా ఇచ్చి పట్టు నేర్పించి అ ఆలను వరుస క్రమంలో గుండ్రంగా దిద్దించిన టీచరు మా కమలమ్మయ్య. నాకే కాదు.. మా నాన్న, పెద్దమ్మ, అమ్మ, చెల్లెళ్ళు అందరికీ అక్షరాలు దిద్దించిన ఆదిగురువు ఆమే. మా ఊర్లో విద్యార్థులంతా మొదట ఆమె దగ్గర అక్షరాలు నేర్చిన వారే.

ఆమె నేర్పించే పద్యాలు, పాటలు ఇప్పటికీ ప్రతి విద్యార్థి మెదడులో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. మధురమైన స్వరంతో ఆమె రాగయుక్తంగా పాడి పిల్లలకు వినిపించి, నేర్పిస్తుంటే... ఆ దారిన పోయే వాళ్ళు కూడా బడి కిటికీ వద్ద నిలబడి వినసొంపుగా ఉన్న ఆమె గొంతులోని మాధుర్యాన్ని ఆస్వాదించి, పాట (పద్యం) ఆసాంతం విని తరువాత సాగిపోయేవారు.

అలాగే... మా ఊర్లో జరిగే వివాహాది శుభకార్యములకు ప్రతి ఇంటి నుండి తప్పక ఆమెకు ఆహ్వానం అందేది. ఆమెకూడా తప్పకుండా వెళ్ళి సందర్భానికి తగిన పాటలు పాడి వారిని ఆశీర్వదించి వచ్చేది.

మా ఊరి పేరు యర్రగుంట్ల కోట. కుప్తంగా వై.కోట అని అంటారు. ఇప్పటి విద్యార్థులు టీచర్లను ఏమని పిలుస్తున్నారో తెలియదుగానీ అప్పట్లో మేము టీచర్లను అమ్మయ్య, అయ్యవారు అనేవాళ్ళం. ఉపాధ్యాయుల కంటి చూపుకే భయపడి, భక్తి, శ్రద్ధతో విద్య నేర్చుకునేవాళ్ళం.

మా ఊరు పూర్వం రాజులు పరిపాలించిన కోట కాబట్టి వృత్తుల వారీగా విభజింపబడిన, విశాలమయిన వీధులతో ప్రత్యేకంగా ఉండేది. రాజులు కట్టించిన కోటలు పాడుపడిపోయినా... అప్పటి రాజరికం, రాజసం, కళాత్మకత ప్రతివీధిలోనూ... కట్టడం లోనూ ప్రత్యేకంగా కనిపించేవి.

అలాంటి ఊరిలో బజారు వీధి ప్రత్యేకమైంది, ముఖ్యమైంది కూడా. అన్ని అంగళ్ళు, టీ, కొట్లు, టిఫిన్ సెంటర్లు, బస్టాండు మా వీధిలోనే ఉంటాయి. ఆ వీధిలో రాజహంసలా, తెల్లగా, ఠీవిగా ఉన్న రెండంతస్తుల మేడ మాది. అప్పట్లో మూడో, నాలుగో రెండంతస్తులు మేడలు మా ఊర్లో ఉండేవి. కమలమ్మయ్యది మా ప్రక్కనున్న మేడ. (ప్రక్కిల్లు)

ఇక్కడ మాకు (పిల్లలకు) వచ్చిన చిక్కు ఏమంటే.. బడిలో రోజంతా టీచర్ల దగ్గర పాఠాలు విని భయంగా మెలిగి సాయంత్రానికి ఇంటికి వస్తాము.... ఇంట్లోనైనా గట్టిగా అరిచి, అల్లరి చేసి, గారంతో మారాం చేద్దాం అనుకుంటే మా పప్పులు ఉడికేవి కావు.. ప్రక్క ఇంట్లోనే ఉన్న కమలమ్మయ్య ఎక్కడ వింటుందో, ఏమంటుందో, తిడుతుందో, కొడుతుందో అనే భయం మనసులో. కాదు, కూడదు అని చిన్నతనంతో మర్చిపోయి, ఎప్పుడో కాస్త ఏడుపు అందుకున్నామా?... వెంటనే... ప్రక్కింటి గోడ దాటుకుని.. 'ఎవరది...? ఏదో రాగం వినిపిస్తోంది? ' అంటూ ఠంగున ఆమె స్వరం వినిపించేది. అంతే ఎక్కడి పిల్లలు అక్కడే గప్ చుప్. అన్నం తినకుండా మారాం చేసినా, చదవకుండా ఆటలాడినా మా అమ్మ.. 'ఉండు... అమ్మయ్యతో చెపుతా' అంటే చాలు అన్ని పనులూ సైలెంట్‌గా జరిగిపోయేవి.

బడినుండి వచ్చిన పిల్లలు కాళ్ళు చేతులు, మొహం కడుక్కుని, కాస్త ఫలహారం తిని, పుస్తకాల బ్యాగు తీసుకుని ట్యూషన్‌కు బయలుదేరేవాళ్ళు. ఇంకెక్కడికి? ప్రక్కింటికే. మా కమలమ్మయ్యకూ మాకూవున్న అనుబంధం గురుశిష్య సంబంధమే కాక .. ఒకే కుటుంబంలో జీవించే వారి మధ్య ఉన్నటువంటి ప్రేమ. అభిమానం కలిసిన ఆత్మీయ సంబంధం కూడా ఉంది.

ఆమె ఆనాడు నేర్పించిన ఆఆలు, ఎబిసిడిలు, లెక్కలు, ఇంగ్లీషు పునాది పాఠాలు, ఈనాడు ఇలా కువైటు దేశంలో, ఇంగ్లీషు మాట్లాడటానికి, కంప్యూటర్‌లో పని చేయడానికి, సంపాదించడానికి, ఉన్నతంగా ఎదగడానికి

తోడ్పడ్డాయి అనడంలో సందేహం లేదు. తరువాతి కాలంలో ఎంత మంది టీచర్లు ఎన్ని మెరుగులు పెట్టినా, ఎంత జ్ఞానం బోధించినా, పునాది పాఠాలు బలంగా లేకపోతే... విద్యార్థి చదువు బలహీనపడుతుంది కదా! విద్యార్థికి చిన్నతనంలోనే చదువుకోవాలని, బడికివెళ్ళాలనే ఆసక్తి మొదటి తరగతిలోనే కలగాలి. పిల్లల్ని ఇంటినుండి, అమ్మనుండి దృష్టి మరలించి ఏడ్చేవారిని లాలించి, వారికి చదువు, సంగీతం, పాటలు, పద్యాలు, కథలు చెప్పి వారితో బడికి రావాలనే ఆసక్తిని కలిగించి, వారి ప్రతిభను మెచ్చుకుని ప్రోత్సహించి, భయపెట్టి, శ్రద్ధ తీసుకుని భావిపౌరునిగా, విద్యార్థిగా తీర్చిదిద్దడం ఆది గురువుకే సాధ్యం. మొదటి తరగతి టీచరుగా మా కమలమ్మయ్య నిర్వహించిన పాత్ర అమోఘం. ఆమె పిల్లల్ని తీర్చిదిద్దిన తీరు అద్భుతం.

నల్లటి ఒత్తైన, మోకాళ్ళ క్రిందకి దిగిన జుట్టు మా కమలమ్మయ్యది. ఆమె ఎప్పుడూ... వెంట్రుకలు ముడిచి కొప్పులా చుట్టుకునేది. కానీ - కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో జడ అల్లి వదిలేసేది. ఆరోజంతా మేము, ఆమెనూ.. ఆమె జడనూ చూసి మురిసిపోయేవాళ్ళం. ఛామన ఛాయలో ఉన్నా... ఆమె అందం అద్భుతమైనది. ఆమె స్వరం మరెంతో మధురమైనది. ఆమె మనస్సు, ఆమె భక్తి, తగిన విజ్ఞానాల, కళల కలయికల రాశి మా కమలమ్మయ్య.

ఆమెకు హార్మోనియం వాయించడంలో కూడా ప్రవేశం ఉంది.

ఇరుగు పొరుగు వారికి ఆపదలో సహాయపడటం, వారిని శక్తి కొలదీ ఆదుకోవడం, కష్టసుఖాలు పంచుకోవడం, తగిన సలహాలివ్వడం, వారి అభివృద్ధికి చేయూత నివ్వడం, మంచిని పంచడం, నేర్పించడం, శుభకార్యాల్లో పాలుపంచుకోవడం ఆమెకున్న గొప్ప లక్షణాలు.

ఆరోగ్యం బాగోలేనివారు ఆమెనే డాక్టరుగా ఎంచి తమ బాధను వెల్లడించి ఆమె చెప్పిన జాగ్రత్తలు పాటించేవారు.

మా అమ్మ ప్రతి విషయాన్ని కమలమ్మయ్యతో పంచుకుని ఆమె సలహా తీసుకునేది. ఆమె మాట మీద అంత నమ్మకం మా అమ్మకి. చిన్నవయసులోనే మా నాన్నకి రెండో భార్యగా మా ఇంట్లో అడుగుపెట్టిన మా అమ్మకు తెలియని ఎన్నో మంచి విషయాలు, వంటలు, పద్ధతులు నేర్పించేది. పిల్లల సంరక్షణలో ఎన్నో మెలుకువలు, ఆరోగ్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా మా అమ్మ ఆమె వద్దనే తెలుసుకునేది. ప్రక్కనే అమ్మయ్య ఉందని మా అమ్మకు ఎంతో ధైర్యంగా ఉండేది, ఏ అవసరమైనా ఆదుకుంటుందనే ఉద్దేశంతో. ప్రతి ఒక్కరి బాధ పంచుకుని, వారిని తగిన విధంగా ఓర్చి పరిష్కారం చూపే మా కమలమ్మయ్య అందరికీ కొండంత అండగా ఉండేది.

మా అమ్మకు పఠనాశక్తిని కలగజేసింది ఆమే. రామాయణ, భారత, భాగవతాలను ఇచ్చి చదవమని ప్రోత్సహించేది. మా కమలమ్మయ్యకు ఓ కుమార్తె ఐదుగురు కుమారులు. అందర్నీ ఉన్నతమైన చదువులు చదివించి గొప్పస్థానాల్లో నిలిపింది. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది కమలమ్మయ కుమార్తె భారతక్క గురించి కూడా. స్వాతంత్రం సిద్ధించిన నాడే పుట్టినందువలన కుమార్తెకు స్వరాజ్య భారతి అని పేరు పెట్టి దేశభక్తిని చాటుకున్నారు కమలమ్మయ్య - పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది. అలాగే... భారతక్క కూడా చిన్నతనం నుండే సంగీతం, నృత్యం, అల్లికలు, టైలరింగ్, ఎంబ్రాయిడరీలాంటి కళలలో ఆరితేరడమే కాదు. క్లాసులు నిర్వహించి విద్యార్థినులకు నేర్పించడం, వారిని పరీక్షలకు ప్రిపేర్ చేయించడం విధివంచితులైన వారికి, బాధల్లో ఉన్నవారికి ఏ ఆసరా, ఆదరణా లేనివారికి చేయూత నిచ్చి, హస్తకళలను నేర్పించి, ధైర్యమిచ్చి, ఎన్నో బ్రతుకుల్లో వెలుగునింపిన దేవత. ఎందరి కన్నీళ్ళనో తుడిచి, వారి బ్రతుకుకు అర్థం తెలియజెప్పి, జీవితాల్లో చిరునవ్వులను పూయించిన ఘనత మా భారతక్కది. తిరుపతిలో తన

టైలరింగ్ ఇన్స్టిట్యూట్‌లో నాక్కూడా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, అల్లికలు నేర్పించి, పరీక్ష రాయమని ప్రోత్సహించి డిప్లొమా నా చేతికి అందేలా చేసిన గురువు భారతక్క. మా అమ్మ శాంతమ్మకు కుడా... కుట్లు అల్లికలు నేర్పించింది ఆమే.

తల్లి తండ్రులకు తమ కడుపున జన్మించిన వారే బిడ్డలైతే... గురువులకు తమ వద్ద విద్యనభ్యసించిన ప్రతి విద్యార్ధీ బిడ్డతో సమానమే.... వారందరి, వేనవేల విద్యార్థుల ప్రేమను, గౌరవాన్ని పొందగలగడం గురువులకే సాధ్యం. అందుకే వారి జన్మ ధన్యం. అందుకేనేమో మా రాయలసీమలో టీచర్లను అమ్మ, అయ్యావారు అని అంటారు. ముఖ్యంగా తెలుగుభాష ప్రాముఖ్యతను తెలియజెప్పె పద్య గద్య భాగములకు తేడా వివరించి తెలుగుపై ఆసక్తిని కలుగజేసిన ఘనత మా తెలుగు సార్ రాఘవ రాజు గారిది. ఆయన పద్యభాగాన్ని రాగయుక్తంగా పాడుతుంటే ఇంకా వినాలి అనిపించేది. తెలుగుని ఎంతో ఇష్టంగా ఆయన బోధించేవారు తెలుగు మీద ఆసక్తి కలగడానికి, క్లాసులో ఎల్లప్పుడూ ... ఫస్ట్ మార్కులు తెచ్చుకోవడానికి ఆయనే కారణం.

తరువాత హైస్కూలులో తెలుగు టీచర్ రజియా బేగం మేడమ్‌గారు. ఆమె ఒకసారి పాఠం చెపితే.... మరోసారి పుస్తకం తెరిచి చదివే అవసరం ఉండేది కాదు. ఆమె పాఠాన్ని అర్ధమయేలా... మనసుకు హత్తుకునేలా విద్యార్థులకు చెప్పేవారు. మా పెద్ద చెల్లి స్వర్ణలత, ఆ మేడమ్ ఇచ్చిన స్ఫూర్తితోనే ఎం.ఏ తెలుగు చేసి తెలుగు పండిట్ కోర్సు చేసి, మేము చదివిన, రైల్వేకోడూరు గర్ల్స్ హైస్కూలులోనే తెలుగు టీచర్‌గా జాబ్ తెచ్చుకుంది.

ఎంతో శ్రద్ధగా లెక్కలు చెప్పే నాయుడు సారు, సైన్సు మేడం నాగమణిగారు హిందీ మేడమ్ భారతిగారు, ఆటలపై ఆసక్తిని కలగజేసిన పి.యి.టి మేడం భాగ్యమాల గారు, హెడ్ మిస్ట్రెస్ ఉమామహేశ్వరిగారు. కీర్తిశేషురాలు సాయం లక్ష్మీదేవమ్మ, కీర్తిశేషులు దొంతు నాగయ్య, కీర్తిశేషులు యజ్జు వెంకటయ్య, కీశే సాయం వెంకటయ్య, దొంతు లక్ష్మీదేవమ్మ, ట్యూషన్ చెప్పిన కుమార్ సారు, గురువులకే గురువు తాతగారైన శ్రీ కే.శేషులు అంకేరు రామయ్యగారు ప్రాతః కాలాన స్మరింపదగిన, నాకు చదువు చెప్పిన గురువులు. వీరందరినీ ఈవిధంగా కౌముది ద్వారా గుర్తుచేసుకోగలగడం ఎంతో ముదావహం.



2009 ఫిబ్రవరి నాలుగవ తేదీ మా నాన్నగారు శ్రీ తిరుపాలయ్యగారు పరమపదించడంతో కబురు తెలిసిన వెంటనే వచ్చి మా అమ్మను ఓదార్చి, ధైర్యం చెప్పిన కమలమ్మయ్యను చూసిన నాకు, కౌముదిలో మా మంచి టీచర్లు రాయాలనే సంకల్పం కలిగింది. మా నాన్న దశదిన కర్మ రోజు మరలా వచ్చిన ఆమెను నా కెమెరాలో నాలుగు ఫోటోలు తీసుకునే అవకాశం కలిగింది. ఎనభై సంవత్సరాల వయసులోకూడా మంచి ఆరోగ్యంతో, అందరికీ పెద్ద దిక్కుగా సలహాదారుగా చేతికర్ర ఆసరా లేకుండా తిరగగలుగుతున్న ఆమెకు ఆ దేవుని దయ, విద్యార్థుల ప్రేమాభిమానములు మెండుగా లభించాయని చెప్పవచ్చు.

ఆది గురువైన కమలమ్మయ్య కోసం, నేను రాసిన చిన్న కవిత ఆంధ్రభూమి మంత్లీ లో నవంబర్ 20004 సంచికలో ప్రచురింపబడింది. ఆ కవితను కౌముది పాఠకుల కోసం, మా కమలమ్మయ్యకోసం ఇక్కడ

జతపరుచుతున్నాను. నాకు చదువు చెప్పిన గురువులందరికీ కృతజ్ఞతా స్తుతులు చెల్లించుకుంటూ.... వారికి దేవుడు తన ఆశీస్సులను ఎల్లప్పుడూ అందజేయాలని ఆశిస్తూ.... ఈ అవకాశం నాకిచ్చిన కౌముది ఎడిటర్ కిరణ్‌ప్రభగారికి, మిసెస్ కాంతిగారికి కృతజ్ఞతలు .

**కవితాక్షరాలు అంకితం**

అపుడెపుడో నా చిన్నప్పుడు
ఆమె బోధించిన అ ఆ లు
ఓంకార నాదంలా
నా వీనుల్లో మార్మ్రోగి
అక్షర తపస్సుకై నను ప్రేరేపించాయి
నా జీవిత పథాన్ని నిర్దేశించి
నను ముందుకు నడిపించాయి
ఆమె చేతి ఆసరాతో పలకపై
దిద్దిన ఆనాటి ఓనమాలే
ఈనాటి నా ఈ పదాలకు పునాది
ఆమె గొంతు నుండి జాలువారిన
వేమన సుమతీ శతకపద్యాలే
ఈనాటి నా చిన్ని వాక్యాలకు ప్రేరణ
ఆమె సహకారంతో అధిరోహించిన
విద్యాభ్యాసపు తొలిమెట్టే
ఈనాడు నేను అధిరోహించే
విజయ సోపానాలకు మూలం
ఆమె నా తొలిగురువు
ఆమె పాద కమలములకే నా ఈ
లలిత పద కవితాక్షరాలు అంకితం!



లలిత చిట్టే గారు కువైట్‌లోని జె.డబ్ల్యు మేరియట్ హోటల్లో గెస్ట్ రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి సాహిత్యంమీద మిక్కిలి అభిలాష

# మా మంచి గురువులు

డా.కనుపర్తి విజయలక్ష్మి

ఏమీ తెలియని మట్టిముద్దలాటి మొద్దబ్బాయిల్ని, అమ్మాయిల్ని అందమైన బొమ్మలుగ తీర్చిదిద్దటంలో ఎంత కృషి ఉందో! ఒకరా ఇద్దరా ఎందరో మహానుభావులు!! బడిలో అడుగుపెట్టింది మొదలు పి.జి. డిగ్రీతో బయట పడే పదహారు పదిహేడు సంవత్సరాల అధ్యయనంలో 'మనిషి'గ మలిచేందుకు ఎందరి తోడ్పాటు అవసరమయిందో. కొందరు పాఠం మాత్రమే చెబుతారు! మరి కొందరు జీవన పోరాటపు ఆరాటాన్ని వివరిస్తారు! ఇంకొందరు గెలుపు బాటలో పయనించే మెలుకువలు నేర్పుతారు. అతి కొద్దిమంది మాత్రమే గుండెలో గూడు కట్టుకుని జీవితాంతం వరకు ఏదో సందర్భంలో తమ బోధనను వినిపిస్తూనే ఉంటారు!

మేము ప్రాథమిక విద్యనభ్యసించే నాటి రోజుల్లో కాన్వెంట్లు లేవు. ఐదో తరగతి వరకు ఎ.బి.సి.డి.లతో పనే లేదు. పలకా బలపం నాలుగు పుస్తకాలు... బరువు లేదు. బలుపు లేదు 'ఎవ్వని చే జనించు జగమెవ్వని లోపలనుండు. 'తల్లీ నిన్ను దలంచి పుస్తకమున్ చేతన్ బూనితిన్....' అనే ప్రార్థనతో మొదలై సాయంకాలం ఎక్కాలు అప్పచెప్పటం వల్లె వేయటంతో ముగిసేది. ముఖ్యంగా సాయంకాలం చెట్ల కింద ఆరు బయట ఇసుకలో కూర్చుని ప్రకాశరావు పంతులు గారి వైపు చూస్తూ ఎక్కం అప్పగించటం ఇంకా బాగా గుర్తు. నా వంతుకి పదో ఎక్కంగానీ, పదకొండో ఎక్కంగాని వస్తే ఎంత బాగుండుననుకుంటుంటే ఆయన తొమ్మిదిగాని, పదమూడో ఎక్కంగాని అప్పగించమనేవారు. గుండె దడదడలాడేది!

ఆరో క్లాసులో ఇంగ్లీషు, హిందీ... కొత్తగా పెట్టిన మిడిల్ స్కూల్... హెడ్మాస్టారుగా వచ్చిన 'శర్మ'గారు మాట ఎంత మృదువో మనిషి అంతకంటే సుకుమారుడు... మనసు అంతకంటే సుతిమెత్తన. ఆ పల్లెటూరులో ఆయన్ని అభిమానించని వారెవరు లేరు. ఆయన్ని ప్రేమించని విద్యార్థీ ఎవరూ లేరు. ఆయన్ని అభిమానించి గౌరవించడం మాకందరికి తెలుసు. ముఖ్యంగా నన్ను మరీ ప్రేమగా, ఆప్యాయంగా చూసేవారు. అబ్బాయిల్ని అమ్మాయిల్ని విహారయాత్రకు అతిజాగ్రత్తగా తీసుకెళ్ళి తీసుకొచ్చేవారు. ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు అంతగా లేనపుడు కూడా ఆయన అంత సాహసం చేసారు.

అపుడు హైస్కూల్ అంటే ఎస్.ఎస్.ఎల్.సి. మా గ్రామంలో మాతోటే ఫస్ట్‌బ్యాచ్ మొదలు. మొత్తం టీచర్లందరు పరీక్షకెళ్ళే 20 మంది పాసవాలని గట్టి కృషిచేసారు. మమ్మల్ని అట్లాగే చదివించేవారు. తెలుగు మాష్టారు పద్యం చదవటమంటే గుర్రం కదను తొక్కినట్లుండాలి అని అట్లా చదివించేవారు. సోషల్ మాష్టారు చరిత్ర పట్ల ఎంతటి మక్కువను కలిగించారో చెప్పలేను. సైన్సు, లెక్కలు చెప్పే మాష్టారు పరమ స్ట్రిక్టు..... హిందీ మాష్టారు ఆచార్లుగారు... హిందీని మాట్లాడేంతగ హిందీ పాటలు రేడియోలోవి వింటే అర్థం అయేంతలాగా చెప్పారు..... ఇక అందరి కంటే చివర చెప్పుకున్నా మొదటగా చెప్పుకోవలసిన వ్యక్తి. హెడ్‌మాస్టరు గారు... ఇంగ్లీషు గ్రామర్ ఎంత బాగా చెప్పారంటే ఆయన

చెప్పిన డైరెక్ట్ ఇండైరెక్ట్ స్పీచ్ మార్చటం, ఆక్టివ్ వాయిస్, పాజిటివ్ వాయిస్ బోర్డ్ మీద వ్రాయించటం ఇప్పటికీ మరచిపోలేను. కళ్ళముందు కనిపిస్తూ ఉంటుంది.

అన్నిటికంటే ఆయన మమ్మల్ని నిజాయితీపరులుగా నీతిమంతులుగా తయారు చేసిన వైనాన్ని జీవితాంతం గుర్తుంచుకోతగింది. ప్రతిరోజూ ఇంగ్లీషు స్పీచ్‌లు, పద్యాలు చూడకుండా వ్రాయించేవారు. అంతేకాదు ఓ కొత్త ప్రయోగం చేసారు. ఇన్విజిలేటర్ లేకుండా పరీక్ష వ్రాసే విధానం. కొశ్చెన్ పేపర్స్ ఆన్సర్ పేపర్స్ ఇచ్చేసి, ఎడిషనల్స్ టేబుల్ పై ఉంచి విద్యార్థుల్నే స్వయంగా తీసుకొని పరీక్ష వ్రాయమనేవారు. తాను చేసిన ఈ ప్రయోగం ఎట్లా కొనసాగుతుందో ఊరి పెద్దల్ని పిలిచి చూడమనేవారు. కిటికీల నుండీ మాకు తెలియకుండా పెద్దలు మమ్మల్ని గమనించేవారు. ఇట్లా చేయటం వల్ల మాలో నైతిక విలువలకు పునాది ఏర్పరిచారు.

ఇక చదువు ఒక్కటే కాదు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రతిభాపాటవాలు బయటకు తేవాలనే ఆలోచనతో, నలుగురి ముందు చక్కగా మాట్లాడగలగాలనే ఉద్దేశంతో ప్రతి శనివారం డిబేట్ పెట్టేవారు. నేనే ఆ కార్యక్రమానికి సెక్రటరీని. అట్లా అక్కడ నిర్భయంగా మాట్లాడే ఆ అలవాటే తదనంతర కాలంలో ఎంతో పనికి వచ్చింది.

భగవద్గీత అంటే ఏమిటో కూడా తెలీని ఆ వయసులో ఆయన గీతలోని శ్లోకాలు కొన్నింటిని భావంతో సహా అప్పగించుకునేలా చేసారు. గీతాపఠనం పోటీలు పెట్టారు. ప్రతి ఒక్కరు స్పష్టంగా బిగ్గరగా చదవాలని మోరల్ ఇన్‌స్ట్రక్షన్ క్లాసులో శ్లోకాలను నేర్పించే బాధ్యత హిందీ మాష్టారికి అప్పగించారు.

***ఇదంతా నా హైస్కూలు చదువులో పందిళ్ళపల్లి గ్రామంలో (ఇప్పటి ప్రకాశం - అప్పటి గుంటూరు జిల్లా) 1966 నాటి మాట...*** అపుడు ఏ విద్యా కమీషన్స్ పిల్లల్ని ఇలా తీర్చిదిద్దాలని చెప్పనవసరంలేకుండానే నడతను తీర్చిదిద్దిన ఘనత నాటి మాష్టర్లది.... వీళ్ళందరితో పాటు ఏది అవసరమైనా అనుమానం వచ్చిన వెంటనే తీర్చే నాన్న పందిళ్ళపల్లి గ్రామ కరణం కనుపర్తి గోపాలకృష్ణారావు గారు. నా అసలు గురువు ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో సంతకం పెడుతు ఎన్ని మార్కులొచ్చినా తక్కువే అని అంటూ చాటుగా అమ్మతో పొగడటం విన్నాను ఎన్నోసార్లు! తొమ్మిదిమంది సంతానం, ఏడుగురమ్మాయిలు చివర ఇద్దరబ్బాయిలు. అయినా దగ్గరలోని చీరాల పట్టణం పంపి నన్ను మా అక్కను చదివించటంలో అమ్మ సాహసం ఇక్కడ చెప్పుకోవాలి... హాస్టల్స్ లేవు స్వయంగా వంటా - వార్పు.

డిగ్రీలో ఎన్ని సబ్జెక్టులున్నా తెలుగు మేడమ్ పుల్లమాంబగారిదే అగ్రస్థానం. ఇంగ్లీషు మేడమ్ ప్రభావతిగారు ఆమె చెప్పిన జూలియస్ సీజర్ డ్రామా, హిస్టరీ చెప్పే గిరిజా మేడమ్ కూడా ఎంతో గుర్తుండిపోయారు. మాతో పాటే మొదలయ్యింది చీరాల్లో ప్రభుత్వ కళాశాల. తక్కువమంది విద్యార్థులం. బిఎస్సీ, బి.ఏ లు కలిసే కూర్చునే వాళ్ళం .

పుల్లమాంబగారు పద్యాన్ని స్పష్టంగా అర్థవంతంగా చదవటం.. తీయని ఆ కంఠస్వరం. ఆ పద్యం చదివే తీరే నేననుసరించేలా చేసింది. అన్నిటికంటే ముఖ్యంగా ఆమె ఎంతో ప్రేమగా విద్యార్థినులను ''ఏమోయ్'' అని సంబోధించేవారు. అందమైన ఆమె రూపం, ప్రేమాస్పదమైన ఆ పలకరింపు, పాఠం చెప్పే ఆ తీరు ఎంతో ప్రభావితం చేసాయి నన్ను. నేను నా ఉద్యోగ జీవితం మొత్తంలో అబ్బాయిలనయితే 'ఏమయ్యా' అని అమ్మాయిలనయితే 'ఏమ్మా' అని తప్ప 'అరేయ్' ఒరేయ్' అని ఎప్పుడూ అనలేదు.

ఆ తర్వాత పి.జి, ఎం.ఫిల్. పి.హెచ్.డి, బి.యిడి.... ఇలా ఎన్నో డిగ్రీలు సంపాదించినా నా హైస్కూల్ డిగ్రీ స్థాయి చదువు బోధించిన వారే నన్నెక్కువ ప్రభావితం చేసారు.

కొందరు గురువులు సరస్వతీ స్వరూపులు. వాళ్ళసలు పిల్లలకి పాఠాలు చెప్పటానికే పుట్టారా అన్నట్లుండేవారు. కొందరు బద్ధకస్తులు ఉన్నారు. అందుకే వారిని జీతాలు పంతుళ్ళంటాం... వీరిని జీవితాన్నర్పించి జీవితాలు దిద్దిన పంతుళ్ళంటాం. తరగతి గదుల్లోనే విద్యార్థి వ్యక్తిత్వానికి పునాదులు పడాలంటారు అట్లాంటి సంపూర్ణ మూర్తిమత్వానికి కావలసిన నాంది పలికిన మహాత్ములకు మనఃపూర్వక నమోవాకాలు.



*రాజమండ్రి విమెన్స్ కాలేజీలో చాలా కాలం పనిచేసిన విజయలక్ష్మి గారు, రామచంద్రాపురం వి.ఎస్.ఎమ్ కాలేజీ నుంచీ పదవీ విరమణ చేశారు. తెలుగులో మంచి రచనలు చేశారు.*

## గురుసాక్షాత్పరబ్రహ్మం - స్వర్ణబాల గంటి

*"పార్థాయ ప్రతి బోధితాం, భగవతాం నారయణేన స్వయం,*
*వ్యాసేన గ్రుధితాం పురాణమునినా మధ్యే మహాభారతం,*
*అద్వేతాంమృత వర్షిణీం భగవతీం అష్టాదశాధ్యాయినీం,*
*అంబత్వామను సందధామి భగవద్గీతా భవద్వేషిణీం"*

అంటూ ప్రార్థనతో మొదలు పెట్టి పదునెనిమిది అధ్యాయాలూ కూడా చక్కని రాగంలో రాగయుక్తంగా ఆలపిస్తూ కంఠస్థం చేసేవాళ్ళం మా "భారతమ్మ టీచర్"గారి చలవన. మాడపాటి హనుమంతరావు స్కూల్లో ప్రతీ సంవత్సరం కూడ వార్షికోత్సవాలకి రెండు, పన్నెండు, పదునెనిమిది అధ్యాయాలు స్టేజ్ మీద పాడేవాళ్ళం. తరువాత నేను రోజూ నా పిల్లల్ని నిద్రపుచ్చటానికి ఈ ప్రార్థనా గీతాన్నే పాడేదాన్ని. ఇప్పుడు బి.టెక్ చదువుతూ ఒళ్ళో తల పెట్టుకుని అదే పాట పాడమంటారు. దీనంతటికీ మూలం ఆనాటి భారతమ్మ టీచర్ బోధనే అనుకున్నప్పుడు టీచర్ ప్రాధాన్యత ఏమిటో తెలుస్తుంది. ఇంకా ఆ స్కూల్ జీవితంలో ఎందరో టీచర్లు, - లెక్కలకి సావిత్రి టీచర్, భారతీ టీచర్ గార్లు,

హిందీకి సుబేదా టీచర్, సైన్స్‌కి ఝాన్సీ టీచర్, రాజ్యం టీచర్ గార్లు, భరత నాట్యానికి స్వామాజ్య లక్ష్మి టీచర్... ఇలా ఎందరో మరెందరో....

ఇంతమంది "టీచర్"లని తలుచుకున్నానీనాడు "కౌముది" పత్రిక పుణ్యమా అని. వారందరూ కూడా నా వ్యక్తిత్వ వికాసానికి ఎంతో కొంత దోహదం చేసినటువంటివారే.

హైస్కూలు రోజుల్లో మా హెడ్‌మిస్ట్రస్, కస్తూరీ ప్రసాద్ గార్లు ఎంతో ఆదర్శమూర్తులు. మా ఉన్నతి కోసం ఎంతో తపించేవారు. నేను తెలుగు నుంచి ఇంగ్లీషు మీడియంకు, ఆరవ తరగతిలో మారతానంటే

"మరి అమ్మని అడిగావా, ఎందుకు మారాలనుకుంటున్నావ్?" అని అన్నారావిడ.

"ఏమీ లేదు, వద్దనదు" అని బుంగమూతి పెట్టి ఆ సైన్స్‌లో బూతుమాటలు నేను చదవలేను" అని చెప్పానని ఆవిడే అమ్మకి చెప్పారట. ఐదో క్లాసులో మనిషి బొమ్మ గీసి శరీరభాగాలన్నీ ఒక్కొక్కటిగా పేర్కొనాలి, కొన్ని భాగాలు పలకటానికి మరీ ఇబ్బందిగా ఉండేది. నవ్వేసి "సరేలే ఉత్సాహంగా ఉన్నావుగా వెళ్ళు" అని ఆవిడ పర్మిషన్ ఇచ్చేసారు.

భారతీ టీచర్‌గారు చాలా స్ట్రిక్ట్ - లెఖ్ఖలు తప్పు చేస్తే సహించలేకపోయేవారు. అందరికీ ఆవిడంటే హడల్. ఆవిడ ఎం.ఏ మాథ్స్ చేస్తున్నారప్పుడు. "మాథ్ మెటిక్స్ ఒలింపియాడ్"కి ఓ శనివారం ప్రొద్దుట మోడరన్ మాథ్స్ నేర్పించి మధ్యాహ్నం కల్లా పరీక్ష రాయించేసారు మా చేత. నాకు 30 కి 29న్నర. లెక్కలు సరిగ్గా చేయటంతో మూడో రాంక్ వచ్చింది. అసలు విషయం ఏమీటంటే ఆ పరీక్ష యొక్క ఫీజ్ రెండు రూపాయలు. ఆవిడ అది తీసుకోను కూడా తీసుకోలేదు నా దగ్గర. ఇది ఆవిడ నాకిచ్చిన బహుమతి. ఎందుకంటే నాకు లెక్కలంటే ప్రాణం, ఎనిమిదవ తరగతి ఎండాకాలం సెలవల్లో సగానికి సగం పుస్తకంలోని లెఖ్ఖలు 400 పేజీల పుస్తకంలో చేసేసాను. తొమ్మిదవ తరగతి తెరిచాక అదే పుస్తకంలో వెనగ్గా మొదలుపెట్టి చేసాను. హోమ్ వర్క్ చూస్తూ ఆవిడ దాన్ని చూసేవారు. అంతే ఒక్కసారిగా కోపం వచ్చేసింది.

"నీకు ట్యూషన్ ఉందా? ఇవన్నీ ముందే చేసేసావ్, నేను క్లాసులో చెప్పకుండానే. అవి వేరే నోట్ బుక్‌లో చెయ్యాలి, క్లాస్ వర్క్‌లో చేస్తే ఎలా?" అని ఆ చేసిన పేజీలు చింపి డస్ట్‌బిన్‌లో పారేసి, బెల్లుకొట్టారేమో, వెళ్ళిపోయారు.

"కాదు టీచర్" అన్నా వినలేదు. ఏడుస్తూ కూర్చుంటే పిలిపించారు. మా పిన్ని, సావిత్రి టీచర్ గారి దగ్గర తెలుసుకున్నారట "నాకు లెక్కలంటే ఇష్టం కొద్దీ చేసాననీ, తప్పులూ, తడకలూ కాదనీ, అవన్నీ ఆవిడకి చూపించాననీ, సెలవుల్లో, టైమ్ వృథా చేయకుండా మా అమ్మగారు చెబితే తానే నాకు నేర్పించాననీ" చెప్పారట ఆవిడ. ఆ తరువాత తానే నాకొక 400 పేజీల పుస్తకం కొనిచ్చి మళ్ళీ అన్నీ చేయటానికి ప్రోత్సహించారు, నాకు ట్యూషన్ పెట్టించుకునే ఆర్థిక స్తోమత లేదని తెలిసి, అన్నీ పిన్ని చేయించారని.

ఆవిడ మాత్రం ఎప్పుడూ ఎవరైనా హోమ్ వర్క్ చేయకపోతే బోర్డ్ మీద "రేపు అని వ్రాయనా, అది ఎన్నటికీ రాదు" అనేవారు. దాంతో బెదిరి అందరూ చేసేసేవారు.

తరువాత కళాశాలల్లో లక్ష్మీ మేడం గారు, డా.సాయి ప్రకాశ్ గారు, ప్రొ.ఖాటావ్‌కర్ గారులాంటివారు కూడా ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి నాకు కూడ ఒక "గురువు" అవ్వాలన్న కోరికను పెంచారు.

విద్యారణ్యా స్కూలులో ఎల్.కె.జిలో " భవిష్యత్‌లో ఏమి అవ్వాలనుకుంటున్నారు?" అని టీచర్ అడిగిన ప్రశ్నకి "టీచర్ అవుతాను" అని అన్నానట, అమ్మ చెబుతూ ఉంటుంది. వాళ్ళంతా ఎంతో మురిసిపోయారుట. మా అమ్మగారి

లాగే నాకు టీచింగ్ అంటే ఎంతో మక్కువ. ఇందరున్నా మా అమ్మ - డా.మంగమాంబగారు కానీ, భరతనాట్య - కూచిపూడి నృత్యాల్లో నిష్ణాతులైనటువంటి - డా.ఉమారామారావుగారు కానీ, కెమిస్ట్రీ ప్రొఫెసర్ - డా. రాజశేఖరన్ గారిలాంటి వారిని నేనెక్కడా చూసెరగను ఇన్నేళ్ళ జీవితంలో. వారి ముగ్గురి యొక్క ప్రభావం నా మీద అంతా ఇంతా కాదు. ఏకంగా తిరుమల గిరి సప్తశిఖరాల్లా ఎంతో ఎంతెంతో ఎత్తు. నేనీనాడు ఇంత ఉన్నత స్థాయిలో ఉన్నానంటే, ఇన్నిపనులు అవలీలగా చెయ్యగలుగుతున్నానంటే, ఇన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించానంటే, అదంతా కూడా నిజమైన "గురువు"లు అయినటువంటి ఈ ముగ్గురి దీవనలే. వారంతా కూడా నా "స్వయం వికాసానికి" ఎంతో తోడ్పడ్డారు.

ఇక ఉమాటీచర్ గారితో సంబంధం ముప్పై ఏళ్ళనాటిది. మొదటిసారి మ్యూజిక్ కాలేజీలో కలిసాను, భరతనాట్యం చేర్చుకోవటానికి. అప్పటికే స్కూల్‌లో కొంత నేర్చుకున్నానేమో వెళ్ళగానే అలరింపు, జతి స్వరం చేయించి "సరే నువ్వు సెకండ్ ఇయర్‌లో జేరు" అన్నారు. నేను ఐదారు సంవత్సరాలు రోజూ కాలేజీ తరువాత వెడుతూ వచ్చేదాన్ని. అయితే నాకు మా గురువుగారి వద్ద కూడ ప్రేరణతోనే విద్య వచ్చింది అనటానికి ఎటువంటి సందేహమూ లేదు. అక్కడ కూర్చుని నేర్చుకున్న ప్రతీ పాఠం కూడ అచ్చం మా అమ్మగారు చెప్పినట్లే ఉండేది. ఎంతో శ్రద్ధగా నేర్చుకునేవాళ్ళం. ఈనాడు ఇంజినీరింగ్ చదువుతున్న మా అమ్మాయి కూడా ఆవిడ దగ్గరే శిష్యరికం చేసి 'కూచిపూడి' కళాకారిణిగా రూపుదిద్దుకుంటోంది. ఎన్నోమార్లు ఇద్దరం కలిసి కూడా నృత్యం చేయగలుగుతున్నాం



మా అమ్మాయి, డా.ఉమా రామారావు గారు

ఉమా టీచర్ గారు ఎన్నో పురాణేతిహాసాల గురించి వివరిస్తుంటే అందరం ఎంతో శ్రద్ధగా వింటాం. ఎంతో ప్రేరణోపేతంగా ఉంటాయి. నాట్యానికి కావలసిన భావోత్పత్తి, రసోత్పత్తి కూడా నేర్పేటప్పుడే కలగటం జరుగుతుంది. అందుకేలా ఉంది పిల్లలు, పెద్దలూ కూడ ఎంతో కష్టపడిపోతున్నట్లుగా కాకుండా, రసవత్తరంగా నాట్యాన్ని ఆ ఎసెన్స్ మాత్రం తీసుకుని ప్రేక్షకులకు ఆనందం కలిగించేలా ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. ఆవిడను గురువుగా పొందటం మా అదృష్టం.

నాట్యాన్ని హాబీగా నేర్చుకుని, చిన్న చిన్న ప్రదర్శనలు ఇస్తూ, నా కూతురుకి ప్రేరణగా నిలబడగలిగానన్న తృప్తితోపాటు, రసాయన శాస్త్రంలో ఎంతో కొంత కృషి నా మటుకు నేను చేయగలిగాను, చేస్తున్నాను, నా ఈ చిన్ని పరిధిలో గుర్తింపబడ్డాను. అంటే మా పి.హెచ్.డి, మెంటర్, గురువుగారు డా.రాజశేఖరన్ గారు కారణం.. 6 సంవత్సరాలు రీసర్చ్ అసోసియెట్ షిప్ అదే లాబ్‌లో చేయటం నా అదృష్టం అనే చెప్పాలి. విశ్వవిద్యాలయాల్లో మామూలుగా ఎవరూ కూడ శిష్యులని ఒక్కొక్కరిని కూర్చోబెట్టి చెప్పటం జరగదు. కానీ ఆయన మాకందరికీ కూడ ఎవరి పని వారితో క్షుణ్ణంగా పరిశీలించి తెలియకపోతే నేర్పి, ఓపిగ్గా మళ్ళీ మళ్ళీ చేయించి, మా చేత మంచి నాణ్యత కలిగినటువంటి పని చేయించేవారు. వాటన్నింటినీ కూడ ఎంతో సరళంగా, కుదించి, అందరికీ అర్థం అయ్యే విధంగా పేపర్ల రూపంలో వ్రాయించేవారు.

ఆయన ఎప్పుడూ అనేవారు "I want to be known through my Students" అని. అది చాలా నిజం. ఎవరైనా కానీ మెచ్చుకోవాలన్నా, కించపరచాలన్నా కూడ "ఎక్కడ చదివావు? ఎవరు నేర్పారు?" అని అడుగుతారు కదా!! అక్కడే తెలుస్తుంది "గురువు"కి ఉన్న విలువ. అలా అన్నందుకు ఒళ్ళు దగ్గర పెట్టుకుని, జాగర్తగ పనిచేయాలి మరి మేమందరం కూడ. గురువులు ఎప్పుడు శిష్యులు తమకంటే ఉన్నతంగా, గొప్ప విజ్ఞాన ఘనులుగా ఉండాలని

అనుకుంటారు. తమను మించిన శిష్యులను తయారు చేసేవారు చాలా అరుదు. అయితే ఆ శిష్యులకి మళ్ళీ శిష్యులు... అలా గురుశిష్య పరంపరగా భారతదేశం కొనసాగుతోంది. గురువులు తమ శిష్యులకోసం, శిష్యులు తమ గురువుల కోసం తహ తహలాడి, వెతికి వారిని పొంది, ధన్యులయ్యే సంఘటనలు ఈ కాలంలో తక్కువే అయినా, లేకపోలేదు. గురువు చెప్పనిదే ఏ విద్యా రాదన్నది చాలా వాస్తవం.

ఈనెల గురుపూజా దినోత్సవ సందర్భంగా నేను ఇలా నా గురువులను తలుచుకోవటం నాకెంతో ఆనందంగా ఉంది. అందరు గురువులకు పాదాభివందనం చేస్తూ ఈ చిన్ని కావ్యాంశం. ఈ అవకాశానికి ధన్యురాలిని.



రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్న స్వర్ణబాల గారు, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వివిధ సంస్థలకి క్వాలిటీ డాక్యుమెంటేషన్ చేస్తుంటారు. లూపిడ్ ల్యాబ్స్‌లో క్వాలిటీ మేనేజర్‌గా కూడా ఉన్నారు. తెలుగు సాహిత్యం అంటే మక్కువ. కూచిపూడి నృత్యంలో డిప్లమో చేశారు.

# డా. ఉమా ఇయ్యుణ్ణి



ఒక విద్యార్థి వ్యక్తిత్వం మలచపడడానికి తల్లి, తండ్రి ఎంత అవసరమో ఉపాధ్యాయులు కూడా అంతే అవసరం అన్నది ఎంతో నిజం. నేను తరచూ తల్చుకునే మంచి ఉపాధ్యాయిని మా సత్యవతిగారు. హైదరాబాదులోని మాడపాటి హనుమంతరావు గారి స్కూల్లో సత్యవతి గారి పేరు వినని, తెలియని వారు ఉండరంటే అతిశయోక్తికాదు. ఎప్పుడూ చిరునవ్వుతో, కోప్పడినా కూడ నొప్పి అనిపించని నవ్వు ముఖంతో ప్రతి ఒక్క విద్యార్థినినీ ఆకట్టుకున్న సత్యవతిగారిలాటి వ్యక్తి మా అందరి మనసుల మీదా చెరగని ముద్రవేసారు. నేను ఏడవ తరగతిలో చేరినప్పటినుండీ కూడా

వ్యక్తుత్వపు పోటీలలో పాల్గొనడానికి ఆవిడే స్ఫూర్తి. అప్పటినుంచే నన్ను గమనిస్తు ఉండేవారని, నేను ఆవిడ క్లాసుకి వచ్చేదాక నాకు తెలియదు. ఆవిడ చమత్కారపు మాటలు, సమయ స్ఫూర్తి చక్కలిగింతలు పెట్టేవి. శబ్ద చిత్రమంటే ఏమిటో, కవితాలోకంలోకి అడుగుపెట్టాక తెలుసుకున్న నాకు, ఆ మాటకి తొలి పరిచయం సత్యవతిగారి దగ్గరనుంచే.

"భీముడు కాలుని నిలిచాడంటే, మనం బస్సులో నిలబడినప్పుడు, బ్రేకు వేస్తే పడిపోకుండా కాలు తన్ని పెట్టి నిలుచుంటాం చూడూ, అలాగన్నమాట". అని చెప్పిన ఆవిడ మాటలు ఇప్పటికీ చెవిలో రింగుమంటాయి. బమ్మెర పోతన గారి భాగవతంలో, గజేంద్ర మోక్షంలో, సిరికిం చెప్పకుండా శ్రీహరి పరుగెడుతుంటే వెనకాలే శ్రీదేవి అడిగెదనని కడువడిజని పరుగిడిందని ఆవిడ చెపుతుంటే నిజంగా కళ్ళముందు వైకుంఠమే కదలి వచ్చేది.

నేను వక్తుత్వపు పోటీలలో పాల్గొనడానికి వేరే స్కూళ్ళకి వెళ్ళేముందు విధిగా సత్యవతిగారిని కలిసి, ఆశీస్సులు తీసుకుని వెళ్ళేదాన్ని. "జలపాతంలా దడదడా మాట్లాడే నీకు భయం ఏమిటే," అని నవ్వి, తల మీద చెయ్యి పెట్టే ఆవిడ సమక్షంలో ఎక్కడా లేని ధైర్యం వచ్చేది. తప్పకుండా ప్రైజ్ తీసుకునే వచ్చేదాన్ని. ఆ ఘడియలు జీవితంలో ఎన్నటికీ మరువలేనివి.

ఆవిడకు కోపం వచ్చి ఒక విద్యార్థినిని తిట్టడం ఎంత మృదువుగా ఉండేదంటే బూందీ లడ్డు మధ్యలో పచ్చిమిరపకాయ పెట్టినట్లు అనిపించేది. కాస్త కొరికితే కానీ ఘాటు తెలిసేది కాదు. అప్పుడు ఆ మొహాలు చూడవలసినదే

ప్రముఖ రచయిత జర్నలిస్ట్ తురగా కృష్ణమోహన్ గారి సహోదరి మా సత్యవతిగారు. ఎప్పుడూ తెల్లని ఖాదీ చీరలో, మెల్లగా నడుస్తూ, ఆవరణలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థినినీ కళ్ళతోనే పలుకరించి, వారిని గమనించి అవసరం అనుకుంటే ఎన్ని విధాలుగానో సహాయం చేసిన సత్యవతిగారిలాటి ఉపాధ్యాయినిలు సమాజానికే ఆయువుపట్టులాటివారు.

అలాగే ఆవిడ ఎంతో చక్కగా, నా స్నేహితురాలు కాంత కవిత్వాన్ని తనని నొప్పించకుండా మా అందరికీ చదివి వినిపించడం, మొన్న కలిసినప్పుడు మేమదరం తల్చుకుని నవ్వుకున్నాం. అంత్యప్రాస గురించి వివరించి, మా అందరినీ తలో కవితా వ్రాయమన్నారు. కాంత ఏం వ్రాసిందో వినండర్రా అని చదివారు.

ఇంటికప్పు,

బాటా చెప్పు

ఎంతైనా చెప్పు

అడిగితే పుడుతుంది అప్పు !!

అమెరికా వలస వచ్చి దాదాపు ముప్పై సంవత్సరాల దాకా కూడా, ఎప్పుడు ఇండియా వెళ్ళినా, మా స్నేహితులం అందరూ కలిసి చేసే పని సత్యవతిగారిని కలవడం. అలాటిది గత రెండు సార్లు, ఆవిడ భౌతికంగా లేకపోవడంతో ఎంతో వెలితి అనిపించింది.

గత అయిదు సంవత్సరాలుగా ఆవిడ నడవలేకపోయినా, పక్కమీదనుండే మాకు చిరుతిళ్ళు ఏర్పాటు చేసేవారు. ఆమె పని నుండి విశ్రమించాక కూడా స్ఫూర్తి అన్న కార్యక్రమం పేరిట ప్రవాసాంధ్రులందరినీ కూడగట్టుకుని, స్కూల్‌కి సహాయం చేయించారు.

నా తొలి కవితా సంకలనం 'తుహిన కణాలు' ముందు మాటలో ఆవిడకు అంజలి ఘటించి నేను, ఇది మీరు నేర్పిన విద్య అన్నాను. ''ఉమా, నేను వేలమందికి చదువు చెప్పాను కానీ నేర్చుకున్నది ఎందరంటావు,'' అని తిరిగి ఆ మెప్పు నాకే ఇచ్చేసిన సత్యవతిగారికి అక్షరాల అంజలి తప్ప ఏమివ్వగలను.

అమెరికాలో పుట్టి పెరిగిన మా పిల్లలకు కూడా మా సత్యవతిగారు తెలుసు. దాదాపు నలభై సంవత్సరాల క్రితం స్కూల్ వదిలేసి, వైద్య వృత్తి చేపట్టి, అమెరికా వలస వచ్చేసినా, నలుగురు స్కూల్ పిల్లలం కలిస్తే, సత్యవతిగారి గురించి తల్చుకోవలసినదే. అన్నిటికన్న, గర్వకారణం కొన్నేళ్ళ క్రితం ఒక తెలుగు మహాసభలో వక్తగా పిలిచారు. ఆ సభకి వచ్చిన ఆరుగురు వక్తల్లో, నలుగురు సత్యవతిగారి దగ్గర చదువుకున్నామని తెలుసుకుని ఆశ్చర్యపోయాం కానీ, వెంటనే నవ్వుకున్నాం కూడా. అందరికీ కూడా, తరువాతి వక్త వాగ్ధోరణి కొత్త అనిపించలేదు. అందరం ఆ టీచరు స్టూడెంట్లమే కదా మరి!

ఇలా చెప్పుకుంటూ పోతే, సత్యవతిగారి మీద గ్రంథాలు వ్రాయగలను అనిపిస్తుంది. చక్కటి తెలుగు భాషలోని మాధుర్యాన్ని చిన్న వయసులోనే పరిచయం చేసి కేవలం చదువేకాక విద్యార్థినుల అవసరాలు, ఆక్రోశాలు, ఆవేశాలు గుర్తించి, లాలించి, మాలోటు పాట్లు మేమే తెలుసుకునేలా మందలించి, మమ్మల్ని మలచిన సత్యవతిగారిలాటి సహృదయులు మాకు టీచర్‌గా లభించడం మేము చేసుకున్న సుకృతం. అలాటి టీచర్లు ఎందరికో, అందరికీ కూడా లభించాలన్న మా కోరిక ఫలిస్తే ధన్యులం.

ఇప్పుడు ఆమె భౌతికంగా లేరు కాని, మా అందరి తలపుల్లో ఆమె చిరంజీవి.

అలాటి సత్యవతి గారిని ఒక కుటుంబ సభ్యురాలిగా ఆరాధించకుండా ఎలా ఉండగలం చెప్పండి?

మా స్కూల్లో ఆ రోజుల్లో సరిగా జీతం కట్టలేని వాళ్ళు కూడా ఉండేవారు వారి లేమిని కించపరచకుండా మా అందరిచేతా ఒక చక్కని ప్రణాళిక మొదలు పెట్టించారు. అలాగ మొదలయింది మా ''నయాపైసా ఫండ్''. ఒక డబ్బా పట్టుకుని, కొంత మంది వాలంటీర్లు మధ్యాహ్నం రీసెస్ వేళ ప్రతి క్లాసుకి వెళ్ళి పిల్లల దగ్గరనుంచి నయాపైసలు, చిల్లరా సేకరించేవారు. నెల చివరికి ఆ డబ్బులన్నీ కలిపి, ఒక పేద విద్యార్థినికి కావలసిన పుస్తకాలు కానీ యూనిఫారం కానీ సమకూర్చేవారు కాని, ఆ సహాయం ఎవరికి అందినదో టీచర్లకు తప్ప ఇంకెవరికి తెలియనిచ్చేవారు కాదు. ఆ విధంగా ఆ పేద పిల్లల ఆత్మాభిమానాన్ని గౌరవించేవారు.

ఇన్ని సంవత్సరాల తరువాత, మా పిల్లల చేత అలాగే చిల్లర పోగు చేయించి, వాలంటీరు సర్వీస్‌లకు ఇప్పించడం అనే అలవాటుకి అదే నాంది జరిగిందేమో మరి.

ఇవేకాకుండా, స్వచ్ఛంద సేవ కూడా అప్పుడే మా మనసుల్లో బాగా నాటుకు పోయింది. ఎంతో పెద్ద ఆవరణ ఉన్న మా స్కూల్లో ఈ రోజుల్లోలాగా, ఇక్కడ అమెరికాలో లాగా, డైనింగ్ రూంలు ఉండేవికావు. అందరూ చెట్ల క్రింద అన్నాలు తినేసి, శుభ్రం చేయకుండా వెళ్ళిపోయేవారు. అందుకని ఆవిడ ప్రతిక్లాసు నుండి రోజుకి ఇద్దరేసి వాలంటీర్లను ఆ ప్రదేశాలు శుభ్రంగా ఉండేలాగ చూడమనే వారు. లంచ్ తిన్నప్పుడే శుభ్రంగా పెడితే ఎంత సుఖమో అందరికీ బాగా తెలిసి వచ్చేది. ఇలాగ, కేవలం చదువే కాక, జీవితపు విలువలు కూడా నేర్పిన మా మంచి టీచరు మా సత్యవతిగారు.



*డాక్టర్ ఉమా గారు వృత్తి రీత్యా వైద్యురాలైనా సంగీత, సాహిత్యాల్లో విశేషమైన కృషి చేశారు..చేస్తున్నారు. వీరి లలిత గీతాలు అనేకం సి.డి.ల రూపంలో విడుదలయ్యాయి. మరిన్ని విశేషాల్ని వీరి వెబ్‌సైట్ **www.pranavamusic.net** లో చూడొచ్చు.*

## శారద ఆస్ట్రేలియా

**చదువూ, పోటీ పరీక్షలకి** శిక్షణలతో పాటు, మంచీ చెడూ విచక్షణా, యుక్తాయుక్త పరిజ్ఞానమూ, జీవితాన్ని పరిశీలించే సునిశిత తత్వమూ నేర్పించే గురువులుండటం కేవలం మనం అదృష్టం మీద ఆధారపడి ఉంటుందేమో! ఆ రకంగా నేను కొంచెం కాదు, చాలా అదృష్టవంతురాల్ననే అనుకోవచ్చు.

ఒకటి రెండో తరగతుల్లోనే, "జనరల్ నాలెడ్జ్" మీద ఆసక్తి కలిగించిన సునీత టీచర్నించి, ఎమ్మెస్సీలో ఏ వేళ వెళ్ళి ప్రశ్నలడిగినా కాదనకుండా, ఆప్యాయంగా ఫిజిక్స్ నేర్పించిన శాస్త్రిగారి వరకూ, అందరూ నన్ను తీర్చిదిద్దటమనే యజ్ఞం తెలిసో తెలియకో పాలు పంచుకున్నవారే.

నా స్కూలు చదువంతా హైదరాబాదు సంతోష్‌నగర్ లోని సెయింట్స్‌ఎయింట్ జేవియర్స్ స్కూలులో జరిగింది. నాతో పాటు మా బంధువర్గంలోని ఇతర పిల్లలూ, మా చెల్లెళ్ళూ అందరమూ అదే స్కూలు. అవటానికి కేథలిక్ స్కూలే అయినా పెద్దగా మతాన్ని గురించి ఏమీ చెప్పేవారేకాదు.

లెక్కలు చెప్పిన రామశాస్త్రిగారు, మార్కులు తక్కువొస్తే చూపులతోనే కాల్చివేసే నరసింహాశాస్త్రిగారినీ మరిచిపోలేను. వాళ్ళు ఆనాడు శ్రద్ధగా నేర్పించిన లెక్కలూ ఫిజిక్సే ఈనాడు నన్ను ఫిజిక్సులో పీ.హెచ్.డీని చేసాయనటం

అతిశయోక్తి ఎంత మాత్రమూ కాదు. ఎందుకంటే, కేవలం ఒక విషయం (సబ్జెక్ట్) మీద పరిజ్ఞానం కలిగించటం ఒక ఎత్తూ, దానిమీద ఇష్టమూ ఆసక్తీ కలిగించటం ఇంకొక ఎత్తూ. మళ్ళీ ఇదంతా ఏదో మొక్కుబడి కోసం జీతం రాళ్ళ కోసం అన్నట్టు కాకుండా విద్యార్థుల మీదా నేర్పిస్తున్న విద్య మీదా ప్రేమతో చేయటం ఇంకొక ఇంకొక కోణం.

ఇంతమంది మంచి టీచర్లలోనూ, తెలుగు మాస్టారు శ్రీ అన్నదానం సుబ్రహ్మణ్యంగారి తెలుగు పాఠాలు ఒక ఎత్తు!

మా స్కూల్లో మా పిన్నిగారు శ్రీమతి యశోద గారే తెలుగు టీచరు. పాతికేళ్ళు స్కూలుకి సేవచేసి కొన్నేళ్ళ క్రితమే రిటైరయ్యారావిడ. ఆరు ఏడు తరగతులో మా కందరికీ చాలా ఇష్టంగా తెలుగు చెప్పేది మా పిన్ని. అయితే అందరికంటే నాకు మార్కులు తగ్గించి వేసేవారావిడ! మా క్లాసులో ఆరోగ్యకరమైన పోటీ కూడా తను నేర్పించిందే. కేవలం పాఠాలే కాకుండా తెలుగు సాహిత్యం గురించి చిన్న చిన్న కథలూ, వార్తావిశేషాలూ చెప్పేవారావిడ.

అయితే మేము ఎనిమిదో తరగతికొచ్చేసరికి ఆవిడకి హైస్కూలు తెలుగు బోధించటానికి తగిన విద్యార్హతలు లేవని ఇంకొక తెలుగు టీచర్ని నియమించాలని యాజమాన్యం నిర్ణయించింది.

ఆ ప్రక్రియలో భాగంగా డిమాన్స్ట్రేషన్ పాఠం చెప్పటానికి మాక్లాసుకొచ్చారు సుబ్రహ్మణ్యంగారు. ఆ రోజు ఆయన చెప్పిన "శీతకాలము" పాఠం నాకింకా గుర్తుంది. అయితే ఆయన బాహ్యరూపం సినిమా స్టారులంత అందంగా ఉండకపోవటంతో యాజమాన్యం కొంచెం వెనుకాడిందనీ మా పిన్నిగారే పట్టు పట్టి ఆయన్ని తీసుకోవాలన్నారనీ ఆయన తరువాత మాతో చెప్పారు. ఇప్పటికీ ఆవిడని "అక్కయ్యా" అనే పిలుస్తారాయన.

"నాలుగంటే నాలుగే రోజుల్లో పిల్లలాయన బాహ్య రూపాన్ని గురించి పట్టించుకోవటం మానేస్తారు" అన్నారు మా పిన్ని.

రెండేరోజుల్లో ఆయనన్నా, ఆయన పాఠాలన్నా మాకు ఎక్కళ్ళేని ఇష్టమూ ఏర్పడిపోయింది. రాగయుక్తంగా ఆయన చెప్పిన పద్యాలూ, వాటికి ఆయన ఇచ్చిన భాష్యాలూ, అన్నీ కలిపి తెలుగు సాహిత్యం మీద ఎంతో అభిరుచి కలిగించాయి.

కేవలం పాఠ్యాంశాలే కాకుండా అప్పుడప్పుడూ వక్తృత్వ పోటీలూ, సత్ప్రవర్తన గురించిన సూచనలూ, రాజకీయాల మీదా, సామాజిక సమస్యల మీదా చర్చలూ పాటలూ, డాన్సులూ చేయించటం ఒకటేమిటి, మూడేళ్ళలో ఎన్ని నేర్పించగలరో అన్నీ నేర్పించే ప్రయత్నం చేసారాయన.

"సిరికిం చెప్పడు శంఖ చక్ర యుగము కేదోయి సంధింపడే పరివారమున్ జీరడభ్రగ పతిన్ పన్నింపడాకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తడు, వివాద ప్రోద్ధత శ్రీకుచోపరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై" అన్న పద్యం మీదా, దాని వల్ల పోతన గారి ఆంధ్ర మహాభాగవతం మీద ఇష్టమూ ఆసక్తీ తెలుగు క్లాసులోనే ప్రారంభమైందేమో. అప్పుడు కలిగిన ఆ ఇష్టమే నన్ను మా ఊళ్ళో పిల్లలకి భాగవతంలో పద్యాలు నేర్పించి వల్లె వేయించేదాకా తీసికెళ్ళింది.

మా ఇద్దరు పిల్లలనీ పెంచటంలో నేను ఆయన మాటలనీ, ప్రవర్తననీ ఆయనతో చర్చించిన విషయాలనీ చాలా సార్లు ఉపయోగించుకున్నాను. ఇక్కడికొచ్చిన కొత్తలో మా పిల్లలిద్దరూ రేడియోలో విని బ్రిట్నీ స్పియర్స్ పాట పాడుతుంటే మొదటిసారి కొంచెం దిగులు పడ్డాను. ఎలా వీళ్ళని పెంచగలుగుతానా అని. మంచీ చెడూ బోధించినా అర్థంకాని, చేసుకోలేని వయసులో ఉన్నారిద్దరూ (ఆరు, రెండేళ్ళు!)

వాళ్ళు పాడుతున్న పాటలని ఆపలేదు కానీ, రాత్రి పూట పడుకునేటప్పుడు, "మందార మకరంద మాధుర్యమున తేలు" పద్యం నేర్పించాను. అలా తెలుగు పద్యాల మీదా వాటిల్లో ఉన్న భావం మీదా ఇద్దరికీ కొంచెం ఆసక్తి కలిగింది.

నాలుగన్నర ఏళ్ళ కింద మా తమ్ముడి పెళ్ళికి నా మీదా, మా కుటుంబం మీదా అభిమానంతో వచ్చారు తెలుగు మాస్టారు. సగర్వంగా మా పిల్లలకూ, మా అత్తమామలకూ పరిచయం చేసాను. ఆయన దగ్గర నేను కేవలం తెలుగు పాఠాలే కాదు, జీవితానికెంతో విలువైన విలువలునేర్చుకున్న విషయం మళ్ళీ గుర్తుతెచ్చుకున్నాను.

ఒక మనిషి మీద దీర్ఘకాలికమైన ప్రేమా అభిమానమూ, గౌరమూ కలగడానికి రూపురేఖా విలాసాలూ, అందచందాలకంటే, హృదయ సౌందర్యమూ, చేస్తున్న వృత్తి పట్ల నిబద్ధతా, వ్యక్తిగత జీవితంలో నిజాయితీ, పక్కవారి పట్ల చూపించే ఆప్యాయతా, స్వచ్ఛమైన నడవడీలాటి లక్షణాల వల్ల కలుగుతాయని మాకందరికీ అనుభవం ద్వారానే అర్థమైంది. ఈ జ్ఞానమే బహుశా నా ప్రవర్తననీ, వ్యక్తిత్వాన్నీ తీర్చిదిద్దిఉండవచ్చు.

నన్నూ నా ఆలోచనలనూ, వృత్తినీ, ప్రవృత్తినీ తీర్చిదిద్దిన గురువులుకీ, గురుతుల్యులకీ పత్రిఖాముఖంగా వందనాలు తెలుపుకునే అవకాశం ఇచ్చినందుకు కౌముది పత్రికా సంపాదకులకు ధన్యవాదాలు.



శారద గారు సౌత్ ఆస్ట్రేలియా లోని అడిలాయిడ్ నివాసి. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ రచనలు చేస్తుంటారు..

# దీప్తి కనుపర్తి

"ఎందరో మహానుభావులు అందరికీ నా వందనాలు"

విద్యా ప్రమాణాల్లో – సంస్కృతిలో మార్పు చోటు చేసుకుంటున్నప్పటి తరం మాది. పంతులుగారి బడికి, ఇంటర్నేషనల్ స్కూళ్ళకి మధ్య వారధులం మేము.

తూర్పు గోదావరి జిల్లా మండపేటలో నా ప్రాథమిక విధ్య అభ్యసించాను. టీచర్ ఏది చెపితే అది వేద వాక్కు.. అమ్మ నాన్నలకి కూడా చాలా సంగతులు తెలుసు కాని టీచర్ – టీచర్ కదా! 'రేయ్ పిల్లలు ఎక్కాలు ఎలా రావాలో తెలుసా, నిద్రలో లేపి అడిగిన ఠక్కుమని చెప్పాలి' అన్నారు లలిత టీచర్. ఎప్పుడో నిద్రలో మెలుకువ వచ్చింది గబగబా ఆరో ఎక్కం మననం చేసుకుని నిద్రపోయాను. అది తలచుకుంటే నాకు ఇప్పటికే ముచ్చటగా అనిపిస్తుంది. అంత నమ్మకం గురువు మీద. ఏం చెప్పినా మనకోసం అని, మంచి కోరే అని నమ్మకం. ఆ దశ నుండి హైస్కూల్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోకి అడుగుపెట్టాకా చాలా పరిణితి పొందాల్సి వచ్చింది పరిస్థితుల వల్ల చాలా మంది చక్కని టీచర్ల సాంగత్యం, ఇంకా చాలా మంది ప్రవర్తన వల్ల కలిగిన పరివర్తన, గడించిన అనుభవాలు వెలకట్టలేనివి.

ప్రమీల జూలియట్ టీచర్ నాచురల్ సైన్స్ చెప్పేవారు, అప్పటికే సైన్స్ పట్ల నాకు ప్రత్యేకమైన ఆసక్తి ఆవిడ నా ఫేవరెట్ టీచర్ అయిపోయారు.

గణితంలో ఘనాపాటి బెట్టీ రోజ్ టీచర్, ఆవిడ ప్రేరేపించిన పోటీతత్వం వల్ల నాకు లెక్కల భయం పోయింది.

ఎప్పుడూ లాంగ్వేజెస్ నాకు ఇష్టమైన క్లాసులు తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు ఆ కథలు, కథనాలు నేను ఒక్కోసారి హంపి నుండి కణ్వాశ్రమానికి, ఇక్బాల్ (సారే జహాఁ అచ్చా రచయిత) జీవితం నుండి రోమ్ వీధుల్లోకి వెళ్ళిపోయేదాన్ని. అలా చెప్పేవారు కళ్ళకు కట్టినట్లు.

గులాబీల చాటున ముళ్ళు పొంచి ఉంటాయి అని అనుభవం అవుతున్న తొలిరోజులు. దాని అంకురార్పణ స్కూల్లోనే జరిగింది. రావలసినదానికన్నా ఒకటీ అరా మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయి అని ఆలోచిస్తుంటే " నా దగ్గరకి రాకుండా ఫలానా మాస్టారి దగ్గరకి ట్యూషన్‌కి వెళుతున్నావు కదా!" అని ఆక్షేపణ. "అబ్బ బాగా గత్తర పిల్లలు చనువిస్తే చంకల్లో కెక్కేస్తారు" అని విమర్శలు. టీచర్లు ఇలా కూడా ఉండొచ్చా? అని మొదట్లో ఆశ్చర్యం. కాని ఆ అనుభవం చాలా విలువైంది. ఆత్మవిశ్వాసాన్ని మనోస్థైర్యాన్ని సమీకరించుకుని ముందుకుసాగిపోవడానికి అవే మొదటి మెట్లు.

ఎమ్‌సెట్ జ్వరం తీవ్రంగా ఉన్న రోజులవి... నా ఇంటర్ చదువు విజయవాడలోని ఒక రెసిడెన్షియల్ కాలేజ్‌లో సాగింది. ఇంటికీ ఊరికి దూరంగా మొదటిసారి - చిన్న తనం నుండి గురుకులంలాంటి వాతావరణం నాకు చాలా ఇష్టం. మనం గురువుగారికి సపర్యలు చేయకపోయినా (అమ్మా నాన్న డబ్బులు కట్టడం వల్ల) మనల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు అని ఆనందం. స్నేహితులతో పగలు - రాత్రి కలిసి గడపడం. వెంకటనారాయణగారు మా కాలేజ్ ప్రిన్సిపాల్ చాలా ముక్కుసూటి మనిషి కెమిస్ట్రీలో దిట్ట. తండ్రిలా మమ్మల్ని చూసుకునేవారు. సౌశీల్యం, ఆత్మస్థైర్యం ఎలా కాపాడుకోవాలో బోధించారు, చాలా అరుదైన విలువైన పాఠం అది.

శివశర్మగారు రిటైర్డ్ ప్రొఫెసర్ మాకు ఫిజిక్స్ ఎలా చెప్పారంటే మా ప్రమేయం లేకుండానే విషయం బుర్రలోకి వెళ్ళిపోయేది.

టిఫిన్ (బ్రేక్ ఫాస్ట్) బాగా సాంబారు ఇడ్లీ పెట్టి క్లాసులో కూర్చోమనేవాళ్ళు. బుర్ర వేడిగా, బొజ్జ నిండుగా, మత్తుగా కూర్చునేవాళ్ళం. అప్పుడే మా సంస్కృతం క్లాసు (తెలుగులో ఇంగ్లీషులో రాసేవాళ్ళం, అది వేరే సంగతి) రామకృష్ణ శర్మగారు మా టీచర్, ఆయన రాగానే మా మత్తు వదిలిపోయేది. ఎన్నో ఛలోక్తులు, విషయాలతో సరదాగా సాగిపోయేది. "పార్వతి శివుడి కోసం తపస్సు చేసింది. ఎలా చేసింది? శివ నువ్వుకావాలి ఓ శివ నువ్వే కావాలి" అని రాసింది. అంటే ఘొల్లున క్లాసంత ఒకటి నవ్వులు. ఆ క్లాసు మాకు ఆటవిడుపు.

డిగ్రీ కాకినాడలో చదివాను, వి.ఎస్.లక్ష్మి కళాశాల, అక్కడ బయోకెమిస్ట్రి లెక్చరర్ పద్మజ మేడమ్ ఒక సోదరిలా ఉంటూ మాలోని నైపుణ్యాన్ని వెలికి తీసారు. బయోకెమిస్ట్రీ పునాది గట్టిగా ఉండడానికి ఎంత శ్రమించానో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి అంత ప్రోత్సహించేవారు. అక్కడే నేను ఎన్నో వక్తృత్వ, వ్యాసరచన, నాటక మరియు వాగ్ధాటి పోటీల్లో పాల్గొన్నాను. అప్పుడు కూడా మా అందరికీ సంస్కృతం క్లాసు చాలా ఇష్టం. ధూళిపాళ మహదేవ్ మణిగారి బోధన మా అందరికీ ఎంతో ప్రియం. సరోజని శాస్త్రిగారు రిటైర్డ్ లెక్చరర్ మా కాలేజి ప్రిన్సిపాల్ ఎప్పుడూ చూసినా చక్కగా ఫ్రెష్‌గా ఉండే ఆవిడ ఉత్సాహం మా కన్నా రెండాకులు ఎక్కువే. నా "అందమైన జీవితం" సిద్ధాంతానికి ఆమె బలమైన ప్రేరణ. ఇక్కడే విశ్వాసాల మధ్య విబేధాలు రుచిచూడడం కూడా జరిగింది నేను కాలేజి స్టూడెంట్స్ ప్రెసిడెంట్‌ని, ఒక లెక్చరర్ రోజు పాఠం మొదలుపెట్టే ముందు ఒక మత గ్రంథం నుండి సూక్తి రాసి మరీ మొదలు పెట్టేవారు. మొదట్లో వింతగా అనిపించింది. ఎన్నాళ్ళు సాగుతుందిలే అని ఊరుకున్నాం. రోజులు - వారాలు - నెలలు గడిచాయి ఆ అభిప్రాయలు మాపై రుద్దబడతాయా? అని అనుమానం మొదలైంది. క్లాసులో కొందరికి ఇక సహించడం చేతకాని తనం అవుతుంది అనిపించింది పెద్ద స్టూలు వేసుకుని బాగా ఎత్తులో (లెక్చరర్ చెరపడానికి వీలు లేనంత ఎత్తులో) బోర్డుపైన భగవద్గీత శ్లోకాలు రాయడం మొదలు పెట్టారు. సగం బోర్డు ఈ రకంగా నిండిపోయేది. ఇది ముదిరితే సహృద్భావ వాతావరణానికి మతం మంచిది కాదని నేను మా ప్రిన్సిపాల్ మరియు ఆ లెక్చరర్‌లతో మాట్లాడి మతపరమైన అంశాలకి వేరే చర్చా వేదిక ఏర్పాటు మంచిదని నిర్ణయం తీసుకోవడం అయింది. సామరస్యంగా ఆ సమస్య ముగిసింది కాని నిజజీవితంలో అంత సులభం కాదు.

అక్కడ నుండి తర్వాతి మజిలి విశాఖపట్నం, ఆంధ్ర యూనివర్శిటి బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్, మాది రెండో బ్యాచ్. ప్రొ.టి.రమణగారు చిన్న పిల్లని సాకినట్లు మా డిపార్ట్‌మెంట్‌ని సాకి అస్థిత్వాన్ని కాపాడారు.

టి.ఎం.ఆర్ గారి మాలిక్యులర్ బయాలజీ క్లాసు, ఆ తోట గారి ఇమ్యునాలజీ క్లాసులు నాకు ఇష్టమైన క్లాసులు.

చివరగా చెపుతున్నా ముఖ్యంగా చెప్పవలసింది నా ప్రాథమిక హెడ్ మాస్టారు - మా నాన్నగారు సిద్దార్ధ బక్ష్ గారి గురించి. మృదుభాషి, అందరి హితైషి. నన్ను పొదవి పట్టి నా తొలి అడుగులు పలుకులు నేర్పిన తొలి గురువు.

జీవితాన్ని పూర్తిగా ప్రభావితం చేసి మార్చేసిన గురువులు లేరు. ద్రోణాచార్యుడివంటి గురువు నా జీవితంలో లేడని అర్జునిపై ఈర్ష్య కలుగుతుంది కాని ఆ సంస్కృతికి సంస్కారానికి మనం దూరం అయిపోయాం.

కాని ప్రతి మజిలీలో కొంచెం నేర్చుకుంటూ కొంచెం మార్చుకుంటూ మలుచుకున్న ఈ జీవితంలో బోధించిన అందరికీ నా వందనాలు.



బయోటెక్ కంపెనీలో అసోసియేట్ సైంటిస్టుగా పనిచేస్తున్న దీప్తిగారు, భర్త ఫిరోజ్ గోరా, కుమార్తెలు స్మేరా, అమేయ లతో మెసాచుసెట్స్, కేంబ్రిడ్జిలో నివాసం. వ్రాయడం, చదవడం, ట్రావెలింగ్ హాబీలు